

'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 94

బుధవారం 25-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




లీడ్స్ వదిలేశారు

తొలి టెస్టులో భారత్ ఓటమి. 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఇంగ్లండ్ - 14లో



దాంపత్య సుధలివి..

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి సలహాలు, సూచనలు -13లో



నేడే యాక్సియం-4 ప్రయోగం

శుభాన్షు శుక్లా తదితరులతో కూడిన యాక్సియం-4 ప్రైవేట్ మిషన్ ప్రయోగం జూన్ 25న చేపట్టనున్నట్లు నాసా తెలిపింది.

- వివరాలు 6లో



ఉగ్రవాదంపై ఉక్కుపాదమే

ఉగ్రవాదంపై భారత్ ఉక్కుపాదం మోపుతుందని ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి చాటామని మోదీ అన్నారు.

- వివరాలు 6లో



రైల్వే చార్జీల్లో స్వల్ప పెరుగుదల!

మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ తరగతికి కిలోమీటర్‌కు ఒక పైసా, ఏసీ ప్రయాణాలకు 2 పైసల చొప్పున చార్జీలు పెరగనున్నాయి!

- వివరాలు 6లో



జపాన్ తొలి క్షిపణి పరీక్ష

చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో జపాన్ తన సైనిక పాటవాన్ని వేగంగా పెంచుకునే ప్రయత్నాల్లో పడింది.

- వివరాలు 6లో



రైతుభరోసా విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. వేదికపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క

> ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులపై సీమాంధ్రులు నిర్లక్ష్యం వహించారన్న నువ్వు.. పదేళ్లలో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశావా? ఈ దుర్మార్గానికి నువ్వు, నీ కుటుంబం కారణం కాదా?

చర్చకు రా.. తేల్చుకుందాం!

గోదావరి- బనకచర్లపై తప్పెవరిదో అసెంబ్లీలో మాట్లాడదాం

తారీఖు చెప్పి స్పీకర్‌కు లేఖ రాయి.. నేను పూర్తి వివరాలతో వస్తా

రైతుభరోసా విజయోత్సవ సభలో కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

- పదేళ్ల అధికారంలో ఉండి నదీ జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు
- గోదావరి జలాలు సీమకు తరలించమని చంద్రబాబుకు చెప్పింది నువ్వు కాదా?
- అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోం.. అసెంబ్లీకి రా.. నీ సంగతి చెపుతా అన్న సీఎం

ఏ వేదిక మీదనైనా చర్చకు సిద్ధం: హరీశ్ 2లో

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల అధికారంలో కొనసాగి కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన కేసీఆర్.. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తనపై దుర్మార్గపు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. 'నేను చంద్రబాబుతో కలిసిపోయి గోదావరి- బనకచర్లకు నీళ్లిస్తున్నానని దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నావు. దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయమని ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో స్పీకర్‌కు లేఖ రాయి. గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసింది ఎవరు? ప్రాణహిత-చేవెళ్లను తరలించి లక్ష కోట్లు దోచుకున్నది ఎవరో చర్చిద్దాం..' అని అన్నారు. కేసీఆర్ సూచనలతో హరీశ్‌రావు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు భరోసా కింద ప్రభుత్వం 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిన నేపథ్యంలో మంగళవారం సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో రేవంత్ మాట్లాడారు.

నీ దిక్కుమాలిన సూచన వల్లే ఈ దరిద్రం

'చంద్రబాబును కలిసి గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నయ్.. రాయలసీమకు తరలించమని 2016లో చెప్పింది నువ్వు కాదా? నువ్వు చెప్పినంకనే కదా ఉమాభారతి ఆదేశాల మేరకు చంద్రబాబు హంద్రీనీవా నుంచి

మిగతా 2వ పేజీలో ▶



ఆగిన దాడులు!

యుద్ధం ముగిసిందంటూ తొలుత ట్రంప్ ప్రకటన

- అయినా కొనసాగిన దాడులు, విమర్శలు
- ట్రంప్ ఆగ్రహంతో తగ్గిన ఇజ్రాయెల్, ఇరాన్
- స్వాగతించిన భారత్, ప్రపంచ దేశాలు
- గగనతలం తెరిచిన ఇజ్రాయెల్
- ఇరాన్‌లో అధికార మార్పిడి ఉద్దేశం లేదన్న ట్రంప్

6లో

గెలిచిందెవరు?

- ఎవరికి వారే గెలుపును తమ ఖాతాలో వేసుకున్న ఖమేనీ, ట్రంప్, నెతన్యాహూ
- వాస్తవానికి ఎవరు ఎక్కువ ప్రయోజనం పొందారు?
- అసలు ఈ కాల్పుల విరమణ పూర్తిస్థాయిలో అమలవుతుందా?

6లో

యురేనియంను దాచేసింది..

ఇరాన్, ఇజ్రాయెల్ నుంచి భారతీయుల తరలింపు

ఇదేం పద్ధతి..?

- కార్యకర్తలకు పదవులివ్వడంలో జాప్యం జరిగితే ఎలా?
- మీరు ఎంపిక చేసి పంపితే కదా.. నేను ఫైనల్ చేసేది
- ఎవరంటే వారు గాంధీభవన్‌లో ధర్నాలు చేస్తే ఎలా?
- మంత్రులు, పార్టీ నేతలను ఉద్దేశించి సీఎం రేవంత్
- ప్రభుత్వం బాగా పని చేస్తోందన్న మీనాక్షి నటరాజన్
- దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్న పీసీసీ చీఫ్

- వివరాలు 2లో

2029లోనే అసెంబ్లీ ఎన్నికలు

- మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం.. ఆ బాధ్యత పార్టీ నేతలదే
- ఈ పదేళ్లూ అధికార బాధ్యతలు నేను చూసుకుంటా
- టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి
- పార్టీ నిర్మాణంలో కొత్తగా పదవులు పొందినవారు భాగస్వాములు కావాలని పిలుపు

- వివరాలు 2లో

కన్న కూతురే.. కర్కశంగా మారే..

- ప్రియుడితో తల్లిని చంపించిన పదో తరగతి బాలిక
- తమ ప్రేమకు అడ్డుగా ఉందని ఘాతుకం
- ఇన్‌స్టాలో పరిచయమైన యువకుడితో కలిసి దారుణం
- జీడిమెట్ల పరిధిలో కలకలం రేపిన ఘటన

7లో



నిందితుడు శివ, హతురాలు అంజలి (ఫైల్)

న్యూస్‌రీల్

టీఆర్‌ఎస్‌లో ఉండగానే ట్యాపింగ్: ఈటల



టీఆర్‌ఎస్‌లో (ఇప్పటి బీఆర్‌ఎస్) ఉన్నప్పటి నుంచే తన ఫోన్లను ట్యాప్ చేశారని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. మంగళవారం ఈ మేరకు ఆయన సిట్‌కు వాంగ్మూలం ఇచ్చారు.

- వివరాలు 3లో

129 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ



రాష్ట్రంలో మున్సిపల్ కమిషనర్లకు పదోన్నతి ఇవ్వడంతోపాటు భారీగా బదిలీలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 129 మందిని బదిలీ చేస్తూ మున్సిపల్ కార్యదర్శి టీకే శ్రీదేవి ఐదు ఉత్తర్వులు జారీ చేశారు.

- వివరాలు 3లో

దడ పుట్టిస్తున్న జూనోటిక్ డిసీజెస్



మనషుల్లో 'జూనోటిక్ డిసీజెస్' (జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులు) పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం 75–80% దాకా వైరస్‌లు ఇలాగే మనుషులకు వ్యాపిస్తున్నాయని అధ్యయనాల్లో తేలింది.

- వివరాలు 12లో

శ్రీధర్ బినామీలపై ఫోకస్!



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన ఇరిగేషన్ శాఖ ఈఈ నూనె శ్రీధర్ బినామీ ఆస్తులపై ఏసీబీ అధికారులు దృష్టిపెట్టారు. శ్రీధర్ తన అక్రమార్జనను బినామీల పేరిట దాచినట్టుగా కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం.

- వివరాలు 5లో

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు మళ్లీ బ్రేక్


ఉన్నత విద్యామండలి వర్సెస్ సాంకేతిక విద్యామండలి

- రెండు విభాగాల మధ్య సమన్వయ లోపం
- ఫీజులపై జీవో వచ్చేవరకు కౌన్సెలింగ్ వద్దన్న అధికారులు
- కొత్త సీట్లపై స్పష్టత ఇవ్వని ఏఐసీటీఈ
- న్యాయ సలహాలు తీసుకున్నాకే ముందుకు వెళ్లాలని సాంకేతిక విద్యామండలి నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యామండలి వర్సెస్ సాంకేతిక విద్యామండలి అన్నట్టుగా పరిస్థితి తయారైంది. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌పై ఈ విభాగాల మధ్య అగాధం పెరుగుతోంది. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇవ్వడానికి మొత్తం రంగం సిద్ధమైన తరుణంలో సాంకేతిక విద్యామండలి మోకాలొడ్డింది. ఇంజనీరింగ్ ఫీజులు ఖరారు కాకుండా కౌన్సెలింగ్ నిర్వహించేది లేదంటూ కరాఖండీగా తేల్చిచెప్పినట్టు సమాచారం. వాస్తవానికి కిందిస్థాయి అధికారులు మంగళవారం కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలకు అన్ని ఏర్పాట్లూ చేశారు. ప్రభుత్వం కూడా అనుమతించిందని ఉన్నత విద్యామండలి అధికారులు చెప్పారు. అయితే ఈ సమాచారం బహిరంగపర్చడంపై విద్యాశాఖ, సాంకేతిక విద్య అధికారులు మండి పడుతున్నా రు. తమను సంప్రదించకుండా కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇస్తామన్న ప్రచారం సరికాదన్నారు. ఈ తరహా ప్రకటనలు చేయడంపై సాంకేతిక విద్యామండలి ఉన్నతాధికారి ఒకరు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు ఉన్నత విద్యామండలి వర్గాలు తెలిపాయి. అసలు షెడ్యూల్ ఇవ్వాల్సింది తామని సాంకేతిక విద్య ఉన్నతాధికారులు అంటున్నారు. అధికారుల సమన్వయ లోపం కారణంగా కౌన్సెలింగ్ వాయిదా వేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే షెడ్యూల్ విడుదల నెలన్నర ఆలస్యమైంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన పడుతున్నారు.

అవునంటే.. కాదంటూ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్, అనుబంధ గుర్తింపు,

మిగతా 3వ పేజీలో ▶







ప్రజాస్వామ్యానికి సంకెళ్లు

ఎమర్జెన్సీ కళంకానికి 50 ఏళ్లు

- అధికారం నిలుపుకొనేందుకు ఇందిర నిర్ణయం
- 21 నెలలపాటు దేశవ్యాప్త దమనకాండ
- నేతల నిర్బంధం, మీడియాపై ఉక్కుపాదం
- రాజ్యాంగేతర శక్తిగా సంజయ్ ఆగడాలు
- లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించిన జనం
- జనతా రూపంలో తొలి కాంగ్రెసేతర సర్కారు

- వివరాలు 15లో

'మీ సేవ'లో ఇసుక బుకింగ్

ప్రజల ఇంటి ముంగిటకే డెలివరీ

సాక్షి, హైదరాబాద్: ప్రజలే నేరుగా ఆన్‌లైన్‌లో ఇసుకను బుకింగ్ చేసుకునే విధానాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ గవర్నెన్స్‌కు ఆన్‌లైన్ వేదికగా ఉన్న 'మీ సేవ'ద్వారా ఇసుక బుకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రజలకు సులభ రీతిలో పారదర్శకంగా, సమర్థవంతంగా ఇసుకను సరఫరా చేసే విధానాన్ని అందుబాటులోకి తెస్తోంది. ఇసుక బుకింగ్ ప్రక్రియను డిజిటలైజేషన్ చేయడం వల్ల సరఫరాలో జాప్యం తగ్గుతుందని, అక్రమాలను నివారించవచ్చని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నూతన విధానంలో పౌరులు వాహనం రకం, ఇసుక పరిమాణం, ఏ స్టాక్‌యార్డ్ (ఇసుక రీచ్), దేనికి వినియోగిస్తారు, ఏ తేదీన కావాలి వంటి వివరాలను ఎంచుకోవచ్చు. ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా బుకింగ్ పూర్తి చేసుకుని ఇసుకను ఎంచుకున్న చిరునామాకు డెలివరీ అయ్యేలా మీ సేవలో ఆప్షన్ ఇచ్చారు. పౌరులు సమీపంలోని మీసేవ కేంద్రాన్ని సంప్రదిస్తే అక్కడ ఉండే వీఎల్‌ఈ సంబంధిత పౌరుడి మొబైల్ నంబరుతోపాటు ఇతర వివరాలను నమోదు చేస్తారు. తర్వాత ఇసుక డెలివరీ వివరాలు (జిల్లా, మండలం, గ్రామం లేదా సమీప కాలనీ, పిన్ కోడ్) అందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆన్‌లైన్ చెల్లింపుతో బుకింగ్ ప్రక్రియ పూర్తవుతుంది.



ఇదేం పద్ధతి?

- కార్యకర్తలకు పదవులు ఇప్పించడంలో జాప్యం జరిగితే ఎలా?
- మీరు ఎంపిక చేసి పంపితే కదా... నేను ఫైనల్ చేసేది
- మంత్రులు, పార్టీ నేతలను ఉద్దేశించి సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- కార్యకర్తలను నిరాశకు గురి చేయడం మంచిది కాదు.. ఎవరంటే వారు వచ్చి గాంధీభవన్‌లో ధర్నాలు చేస్తే ఎలా?
- అలాచేస్తే ప్రతిపక్షాల చేతికి ఆయుధాలిచ్చినట్టే..
- 18 నెలల పాలన గోల్డెన్ పీరియడ్ అన్న సీఎం
- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపు
- హామీలు నెరవేర్చేందుకు ప్రభుత్వం బాగా కృషి చేస్తోందన్న మీనాక్షి నటరాజన్
- దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందన్న పీసీసీ చీఫ్

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అటు రాష్ట్ర మంత్రులు, ఇటు పార్టీ నేతలపై కాస్త అసహనం వ్యక్తం చేశారు. పార్టీకి కీలకమైన కార్యకర్తలను నిరాశ పరచడం మంచిది కాదని హితవు పలికారు. ప్రభుత్వ పదవులను కార్యకర్తలకు ఇప్పించడంలో జాప్యం జరిగితే ప్రయోజనం ఏంటని ప్రశ్నించిన రేవంత్.. దేవాలయాల కమిటీలు, మార్కెట్ కమిటీలు లాంటి పదవులు నేరుగా తాను ఇవ్వలేనని, ఇన్‌చార్జి మంత్రులు షార్ట్‌లిస్ట్ చేసి పంపితే తాను ఫైనల్ మాత్రమే చేయగలనని అన్నారు. నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ కమిటీల ఏర్పాటు ద్వారా పార్టీ పదవులు ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోందని, ఇలాంటి చర్యల ద్వారా కార్యకర్తలను నిరాశకు గురిచేయవద్దని చెప్పారు. వీలున్నంత త్వరగా నామినేటెడ్, పార్టీ పదవుల కోసం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జాబితాలను పార్టీకి పంపాలని, పార్టీ నుంచి వచ్చిన జాబితాలను పరిశీలించి నామినేటెడ్ పదవులను ఫైనల్ చేద్దామని అన్నారు. మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ పీఏసీ భేటీ జరిగింది. రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్‌తో పాటు పీఏసీ సభ్యులు ఈ భేటీకి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్ని కలు, బీసీల కులగణన, ఎస్సీల వర్గీకరణ, సంస్థాగత నిర్మాణం గురించి చర్చించిన ఈ సమావేశంలో సీఎం రేవంత్.. తనదైన శైలిలో పలు వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం.

వాళ్లను చూసి ఇంకొకరొస్తారు

ఎవరంటే వాళ్లు వచ్చి గాంధీభవన్‌లో ధర్నాలు చేస్తే ఆఫీసు నిర్వాహకులు ఏం చేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. యాదవ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేస్తోందంటూ కొందరు యాదవ సంఘాల ప్రతినిధులు గొర్రెలను తీసుకొచ్చి ధర్నా చేయడంపై సీరియస్‌గా స్పందించారు. పార్టీలో ప్రాధాన్యం కావాలని, మంత్రి పదవులు ఇవ్వాలని ఏ సామాజికవర్గానికి చెందిన వారయినా అడగొచ్చని, తనతో పాటు పార్టీ అధ్యక్షుడికి వినతిపత్రాలు ఇవ్వొచ్చని, డిమాండ్ చేయవచ్చని, కానీ ఓ సామాజిక వర్గం పేరుతో వచ్చి గాంధీభవన్‌లో ధర్నా చేయడమేంటని ప్రశ్నించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రతిపక్షాల చేతికి తామే ఆయుధాలిచ్చినట్టు అవుతుందని అన్నారు. ఇప్పుడు వచ్చిన వారిని చూసి రేపు ఇంకొకరు వచ్చి ధర్నా చేస్తారని, ఇలాంటి ధర్నాలకు గాంధీభవన్‌లో అవకాశం ఇవ్వకూడదని అన్నట్టు తెలిసింది.

ఇన్‌చార్జి మంత్రులు గ్రామాలకు వెళ్లాలి

క్షేత్రస్థాయిలో ఇన్‌చార్జి మంత్రులు చేయాల్సిన పనులు చేయాలని, లేదంటే గ్రామాలకు వెళ్లడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే తాను వెళ్లడం వల్ల ఉపయోగం లేదని, గ్రామాలకు వెళ్లాల్సింది ఇన్‌చార్జి మంత్రులేనని స్పష్టం చేశారు. 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గోల్డెన్ పీరియడ్ అని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా పార్టీ కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సంస్థాగత నిర్మాణంపై పీసీసీ దృష్టి సారించాలని చెప్పారు.

'జూబ్లీహిల్స్'పై చర్చ

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఎన్నిక చాలా కీలకమని, ఈ అంశంపై పార్టీ ఫోకస్ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. అయితే కీలకమే కాదని, ఖచ్చితంగా గెలిచి తీరాలని మీనాక్షి స్పష్టం చేశా రు. ఉప ఎన్నికకు పార్టీ సిద్ధం కావాలని, ఆ నియోజకవర్గంలో చేయాల్సిన అన్ని కార్యక్రమాల రోడ్‌మ్యాప్‌ను హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తయారు చేయాలని సీఎం సూచించారు. అభ్యర్థిని పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని, తామంటే తాము అభ్యర్థులమని ఎవరూ చెప్పకూడదని పీసీసీ అధ్యక్షుడు ఆదేశించారు.

మేనిఫెస్టోలో పెట్టలేదు: భట్టి.. కాదు పెట్టాం: శ్రీధర్‌బాబు

రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేసే అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టకపోయినా తాము అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. అయితే మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..మేనిఫెస్టోలో పెట్టామంటూ పుస్తకం చూపించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బాగానే ఉన్నాయి కానీ, కార్యకర్తలను దృష్టిలో ఉంచుకుని వారికి మేలు చేసే పథకాలు కూడా రూపొందించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పారు. పదవులు, ప్రాధాన్యతలో కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి కంటే ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను పరిగణనలోకి తీసుకోవాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. సమావేశంలో మంత్రులు జూపల్లి, పొన్నం ప్రభాకర్, పీసీసీ మాజీ అధ్యక్షుడు కె.కేశవరావు తదితరులు మాట్లాడారు. కాగా టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ రాసిన వ్యాసాల సంకలనం 'విధ్వంసం నుంచి వికాసం వైపు'అనే పుస్తకాన్ని రేవంత్, మీనాక్షి ఆవిష్కరించారు.

'వైఎస్ రచ్చబండ'లాంటి కార్యక్రమం కావాలి

ప్రభుత్వ పరంగా చేసింది చెప్పుకోలేకపోతున్నామని సీనియర్ నేత జెట్టి కుసుమకుమార్ పీఏసీ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన రచ్చబండ లాంటి కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల కారణంగా ఎవరికి లబ్ధి కలుగుతుంది, ఎవరికి కలగడం లేదనే అంశాలపై గ్రామాల్లోనే చర్చ పెట్టాలని సూచించినట్టు సమాచారం. కాగా పార్టీ కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా అవకాశం లభిస్తుందని మీనాక్షి నటరాజన్ చెప్పారు. ప్రజలకు ఇచ్చిన అన్ని రకాల హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చాలా కృషి చేస్తోందని అభినందించారు. రాష్ట్రంలో గోల్డెన్ పాలన సాగుతోందని, దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోందని మహేశ్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ కూడా తెలంగాణ గురించి ప్రత్యేకంగా చెప్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అన్ని సంక్షేమ కార్యక్రమాల గురించి గణాంకాలతో సహా భట్టి వివరించారు. సమావేశం అనంతరం పీఏసీ నిర్ణయాలను మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి భట్టి వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో చేసిన కార్యక్రమాలను పీఏసీ అభినందించిందని, గోల్డెన్ పీరియడ్ అని అభివర్ణించిందని చెప్పారు. బూత్, మండల, జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని, ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లేందుకు అవసరమైన ప్రత్యేక కార్యాచరణను ఏర్పాటు చేసుకోవాలని కూడా పీఏసీ నిర్ణయించినట్లు తెలిపారు.

నాడు పండగ... నేడు దండగ

- ఓట్ల కోసం ఆగమేఘాల మీద డబ్బులు వేయడం సంబరమా?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండగైతే..ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం దండగైందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌వేదికగా విమర్శించారు. రూ.10 వేల రైతుబంధు స్థానంలో రూ.15 వేలు రైతుభరోసా ఇస్తామని ఓట్లు దండుకుని.. రూ.12 వేలకు కుదించడం సంబరమా? రైతు భరోసా రెండుసార్లు ఎగ్గొట్టి ఇప్పుడు మళ్లీ ఓట్ల కోసం ఆగమేఘాల మీద డబ్బులు వేయడం సంబరమా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యవసాయం అంటే రైతు భరోసా ఒక్కటేనా? అని నిలదీశారు. బీఆర్‌ఎస్ పాలనలో సాగు నీటితో రైతుకు ప్రోత్సాహం ఇచ్చి, ఉచిత కరెంటుతో సాగుకు ఊతమిచ్చి, పంట పెట్టుబడికి రైతుబంధుతో వెన్నుదన్నుగా నిలిచి, రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షల రైతుబీమాతో మట్టిని నమ్ముకున్న అన్నదాత కుటుంబానికి ధీమానిచ్చామని పేర్కొన్నారు. వందశాతం పంటల కొనుగోళ్లతో వ్యవసాయానికి భరోసానిచ్చిన దార్శనికుడు కేసీఆర్ అని కొనియడారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఎగ్గొట్టి, రైతుబీమా పక్కనపెట్టి, రుణమాఫీని తుంగలో తొక్కి, క్వింటాలుకు రూ.500 బోనస్‌కు సున్నం పెట్టి, కల్లాల్లో ధాన్యం కొనకుండా కన్నీళ్లు పెట్టించి.. రైతులను పండగ చేసుకోమంటారా? అని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

బనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదిక మీదనైనా చర్చకు సిద్ధం

రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌పై విమర్శలా?: మాజీమంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై ఏ వేదిక మీదనైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని, గణాంకాలతో సహా నిరూపించి తెలంగాణకు చేస్తున్న మోసాన్ని బట్టబయలు చేస్తామని మాజీమంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయని దద్దమ్మవి..ఇప్పుడు అన్నారం, సుందిళ్ల కూడా కూలిందని అంటున్నావంటే నీది నోరా, మోరా అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వ కార్యక్రమమని మరిచి ప్రత్యేక రాష్ట్ర సాధకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సంస్కారం లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడి తన చిల్లరబుద్ధిని మరోసారి ప్రదర్శించాడని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు శనిలా, శాపంలా మారిన రేవంత్‌రెడ్డి 'ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే'అనే రీతిలో పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించిన అద్భుత ప్రగతిని తక్కువ చేసి చూపి రాష్ట్ర ప్రజలను అవమానించారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజూ అబద్ధాలు, బూతులతో నెట్టుకొస్తానంటే కుదరదని హెచ్చరించారు. వ్యవసాయాన్ని పండగలా చేసిన కేసీఆర్‌ను ఉరి తీయాలని ఉన్మాదిలా మాట్లాడతావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలిచిన వాడు రాజు..ఓడిపోయిన వాడు రావణాసురుడని రేవంత్‌రెడ్డి అంటున్నాడని, ఓడిపోయిన రాహుల్ గాంధీ కూడా రావణాసురుడేనా అని ప్రశ్నించారు.

విజయోత్సవాలు కాదు.. రైతులకు క్షమాపణ చెప్పాలి

స్థానిక సంస్థల సమయంలో రైతు భరోసా పేరిట డ్రామాలు ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలకు బదులుగా క్షమాపణలు చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతు భరోసాను ఎకరాకు రూ.12 వేలకు మాత్రమే పరిమితం చేసి వానాకాలంలో ఎగవేసిందన్నారు. రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వ్యవసాయ సీజన్లలో రైతు భరోసా ఇవ్వకుండా, కౌలు రైతులు, రైతు కూలీలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రుణమాఫీ, అన్ని పంటలకు బోనస్, రైతు బీమాకు ప్రీమియం చెల్లించకపోవడం, రైతులపై అక్రమ కేసులు వంటి అనేక రైతు వ్యతిరేక విధానాలను ప్రభుత్వం అవలంబిస్తోందని మండిపడ్డారు.

క్లుప్తంగా...

ఇజ్రాయెల్, ఇరాన్‌ల నుంచి స్వదేశానికి తెలంగాణ వాసులు



సాక్షి, న్యూఢిల్లీ: ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో.. ఆయా దేశాల నుంచి మరో 17 మంది తెలంగాణ వాసులు స్వదేశానికి సురక్షితంగా చేరుకున్నారు. వారికి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆశ్రయం కల్పించినట్లు మంగళవారం తెలంగాణ భవన్ అధికారులు తెలిపారు. ఇరాన్‌లోని మస్హాద్ నుంచి ఐదుగురు, జోర్డాన్ నుంచి ఒక్కరు, ఇజ్రాయెల్ నుంచి మొత్తం 11 మంది ఢిల్లీకి చేరుకున్నారని వెల్లడించారు. వారంతా తమ సొంత ఖర్చులతోనే హైదరాబాద్‌కు వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారని, అయితే వారికి ఎయిర్‌పోర్టులో భవన్ సిబ్బంది తగిన సహాయ, సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిరంతరం విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయాలు, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చొరవ మేరకు ఇప్పటివరకు ఇజ్రాయెల్, ఇరాన్‌ల నుంచి మొత్తం 23 మంది ఢిల్లీకి చేరుకోగా.. వీరిలో ఆరుగురు సోమవారం హైదరాబాద్‌కు సురక్షితంగా చేరుకున్నారని స్పష్టం చేశారు.

9 విమానాల రద్దు

శంషాబాద్ (హైదరాబాద్): తమ దేశంలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడుల నేపథ్యంలో.. ఖతార్ తన గగనతలాన్ని మూసివేసింది. దీంతో విమానాల రాకపోకలు పెద్ద ఎత్తున నిలిచిపోతున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు దోహా, జెడ్డా, ధమామ్, మస్కట్, అబుదాబి, కువైట్, దుబాయ్‌కు చెందిన మొత్తం 9 విమానాలు శంషాబాద్ విమానాశ్రయానికి రాలేదు. ఇక్కడి నుంచి ఆయా గమ్యస్థానాలకు వెళ్లాల్సిన 9 విమానాలు కూడా రద్దయినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. ప్రయాణికులు కూడా సౌదీకి రాకపోకలను పెద్ద ఎత్తున రద్దు చేసుకోవడంతో పాటు వాయిదా వేసుకుంటున్నారు.

2029లోనే అసెంబ్లీ ఎన్నికలు

- మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం.. ఆ బాధ్యత పార్టీ నేతలదే... ఈ పదేళ్లు అధికార బాధ్యతలు నేను చూసుకుంటా
- టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి
- పార్టీ నిర్మాణంలో కొత్తగా పదవులు పొందినవారు భాగస్వాములు కావాలని పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మహేశ్‌గౌడ్, మీనాక్షి నటరాజన్, భట్టి, వాకిటి శ్రీహరి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు 2029లోనే జరుగుతాయని, కాంగ్రెస్ పార్టీయే తిరిగి అధికారంలోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తెచ్చే బాధ్యత పార్టీ నాయకులదేనని చెప్పారు. '1994–2004 వరకు పదేళ్లు టీడీపీ, 2004–2014 వరకు పదేళ్లు కాంగ్రెస్, 2014–23 వరకు తొమ్మిదేళ్లు బీఆర్‌ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నాయి. ఇక 2023–33 వరకు పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది. ఈ పదేళ్లు అధికార బాధ్యతలు నేను చూసుకుంటా. పార్టీ కోసం పనిచేసే వారిని కాపాడుకునే బాధ్యత నాది. మీరు భవిష్యత్తు నాయకులను తయారు చేయండి..'అని సీఎం కోరారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులుగా కొత్తగా నియమితులైన వారికి నియామక పత్రాలిచ్చే కార్యక్రమం మంగళవారం గాంధీభవన్‌లో జరిగింది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. కొత్తగా పార్టీ పదవులు పొందిన వారికి అభినందనలు తెలిపిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు.

పదవులకు న్యాయం చేయాలి..లేదంటే తప్పిస్తారు

'పార్టీ నిర్మాణంలో కొత్తగా పదవులు పొందినవారు భాగస్వాములు కావాలి. అప్పుడు ప్రభుత్వంలో మీరూ భాగస్వాములవుతారు. రాజకీయంగా ఎదగడానికి ఈ పదవులు, వేదికలే ఉపయోగపడతాయి. ప్రభుత్వ బాధ్యతల కంటే పార్టీ బాధ్యతలకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. వేలాది మంది పోటీ పడినా ఈ పదవులు మీకే దక్కినందుకు వాటికి న్యాయం చేయాలి. పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి. పార్టీలో పనిచేసే వారికి తప్పకుండా అవకాశాలు వస్తాయి. నేను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు పార్టీ అనుబంధ సంఘాల బాధ్యతలు తీసుకునేందుకు కొందరు అంగీకరించలేదు. అంగీకరించి బాధ్యతలు తీసుకున్నవారు ఇప్పుడు కార్పొరేషన్ చైర్మన్లు అయ్యారు. అయితే పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు అయినంత మాత్రాన ఇక రాజకీయ జీవితం నల్లేరు మీద నడక అవుతుందని అనుకోవద్దు. మీరు ఈ బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తేనే రాజకీయంగా ముందుకెళతారు. లేదంటే ఎన్నికల ముందు తప్పిస్తారు..'అని రేవంత్ చెప్పారు.

భవిష్యత్తులో చాలా అవకాశాలు

'నాయకుల ఎన్నికలు అయిపోయాయి. ఇప్పుడు మిగిలింది కార్యకర్తల ఎన్నికలు. ఈ ఎన్నికల్లో కష్టపడిన వారికి, కష్టపడి కార్యకర్తలను గెలిపించిన వారికి అవకాశాలు వస్తాయి. భవిష్యత్తులో చాలా పరిణామాలు జరుగుతాయి. డీలిమిటేషన్ జరుగుతుంది. అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయి. మహిళలకు రిజర్వేషన్లు వస్తాయి. 2029లో మీలో చాలామందికి అవకాశాలు వస్తాయి. అప్పటికల్లా సిద్ధంగా ఉండండి..'అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

అలా చేస్తే పార్టీకి తిరుగుండదు: భట్టి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలోనే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ఒక్క సంక్షేమ పథకాల కోసమే రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పార్టీ నేతలు ప్రజల్లోకి సరిగ్గా తీసుకెళితే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగుండదని అన్నారు. సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సలహాదారు షబ్బీర్ అలీ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవును..అంతా అక్క కష్టమే..

జగ్గారెడ్డి దంపతులపై సీఎం చలోక్తి

ఆది శ్రీనివాస్, వాకిటి శ్రీహరి, భట్టి విక్రమార్క, మహేశ్‌గౌడ్, సంపత్‌కుమార్, షబ్బీర్ అలీ, నాయిని రాజేందర్‌రెడ్డిలు పార్టీలో ఎలా ఎదిగారో సీఎం వివరించారు. జగ్గారెడ్డి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారని, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా ఆయన భార్య నిర్మలా జగ్గారెడ్డికి కీలకమైన టీజీఐఐసీ చైర్మన్ పదవి ఇచ్చామని చెప్పారు. జగ్గారెడ్డి అందులో తనదేమీ లేదని అనడంతో.. 'అవును.. నిర్మలక్కకు పదవి రావడంలో జగ్గారెడ్డికి సంబంధం లేదు. ఆమె పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. కష్టపడ్డారు.. అందుకే పెద్ద కార్పొరేషన్‌కు చైర్మన్ అయ్యారు. అంతా అక్క కష్టమే..'అంటూ సీఎం చలోక్తి విసిరారు.

రైతుభరోసా రూ. 8,744.13 కోట్లు

- 9 రోజుల్లో పూర్తిస్థాయిలో అందించిన ప్రభుత్వం
- చివరి రోజు రైతుల ఖాతాల్లో రూ.459.47 కోట్లు జమ

సాక్షి, హైదరాబాద్: వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు పెట్టుబడి సాయం అందించే 'రైతుభరోసా'కార్యక్రమం ముగిసింది. ఈ నెల 16న రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతుభరోసా కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ రోజు చెప్పినట్టుగానే 9 రోజుల్లో ప్రక్రియను ముగించారు. మంగళవారం చివరగా 15 ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులందరికీ కలిపి రూ.459.47 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. దీంతో 9 రోజుల్లో 69,39,548 మంది రైతులకు రూ.8,744.13 కోట్లు అందించినట్లయ్యింది. రాష్ట్రంలోసాగు యోగ్యమైన భూములుగా గుర్తించిన సుమారు 1.46 లక్షల ఎకరాలకు ఈ మొత్తాన్ని అందించారు.

ఎకరాలవారీగా రైతు భరోసా పొందిన రైతుల వివరాలు

ఎకరాలు	రైతులు (లక్షల్లో)	మొత్తం విస్తీర్ణం (లక్షల ఎకరాల్లో)	ఖాతాల్లో వేసిన నిధులు (రూ.కోట్లలో)
1	24.22	13.54	812.63
2	17.02	25.62	1,537.20
3	10.45	25.86	1,551.89
4	6.33	21.89	1,313.54
5	4.43	19.82	1,189.43
6	1.71	9.16	549.80
7	0.93	5.93	356.9
8	0.67	4.43	265.91
9	0.39	3.23	194.32
10	0.32	2.96	178.16
11	0.16	1.67	100.20
12	0.11	1.26	76.14
13	0.08	1.05	63.16
14	0.06	0.85	51.72
15	0.05	0.74	44.82
15పైన	2.38	7.65	459.97
మొత్తం	69.40	145.73	8,744.13

చర్చకు రా.. తేల్చుకుందాం!



రైతులతో కరచాలనం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

400 టీఎంసీలు తరలించడానికి 2016లో జీవో ఇచ్చిండు. 2018లో వ్యాప్కోస్ సంస్థను నియమించి, 400 టీఎంసీలు హంద్రీనీవా నుంచి బనకచర్లకు తరలించడానికి ప్రాజెక్టు రిపోర్టు ఇచ్చింది నిజం కాదా? నువ్వు ఇచ్చిన దిక్కుమాలిన సూచనతోనే ఈ దరిద్రం దాపురించింది? తెలంగాణను ఎడారిగా మార్చేలా వందలాది టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించమని చెప్పింది నువ్వు. నేను తప్పు చేసినట్టు ఒక్క ఆధారం చూపిస్తే దేనికైనా సిద్ధం. నేను మొత్తం వివరాలతో వస్తా? నువ్వు చెప్పిన తారీఖు నాడు అసెంబ్లీలో చర్చకు పెట్టించే బాధ్యత శ్రీధర్‌బాబు తీసుకుంటరు. నువ్వు, నేను చర్చ చేద్దాం. నువ్వు సిద్ధంగా ఉన్నవా?..' అని సీఎం నిలదీశారు.

ఆ ప్రాజెక్టులన్నీ ఎందుకు ఆగిపోయాయి?

'బీఆర్‌ఎస్ పదేళ్ల వాళ్ల పాలన ఎలా ఉందో.. 18 నెలల మా పాలన ఎలా ఉందో గ్రామాల్లో, రచ్చబండల దగ్గర రైతులు చర్చ పెట్టాలి. వ్యవసాయాన్ని పండుగ చేయాలని 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉచిత కరెంటుపై తొలి సంతకం చేశారు. రుణమాఫీ అమలు చేశారు. ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే మొదలయ్యాయి. కానీ కేసీఆర్ కుట్రలు, కుతంత్రాలతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. కాళేశ్వరం కూలేశ్వరమై లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయినయ్. ప్రాజెక్టు కూలిపోయినందుకు నిన్ను చిన్న కాళేశ్వరంలోనే ఉరి తీసినా తప్పు లేదని అక్కడి రైతాంగం అంటున్నది నిజం కాదా? కేసీఆర్ కాంట్రాక్టర్లకు రూ.2 లక్షల కోట్లు చెల్లించిండు. మరి రూ.1,000 కోట్లతో పూర్తి కావాల్సిన కల్వకుర్తి ఎందుకు ఆగిపోయింది? రూ.300 కోట్లతో పూర్తి కావాల్సిన భీమా, రూ.200 కోట్లతో పూర్తి కావాల్సిన నెట్టెంపాడు, రూ.6 వేల కోట్లతో పూర్తి కావాల్సిన సీతారామ ఎందుకు ఆగిపోయాయి? దేవాదుల పూర్తి చేస్తే 4 వేల ఎకరాలు సాగయ్యేవి..ఎందుకు పూర్తి చేయలేదు? ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులపై సీమాంధ్రులు నిర్లక్ష్యం వహించారన్న నువ్వు.. పదేళ్లలో ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశావా? ఈ దుర్మార్గానికి నువ్వు, నీ కుటుంబం కారణం కాదా? కృష్ణా జలాల్లో 68 శాతం కేటాయింపులు తెలంగాణలో, 32 శాతం కేటాయింపులు ఆంధ్రలో ఉండాలి. ఈ లెక్కన 555 టీఎంసీల వాటా తెలంగాణకు రావాలి. కానీ 290 టీఎంసీలు తెలంగాణకు తీసుకుని, 519 టీఎంసీలు ఆంధ్రకు ఇచ్చి తెలంగాణ రైతాంగానికి మరణశాసనం రాసిందే నువ్వు.

అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోం..

మేం తెలంగాణకు న్యాయం కోసం పోరాడుతున్నం. గోదావరి–బనకచర్లకు అనుమతులు ఇవ్వవద్దని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి కేంద్రమంత్రిని కోరాం. ప్రాజెక్టులను పడావు పెట్టి మీరు ఫాంహౌస్‌లో పడుకుంటే.. మేం వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. అబద్ధాలు ప్రచారం చేస్తే ఊరుకోం. అప్పుడంటే జానారెడ్డి నీతో ఎందుకని ఊరుకున్నాడు. ఇప్పుడు అసెంబ్లీకి రా. నీ సంగతి చెపుతా..' అని రేవంత్ అన్నారు.

మీకు ఫామ్‌హౌస్‌లు ఎట్లా వచ్చినయ్?


'కేసీఆర్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను క్యాన్సర్ బారిన పడేసి మాకు అప్పగించారు. కోకాపేట భూములు, ఓఆర్‌ఆర్ అమ్మి రైతు బంధు ఇచ్చారు. రైతుల పేరుతో అప్పులు చేసిండు.. దోపిడీ చేసిండు. తెలంగాణ రాష్ట్రం రాకముందు మీ ఆర్థిక పరిస్థితి ఏంటి? ఇప్పుడేంటి? మొయినాబాద్‌లో హరీశ్‌రావుకు, జన్వాడలో కేటీఆర్‌కు, గజ్వేల్‌లో కేసీఆర్‌కు ఫామ్‌హౌస్‌లు ఎట్లా వచ్చినయ్? రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పు మిగిల్చి, పదేళ్లలో నిజాం నవాబుల కంటే ధనవంతులయ్యారు. మేం మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేశాం. మీరు పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ప్రజలకు చెప్పు. కాళేశ్వరం పేరుతో మీరు రూ.లక్ష కోట్లు కొల్లగొడితే.. 18 నెలల్లో లక్షా 4 వేల కోట్లు ఖర్చు చేసి రైతులను ఆదుకున్న చరిత్ర మాది. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న ఉక్కు సంకల్పంతో ప్రజా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం' అని అన్నారు.

మా తొలి ప్రాధాన్యత రైతులే

ప్రజా ప్రభుత్వంలో మా మొదటి ప్రాధాన్యత రైతులుం. ఆ తర్వాత మా ఆడబిడ్డలు, ఉద్యమకారులు, విద్యార్థులు. ఆనాడు కేసీఆర్ రైతుబంధు ఎగ్గొడితే మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.7,625 కోట్ల నిధులు విడుదల చేశాం. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అప్పుల్లో కూరుకుపోయిన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం. కేసీఆర్ ఆనాడు వరి వద్దంటే మేం వరి పండించండి అని చెప్పాం. చివరి గింజ వరకు కొనడమే కాదు.. మద్దతు ధరతో పాటు బోనస్ కూడా ఇస్తున్నాం..' అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, వాకిటి శ్రీహరి, విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాకెప్పుడు రైతు భరోసా సంబురాలు?

సీఎం వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగా నారాయణపురం రైతుల నిరసన



రైతువేదిక ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నారాయణపురం గ్రామ రైతులు

కేసముద్రం: తమకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఎప్పుడిస్తారు? తమకెప్పుడు ఈ రైతు భరోసా సంబురాలు అంటూ.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని రైతువేదిక భవనం ఎదుట నారాయణపురం గ్రామ రైతులు మంగళవారం నిరసన తెలిపారు. రైతు భరోసా నిధుల విడుదల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఇక్కడి రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగా, నారాయణపురం గ్రామ రైతులు చేరుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ వాంకుడోతు రవి నాయక్‌తోపాటు పలువురు రైతులు మాట్లాడుతూ.. 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 1,827 ఎకరాల పట్టాభూములను 2017లో గత ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా అటవీ భూములుగా పేర్కొంటూ, తమ పట్టాలను రద్దు చేసిందన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జీవో 94 జారీ చేసి రైతు పేరు, తండ్రి పేరు చోట వస్తున్న అడవి అనే పదం తొలగించిందని తెలిపారు. తమకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని వారు డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

ఎంపీడీవోలను పాత స్థానాలకు బదిలీ చేయాలి

మంత్రి సీతక్కకు వినతి

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బదిలీ అయిన తమను యథాస్థానానికి బదిలీ చేయాలని ప్రభుత్వాన్ని ఎంపీడీవోలు కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో ఎంపీడీవోలను సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారని వివరించారు. వారికి ఎలాంటి ఆంక్షలు లేకుండా పాత స్థానాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 317 జీవో పేరుతో బదిలీ చేయడం లేదని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు.

టీచర్లతో తనిఖీలొద్దు

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలకు ఉపాధ్యాయులను నియమించాలనే ఆలోచనను విరమించుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షుడు చావా రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పర్యవేక్షణకు డీఈవో, డిప్యూటీ ఈవో, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యాశాఖ నిర్ణయం వల్ల విద్యా ప్రమాణాలు దెబ్బ తింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రైవేటు స్కూళ్ల ఫీజులపై నియంత్రణేది?: గెల్లు శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం తీరుతో ప్రైవేటు స్కూళ్ల సంఖ్య పెరుగుతుండగా, మరో వైపు ప్రైవేటు స్కూళ్ల ఫీజులపై నియంత్రణ లేకుండా పోయిందని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ విమర్శించారు. విద్యా శాఖమంత్రిగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నా.. సోమవారం జరిగిన కేబినెట్ భేటీలో ఒక్క నిమిషం కూడా చర్చించలేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా విద్యా శాఖపై రేవంత్ రెడ్డి కనీసం సమీక్ష చేయడం లేదని చెప్పారు. రేవంత్‌కు రియల్ ఎస్టేట్ రంగం మీద ఉన్న ప్రేమ విద్యా వ్యవస్థపై లేదన్నారు. బీఆర్‌ఎస్‌వీ ఉపాధ్యక్షుడు తుంగ బాలుతో కలిసి గెల్లు శ్రీనివాస్ మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఏఐ టెక్నాలజీతో సృష్టించిన ఫొటోలతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు అంటూ ప్రచారం చేయడం మినహా వాటి ఏర్పాటులో ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు. విద్యారంగ సమస్యలపై బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి 30వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని శ్రీనివాస్ ప్రకటించారు. అరకొర చదువులు చదివిన సీఎంకు విద్యావ్యవస్థ మీద అవగాహన లేదని తుంగ బాలు విమర్శించారు.

నేడు లాసెట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: లాసెట్ ఫలితాలు బుధవారం విడుదలవుతాయి. మూడు, ఐదేళ్ల లా, పీజీ లాసెట్‌ను ఇటీవల నిర్వహించారు. ఈ ఫలితాలను సాయంత్రం 3.30 గంటలకు విడుదల చేయనున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. వి.బాలకిష్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల విడుదల తర్వాత.. కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో జిజ్ఞాస ఎంత?



విద్యాసామర్థ్యాల పరిశీలనకు విద్యాశాఖ నిర్ణయం
- చదవడం, రాయడంపై రాత, మౌఖిక పరీక్షలు
- 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఏటా మూడుసార్లు ప్రత్యేక పరీక్ష... ప్రభుత్వ స్కూళ్లకు ఎస్‌సీఈఆర్‌టీ మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల పఠనాసక్తి, వారిలోని సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రత్యేక పరీక్షలు చేపట్టనున్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) దీనికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేసింది. దీన్ని బేస్‌లైన్ టెస్ట్‌గా చెబుతున్నారు. పరీక్ష నిర్వహణ, విద్యా సామర్థ్యాల పరిశీలనకు సంబంధించిన మార్గదర్శకాలను ఎస్‌సీఈఆర్‌టీ మంగళవారం జిల్లా అధికారులకు పంపింది. ప్రభుత్వ పాఠశాలల్లోని 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు వీటిని నిర్వహిస్తారు. సంవత్సరానికి మూడుసార్లు జరిగే ఈ పరీక్షల్లో వచ్చే మార్కులను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఓ యాప్‌ను తయారు చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో ఒకసారి, మధ్యలో మరోసారి, చివరలో ఇంకోసారి పరీక్షలు ఉంటాయి. రెగ్యులర్‌గా జరిగే పరీక్షలకు ఇవి భిన్నంగా ఉంటాయని అధికారులు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎంలు ప్రతీ విద్యార్థికి సంబంధించిన మార్కులను యాప్‌లో పొందుపరుస్తారు. వీటి ఆధారంగా విద్యార్థి ఎక్కడ వెనుకబడి ఉన్నాడు? ఏ జిల్లాల్లో ప్రమాణాలు ఎలా ఉన్నాయి? అనే వివరాలను ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలించి, విద్యార్థుల స్థాయిని పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తుంది.

పరీక్ష విధానం ఇదీ..

ఈ ప్రక్రియ మొత్తం ఎస్‌సీఈఆర్‌టీ నేతృత్వంలోనే నడుస్తుంది. ప్రశ్నపత్రాల రూపకల్పన, వాటి పరిశీలన ఈ విభాగమే చూస్తుంది. ఇది తరగతి వారీగా మారుతుందని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో అనర్గళంగా చదవడం, రాయడం, చదివిన దాన్ని అర్థం చేసుకోవడం తప్పనిసరి. దీని ఆధారంగానే పరీక్ష నిర్వహిస్తారు. పిల్లలు సరళ పదాలు, గుణింతాలు ఒత్తుల పదాలు, వాక్యాలు, పేరాలను చదవాలి. తెలుగు పదాలను తడబడకుండా, తప్పులు లేకుండా నిర్ణీత వేగంతో చదివితేనే ఆ విద్యార్థికి సామర్థ్యం ఉన్నట్లుగా గుర్తిస్తారు. గణితంలో 1, 2 తరగతుల విద్యార్థుల సంఖ్యలు గుర్తించడం కూడికలు, తీసివేతలు సమస్యల సాధన, 3, 4, 5 విద్యార్థులు కూడికలు, తీసివేతలు, భాగహారం వంటివి చేయాలి. 6–10వ తరగతి వారికి పాఠ్యాంశాల్లో కనీస ప్రశ్నలు వస్తాయి. ఇందులో విద్యార్థి ఎంత వేగంతో సమాధానం ఇస్తున్నాడు? ఇచ్చేదాంట్లో సరైన సమాధానం శాతం ఎంతమేర ఉందనే దాన్ని సామర్థ్యానికి కొలమానంగా తీసుకుంటారు. 9, 10 తరతుల విద్యార్థులను కొంత తికమక పెట్టే రీతిలోనూ ప్రశ్నలు ఉంటాయి. ఈ పరీక్షల్లో వచ్చే మార్కులకు, సంవత్సరంలో నిర్వహించే పరీక్షలకు ఏ సంబంధం ఉండదని అధికారులు తెలిపారు.

మళ్లీ తెలంగాణకు ఆమ్రపాలి



కేంద్రం, రాష్ట్రాలకు క్యాట్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఐఏఎస్ అధికారి ఆమ్రపాలి కాటకు క్యాట్‌లో ఊరట లభించింది. ఆమెను మళ్లీ తెలంగాణకే కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఆదేశించింది. ఈ మేరకు ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ తీర్పు వెలువరించింది. ఖండేకర్ కమిటీ నివేదిక మేరకు విభజన సమయంలో ఏ రాష్ట్రానికి కేటాయించిన అధికారులు ఆ రాష్ట్రానికి వెళ్లాల్సిందేనని గత అక్టోబర్‌లో డీవోపీటీ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో డీవోపీటీ ఆదేశాల మేరకు 2010 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్ట్ చేయగా.. ప్రస్తుతం ఆమె పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ ఆదేశాలను ఆమ్రపాలి సహా ఐఏఎస్, ఐపీఎస్‌లు క్యాట్‌లో సవాల్ చేశారు. తుది ఉత్తర్వుల మేరకు కేటాయింపులు ఉంటాయని, ఇప్పటికైతే ఏ రాష్ట్రానికి కేటాయించిన వారు ఆ రాష్ట్రానికి వెళ్లాలని క్యాట్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వులపై హైకోర్టును ఆశ్రయించినా ఊరట లభించలేదు. దీంతో డీవోపీటీ ఆదేశాల మేరకు అధికారులు ఆయా రాష్ట్రాల్లో విధుల్లో చేరారు. ఆమ్రపాలి కూడా ఏపీలో విధుల్లో చేరారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై క్యాట్‌లో వాదనలు పూర్తి కావడంతో లతా బస్వరాజ్ పట్నే (జ్యుడీషియల్), వరుణ్ సింధు కుల్ కౌముది (అడ్మినిస్ట్రేషన్) బెంచ్ మంగళవారం తీర్పు వెలువరించింది. ఆమెను మళ్లీ తెలంగాణకు కేటాయించాలని డీవోపీటీతో పాటు ఇరు రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. మరికొందరు అధికారుల పిటిషన్లు ఇంకా క్యాట్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

ఒకటో తరగతి ప్రవేశాలు అంతంతే!

- ప్రభుత్వ స్కూళ్లలో కొత్తగా 2,56,156 మంది ప్రవేశం
- వీరిలో ఒకటో తరగతిలో చేరినవారు 1.08 లక్షలు.. గతేడాది ఒకటో తరగతిలో ప్రవేశాలు 1.67 లక్షలు
- బడిబాట కార్యక్రమం చేపట్టినా స్పందన స్వల్పమే

సాక్షి, హైదరాబాద్: ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల టీచర్లు చేపట్టిన బడిబాట ద్వారా కొత్తగా 2,56,156 మంది పిల్లలు ప్రభుత్వ స్కూళ్లలో చేరినట్టు విద్యాశాఖ ప్రకటించింది. గత ఏడాది 2,00,901 మంది మాత్రమే చేరినట్టు వెల్లడించింది. క్రితం సంవత్సరంతో పోలిస్తే 50 వేల పైచిలుకు అధికంగా చేరినట్టు పేర్కొంది. బడిబాటలో సాధారణంగా ఒకటవ తరగతిలో ఎంత మంది చేరారన్నదే కీలకం. గత సంవత్సరం మొదటి తరగతిలో 1.67 లక్షల ప్రవేశాలు నమోదయ్యాయి. కానీ బడిబాట చేపట్టిన తర్వాత కూడా ఈ ఏడాది ప్రవేశాలు 1.08 లక్షలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో గత పదేళ్లలో విద్యార్థుల ప్రవేశాలు 32 శాతం తగ్గాయి. 2014–15లో 24.85 లక్షల మంది చేరితే, 2024–25లో ఈ సంఖ్య 16.68 లక్షలకు తగ్గింది. మరోవైపు ఇదే పదేళ్లల్లో ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశాలు 31.17 లక్షల నుంచి 36.73 లక్షలకు పెరిగాయి. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని ఈసారి బడిబాట చేపట్టినా ఆశించిన ఫలితాలు మాత్రం ఇవ్వలేదు.

టీఆర్‌ఎస్‌లో ఉండగానే ట్యాపింగ్

- వ్యక్తిగత స్వేచ్ఛను హరించడం దుర్మార్గం
- సిట్‌కు వాంగ్మూలం ఇచ్చిన ఈటల
- తాను, తన భార్య మాట్లాడుకున్న మాటలు కూడా విన్నారని వెల్లడి



సిట్ విచారణకు హాజరైన ఎంపీ ఈటల రాజేందర్

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: టీఆర్‌ఎస్‌లో (ఇప్పటి బీఆర్‌ఎస్) ఉన్నప్పటి నుంచే తన ఫోన్లను ట్యాప్ చేశారని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఒకరి వ్యక్తిగత స్వేచ్ఛను హరించడం దుర్మార్గమని, దేశ భద్రత కోసం, ప్రజల ప్రాణాలు తీసే వారి మీద పెట్టాల్సిన నిఘాను తమ మీద పెట్టారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు ఆయన ప్రత్యేక దర్యాప్తు బృందానికి వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..'నేను నా భార్య మాట్లాడుకున్న మాటలూ విన్నారు. ప్రభాకర్‌రావుకు ట్యాపింగ్ ఆదేశాలు ఇచ్చింది ఎవరో నిగ్గు తేల్చాలి..'అని డిమాండ్ చేశారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు..ఈటల ఫోన్ కూడా ట్యాప్ అయిందని గుర్తించారు. సాక్షిగా వచ్చి వాంగ్మూలం ఇవ్వాలని ఆయన్ను కోరారు. దీంతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని సిట్ కార్యాలయానికి వచ్చిన ఈటల స్టేట్‌మెంట్ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

సీఎంల అధీనంలోనే..

'ఎస్‌ఐబీ, ఇంటెలిజెన్స్ అన్నీ ముఖ్యమంత్రుల అధీనంలో ఉంటాయి. అప్పట్లో సీఎంగా కేసీఆర్ ఉన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలు ఇచ్చింది ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలి. లేదంటే వారితో ఈ ప్రభుత్వం కుమ్మక్కైనట్లు భావించాల్సి ఉంటుంది. 2021లో హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంలో ఆరు నెలల పాటు నా ఫోన్లు ట్యాప్ చేశారు. 2023 లోనూ బీఆర్‌ఎస్ అధికార దుర్వినియోగం చేసింది. దీనికి సంబంధించిన సిట్ అధికారులు వందల ఆధారాలు చూపించారు. మా నాయకుల సంభాషణల్ని కూడా వినిపించారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్‌రావును అక్రమంగా నియమించి 9 నెలల పాటు పని చేయించారు. ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్న ఇంద్రసేనారెడ్డి ఫోన్‌తో పాటు జడ్జీలు, మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లు ట్యాప్ చేయించడం దుర్మార్గం..'అని ఈటల అన్నారు.

ప్రభుత్వానికి నిజాయితీ ఉందా? లేదా?

'విద్యుత్ కొనుగోళ్ళ మీద వేసిన కమిషన్ ఏమైందో తెలియదు. ఫోన్ ట్యాపింగ్‌పై సిట్, కాళేశ్వరం కమిషన్ రిపోర్టులు ఇంకా రాలేదు. ఈ ప్రభుత్వానికి నిజాయితీ ఉందా? లేదా? బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటే అని చెప్పే రేవంత్‌రెడ్డి దీనికి సమాధానం చెప్పాలి. లోపాయికారీ ఒప్పందం లేకపోతే.. బీఆర్‌ఎస్‌తో లాలూచీ పడకపోతే ఈ ఎంక్వైరీలు ఎందుకు నత్తనడకన నడుస్తున్నాయి?..'అని ఈటల నిలదీశారు. మరోపక్క బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కూడా మంగళవారం సిట్ ఎదుట హాజరై వాంగ్మూలం ఇచ్చారు. 2022–24 మధ్య తన ఫోన్ కూడా ట్యాప్ అయిందంటూ టీడీపీ నేత కిషోర్‌బాబు ఫిర్యాదు చేశారు.

129 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

- ఒకేరోజు ఐదు జీవోలతో భారీగా స్థానచలనాలు
- స్పెషల్ గ్రేడ్‌తోపాటు గ్రేడ్ 1, 2, 3 కమిషనర్లుగా పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మున్సిపల్ కమిషనర్లకు పదోన్నతి ఇవ్వడంతో పాటు భారీగా బదిలీలు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 129 మందిని బదిలీ చేస్తూ మున్సిపల్ కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవి మంగళవారం ఐదు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలపై ఉన్న నిషేధం ఎత్తివేస్తూ జారీచేసిన ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 142 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకుగాను 129 మందిని ఏకకాలంలో బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న మున్సిపల్ శాఖలో జరిగిన బదిలీలు ఆ శాఖ ప్రక్షాళనతో పాటు పురపాలన గాడిన పెట్టేందుకు దోహద పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తం 129 మంది బదిలీ అవ్వగా, వీరిలో 11 మంది స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా, 12 మంది గ్రేడ్ వన్ మున్సిపల్ కమిషనర్లుగా, 39 మంది గ్రేడ్ 2 మున్సిపల్ కమిషనర్లుగా, 56 మంది గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతి సాధించి పోస్టింగులు పొందారు. మరో 11 మందికి సాధారణ బదిలీల్లో భాగంగా స్థానచలనం కలిగింది. జీహెచ్‌ఎంసీలో డిప్యూటీ కమిషనర్లుగా ఉన్న సి.అరుణ కుమారి, టి.యాదయ్య, మధుకిరణ్, పి.మోహన్‌రెడ్డి, అలీ, కె.రవికుమార్‌కు స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా ప్రమోషన్ లభించింది. సచివాలయంలో సహాయ కార్యదర్శి కె.మల్లికార్జున రావు, జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ ఉమా ప్రకాశ్ తదితరులు స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతి పొందారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న టీ రాజేశ్వర్‌ను మహబూబాబాద్ కమిషనర్‌గా బదిలీచేశారు. పాలన సంస్కరణలతో పాటు పట్టణ స్థానిక సంస్థల (అర్బన్ లోకల్‌బాడీలు) వార్డుల పునర్విభజన, పదోన్నతుల నేపథ్యంలో ఈ బదిలీలు జరిగినట్లు సమాచారం.



చదువు చెబుతూ సాగు చేస్తూ..!

భైంసా టౌన్: నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కళాశాల ఆవరణలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు సాగు చేయడంతోపాటు ఆ కూరగాయలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు తలా కొంత సొమ్ము పోగు చేయడంతోపాటు దాతల సహకారం తీసుకుంటున్న అధ్యాపకులకు సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలతో భోజనం అందించాలన్న ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడవుగా కళాశాల ఆవరణలో అర ఎకరం స్థలాన్ని చదును చేసి టమాటా, బెండకాయ, వంకాయ, మిరప, కాలీఫ్లవర్, క్యాబేజీ, చిక్కుడు, బీన్స్ వంటివి సాగు చేస్తున్నారు. ప్రతిరోజూ ఆ మొక్కలకు నీరు పోస్తూ వాటిని సంరక్షిస్తున్నారు. అధ్యాపకులు సైతం విద్యార్థులతో కలిసే మధ్యాహ్న భోజనం చేస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య తెలిపారు. కళాశాలలో దాదాపు 700 మంది వరకు విద్యార్థులు ఉన్నప్పటికీ ప్రతిరోజూ సగటున 50 నుంచి 100 మంది మాత్రమే హాజరవుతున్నారన్నారు. విద్యార్థుల హాజరు పెంచడంతోపాటు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



విద్యుత్ సంస్థలకు కొత్త డైరెక్టర్లు

ఉత్తర్వులు విడుదల చేసిన నవీన్ మిత్తల్



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఈ మేరకు ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర, దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలతోపాటు, రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ (టీజీ ట్రాన్స్‌కో), విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టీజీ జెన్‌కో)లో కూడా కొత్త డైరెక్టర్లను నియమించింది. కోల్ అండ్ లాజిస్టిక్స్ డైరెక్టర్‌గా రైల్వే, సింగరేణి సంస్థల్లో పనిచేసిన బి.నగ్యాను నియమించారు. అయితే ఈయన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల్లో కూడా డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకేసారి విద్యుత్ డైరెక్టర్‌గా పనిచేసే అవకాశం వచ్చినా తెలంగాణలో పనిచేసేందుకే సుముఖత వ్యక్తం చేస్తున్నట్టు నగ్యా తెలిపారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. కోదాడ వాసిని కావడం వల్లే తాను ఇక్కడే తన సేవలందించాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు.

ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ : వంటేరు తిరుపతిరెడ్డి (ఫైనాన్స్), టి.మధుసూదన్ (ఆపరేషన్స్), వంగూరు మోహన్‌రావు (ప్రాజెక్ట్స్), సి.ప్రభాకర్‌రావు (హెచ్‌ఆర్‌డీ అండ్ ఐఆర్)

దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ : వి.శివాజీ (ప్రాజెక్ట్స్), ఎన్.నర్సింహులు (ఆపరేషన్స్), చిలుకుమరి చక్రపాణి (కమర్షియల్), పి.కృష్ణారెడ్డి (ఫైనాన్స్)

ట్రాన్స్‌కో: గాదె సంపత్‌కుమార్ (గ్రిడ్ అండ్ ట్రాన్స్‌మిషన్ మేనేజ్‌మెంట్), డి.లతావినోద్ (ప్రాజెక్ట్స్), శ్రీనివాసులు (ఫైనాన్స్)

జెన్‌కో : పి.బాలరాజు (జలవిద్యుత్), వై.రాజశేఖర్‌రెడ్డి (థర్మల్ విద్యుత్, ప్రాజెక్ట్స్), ఎస్‌వీ.కుమార్‌రాజు (హెచ్‌ఆర్ అండ్ ఐఆర్), బి.నాగ్యా (కోల్ అండ్ లాజిస్టిక్స్), జి.వీరమహేందర్ (ఫైనాన్స్, కమర్షియల్)

పాస్‌పోర్ట్ సేవలో తెలంగాణకు అవార్డులు



కేంద్రమంత్రి పబిత్ర మార్గరిటా నుంచి అవార్డులు అందుకుంటున్న శివధర్ రెడ్డి, స్నేహజ

- దరఖాస్తుల ధ్రువీకరణలో 2వ స్థానంలో రాష్ట్ర పోలీస్
- ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి.. ఆర్పీఓ హైదరాబాద్‌కు సృజనాత్మక విభాగంలో అవార్డు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో పాస్‌పోర్ట్ సేవలో తెలంగాణ రాష్ట్రానికి రెండు అవార్డులు దక్కాయి. పాస్‌పోర్ట్ దరఖాస్తుదారుల పోలీసు ధ్రువీకరణ ప్రక్రియలో 5 లక్షల నుంచి 10 లక్షల మధ్య కేటగిరీలో తెలంగాణ పోలీసు విభాగం రెండో స్థానంలో నిలిచింది. మంగళవారం ఢిల్లీలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన 13వ పాస్‌పోర్ట్ సేవా దివస్ కార్యక్రమంలో ఆ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరిటా అవార్డులు అందించారు. పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధ్రువీకరణలో రెండో స్థానంలో నిలిచిన తెలంగాణ పోలీస్ తరఫున ఉత్తమ సేవా పురస్కారం తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డి అందుకున్నారు. పాస్‌పోర్ట్ సేవల్లో ఉత్తమ సృజనాత్మక పనితీరు ప్రదర్శించిన హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికవగా, హైదరాబాద్ ఆర్పీఓ జొన్నలగడ్డ స్నేహజ ఈ అవార్డును అందుకున్నారు.

డీజీపీ అభినందనలు

పాస్‌పోర్ట్ ధ్రువీకరణ కోసం తెలంగాణ పోలీసులు అభివృద్ధి చేసిన వెరీఫాస్ట్ యాప్ ఈ ప్రక్రియను వేగవంతంగా, కచ్చితంగా, పారదర్శకంగా చేసింది. విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. తెలంగాణ పోలీసులు దేశంలోనే అత్యంత వేగంగా పాస్‌పోర్ట్ ధ్రువీకరణను పూర్తి చేస్తూ, అత్యల్పంగా మూడు పని దినాల్లోనే ఎక్కువ శాతం కేసులను పరిష్కరిస్తున్నారు. 2024–25లో మొత్తం 8,06,684 పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధ్రువీకరణను తెలంగాణ పోలీసులు విజయవంతంగా పూర్తి చేశారు. తెలంగాణ పోలీసులకు లభించిన ఈ జాతీయ గుర్తింపుపై డీజీపీ జితేందర్ అన్ని యూనిట్ల అధికారులను, ప్రత్యేక బ్రాంచ్ అధికారులను, సిబ్బందిని అభినందించారు.

ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు ప్రోత్సహించండి

'ఇఫ్కీ'సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు పిలుపు

తెలంగాణలో ఉన్న అనుకూలతలను వివరించాలని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించే ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ఫ్రెంచ్ కంపెనీలను ప్రోత్సహించాలని 'ఇండో ఫ్రెంచ్ చాంబర్ ఆఫ్ కామ ర్స్ ఇండస్ట్రీ (ఇఫ్కీ)'ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. మంగళ వారం సచివాలయంలో ఇఫ్కీ ప్రతినిధులతో శ్రీధర్‌బాబు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఆయన వివరించారు. 'తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి 30 వేల ఎకరాల్లో పీపీపీ విధానంలో అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు'అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఫ్రాన్స్ పారిశ్రామికవేత్తలు దీనిని సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని శ్రీధర్‌బాబు చెప్పారు. కార్యక్రమంలో ఇఫ్కీ నుంచి యోహాన్ సామ్యూల్, ప్రియాంక్ ప్రకాశ్, నకుల్ దల్వాలా, ఇతర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సఫ్రాన్'మరిన్ని పెట్టుబడులు

ఫ్రెంచ్ విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సఫ్రాన్ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న సఫ్రాన్ హైదరాబాద్‌లో ఇప్పటికే రెండు ప్రపంచస్థాయి ఉత్పాదక కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాజాగా శ్రీధర్ బాబు సమక్షంలో సఫ్రాన్ జనరల్ మేనేజర్ పియరీ ఫెర్నాండెజ్ కొత్త పెట్టుబడులను ప్రతిపాదించారు. సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ అనే కొత్త కంపెనీని నెలకొల్పనున్నట్టు వెల్లడించారు. రఫేల్, ఎం 88 ఫైటర్ జెట్ ఇంజన్ల నిర్వహణ, ఓవర్‌హాలింగ్ పనులను సఫ్రాన్ చేపడుతుంది. దీని వల్ల వచ్చే ఏడాది చివరి నాటికి 150 కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. తర్వాత దశల్లో మరో 750 ఉద్యోగాలు వస్తాయి. రఫేల్ యుద్ధ విమానాల ఇంజిన్లకు కీలక విడిభాగాలను సఫ్రాన్ తయారు చేస్తుంది. ఇక్కడి నుంచే ఇతర దేశాలకు సరఫరా చేస్తుంది.

ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు మళ్లీ బ్రేక్

▶ మొదటి పేజీ తరువాయి

సీట్ల పెంపుపై యూనివర్సిటీల వీసీలు, ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యామండలి అధికారుల మధ్య ఏమాత్రం సమన్వయం కుదర డం లేదు. అనుబంధ గుర్తింపు ప్రక్రియ మొత్తం యూనివర్సిటీలు పూర్తి చేశా యి. గుర్తింపు ఇవ్వడానికి సిద్ధమైన తరుణంలో విద్య, సాంకేతిక విద్య ఉన్నతాధికారులు దీనిపై అభ్యంతరాలు లేవనెత్తారు. కాలేజీలను పూర్తిగా తనిఖీ చేసేందుకు కమిటీ వేయాలంటూ సాంకేతిక విద్యామండలి ప్రభుత్వం వద్ద కొత్త వాదన లేవనెత్తింది. దీనికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నలివ్వడంతో అఫ్లియేషన్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. కౌన్సెలింగ్‌లో కాలేజీలు పాల్గొనాలంటే ముందు గుర్తింపు ఇవ్వాలి. ఇంత వరకూ కమిటీ ఏర్పాటుకు మార్గదర్శకాలు రాలేదు. అప్పటి వరకూ గుర్తింపు ఇవ్వకుండా ఆపడం ఏమిటని వీసీలు అంటున్నారు. ఉన్నతాధికారులు వ్యక్తిగత ప్రతిష్టకు పోతున్నారని, వీసీలపై పెత్తనం చెలాయించే ధోరణితో వ్యవహరిస్తున్నారని ఓ యూనివర్సిటీ వీసీ అన్నారు. ఫీజుల వ్యవహారం పైనా ఇదే పేచీ కొనసాగుతోంది. ప్రైవేట్ కాలేజీల ఆడిట్ నివేదికలు పరిశీలించిన ఎఫ్‌ఆర్‌సీ తుది నివేదికను ప్రభుత్వానికి పంపింది. ఫీజులు ఖరారైనట్టు ఉన్నత విద్యామండలి వెల్లడించడంతో సాంకేతిక విద్యామండలి అధికారులకు ఆగ్రహం వచ్చింది. అసలు ఫీజులు ఎలా పెంచుతారంటూ సాంకేతిక విద్య అధికారి ఒకరు అభ్యంతరం లేవనెత్తారు. ఈ వివాదాన్ని ప్రభుత్వం వరకూ చేరవేశారు. దీంతో ఫీజుల ఖరారు ఆగిపోయింది.

జీవో రాకుండా కౌన్సెలింగ్ కుదరదు

ఫీజులపై ప్రభుత్వం జీవో ఇవ్వాలని సాంకేతిక విద్యామండలి అధికారులు అంటున్నారు. అప్పటి దాకా కౌన్సెలింగ్ వాయిదా వేయాలని చెబుతున్నారు. అయితే, ఉన్నత విద్యామండలి మాత్రం ఫీజుల వ్యవహారంతో పనిలేకుండానే కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇవ్వాలని అభిప్రాయపడుతోంది. ఒకవేళ ఫీజులు పెంచితే ఆ తర్వాత కాలేజీలు వసూలు చేసుకోవచ్చనే షరతును కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో పెడతామని తెలిపింది. ఫీజుల వ్యవహారంపై ప్రైవేట్ కాలేజీలు కోర్టుకెళ్లే ఆలోచనలో ఉన్నాయి. ఇదే జరిగితే జీవో ఇవ్వకుండా కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని సాంకేతిక విద్యామండలి అధికారులు అంటున్నారు. మరోవైపు అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఈ నెలాఖరు వరకూ కొత్త సీట్లపై స్పష్టత ఇస్తుంది. కొత్త సీట్ల వ్యవహారం తేలకుండా రాష్ట్ర కౌన్సెలింగ్ నిర్వహించడం సరికాదని విద్యాశాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. ఒకవేళ కొత్త సీట్ల పెంపు అనివార్యమైతే ఆఖరి కౌన్సెలింగ్‌లో వీటిని పొందుపరిస్తే సరిపోతుందని ఉన్నత విద్యామండలి అంటోంది. ఇలా భిన్న వాదనల మధ్య కౌన్సెలింగ్ షెడ్యూల్ వాయిదా పడటంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే న్యాయ సలహా తీసుకోవాలనే ఆలోచనలో సాంకేతిక విద్యామండలి ఉంది.



అధికారాన్ని హస్తగతం చేసుకోవడం కాదు నాకు కావాల్సింది. జనానికి అధికారం మీద నియంత్రణ ఉండటం!
– 'లోక్‌నాయక్' జయప్రకాశ్ నారాయణ్

సాక్షి
బుధవారం, 25 జూన్ 2025

విరమణ... నిజంగానా?!

ఎప్పటిలాగే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బహుపాత్రాభినయంతో అందరినీ మెప్పిస్తున్నారు. పశ్చిమాసియాలో అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు సాగించిన కొన్ని గంటలకే ఇరాన్–ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు అంగీకరించాయని, దాన్ని తాము స్వాగతిస్తున్నామని మంగళవారం మధ్యాహ్నం ట్రంప్ ప్రకటించారు. దీనికి ఇరాన్ సానుకూలంగా స్పందించినా ఇజ్రాయెల్ మౌనం పాటించింది. ట్రంప్ ప్రకటించిన కాసేపటికే ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అది బాంబుల వర్షం కురిపించింది. రెండు దేశాలూ పరస్పరం 'ఎందుకో కూడా తెలియని' విధంగా కాల్పుల విరమణ ఒడంబడికను ఉల్లంఘిస్తున్నాయని ట్రంప్ నిందించి తన 'తటస్థతను' చాటుకున్నారు! ఇంతకూ కాల్పుల విరమణ నిజమేనా? ఒక సమాచారం ప్రకారం ఖతార్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించాక ట్రంప్ చొరవ తీసుకుని ఇరాన్‌తో మాట్లాడి కాల్పుల విరమణకు ఒప్పించమని ఖతార్‌ను కోరారు. ఖతార్ తీసుకొచ్చిన ప్రతిపాదనకు ఇరాన్ అంగీకారం తెలిపింది. ఇరాన్ ఈ సంగతి బాహాటంగానే చెప్పింది. కాల్పుల విరమణ గురించి ట్రంప్ బతిమాలుకున్నారని వెల్లడించింది. అయితే ట్రంప్ ప్రకటన తర్వాత కాసేపటికే దాడులకు దిగడాన్నిబట్టి ఇజ్రాయెల్‌కు ఈ పరిణామం ససేమిరా ఇష్టం లేదని బోధపడుతోంది. యుద్ధం ఆపటం సులభమేమీ కాదు. కాల్పుల విరమణ ప్రకటనకూ, దాని ఆచరణకూ మధ్య గంటలు మాత్రమే కాదు... రోజుల వ్యవధి కొనసాగటం రివాజే. మొన్న భారత్–పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందమైనా, రష్యా–ఉక్రెయిన్‌ల కాల్పుల విరమణ అయినా ఈ సంగతే చెబుతాయి.

యుద్ధానికి ముందు నెల నుంచి ట్రంప్ ఇరాన్‌కు రోజువారీ హెచ్చరికలు జారీచేస్తూ వచ్చారు. అణు ఒప్పందంపై మొండి పట్టుదలకు పోతే దేశం సర్వనాశనమవుతుందని బెదిరించారు. ఆఖరికి ఒకపక్క ఇరాన్ అమెరికాతో చర్చలు సాగిస్తుండగానే పన్నెండు రోజుల క్రితం ఇజ్రాయెల్ ఎలాంటి కవ్వింపూ లేకుండా ఆ దేశంపై దాడులు సాగించి ఇరాన్ సైనిక దళాల చీఫ్‌లు ఇద్దరినీ, అణు శాస్త్రవేత్తలతోసహా పలువురినీ హత్య చేసింది. ఇది తప్పని చెప్పాల్సిన ట్రంప్... ప్రతీకార దాడులకు దిగితే ఖబడ్దార్ అంటూ తిరిగి ఇరాన్‌నే హెచ్చరించారు. ఆఖరికి శనివారం అర్ధరాత్రి దాటాక అమెరికా తానే రంగంలోకి దిగి బంకర్ బస్టర్ బాంబులతో ఇరాన్‌లో మూడు అణు స్థావరాలను ధ్వంసం చేశామని ప్రకటించింది. ఇంతా అయినాక హఠాత్తుగా ట్రంప్ కొత్త రాగం అందుకున్నారు.

ఏకపక్ష యుద్ధం ప్రారంభానికి పూర్వమే ఇరాన్ బలహీనతలు బయటపడ్డాయి. దశాబ్దాల ఆంక్షలతో అన్నివిధాలా దెబ్బతిన్న దేశం మెరుగ్గా ఉండగలదని ఎవరూ భావించలేరు. ఒకపక్క నేరుగా అమెరికా, ఇజ్రాయెల్ కుటిలత్వం తెలుస్తున్నా మిత్రులనుకున్నవారు కూడా ఖండించటానికి సిద్ధపడకపోవటం... అండగా ఉండగలవని భావించిన రష్యా, చైనాలు ప్రకటనలకే పరిమితం కావటం, గల్ఫ్ దేశాలు నామమాత్రంగా ఖండించి ఊరుకోవటం ఇరాన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసి ఉంటాయి. అణు ఒప్పందానికి సిద్ధపడతామని ప్రకటించి ఆ దిశగా అడుగులేస్తున్న దేశం ప్రపంచంలో ఇలా ఏకాకిగా మిగిలిపోవటం వర్తమాన విషాదం. యుద్ధం పర్యవసానంగా ఇరాన్‌లో పలు దేశాల పెట్టుబడులు దెబ్బతింటాయి. పైగా ప్రపంచానికి పెద్ద పోలీసుగా వ్యవహరిస్తూ తాము చెప్పిందే ఒప్పందమని ఒత్తిడి తెచ్చే ధోరణి రేపన్నరోజు ఎవరికైనా ముప్పే. ఇజ్రాయెల్ దగ్గర... ఆ మాటకొస్తే పశ్చిమాసియాలో అణుబాంబుల జాడలేకపోతే, ఇరాన్ మాత్రమే ఆ పని చేస్తే దాన్ని నియంత్రించటంలో హేతుబద్ధత ఉన్నదని నమ్మినా తప్పుబట్టనవసరం లేదు. కానీ అసలు అమెరికా, రష్యా మొదలుకొని ఏకపక్ష యుద్ధాలతో అందరూ తమ బాధ్యతారాహిత్యాన్ని బయటపెట్టుకుంటుండగా ఒక్క ఇరాన్ మాత్రమే ధూర్త దేశమని ఎందుకు భావించాలి?

ఇంతకూ ట్రంప్ హఠాత్తు నిర్ణయం వెనకున్న కారణాలేమిటి? సైనిక స్థావరంపై దాడి చేస్తున్నామని ఇరాన్ ముందస్తు సమాచారం ఇవ్వటం, అందుకు అనుగుణంగా అమెరికా తన సైనికుల్ని తరలించటంతోపాటు క్షిపణుల్ని కూల్చే ఏర్పాటు చేసుకోవటం సాధ్యమైంది. ఒకే ఒక్కటి పేలినా దానివల్ల నష్టం లేదు. అది ట్రంప్‌కు నచ్చినట్టుంది. దానికితోడు ఆయన అందలం ఎక్కటంలో కీలకపాత్ర పోషించిన 'మాగా' ఈ యుద్ధంపై చీలిపోయింది. గట్టి మద్దతుదారైన స్టీవ్ బెనన్ లాంటివారు సైతం ట్రంప్‌ను తప్పుబట్టారు. ఆ ఒత్తిళ్ల మాటెలావున్నా యూరప్ నుంచి వస్తున్న వార్తలు అమెరికాను భయపెట్టి ఉండాలి. అమెరికా తర్వాత బంగారం నిల్వల్లో రెండు, మూడు స్థానాల్లో ఉన్న జర్మనీ (3,352 టన్నులు), ఇటలీ (2,452 టన్నులు) ఆ నిల్వల్లో మూడోవంతు భాగాన్ని అమెరికా ఫెడరల్ రిజర్వ్‌లో ఉంచాయి. దాన్ని వెనక్కుతేవాలని ఆ దేశాల్లో డిమాండ్లు బయల్దేరాయి. నిల్వల విలువ 24,500 కోట్ల డాలర్ల పైమాటే. ఫెడరల్ రిజర్వ్ స్వతంత్రతను దెబ్బతీసేలా ట్రంప్ వ్యవహరించటం, ప్రపంచాన్ని అస్థిరపరిచే నిర్ణయాలు తీసుకోవటం తదితర కారణాల వల్ల అమెరికాలో బంగారం ఉంచటం సురక్షితం కాదని విపక్షాలు వాదిస్తున్నాయి. అది ఆచరణ రూపందాలిస్తే అమెరికా ఆర్థికవ్యవస్థ మరింత కుంగిపోవటం ఖాయం. పైగా లండన్‌తో పాటు ప్రపంచంలోనే కీలకమైన బంగారం కేంద్రంగా వెలిగిపోతున్న న్యూయార్క్ కళ అడుగంటుతుంది. అందుకే ట్రంప్ పునరాలోచనలో పడ్డారా? లేక ముందస్తు సమాచారం ఇచ్చిన ఇరాన్ 'మంచితనం' నచ్చిందా? మొత్తానికి అగ్ని గుండం కాబోతున్న పశ్చిమాసియాలో సామరస్య గాలులు వీచటం ఆహ్వానించదగ్గది. ఇది పూర్తి స్థాయిలో సాకారం కావాలని ఆశించాలి.


గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, **తిథి:** అమావాస్య సా.4.32 వరకు, తదుపరి ఆషాఢ శుక్ల పాడ్యమి, **నక్షత్రం:** మృగశిర ప.11.32 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.7.34 నుండి 9.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.35 నుండి 12.27 వరకు, **అమృత ఘడియలు:** రా.12.52 నుండి 2.22 వరకు.

సూర్యోదయం: 5.31
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

మరోసారి ఎమర్జెన్సీ రాకూడదు!

జ్ఞాపకం




బండారు దత్తాత్రేయ

భారత ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ ఎమర్జెన్సీ. తన అధికారానికి ముప్పు రావడంతో నాటి ప్రధాని ఇందిరా గాంధీ 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించి స్వతంత్ర భారత చరిత్రలో చీకటి అధ్యాయానికి తెరతీశారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అనేకమంది ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాస్వామికవాదులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు గొప్ప పోరాటాన్ని నడిపారు. ఈ పోరాటంలో నేనూ భాగమయ్యాను. ఈ క్రమంలో ఏడాదికి పైగా జైలు జీవితం కూడా గడిపాను. ఎమర్జెన్సీ విధించి నేటికి (జూన్ 25) 50 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో నాటి నా అనుభవాలు ఈ తరానికి తెలియజేయడం సముచితమని భావిస్తున్నాను.

అప్పుడు నేను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ప్రచారక్. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల జోన్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఎమర్జెన్సీ ప్రకటించిన మరునాడే ఆరెస్సెస్‌ను నిషేధించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం చేపట్టేందుకు 'లోక్ సంఘర్ష్ సమితి' ఏర్పడింది. నేను కూడా అందులో భాగమయ్యాను. అజ్ఞాతంలోకి వెళ్లి ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ప్రజలను జాగృతం చేయాలని, ఎమర్జెన్సీ ఎత్తివేతకు ఉద్యమాలు నిర్వహించాలని 'లోక్ సంఘర్ష్ సమితి' నుంచి సూచనలు అందాయి. వెంటనే నా వస్త్రధారణ మార్చాను. తెల్లని లాల్చీ, పైజమా వేసుకునే నేను అందుకు భిన్నంగా షర్టు, ప్యాంటు, కోటు, టై, బూట్లు ధరించాను. పేరు కూడా ధర్మేంద్రగా మార్చుకున్నాను. జుట్టు కూడా పెంచుకొని మారువేషం కట్టాను. ఎమర్జెన్సీ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేయడం, ఎమర్జెన్సీని వ్యతిరేకించి జైలులో ఉన్న నాయకుల కుటుంబాలకు సహాయం చేయడం మా పని.

పత్రికలపై సెన్సార్ విధించడంతో ప్రజలకు ప్రభుత్వ వార్తలు తప్పితే, ఇతర ఏ రకమైన సమాచారం అందేది కాదు. మాకు అందిన రహస్య సమాచారాన్ని బులెటిన్ రూపంలో ప్రచురించి ప్రజలకు, కార్యకర్తలకు పంపిణీ చేసేవాళ్లం. ఒకసారి నిజామాబాద్ జిల్లా కామారెడ్డి వద్ద రామేశ్వరపల్లి అనే గ్రామంలోని ఒక పెద్ద రామాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఇంజినీర్ వెంకట్ రామ్‌రెడ్డి వివాహం సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు, అందరూ వ్రతంలో పాల్గొని ప్రసాదం తీసుకువెళ్లాలన్న సందేశం కార్యకర్తలకు వెళ్లింది. సుమారు 250 మంది కార్యకర్తలు, మద్దతుదారులు అక్కడకు చేరుకున్నారు. ఎలా తెలిసిందో ఏమో కానీ పోలీస్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు దీనిని పసిగట్టారు. పైన సమావేశ మందిరంలో మారువేషంలో ఉన్న నన్ను పోలీసు అధికారి గుర్తించి, పైకి వస్తున్న విషయాన్ని గమనించాను. అప్పుడు ప్యాంటు, టీ షర్ట్ ధరించి మెడలో శిలువ వేసుకొని తన పేరు జాన్‌గా మార్చుకొన్న ఏబీవీపీ నాయకుడు ప్రస్తుత త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి కూడా నా వెంట ఉన్నారు. నేను, ఇంద్రసేనా రెడ్డి ఆ ఆలయం వెనుకవైపున ఉన్న ఇరవై అడుగుల ఎత్తు ఉన్న ప్రహరీ గోడ దూకి అక్కడ నుంచి తప్పించుకున్నాం. మేం పారిపోయిన కొద్దిసేపటికే పోలీసులు కొందరు కార్యకర్తలను



◆ పైన సమావేశ మందిరంలో మారువేషంలో ఉన్న నన్ను పోలీసు అధికారి గుర్తించి, పైకి వస్తున్న విషయాన్ని గమనించాను. అప్పుడు ప్యాంటు, టీ షర్ట్ ధరించి మెడలో శిలువ వేసుకొని తన పేరును జాన్‌గా మార్చుకొన్న ఏబీవీపీ నాయకుడు, ప్రస్తుత త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి కూడా నా వెంట ఉన్నారు. నేను, ఇంద్రసేనా రెడ్డి ఆ ఆలయం వెనుకవైపున ఉన్న ఇరవై అడుగుల ఎత్తు ఉన్న ప్రహరీ గోడ దూకి అక్కడ నుంచి తప్పించుకున్నాం.

అరెస్ట్ చేసి 'దత్తాత్రేయ ఎక్కడ ఉన్నాడో చెప్పాలని' ఒత్తిడి చేశారు.

కొన్ని రోజుల తరువాత నేను, నాతో పాటు వరంగల్ విభాగ్ ప్రముఖ్ శ్రీధర్ జీ మారువేషంలో బెల్లంపల్లిలో ఒక చిన్న హోటల్‌లో భోజనం చేస్తున్నాం. సరిగ్గా అప్పుడే పోలీసులు వచ్చి మమ్మల్ని పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించడం మొదలుపెట్టారు. శ్రీధర్‌జీ తన పేరు శ్రీధర్ అని ఒప్పుకున్నారు. నేను మాత్రం 'దత్తాత్రేయ ఎవరో నాకు తెలియదు, నేను మాత్రం కాదు' అని నిక్కచ్చిగా చెప్పాను. శ్రీధర్‌జీని 'మీసా' క్రింద అరెస్ట్ చేసి వరంగల్ జైలుకి తరలించారు. మరుసటిరోజు పోలీసులు డోసు పెంచారు. చిత్రహింసలు పెడ్తామంటూ బెదిరింపులకు దిగారు. ఇంతలో ఒక పరిచయస్థుడైన నిజామాబాద్ సెంట్రల్ ఇంటెలి జెన్స్‌లో పనిచేస్తున్న మురళి అనే హెడ్ కానిస్టేబుల్ అక్కడకు వచ్చాడు. వస్తూనే, 'నమస్తే సార్.. బాగున్నారా' అని పలుకరించాడు. అంతటితో ఆగకుండా 'దత్తాత్రేయ గారూ' అంటూ కుశల ప్రశ్నలు వేశాడు. నేను అతడికి ప్రతిస్పందించడం గమనించిన పోలీస్ అధికారులు 'నీ పేరు దత్తా త్రేయ కదా' అంటూ మొత్తం మీద నన్ను ఒప్పించారు. మా కార్య కలాపాల గురించి, ఆదాయ మార్గాలు వంటి వాటి గురించి అడిగినా నేను సమాధానం చెప్పక పోవడంతో 'మీసా' కింద అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని చంచల్ గూడ జైలుకి తరలించారు.



జైలులో 'జనసంఘ్' నేతలు బంగారు లక్ష్మణ్, ఆలె నరేంద్ర... వరవరరావు, చెరబండ రాజు, ఎం.టి. ఖాన్, నాయిని నర్సింహారెడ్డి, కార్మిక నాయకులు చైతన్య, శీతల్ సింగ్ లష్కరి; ఇంకా జమాతే ఇస్లామీ, ఆనంద్ మార్గ్ సంస్థల నాయకులు ఉండేవారు. వారిలో అడ్వకేట్ రాజా బోస్ ఒకరు. మా సిద్ధాంతాలు వేరైనా మేమంతా కలిసి మెలిసి ఉండేవారం. ఇందిరా గాంధీ మమ్మల్ని ఎప్పటికీ విడుదల చేయరని, ఆమె శక్తిని సవాలు చేసే దమ్ము ఎవరికీ లేదని తోటి జైలు ఖైదీలు అంటున్న ప్పుడు రాజా బోస్ డ్రమ్స్ వాయిస్తూ... లెజెండరీ సింగర్ మహమ్మద్ రఫీ పాట 'సవేరే వాలీ గాడీ సే చలే జాయేంగే...' పాడుతూ మాలో కొత్త ఆశలు రేకెత్తించేవారు.

కొన్ని రోజుల తరువాత మా పెద్దన్న మాణిక్ ప్రభు పచ్చ కామెర్లు సోకి మరణించారు. ఆయన అంత్యక్రియల్లో పాల్గొనడానికి నాకు ఒక ఎస్కార్ట్ ఇచ్చి పంపించారు. మా అమ్మ ఈశ్వరమ్మ ఉస్మాన్ గంజ్‌లో ఉల్లిపాయల వ్యాపారం చేసేవారు. నేను జైలులో ఉన్నప్పుడు మా అమ్మ ములాఖత్‌లో వారానికొకసారి పండ్లు తీసుకొని వచ్చి నా క్షేమ సమాచారాలు తెలుసుకోవడమే కాదు, నాకు ధైర్యవచనాలు కూడా చెప్పేది. ఒకసారి ములాఖత్‌లో 'నువ్వు మళ్ళీ ఇలాంటి కార్యక్రమాలలో పాల్గొనను అని అండర్ టేకింగ్ ఇస్తే విడిపిస్తానని మామయ్య హామీ ఇచ్చాడ'ని చెప్పింది. దానికి 'నువ్వు ఏమన్నావ'ని అమ్మను అడిగాను. 'నా కొడుకు ఏమైనా ఎవ్వరి పిల్లనైనా ఎత్తుకుపోయాడా, దొంగతనం చేశాడా? ఏం తప్పు చేశాడని అండర్ టేకింగ్ ఇవ్వాలి?' అని గట్టిగా ప్రశ్నించానని అమ్మ వివరించింది. ములాఖత్ సమయంలో రికార్డు చేసుకునేందుకు అక్కడ ఉండే స్పెషల్ బ్రాంచ్ అధికారి ఈ మాటలు విని ఎంతో ఆశ్చర్యపోయారు. మా అమ్మకు రెండు చేతులతో దండం పెట్టి మరీ మెచ్చుకున్నారు. నాకు ఎంతో స్ఫూర్తి నిచ్చిన ఈ సంఘటన జీవితాంతం గుర్తుంటుంది.

జైలులో ఉన్నప్పుడు జైలర్ రామారావుతో నాకు మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. 1977 సార్వత్రిక ఎన్నికల ఫలితాల సమాచారం వారే మాకు తెలియజేశారు. ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న మాకు రామారావే ఎప్పటికప్పుడు సమాచారం అందించేవారు. ఇందిర, ఆమె తనయుడు సంజయ్ గాంధీ ఓటమి సమాచారం కూడా వారే మా చెవిన వేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే రాజా బోస్ 'సవేరే వాలీ గాడీ సే చలే జాయేంగే...' పాట అందుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే శక్తిమంతులు, వారు నియంతృత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.

నాటి చీకటి రోజుల్లో తీవ్రమైన నిర్బంధం, ఆంక్షల మధ్య జరిపిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటాలను ఈ తరానికి తెలియజేయాల్సిన అవసరం మనపై ఉంది. మరోసారి అలాంటి తప్పు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలే తీసుకోవాలి. ఇందుకు ప్రజాస్వామ్యంలో నాలుగు మూల స్తంభాలైన శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, మీడియాను బలోపేతం చేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ దేశంలో మరో ఎమర్జెన్సీకి తావివ్వ కూడదు, మన గొప్ప ప్రజాస్వామ్యానికి భంగం వాటిల్లనివ్వకూడదు. ఇది మన సమష్టి కర్తవ్యం.

వ్యాసకర్త హరియాణా గవర్నర్

ప్రజాభీష్టాన్ని వెక్కిరించిన పీడకల

సందర్భం



జి. కిషన్ రెడ్డి

యాభై ఏళ్ల క్రితం దేశంలో అవినీతి, నిరుద్యోగం, అధిక ధరలకు వ్యతిరేకంగా... జయప్రకాశ్ నారాయణ్ ఆధ్వర్యంలో 'సంపూర్ణ క్రాంతి' పేరుతో ఉద్యమం ఊపందుకుంది. ప్రజలంతా నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీపై ఆగ్రహావేశాలు వెళ్లగక్కుతున్న తరుణమది. అదే సమయంలో... అలహాబాద్ హైకోర్టు ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చింది. ఈ పరిస్థితుల్లో అధికారాన్ని కాపాడుకోవాలన్న ఆలోచనతో 1975 జూన్ 25 నాడు ప్రధాని ఇందిరాగాంధీ 'ఎమర్జెన్సీ' విధించారు. 1977 మార్చ్ 21 వరకు దాదాపు 21 నెలలపాటు ఆత్యయిక పరిస్థితి కొనసాగింది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతూ... ప్రజల హక్కులను హరిస్తూ, ప్రజాస్వామ్యపు నాలుగో మూలస్తంభమైన పత్రికాస్వేచ్ఛకు తిలోదకాలిస్తూ ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయం దేశ చరిత్రలో ఓ మాయని మచ్చగా మిగిలిపోయింది.

జయప్రకాశ్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అడ్వాణీ వంటి ఎందరో మంది నేతలను మీసా (మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్) చట్టం కింద ఎక్కడికక్కడ నిర్బంధించింది ప్రభుత్వం. ఏకపక్షంగా వ్యవహరిస్తూ రాజ్యాంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. వ్యక్తి స్వేచ్ఛను కాలరాస్తూ, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ... నియంతృత్వ పోకడలతో బలవంతంగా కుటుంబ నియంత్రణ చర్యలను అమలు చేశారు. జనాభా పెరగడం కారణంగా... పేదరికం పెరుగుతోందని ఇందిర ప్రభుత్వం తమ చర్యను సమర్థించుకునే ప్రయత్నం చేసింది. 'రోటీ, కపడా ఔర్ మకాన్' నినాదాన్ని ఎన్నికల కోసం వాడుకోవడం తప్ప నిజంగా పేదరికాన్ని తగ్గించేందుకు కాంగ్రెస్ పాలనలో ఇసుమంత ప్రయత్నం కూడా జరగలేదు.

◆ 'ఎమర్జెన్సీ'లో వ్యక్తి స్వేచ్ఛను కాలరాస్తూ, అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ... నియంతృత్వ పోకడలతో బలవంతంగా కుటుంబ నియంత్రణ చర్యలను అమలు చేశారు.

కానీ 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నిరంకుశత్వపు ఆలోచనలు, నియంత పోకడలను రూపుమాపి... భారతీయ అస్తిత్వాన్ని పునరుద్ధరించే ప్రయత్నం ప్రారంభమైంది. ఆయన ప్రభుత్వం ప్రారంభించిన 'స్వచ్ఛభారత్' అభియాన్‌కు ప్రజలు అండగా నిలిచారు. పేదరికంపై గత ప్రభుత్వాలు చెప్పిన మాటలకు, చేసిన చేతలకు పొంతన లేదు. కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదేళ్లలో దాదాపు 27 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చింది. ఇది ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. 'డిజిటల్ ఇండియా'తో ఆర్థిక వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందన్న సందర్భంలోనూ స్వచ్ఛందంగా ప్రజలు సహకరించారు. ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలోకి చేర్చేందుకు మారుమూల ప్రాంతాల్లోని వారికి కూడా అకౌంట్లు ఉండాలన్న ప్రధాని సంకల్పానికీ భారీ స్పందన వచ్చింది. భారతదేశ స్వాతంత్ర్యానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమానికి పిలుపునిస్తే... దేశమంతా ఏకతాటిపైకి వచ్చింది.

ప్రజలకు హక్కులను కల్పిస్తూ, వారి బాధ్యతలను గుర్తుచేస్తూ వారి ఆకాంక్షలకు, రాజ్యాంగ విలువలకు అనుగుణంగా వ్యవహరిస్తే ప్రజల సహకారం సంపూర్ణంగా ఉంటుంది. ఇలా ప్రజల సహకారం, వారి భాగస్వామ్యంతో తీసుకునే నిర్ణయాలతో 'ఎమర్జెన్సీ'కి తావు లేని పరిస్థితులు నెలకొంటాయనడంలో సందేహం లేదు. 50 ఏళ్ల క్రితం 'ఎమర్జెన్సీ' దేశ ఆర్థిక, సామాజిక, శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలను విధ్వంసం చేసి ప్రజల్లో భయాందోళనలకు రేకెత్తించింది. కానీ ప్రజలు తమకు ఏం కావాలో ఆలోచించి నిర్ణయం తీసుకోవడం కారణంగా... వారి సహకారంతో ఇవాళ 'ఆత్మనిర్భర భారత్' వైపు వడివడిగా అడుగులు వేస్తూ... 'వికసిత్ భారత్–2047' స్వప్న సాకారం కోసం ముందుకెళ్తున్నాం. ప్రభుత్వ విధానాల్లో ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే అసలైన అభివృద్ధి సాధ్యమన్న మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి ఆలోచన స్ఫూర్తితో దేశమంతా ఈ దిశగా ముందడుగేయాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు

ఆ 'చీకటి' కోణానికి మరోవైపు...

అభిప్రాయం



ఉండవల్లి అరుణ కుమార్

1975 జూన్ 25న భారతదేశంలో ఎమర్జెన్సీ విధించబడింది. ఈ సంవత్సరానికి యాభై ఏళ్ళు పూర్తయ్యింది! నిజానికి 1962 నుండి 1968 వరకూ మన దేశంలో ఎమర్జెన్సీ విధించబడిన విషయం మనకెవ్వరికీ తెలీదు. చైనా యుద్ధం వల్ల ఆనాటి ప్రెసిడెంట్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశంలో ఆత్యయిక పరిస్థితిని విధించారు. అలాగే 1971 నుండి '77 వరకూ బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో వి.వి. గిరి ఆత్యయిక స్థితి విధించారు. అంటే ఇందిరాగాంధీ మొట్టమొదటిసారి ప్రమాణస్వీకారం చేసిన 1966లోనూ, రెండవసారి ప్రధానైన 1971లోనూ మనదేశం అత్యవసర పరిస్థితుల్లోనే ఉంది. అయితే ప్రజల మీద ఆ పరిస్థితి ప్రభావం లేదు.

1975లో మొదటిసారి అంతర్గత ఎమర్జెన్సీ విధించబడింది. అత్యంత వివాదాస్పద నిర్ణయం తీసుకున్న ఇందిరాగాంధీ మీద ఆ 'మచ్చ' ఇప్పటికీ తొలగిపోలేదు. అయితే 1975 నాటి పరిస్థితులు, రాజకీయాలు ఒకసారి జ్ఞాపకం చేసుకుందామని ఈ చిన్న ప్రయత్నం.

పాలనకు అవరోధాలు

1966 జనవరి 24న ఇందిరాగాంధీ భారత ప్రధాని అయ్యారు. సోషలిస్టు భావాలున్న ఇందిరకు, కేపిటలిస్ట్ భావజాలాన్ని బలపరిచే మొరార్జీ దేశాయ్ వంటి నాయకుల నుంచి అడుగడుగునా అవరోధాలు ఎదురవుతూనే వచ్చాయి.

1962లో నెహ్రూ నాయకత్వంలో 361 సీట్లు గెలిచిన కాంగ్రెస్, 1967లో ఇందిర నాయకత్వంలో 243 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఏదైనా సంపూర్ణ చికిత్స చేస్తే గానీ కాంగ్రెస్ నిలబడే అవకాశాలు కన్పించటం లేదు. ఆ సమయంలో ప్రధాని ఇందిర తన తండ్రి నెహ్రూ సంకల్పించి, అమలు చేయలేకపోయిన 'ఆవడి' కాంగ్రెస్ తీర్మానాలను దులిపి బయటకు తీసింది. ఉప ప్రధాని మొరార్జీ చేతుల్లో ఉన్న ఆర్థిక శాఖను తనే తీసేసుకుంది (ఫలితంగా మొరార్జీ ఉప ప్రధాని పదవికి రాజీనామా చేసేశారు).

వెంటనే బ్యాంకుల జాతీయాకరణను ప్రకటించింది ఇందిరాగాంధీ. 1969 జూలై 15 నాటికి రూ. 50 కోట్లు మించి డిపాజిట్లున్న 14 బ్యాంకులను ప్రభుత్వపరం చేస్తూ ఆర్డినెన్స్ జారీ అయింది. 'దారిద్ర్యాన్ని తొలగిద్దాం' (గరీబీ హఠావో) నినాదంతో సొంత ఎజెండాను అమలుచేయటం ప్రారంభించింది. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. ఇందిర తెచ్చిన 'బ్యాంకుల జాతీయాకరణ' ఆర్డినెన్సును సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజభరణాలు (ప్రివీ పర్సులు) రద్దు చేస్తూ ఇందిర తీసుకున్న నిర్ణయాన్ని లోక్‌సభ ఆమోదించినా... రాజ్యసభలో పాస్ కాలేదు. మరోపక్క దేశాన్ని మిలిటరీ స్వాధీనం చేసుకుంటుందన్న పుకార్లు బలంగా వ్యాపించాయి.

ఇక, 1974లో గుజరాత్‌లోని ఒక ఇంజినీరింగ్ కాలేజీలో హాస్టల్ మెస్ ఛార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ ప్రారంభమైన విద్యార్థుల ఆందోళన... అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి చిమన్‌భాయ్ పటేల్ (కాంగ్రెస్) వ్యతిరేక ఉద్యమంగా రూపాంతరం చెందింది. పైకి ఈ ఉద్యమం చిమన్‌భాయ్ పటేల్‌కు వ్యతిరేకంగా జరుగుతున్నట్లు కనిపించినప్పటికీ, వాస్తవంగా ఇది ఇందిరా గాంధీ వ్యతిరేక ఉద్యమమే!

సాక్షాత్తూ జయప్రకాశ్ నారాయణ్ రంగంలోకి దిగడంతో, దాని విలువ విపరీతంగా పెరిగింది. ఏనాడూ ఏ పదవీ ఆశించని ఈ గాంధేయ విప్లవకారుడు... గుజరాత్ ఉద్యమంలోకి రావటంతో ఇందిరకు కష్టాలు ప్రారంభమయ్యాయి.

సరిగ్గా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్న 1975 జూన్ 12 నాడే... ఇందిర శిబిరంలో మరో బాంబు పేలింది. రాయబరేలీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పిచ్చింది. జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీ వంటి అగ్ర నాయకులు



◆ ఎమర్జెన్సీని దేశప్రజలు అధిక శాతం వ్యతిరేకించారు. కానీ ఎమర్జెన్సీ విధించకుండా ఒక్కరోజైనా ఇందిరా గాంధీ పరిపాలించగలిగేదా? ఆమెకు ఉన్న ప్రత్యామ్నాయాలు పరిమితం. ఒకటి: రాజీనామా చేసి రాజకీయాల నుండి తప్పుకోవడం, రెండు: పార్లమెంటును రద్దుచేసి వెంటనే ఎన్నికలకు పోవడం.

ఇందిర వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభలో జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడారు. అర్హత కోల్పోయిన ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వులను పాటించవద్దని మిలిటరీ, పోలీసులకు పిలుపునిచ్చారు. విద్యార్థులు కాలేజీలకు వెళ్ళడం మానేసి, మరో స్వాతంత్ర్య పోరాటంలోకి దూకాలన్నారు.

రాజ్యాంగానికి లోబడే...

1975 జూన్ 25 అర్ధరాత్రి, ఆర్టికల్ 352(1) అనుసరించి భారత రాష్ట్రపతి 'ఫక్రుద్దీన్ అలీ అహ్మద్' దేశంలో అత్యవసర పరిస్థితి అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రపతికి ఇందిర అత్యవసర స్థితిని సిఫార్సు చేసిన ఉత్తరంలోనే క్యాబినెట్ నిర్ణయం తీసుకోకుండానే ఈ సిఫార్సు చేస్తున్నాననీ, ఆ విధంగా చేయడం కూడా బిజినెస్ రూల్స్ ప్రకారం రూల్–12కి లోబడే చేస్తున్నాననీ ఆమె పేర్కొన్నారు. రేపు తెల్లవారగానే క్యాబినెట్ మీటింగ్ పెడ్తున్నానని కూడా ఆ లేఖలో ప్రస్తావించారు. ఆ విధంగా రాజ్యాంగానికి లోబడే అత్యవసర స్థితి ప్రకటించబడింది.

ఎమర్జెన్సీ ప్రకటించిన నెల రోజుల్లోపే... అంటే 1975 జూలై 23న లోక్‌సభ ఎమర్జెన్సీ నిర్ణయాన్ని ఆమోదించింది. రెండు రోజుల చర్చ తర్వాత 336 మంది అనుకూలంగానూ, 59 మంది వ్యతిరేకంగానూ ఓటు చేశారు.

ఇప్పటికీ అదొక చీకటి రాజ్యమనీ, ఆమె ఒక నియంత అనీ, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందనీ, ఆమె వ్యతిరేకులు అంటూనే ఉంటారు. రాజ్యాంగంలోంచే ఆర్టికల్ 352 తీయబడిందనీ, ఆ అధికరణం ప్రకారం ఎమర్జెన్సీ ప్రకటించటం రాజ్యాంగ విరుద్ధమెలా అవుతుందనీ నాలాంటి వాళ్ళకనిపించినా... కాంగ్రెస్ పార్టీయే 'సారీ' చెప్పాక అది తప్పే అయి వుంటుంది అనుకుని... ఇక మాట్లాడలేదు!

యశపాల్ కపూర్ అనే 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ' తన రాజీనామాను ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకు జనవరి 13న పంపించాడు. 1971 జనవరి 25న ప్రెసిడెంట్ ఆమోద ముద్ర పడింది. ఆ ఉత్తర్వుల్లోనే జనవరి 14 నుంచి అతను ఉద్యోగంలో లేడని స్పష్టంగా ఉంది (విత్ రెట్రాస్పెక్టివ్ ఎఫెక్ట్). అయినా 25కి ముందే ఆయన ఇందిర తరఫున పార్టీ మీటింగుల్లో పాల్గొన్నాడని ప్రధాని పదవి రద్దయిపోయింది. సుప్రీం కోర్టులో జస్టిస్ కృష్ణయ్యర్ వంటి జడ్జి 'స్టే' ఇచ్చినా ''లెక్క చేయం... నువ్వు రాజీనామా చేయాల్సిందే'' అనటం అంత పెద్ద నాయకుల స్థాయికి తగుతుందా?

సరే... ఎమర్జెన్సీ ఎత్తేయటం, ఎన్నికలకు పిలుపు నివ్వటం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీ పార్టీ ఓడిపోవటం... నిశ్శబ్దంగా అధికార మార్పిడి జరిగిపోవటం... ఈ చర్యలు కూడా ఆవిడ నియంతృత్వంలో భాగమేనా?

దేశమంతా చీకటి పాలనకు వ్యతిరేకంగా ఓటువేస్తే, అప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న మన రాష్ట్రంలో ఇందిర 42 సీట్లకు 41 సీట్లు ఎలా గెలిచింది! మనకి చీకటంటే అంత ఇష్టమా? అలాగే తమిళనాడు, కేరళ... దక్షిణ భారతంపై ఆ చీకటి ప్రభావం ఎందుకు చూపలేదు?

ఎమర్జెన్సీని దేశప్రజలు అధిక శాతం వ్యతిరేకించారు. కానీ ఎమర్జెన్సీ విధించకుండా 1975 జూన్ 26 తర్వాత... కనీసం ఒక్కరోజైనా ఆమె పరిపాలించగలిగేదా? ఇందిరకు ఉన్న ప్రత్యామ్నాయాలు పరిమితం. ఒకటి: రాజీనామా చేసి రాజకీయాల నుండి తప్పుకోవడం, రెండు: పార్లమెంటును రద్దుచేసి వెంటనే ఎన్నికలకు పోవడం.

ఇప్పటివరకూ ప్రధానమంత్రుల్ని దింపేయటం, ప్రధాన మంత్రులను చేయటం పార్లమెంటులో జరిగింది గానీ... రోడ్ల మీద ధర్నాలు, ఊరేగింపుల వల్ల జరిగితే ఇక పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుంది?

1952 నుంచి ఇప్పటి వరకూ ఏ ఎన్నికల్లోనూ ఏ పార్టీ కూడా 50% ఓట్లు సంపాదించి గెలవలేదు. 1984లో ఇందిర హత్యానంతరం 404 లోక్‌సభ సీట్లు గెలిచినప్పుడు కూడా కాంగ్రెస్‌కు పోలైన ఓట్లు 50% లేవు. అలాంటిది, ఒక 'స్టే' చెయ్యబడ్డ, పూర్తిగా టెక్నికల్ అయిన కోర్టు తీర్పును అడ్డుపెట్టుకొని ప్రధాని గద్దె దిగాలంటే... ఎలాంటి దృష్టాంతం (ప్రిసిడెంట్) ఏర్పడుతుంది? స్వతంత్ర, జనసంఘ్ వంటి క్యాపిటలిస్టు పార్టీలు సోషలిస్టు ఇందిరను ఎలాగైనా దింపెయ్యాలి అనుకున్నప్పుడు... లొంగిపోవాలా? తిరగబడాలా?

ఇందిరా గాంధీ తిరగబడింది. పర్యవసానంగా ఎన్నికల్లో ఓడిపోయింది. పరస్పర విరుద్ధ సిద్ధాంతాలు కలిగిన వారందరూ కలిసి రెండు ఏళ్ళలో ఏం పరిపాలన చేశారో కూడా దేశం చూసింది. 'ఇందిరా కో బులావో, దేశ్ కో బచావో' (ఇందిరను పిలవండి, దేశాన్ని కాపాడండి) అంటూ 1980లో మళ్ళీ ఆమెనే పిలిచి ప్రధాన మంత్రిని చేశారు.

(ఇప్పటికీ 352 ఆర్టికల్ చిన్న సవరణతో అలాగే ఉంది. అంతర్గత అలజడులు (ఇంటర్నల్ డిస్టర్బెన్స్)కు బదులుగా సాయుధ తిరుగుబాటు (ఆర్మ్డ్ రెబెలియన్) అని సవరించడం గమనార్హం!)

వ్యాసకర్త లోక్‌సభ మాజీ సభ్యుడు(కాంగ్రెస్)

క్లుప్తంగా...

రైతుబంధు డబ్బులివ్వలేదని..

• తండ్రి నాలుక కోసిన తనయుడు


పీర్యా

హవేళిఘణాపూర్ (మెదక్): రైతుబంధు డబ్బులు ఇవ్వడం లేదన్న కోపంతో ఓ తనయుడు కొడవలితో కన్న తండ్రి నాలుక కోసిన ఘటన మెదక్ జిల్లా హవేళిఘణాపూర్ మండలం ఔరంగాబాద్ తండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఔరంగాబాద్ తండాకు చెందిన పీర్యాకు ఉన్న ఎకరంన్నర పొలానికి రైతుబంధు డబ్బులు వచ్చాయి. దీంతో అతడు బ్యాంకు నుంచి రూ.8 వేలు తీసుకొని ఇంటికి వచ్చాడు. ఆ డబ్బు తనకు ఇవ్వాలని అతడి కుమారుడు సంతోష్ తండ్రితో గొడవ పడ్డాడు. పీర్యా మాత్రం రూ.4 వేలే ఇస్తానని తెగేసి చెప్పటంతో ఆగ్రహించిన సంతోష్ కొడవలితో తండ్రి నాలుక కోశాడు. పీర్యాకు తీవ్ర రక్తస్రావం కావటంతో వెంటనే ఆయనను మెదక్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

కోడలి వేధింపులు భరించలేక అత్త బలవన్మరణం


సకీరమ్మ (ఫైల్)

మరికల్: అత్తపై కోడలు దాడి చేయడంతోపాటు వేధింపులకు పాల్పడటంతో భరించలేక అత్త ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మండలంలోని గాజులయ్య తండాకు చెందిన సకీరమ్మ (68)కు ఇద్దరు కుమారులు. కూలి పనులు చేసి ఇద్దరు కుమారుల పెళ్లి చేసింది. అయితే కొంతకాలంగా చిన్న కుమారుడె గేనూనాయక్, ఆయన భార్య జయమ్మ, మనువడు జైపాల్‌నాయక్.. సకీరమ్మను తరచూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి కోడలు జయమ్మ అత్తపై దాడి చేయడంతో మనస్తాపానికి గురై మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పెద్ద కుమారుడు రాంసింగ్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

బ్యాంకులో తుపాకీ మిస్‌ఫైర్



ఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శివాజీ చౌక్‌లో గల ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో తుపాకీ మిస్‌ఫైర్ అయింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు. పెను ప్రమాదం తప్పడంతో బ్యాంకుకు వచ్చిన వారు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఉదయం 10.15 గంటల సమయంలో బ్యాంకు నుంచి డబ్బులు బయటకు తీసుకెళ్లే సమయంలో గార్డ్ రాములు తుపాకీలో బుల్లెట్లు లోడ్ చేశాడు. పొరపాటున ట్రిగ్గర్‌పై వేలు పడటంతో తూటా బ్యాంక్ పైకప్పుకు తగిలింది. దీంతో అక్కడ ఉన్న అధికారులు, సిబ్బంది ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందోనని ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో కొంత మంది ఖాతాదారులు మాత్రమే బ్యాంకులో ఉన్నారు. వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు.

కారుతో గుద్ది సంపుతా బిడ్డా

ఎమ్మెల్యే డ్రైవర్‌ను అంటూ వార్నింగ్

గంగాధర: 'నేను ఎమ్మెల్యే డ్రైవర్‌ను.. బిల్లు కట్టకుంటే కరెంట్ కట్ చేస్తావా? ఏది కట్ చేసి చూడు.. ఊళ్లోకి ఎలా వస్తావో చూస్తా.. ఎమ్మెల్యేతో మాట్లాడించాలా? కారుతో గుద్ది సంపుతా బిడ్డా' అంటూ గంగాధర మండలంలోని కొట్లనర్సింహులపల్లికి చెందిన ఓ వ్యక్తి లైన్‌మెన్‌ను బెదిరించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సదరు వ్యక్తి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేరును సైతం ప్రస్తావించాడు. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. విద్యుత్ ఉద్యోగిని బెదిరించడమే కాకుండా తన పేరు వాడుకున్న వ్యక్తిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొప్పదండి సీఐని ఆదేశించారు.

హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేక..

• కేజీబీవీ పైనుంచి దూకిన విద్యార్థిని

వనపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని మర్రికుంట సమీపంలో కేజీబీవీ హాస్టల్ భవనం పైనుంచి ఒక విద్యార్థిని దూకడంతో వెన్నెముకకు తీవ్ర గాయమైంది. మంగళవారం జరిగిన ఈ ఘటనపై ప్రిన్సిపాల్ లోహిత తెలిపిన వివరాలివి. మండలంలోని కిష్టగిరికి చెందిన గొల్ల సంజీవ్ కుమార్తె తరుణి.. వారం కిందట కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో చేరింది. హాస్టల్‌లో ఉండి చదవడం ఆమెకు ఇష్టం లేక.. మూడురోజులుగా బాధపడుతుండటంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారు సకాలంలో రాకపోవడంతో ఇంటికి పారిపోవాలని నిర్ణయించుకున్న తరుణి.. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో హాస్టల్ భవనం పైనుంచి కిందకు దూకింది. దీంతో ఆమె వెన్నెముకకు గాయమైంది. నొప్పితో విద్యార్థిని అరవడంతో.. వాచ్‌మన్, ఉపాధ్యాయిని అక్కడికి చేరుకొని ఎస్‌ఓకు సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే సిబ్బందితో కలిసి విద్యార్థినిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చారు. డీఈవో అబ్దుల్ ఘని, జీసీడీవో శుభలక్ష్మి ఆస్పత్రికి చేరుకొని వైద్యులతో మాట్లాడారు. వారి సూచనల మేరకు విద్యార్థినిని వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు.

'చినబాబు సర్వీసు' కమిషన్!

• ఏపీలో గ్రూప్–1 ఇంటర్వ్యూల్లో గూడుపుఠాణీ.. అంతా గుంభనంగా!
• సబ్జెక్టును పక్కనబెట్టి పూర్తిగా రాజకీయ నేతల తరహాలో ఆరా
• సీఎం చంద్రబాబు కీర్తనలు.. మాజీ సీఎం జగన్‌పై విమర్శలు

నారా చంద్రబాబునాయుడు..! వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..! వీరిద్దరిలో విజనరీ నాయకుడు ఎవరంటే ఏం చెబుతారు?

రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ పూర్తిగా విఫలమైంది..! దీనిపై మీ అభిప్రాయం ఏమిటి?

అమరావతే రాజధానిగా ఉండాలని అంతా భావిస్తున్నారు..! దీన్ని ఎలా భావిస్తున్నారు?

ఈ ప్రశ్నలు వేసింది ఏ బహిరంగ సభలోనో.. ఏ రాజకీయ నాయకుడో కాదు.. తాజాగా గ్రూప్‌-1 ఇంటర్వ్యూలో అభ్యర్థులను బోర్డు అడిగిన ప్రశ్నలివీ!!

సాక్షి, అమరావతి: గ్రూప్–1 ఇంటర్వ్యూలు దారి తప్పాయి! రాష్ట్రంలోని అత్యుత్తమ సర్వీసుల్లో.. ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు పాటించాల్సిన కనీస నిబంధనలను పక్కనబెట్టిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఏపీపీఎస్సీ) రాజకీయ శక్తుల చేతుల్లో కీలుబొమ్మలా మారిపోయింది! రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన సర్వీస్ కమిషన్ ఓ రాజకీయ పార్టీకి కొమ్ము కాసేలా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడంపై ఇంటర్వ్యూలకు హాజరవుతున్న అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నడూ లేనివిధంగా కమిషన్‌లో ఇతర సభ్యులను పక్కన పెట్టడం.. చివరి నిమిషంలో ఓ సభ్యుడిని తీసుకురావడం.. ఇంటర్వ్యూల నిర్వహణకు మూడు బోర్డులకు బదులుగా ఒకే ఒక్క బోర్డుకు పరిమితం కావడం.. లాంటివన్నీ గుంభనంగా సాగుతున్న వ్యవహారాలకు నిదర్శనమని మండిపడుతున్నారు. పారదర్శకంగా ఉండాల్సిన కమిషన్ చరిత్రలో తొలిసారి అత్యంత జూనియర్ సభ్యుడిని తాజాగా గ్రూప్–1 ఇంటర్వ్యూ బోర్డులో నియమించడం గమనార్హం. అది కూడా ఆదివారం నియామక ఉత్తర్వులిచ్చి సోమవారం సాయంత్రం ప్రమాణస్వీకారం చేయించి మంగళవారం నుంచి బోర్డులోకి తీసుకున్నారంటే గ్రూప్–1 ఇంటర్వ్యూలు ఎలా జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. బోర్డులో సభ్యులుగా ఉన్నవారు ఆ రోజు మొత్తం జరిగే ప్రక్రియలో పూర్తిగా ఉండాలి. కానీ ఓ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ మధ్యాహ్నం తరువాత వెళ్లిపోయారు.

ఇంటర్వ్యూ ముంగిట ఇదేం తీరు?

2023 గ్రూప్–1 నోటిఫికేషన్‌కు సంబంధించి ఇంటర్వ్యూల కోసం స్పోర్ట్స్ కేటగిరీలో 42 మందిని, జనరల్ కేటగిరీలో 182 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరికి ఈనెల 23 నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. ఇంటర్వ్యూ బోర్డులో చైర్మన్‌తో పాటు సభ్యుల్లో కనీసం ఒక్కరైనా ఉండాలి. ఒక మానసిక నిపుణుడు, సబ్జెక్టు నిపుణుడుగా ఏదైనా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పాల్గొనడం తప్పనిసరి. కానీ ఇప్పుడు ఇవేమీ లేకుండా అంతా గుట్టుగా జరిగిపోతున్నాయి. ఇంటర్వ్యూలకు తొలుత మూడు బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ఏపీపీఎస్సీ.. చివరికి కూటమి ప్రభుత్వంలో ఓ కీలక మంత్రి ఆదేశాలతో ఒకే ఒక్క బోర్డుకు కుదించినట్లు సమాచారం. ఒక్క బోర్డు ఉంటే ప్రభుత్వ పెద్దల అభీష్టం మేరకు ఎంపిక జరుగుతుందనే ఆందోళన అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. తద్వారా ప్రతిభకు తీరని అన్యాయం జరుగుతుందని, సంవత్సరాల తరబడి తదేక దీక్షతో సిద్ధమై ఇంటర్వ్యూ వరకు వచ్చిన అభ్యర్థుల తలరాత మారిపోతుందని ఆక్రోశిస్తున్నారు.

మంత్రి కనుసన్నల్లో మొత్తం ప్రక్రియ..

కేంద్రంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు రాష్ట్రాలలో ఉద్యోగాల భర్తీ కోసం ప్రత్యేక సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాజ్యాంగంలోని 315 ఆర్టికల్ నిర్దేశిస్తోంది. 316, 317 నిబంధనల్లో కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం, పదవీ కాలాన్ని పొందుపరిచారు. దీని ప్రకారమే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటైంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండే చైర్మన్.. కమిషన్‌లో పాలనాపరమైన నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలి. ఇంటర్వ్యూ బోర్డులో చైర్మన్‌తో పాటు సభ్యుల్లో సీనియర్‌ను తప్పనిసరిగా నియమించాలి. వీరిద్దరితోపాటు సబ్జెక్టు నిపుణులు, వర్సిటీ వీసీ లేదా ప్రొఫెసర్ ఉంటారు. ఒకటికి మించి ఇంటర్వ్యూ బోర్డులు ఏర్పాటు చేసినప్పుడు సీనియారిటీ ప్రకారం ముందున్న సభ్యుడిని ఆ బోర్డుకు చైర్మన్‌గా నియమిస్తారు. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీపీఎస్సీ ఓ మంత్రి సేవలో తరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మూడు బోర్డుల స్థానంలో కేవలం ఒకటే

వారం క్రితం గ్రూప్–1 ఇంటర్వ్యూల కోసం 3 బోర్డులు ఏర్పాటు చేస్తూ కమిషన్‌లో ఫైల్ పెట్టారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బోర్డు సభ్యులకు శిక్షణ కూడా ఇచ్చారు. అయితే ఈనెల 23న ఇంటర్వ్యూలు అనగా ముందు రోజు సీన్ మొత్తం మారిపోయింది. మూడు బోర్డుల స్థానంలో కేవలం ఒకే ఒక్క బోర్డు ఏర్పాటు చేశారు. ఉన్న సభ్యులను కాదని కొత్త సభ్యుడిని నియమించారు. ఈమేరకు ఆదివారం ఉత్తర్వులిచ్చి సోమవారం సాయంత్రం ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. మంగళవారం ఇంటర్వ్యూ బోర్డులో కూర్చోబెట్టారు. సోమవారం బోర్డులో ఉన్న సీనియర్ సభ్యుడిని హఠాత్తుగా తొలగించి జూనియర్‌ను అప్పటికప్పుడు నియమించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో తన ప్రమేయం ఏదీ లేదని, ప్రభుత్వంలో కొందరు పెద్దల నుంచి తనపై తీవ్ర ఒత్తిడి ఉందని దీన్ని ప్రశ్నించిన ఇతర సభ్యుల వద్ద చైర్మన్ వాపోయినట్లు తెలిసింది. దీన్నిబట్టి ఓ యువ మంత్రి కనుసన్నల్లో ఎంపిక ప్రక్రియ సాగుతున్నట్లు అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

సీనియర్ సభ్యులను పక్కనపెట్టి..

టీడీపీ హయాంలో 2015–19 మధ్య నియమితులైన ఏపీపీఎస్సీ సభ్యులు వైఎస్ జగన్ ప్రభుత్వంలోనూ కొనసాగారు. వీరు బోర్డులో కీలక బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు 2018 గ్రూప్–1 ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారు. ఏపీపీఎస్సీ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్ 2015 నవంబర్ 27 తేదీన నియమితులై 26–11–2021 వరకు పూర్తికాలం కొనసాగారు. గతంలో టీడీపీ ప్రభుత్వం నియమించిన ఆరుగురు సర్వీస్ కమిషన్ సభ్యుల్లో ప్రొఫెసర్ జి.రంగజనార్దన నాలుగేళ్ల ఐదు నెలలు కొనసాగిన అనంతరం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్‌గా అవకాశం రావడంతో సభ్యుడిగా రాజీనామా చేశారు. మిగిలిన ఐదుగురు సభ్యులు పూర్తి పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. టీడీపీ సర్కారు నియమించిన సభ్యుల్లో ప్రొఫెసర్ పద్మరాజు, విజయకుమార్, సేవారూప, రామరాజు అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనూ కొనసాగారు. వీరిలో ప్రొఫెసర్ పద్మరాజు, విజయకుమార్ 2018 గ్రూప్–1 అభ్యర్థులకు 2022లో ఏపీపీఎస్సీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు రెండు బోర్డుల్లో చైర్మన్లుగా వ్యవహరించారు. ప్రొఫెసర్ పద్మరాజు సర్వీస్ కమిషన్ సభ్యుడిగా ఆరేళ్ల కాలాన్ని పూర్తి చేసిన అనంతరం నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా గత ప్రభుత్వంనియమించింది. అయితే గత ప్రభుత్వంలో నియమితులైన సభ్యులను ఇప్పుడు గ్రూప్–1 ఇంటర్వ్యూలకు పూర్తిగా దూరం పెట్టడంతో పాటు ఓ కొత్త సభ్యుడిని నియమించి ఆయనకు అవకాశం ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తలరాతలు తారుమారు...

టీడీపీ హయాంలో సర్వీస్ కమిషన్ తీరు వివాదాల పుట్టగా మారింది. ముఖ్యంగా ఉదయ్‌భాస్కర్ చైర్మన్‌గా తీసుకున్న నిర్ణయాలు వేలాది మంది నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలను తల్లకిందులు చేశాయి. ఇంటర్వ్యూ బోర్డులో కమిషన్ సభ్యులతో పాటు ఉన్నతస్థాయి అధికారి ఒకరు, సబ్జెక్టు నిపుణులు ఒకరు ఉండాలి. కానీ ఇవేవీ పాటించకుండా టీడీపీ ప్రభుత్వం ఒక్క బోర్డునే ఏర్పాటు చేసింది. కమిషన్ చైర్మన్ మాత్రమే ఇంటర్వ్యూ బోర్డు చైర్మన్‌గా వ్యవహరించారు. ఇంటర్వ్యూలో తుది మార్కులు వేసేది చైర్మన్ కావడంతో అన్నీ తానై చక్కబెట్టినట్టు విమర్శలు వెల్లువెత్తాయి. గత టీడీపీ ప్రభుత్వంలో డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్ పోస్టుల్లో ఆయన ఇదే విధానాన్ని అనుసరించారు. ఈ పోస్టుల భర్తీలో అక్రమాలు జరిగాయని తీవ్రస్థాయిలో ఆరోపణలు వ్యక్తమయ్యాయి. 2018 గ్రూప్–2 పరీక్షల నిర్వహణ కూడా వివాదాస్పదమైంది. ఇదే రీతిలో ఇప్పుడు గ్రూప్–1 ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారనే ఆందోళన రేకెత్తుతోంది. పేలవమైన ప్రశ్నలు.. గత ప్రభుత్వ విధానాలపై స్టేట్‌మెంట్లు ఇస్తూ బోర్డు సభ్యులు రాజకీయ నేతల మాదిరిగా వ్యవహరించడం ఏమిటని అభ్యర్థులు మండిపడుతున్నారు. టీడీపీ పెద్దల మెప్పు కోసం గ్రూప్–1 ఇంటర్వ్యూ బోర్డును రాజకీయ వేదికలా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీధర్ బినామీలపై ఏసీబీ ఫోకస్..!

• ఇరిగేషన్ బినామీలుగా కొందరి గుర్తింపు
• ఐదో రోజు విచారణలో కీలక వివరాల సేకరణ
• ముగిసిన ఇరిగేషన్ ఈఈ ఏసీబీ కస్టడీ

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన ఇరిగేషన్ శాఖ ఈఈ నూనె శ్రీధర్ బినామీ ఆస్తులపై ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు. శ్రీధర్ తన అక్రమార్జనను బినామీల పేరిట దాచినట్టు కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఇప్పుడు వారికి నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఏసీబీ కోర్టు అనుమతితో ఈ నెల 20 నుంచి నూనె శ్రీధర్‌ను ఐదు రోజుల కస్టడీకి తీసుకున్న ఏసీబీ అధికారులు విచారణలో పలు కీలక వివరాలు సేకరించారు. మంగళవారం చివరి రోజు విచారణలో బినామీల గురించే ఎక్కువసేపు ప్రశ్నించినట్లు తెలిసింది. సోమవారం ఒక ఎస్‌బీఐ బ్యాంకు లాకర్ తెరిపించగా, మంగళవారం మరికొన్ని లాకర్లను తెరిపించారు. అందులో కొన్ని ఆస్తి పత్రాలు గుర్తించారు. ఎవరెవరి పేర్లపై ఈ ఆస్తులు ఉన్నాయి..? వారికి శ్రీధర్‌తో సంబంధాలు ఏంటి..? అన్నది ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించిన ప్రకారం నూనె శ్రీధర్ ఆస్తులు రూ.200 కోట్లకుపైనే ఉన్నట్టు ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. లాకర్లలో పట్టుబడిన డాక్యుమెంట్ల ప్రకారం అది మరింత పెరిగే అవకాశం ఉంది. శ్రీధర్ కస్టడీ ముగియటంతో బినామీలకు నోటీసులు జారీచేసిన వారిని సైతం విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

ఇంట్లోనే లింగ నిర్ధారణ పరీక్షలు

• అధికారులకు పట్టుబడిన ఎలక్ట్రీషియన్


స్కానింగ్ మిషన్‌తో పట్టుబడిన అంజిరెడ్డి

ఖమ్మం వైద్యవిభాగం: ఎలాంటి అనుమతులు లేకుండా ఇంట్లోనే యంత్రాన్ని సమకూర్చుకుని అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ఓ ఎలక్ట్రీషియన్ అధికారులకు పట్టుబడ్డాడు. ఖమ్మంలోని పంపింగ్ వెల్ రోడ్డుకు చెందిన అన్నవరపు అంజిరెడ్డి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. వైద్యపరీక్షలు చేసేందుకు ఆయనకు ఎలాంటి అర్హతలు లేకపోగా.. పుట్టబోయేది ఏ సంతానమో తెలుసుకోవాలనే తల్లిదండ్రుల ఆసక్తిని సొమ్ము చేసుకుంటున్నాడు. ఈమేరకు స్కానింగ్ యంత్రాన్ని సమకూర్చుకుని ఇంట్లోనే అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సైదులు టాస్క్‌ఫోర్స్ ఉద్యోగులతో కలిసి మంగళవారం సంయుక్త ఆపరేషన్ నిర్వహించగా, అంజిరెడ్డి పట్టుబడ్డాడు. స్కానింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకుని ఆయనను ఖమ్మం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలింత కడుపులో టవల్ వదిలేసిన వైద్యులు

• రూ.5 లక్షల పరిహారం, చికిత్స ఖర్చు చెల్లించాలని తీర్పు
• 2021 నాటి కేసులో వినియోగదారుల ఫోరం ఆదేశం

ఖమ్మం లీగల్: మహిళకు ప్రసవం చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి కడుపులో సర్జికల్ టవల్ వదిలేసిన ఖమ్మంలోని పీపుల్స్ నర్సింగ్‌హోం వైద్యులు పరిహారం, వైద్యఖర్చులు చెల్లించాలంటూ జిల్లా వినియోగదారుల ఫోరం తీర్పు చెప్పింది. మంగళవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఏదులాపురానికి చెందిన కాండ్రుకోట సౌమ్య ప్రసవం కోసం పీపుల్స్ నర్సింగ్‌హోం ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు 2021 డిసెంబర్ 1న శస్త్రచికిత్స చేశారు. ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. కొంతకాలానికి సౌమ్య కడుపు నొప్పి, వాంతులు, ఇతర సమస్యలతో బాధపడటంతో వైద్యులు పరీక్షించి సాధారణ సమస్యగానే చెబుతూ మందులు ఇచ్చారు. అయినా, పరిస్థితి చక్కబడకపోవడంతో 2022 ఏప్రిల్ 1న అదే ఆస్పత్రికి వెళ్తే స్కాన్ చేయించి మరో డాక్టర్ వద్దకు పంపించారు. అక్కడి వైద్యులు కడుపులో రాయి వంటి పదార్థాన్ని గుర్తించడంతో సౌమ్య పీపుల్స్ నర్సింగ్‌హోం వైద్యులకు ఫోన్‌లో చెబితే కలిసే అవకాశం ఇవ్వలేదు. ఆపై ఏప్రిల్ 4న ఆమె తీవ్ర అస్వస్థతకు గురికాగా మరో ఆస్పత్రిలో ఏప్రిల్ 6న ఆపరేషన్ చేయడంతో సౌమ్య కడుపులో 15x20 సైజులో సర్జికల్ టవల్ బయటపడింది. దీంతో ఆమె జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించింది. కేసు వివరాలు పరిశీలించాక వైద్య ఖర్చుల కింద రూ.1,35,533ను 8 శాతం వడ్డీతో చెల్లించాలని.. పరిహారం, మానసిక వేదన, ఇబ్బందుల కింద రూ.5 లక్షలు, కేసు ఖర్చుల కింద రూ.40 వేలను ఖమ్మం పీపుల్స్ నర్సింగ్‌హోమ్ చెల్లించాలని మంగళవారం తీర్పు ఇచ్చారు.

ఆ బ్యాంకు ఉద్యోగి ఎక్కడ?

• తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి కోసం పోలీసుల గాలింపు
• దేశం విడిచి వెళ్లేందుకు ప్రయత్నం...దీంతో లుక్ అవుట్ నోటీసు జారీ
• అనుమానితుల కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే అతనికి సంబంధించిన బ్యాంకు ఖాతాలు సీజ్ చేసినట్టు తెలిసింది. మంగళవారం డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను కర్నూలు జిల్లాకు చెందిన ప్రధాన నిందితుడైన బ్యాంకు ఉద్యోగి తల్లిదండ్రులు, భార్యను వేర్వేరుగా రెండు గంటలకుపైగా విచారించారు. ఇంట్లో ఏమైనా గొడవలు ఉన్నాయా, మనస్పర్థలు చోటు చేసుకున్నాయా అన్న కోణంలోనూ ఆరా తీశారు. తేజేశ్వర్ భార్య సహస్ర, ఆమె తల్లి సుజాతతో ఆర్థిక విషయాలను సైతం ప్రశ్నించారని తెలుస్తోంది. అయితే ఇప్పటికే ఈ కేసులో సహస్ర, సుజాతలు పోలీసుల అదుపులో ఉండటంతో వారి నుంచి కూడా వివరాలు సేకరించారు. ప్రధాన నిందితుడి తండ్రి కర్నూలు జిల్లాలోని పోలీస్ శాఖలో ఏఎస్‌ఐ స్థాయిలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసినట్టు గుర్తించారు. తమ అదుపులో ఉన్న అనుమానితుల కుటుంబ సభ్యులను సైతం పోలీసులు విచారించినట్లు విశ్వసనీయ సమాచారం.

నగదు మొత్తం విత్‌డ్రా

తేజేశ్వర్ హత్య అనంతరం ప్రధాన నిందితుడైన బ్యాంకు ఉద్యోగి సుపారీ ఇచ్చిన వారికి రూ.2 లక్షలు అందజేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అయితే తేజేశ్వర్ హత్యకు ముందే ప్రధాన నిందితుడు తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోంచి భారీ మొత్తంలో నగదు డ్రా చేసుకున్నట్టు సమాచారం. హైదరాబాద్‌లోని స్నేహితులు, బంధువులను కలిసి అక్కడి నుంచి విదేశాలకు పారిపోయేందుకు ప్రధాన నిందితుడు ప్రయత్నించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో పోలీసులు ముందస్తుగానే ఎయిర్‌పోర్టు కార్యాలయానికి ప్రధాన నిందితుడికి సంబంధించిన వివరాలను చేరవేసి లుక్ అవుట్ నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. అయితే ఈ విషయం సైతం ప్రధాన నిందితుడు తెలుసుకొని హైదరాబాద్ శివారులో తెలిసిన వ్యక్తుల ఇళ్లలో తలదాచుకున్నట్టు పోలీసులు గుర్తించారు.

ముందే న్యాయ సలహా

తేజేశ్వర్ హత్య జరిగిన నేపథ్యంలో ఎప్పటికైనా అరెస్టు కావడం ఖాయమని గుర్తించిన ప్రధాన నిందితుడు న్యాయ నిపుణుల సలహాలు సైతం తీసుకున్నట్టు తెలిసింది. తేజేశ్వర్ మిస్సింగ్ కేసు నమోదు తర్వాత, ఆయన కుటుంబ సభ్యులు అనుమానిత వ్యక్తుల వివరాల్లో బ్యాంకు ఉద్యోగి పేరు కూడా చెప్పడంతో విచారణ అధికారులు ఫోన్ చేసి మాట్లాడారు. ఎఫ్‌ఐఆర్ నమోదు కాకముందే.. బ్యాంకు ఉద్యోగి తరఫున కర్నూలుకు చెందిన న్యాయవాదులు వచ్చి ఈ నెల 20వ తేదీన గద్వాల పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడటం గమనార్హం. ఎఫ్‌ఐఆర్ నమోదు కాకముందే న్యాయవాదులు రావడంతో పోలీసులే కంగుతిన్నారు. కాగా హత్య విచారణకు ఎన్నో అడ్డంకులు వస్తున్నాయి. హత్య చేసిన ముఠా సభ్యులు మారణాయుధాలను ప్రవహించే నదుల్లో పారవేసినట్టు తెలుస్తోంది. తేజేశ్వర్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్ ఇతర వస్తువులను సైతం తుంగభద్ర లేదా కృష్ణానదిలో పడేసినట్టు అనుమానిస్తున్నారు.


తేజేశ్వర్ ఎక్కిన కారు ఇదే..

సహస్ర సోదరుడి మృతిపై కూడా అనుమానాలు

సహస్ర తమ్ముడి మృతిపై కూడా అనుమానాలు నెలకొన్నాయి. అక్క సహస్ర, తల్లి సుజాత వ్యవహారం గురించి పలుమార్లు ఆయన హెచ్చరించినట్టు సమాచారం. అయితే ఈ విషయం కూడా బ్యాంకు ఉద్యోగితో చెప్పడంతో పాటు రెండు నెలల క్రితం సహస్ర సొంత తమ్ముడిని హత్య చేసి.. అనారోగ్య కారణాలతోనే మృతి చెందినట్టు నమ్మించారని తేజేశ్వర్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

కీలక దశలో ఉంది..



తేజేశ్వర్ హత్య కేసు చాలా కీలకదశలో ఉంది. అయితే హత్యకు గల కారణాలు, హత్య చేసిన వారి వివరాలపై కూపీ లాగుతున్నాం. ఇప్పటి వరకు అనుమానితులను అదుపులోకి తీసుకున్నాం. తాజాగా వారి కుటుంబ సభ్యులను విచారిస్తున్నాం. ప్రధాన నిందితుడు కోసం ఇప్పటికే పలు ప్రత్యేక బృందాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాయి. తెలంగాణలోనే తలదాచుకున్నట్లు వస్తున్న వార్తలపై నిఘా ఉంచాం. దేశం విడిచి వెళ్లకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశాం. బ్యాంకు ఖాతాలను సీజ్ చేశాం. త్వరలో కేసు వివరాలను వెల్లడిస్తాం.

– మొగిలయ్య, డీఎస్పీ, గద్వాల

టైటిల్ వివాదాలు 'సివిల్'లోనే తేల్చుకోవాలి

• భూ వివాదంలో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు
• హక్కులు, స్వాధీన అంశాలకు అక్కడే పరిష్కారం
• దశాబ్దాల ఆస్తి వివాదంపై పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రాజధానిలో దశాబ్దాల నుంచి ఉన్న ఆస్తి వివాదానికి సంబంధించిన రిట్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 కింద జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. తీవ్రమైన టైటిల్ వివాదాల పరిష్కారం కోసం ఆయా వ్యక్తులు సివిల్ కోర్టును ఆశ్రయించాలని ఆదేశిస్తూ పలు పిటిషన్లను కొట్టివేసింది. అసలైన రికార్డులు లేకపోవడం, పత్రాల ప్రామాణికతకు సంబంధించి విరుద్ధమైన వాదనలు ఉన్నప్పుడు.. అలాంటి వివాదాలను పరిష్కరించడానికి సివిల్ దావానే సరైన మార్గమంటూ జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి తీర్పు వెలువరించారు. షేక్‌పేట్ గ్రామం (ప్రస్తుతం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 4) సర్వే నంబర్ 396 (సవరించిన సర్వే నం. 225)లోని ఏడెకరాలకు సంబంధించి దశాబ్దాలుగా వివాదాలున్నాయి. ఈ భూమి తొలుత హైదరాబాద్ మాజీ ప్రధాన మంత్రి (దివాన్) మహారాజా సర్ కిషన్ పెర్షాద్ యాజమాన్యంలో ఉంది. తర్వాత ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో జూబ్లీహిల్స్ గైరా జిరాయితీ పట్టాగా నమోదై ఉంది. కాగా, మహారాజా కిషన్ పెర్షాద్ చట్టబద్ధమైన వారసులమని చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు 2022లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుత యజమానుల పూర్వీకులకు అనుకూలంగా అమలు చేసిన అమ్మకపు పత్రాలు చెల్లవని పేర్కొన్నారు. అర్బన్ ల్యాండ్ (సీలింగ్, నియంత్రణ) చట్టం–1976 కింద పొందిన అనుమతులు మోసపూరితమన్నారు. ప్రస్తుత యజమానులు ప్రెస్టీజ్ గ్రూప్‌నకు అనుకూలంగా అమలు చేసిన డెవలప్‌మెంట్ అగ్రిమెంట్, జీపీఏని రద్దు చేయాలని కూడా పిటిషనర్లు కోరారు.

ఈ తీర్పు ప్రభావం ఉండదు..

ప్రతివాదులైన.. ప్రైవేట్ కొనుగోలుదారులు, రియల్ ఎస్టేట్ సంస్థ (ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్) యూఎల్‌సీ అనుమతుల తర్వాత నాటి హక్కుదారు అసదుల్లా ఖాన్ వారసుల నుంచి చట్టబద్ధంగా భూమిని కొనుగోలు చేశామని వాదించారు. '1937 నాటి రిజిస్టర్డ్ పత్రాల ద్వారా అసలు యజమానుల నుంచి టైటిల్‌ను తెలుసుకున్నాం. యూఎల్‌సీ నుంచి ఆమోదం పొందిన తర్వాత వారు 1980లో భూమిని విక్రయించారు' అని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. యూఎల్‌సీ రికార్డులు అందుబాటులో లేవని, వివాదాస్పద ఫొటో కాపీలు మాత్రమే మిగిలి ఉన్నాయని ప్రభుత్వం అంగీకరిస్తోందన్నారు. మోసం ఆరోపణలకు సివిల్ విచారణ అవసరమని.. టైటిల్ వివాదాలు, వారసత్వ సమస్యలను సివిల్ కోర్టే నిర్ణయించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డులు మాత్రమే యాజమాన్యాన్ని ఇవ్వవని తేల్చిచెప్పారు. రిట్ పిటిషన్లను కొట్టివేస్తూ.. పరిష్కారం కోసం సివిల్ కోర్టును సంప్రదించవచ్చంటూ స్వేచ్ఛనిచ్చారు. సివిల్ కోర్టు విచారణపై ఈ తీర్పు ప్రభావం ఉండదని వ్యాఖ్యానించారు.


మంగళవారం ఇజ్రాయెల్‌లోని నెతన్యాపైకి దూసుకెళ్తున్న ఇరాన్ క్షిపణులు


క్షిపణి దాడులతో ఇజ్రాయెల్‌లోని బీర్షెబాలో ధ్వంసమైన నివాస భవనం

ఆగిన దాడులు!

యుద్ధం ముగిసిందంటూ తొలుత ట్రంప్ ప్రకటన

- అయినా కొనసాగిన దాడులు, విమర్శలు
- ట్రంప్ ఆగ్రహంతో తగ్గిన ఇజ్రాయెల్, ఇరాన్
- స్వాగతించిన భారత్, ప్రపంచ దేశాలు
- గగనతలం తెరిచిన ఇజ్రాయెల్
- ఇరాన్‌లో అధికార మార్పిడి ఉద్దేశం లేదన్న ట్రంప్

టెహ్రాన్/టెల్ అవీవ్/వాషింగ్టన్/జెరూసలేం: యుద్ధజ్వాలలతో భగ్గుమన్న పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఎట్టకేలకు తగ్గుముఖం పట్టాయి. పట్టప గ్గాల్లేని ప్రతీకారాలతో రణాగ్ని రాజేసిన ఇజ్రాయెల్, ఇరాన్ శాంతించాయి. ఇజ్రాయెల్‌కు దన్నుగా ఇరాన్‌పై బంకర్ బాంబుల వర్షం కురిపించిన అమెరికా, ఆ తర్వాత తీరిగ్గా శాంతిమంత్రం జపించింది. తన కాల్పుల విరమణ ప్రతిపాదనకు ఇరు దేశాలూ అంగీకరించాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం తెల్లవారుజామున ప్రకటించారు. కానీ అప్పటినుంచి రోజంతా పలు నాటకీయ పరిణామాలు జరిగాయి. ఇరాన్, ఇజ్రాయెల్ దాడుల పర్వం యథేచ్ఛగా కొనసాగింది. దాంతో ట్రంప్ తీవ్ర అసహనం వెలిబుచ్చారు. ఒక దశలో ఇజ్రాయెల్‌పై కన్నెర్రజేశారు. తర్వాత ఎట్టకేలకు ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో 12 రోజులుగా సాగుతున్న పోరుకు ప్రస్తుతానికి తెర పడింది. ఈ పరిణామాన్ని భారత్‌తో పాటు ప్రపంచ దేశాలన్నీ స్వాగతించాయి. అయితే కాల్పుల విరమణ షరతులేమిటి, ఇరు దేశాలు వాటిలో ఎన్నింటికి, ఏ మేరకు అంగీకరించాయి వంటివన్నీ ప్రస్తుతానికైతే జవాబుల్లేని ప్రశ్నలే!

ట్రంప్ తిట్ల వర్షం

సంపూర్ణ కాల్పుల విరమణకు ఇజ్రాయెల్, ఇరాన్ అంగీకరించాయంటూ మంగళవారం తెల్లవారుజామున ట్రంప్ తన సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో పోస్టు చేశారు. ''కాల్పుల విరమణ మరో ఆరు గంటల తర్వాత నెమ్మదిగా అమల్లోకి వస్తుంది. ఇరు దేశాలూ సైనిక చర్యల నుంచి వెనుదిరుగుతాయి. రెండు దేశాలను అభినందిస్తున్నా. ఈ యుద్ధం కొనసాగితే పశ్చిమాసియా భస్మీపటలం అవుతుంది. అంతదాకా పోనివ్వను. కాల్పుల విరమణతో ప్రపంచం, పశ్చిమాసియా శాంతిని గెల్చుకున్నాయి'' అని చెప్పుకొచ్చారు. విరమణ వెనుక ఖతార్ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్‌రహీమ్ అల్ థానీ కృషి కూడా ఉందని అమెరికా ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. కానీ ట్రంప్ ప్రకటన తర్వాత కూడా ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు కొనసాగాయి. తమకు ఎలాంటి విరమణ ప్రతిపాదనా రాలేదని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ తొలుత ప్రకటించింది. మంగళవారం ఉదయం ఇజ్రాయెల్‌లోని బీర్‌షెబా సిటీపై క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో నలుగురు చనిపోయారు. అనంతరం ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ తాము దాడులు చేశామన్న ఆరోపణలను తోసిపుచ్చారు. అయితే, తొలుత దాడులు చేసింది ఇజ్రాయెలేనని గుర్తు చేశారు. వాళ్లే ముందుగా దాడులు ఆపితే తామూ ఆపుతామని ప్రకటించారు. తర్వాత దక్షిణ, ఉత్తర ఇరాన్ ప్రాంతాలపై ఇజ్రాయెల్ దాడుల్లో పలువురు చనిపోయారు. టెహ్రాన్ సమీపంలోని రాడార్ వ్యవస్థలపైనా ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో దాడులు చేసింది. మళ్లీ ఉల్లంఘనకు పాల్పడితే దీటుగా బదులిస్తామని హెచ్చరించింది. అయినా ఇరాన్ దాడులను ఉధృతం చేయడంతో మరోసారి ప్రతిదాడులకు దిగింది. ఈ పరిణామాలపై ట్రంప్ మండిపడ్డారు. రెండు దేశాలూ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడ్డాయంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆ క్రమంలో వాటిను ద్దేశించి పలు బూతు మాటలు కూడా ప్రయోగించారు. ''బాంబులేయడం ఆపండి. మీ పైలట్లను వెంటనే వెనక్కి పిలిపించండి'' అంటూ ఇజ్రాయెల్‌కు అల్టిమేటమిచ్చారు. యుద్ధం మొదలయ్యాక ఇజ్రాయెల్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తంచేయడం ఇదే తొలిసారి. ''ఇరాన్ ఇక ఎప్పటికీ అణ్వస్త్రదేశంగా అవతరించబోదు. అణుబాంబును తయారు చేయబోదు'' అంటూ ట్రంప్ ప్రకటించారు. అయితే ఇరాన్‌లో ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశం మాత్రం అమెరికాకు లేదని స్పష్టం చేశారు. తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. దాంతో కాల్పుల విరమణకు అంగీకరిస్తున్నట్లు నెతన్యాహూ ప్రకటించారు. అయితే ఆ తర్వాత కూడా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో బాంబుల మోతలు విన్పించినట్టు తెలుస్తోంది. యుద్ధం మొదలైననాటి నుంచి ఇరాన్‌లో 974 మంది చనిపోయారని, 3,458 మందికిపైగా గాయపడ్డారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే హ్యూమ్ రైట్స్ యాక్టివిస్ట్స్ సంస్థ ప్రకటించింది. తమ దేశంలో 28 మంది చనిపోయారని, 1,000 మందికిపైగా గాయపడ్డారని ఇజ్రయెల్ పేర్కొంది. కొద్దిరోజులుగా మూసేసిన తన గగనతలాన్ని మంగళవారం సాయంత్రం తిరిగి తెరిచింది. పశ్చిమాసియా దేశాలకు విమాన సర్వీసులను బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు ఎయిరిండియా ప్రకటించింది.



పరిష్కారానికి తోడ్పడతాం

ఇరాన్–ఇజ్రాయెల్ నడుమ ఘర్షణలను తగ్గించడంలో తన వంతు పాత్ర పోషించడానికి సిద్ధమని భారత్ ప్రకటించింది. ''యుద్ధం ఏ సమస్యలకూ పరిష్కారం కాదు. చర్చలే ఏకైక మార్గం. ముందనుంచీ ఇదే భారత్ వైఖరి'' అని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

మరో శాస్త్రవేత్త మృతి

అణు కార్యక్రమంలో ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ దేశ అణు కార్యక్రమానికి అత్యంత కీలకమైన శాస్త్రవేత్త మొహమ్మద్ రెజా సెదీఘీ సాబర్‌ను ఇజ్రాయెల్ హతమార్చింది. మంగళవారం తెల్లవారుజామున ఉత్తర ఇరాన్‌లోని అస్తనీయే అష్రాఫీయేలో తల్లిదండ్రుల ఇంట్లో ఉన్న ఆయనపై దాడి చేసింది. జూన్ 13న జరిగిన దాడి నుంచి రెజా తప్పించుకున్నా ఆయన 17 ఏళ్ల కుమారుడు చనిపోయాడు. రెజాపై అమెరికా గతంలోనే ఆంక్షలు విధించింది. ఆయన మృతితో తాజా పోరులో భాగంగా ఇజ్రాయెల్ హతమార్చిన ఇరాన్ అణుశాస్త్రవేత్తల సంఖ్య ఏకంగా 14కు పెరిగింది.

యురేనియంను దాచేసింది!

- దాంతో 10 అణుబాంబులను తయారుచేసే ఛాన్స్
- 16 ట్రక్కుల్లో తరలించిందా?
- బంకర్ బస్టర్ దాడులకు ముందే యురేనియంను తీసుకెళ్లారా?
- ఉపగ్రహచిత్రాలతో మొదలైన కొత్త అనుమానాలు
- ప్రపంచవ్యాప్తంగా అణుభయాలను పెంచేస్తున్న ఇరాన్

గుట్టుచప్పుడుకాకుండా వేల కేజీల బరువైన బంకర్ బస్టర్ బాంబులేసి పర్వతగర్భ ఫోర్డో అణుకేంద్రాన్ని నాశనంచేశానని అమెరికా ఆనందపడేలోపే తాజా ఉపగ్రహ చిత్రాలు కొత్త భయాలను మోసుకొచ్చాయి. దాడులు ఖాయమన్న అంచనాతో ఇరాన్ సైన్యం ముందుగానే ఆ అణుకేంద్రం నుంచి వందల కేజీల అత్యంతశుద్ధమైన యురేనియంను అక్కడి నుంచి వేరే చోటుకు తరలించిందన్న వార్త ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఎంతో కష్టపడి శుద్ధిచేసిన యురేనియంను గాల్లో దీపంలా అలా అణుకేంద్రంలో నిర్లక్ష్యంగా వదిలేసేంత అమాయకత్వం ఇరాన్‌కు లేదని, ఎంతో తెలివిగా యురేనియం నిల్వలను వేరే చోటుకు తీసుకెళ్లిందని వార్తలు వెలువడ్డాయి. ఈ వార్తలకు బలంచేకూరేలా అమెరికా వైమానిక దాడులకు ముందే న్యూక్లియర్ సెంటర్‌కు కొన్ని భారీ ట్రక్కులు వచ్చి వెళ్లినట్లు తాజా ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇవేం తెలీకుండానే యురేనియంలేని న్యూక్లియర్ కేంద్రంపై అమెరికా హడావిడిగా బాంబులేసిందని కొందరు చెబుతున్నారు.

పక్కా ప్రణాళికతో..

చిన్నని స్థూపాకార ఉక్కు బ్యారెళ్లలో 400 కేజీల అత్యంత శుద్ధ యురేనియంను ఫోర్డో యురేనియం శుద్ధి కర్మాగారం నుంచి ఇరాన్ రహస్య ప్రాంతానికి తరలించిందని వార్తలొచ్చాయి. ఈ చిన్న బ్యారెళ్లను తర్వాత చిన్న వాహనాల్లోకి మార్చి తరలించవచ్చు. కారు డిక్కీలో పెట్టి ఎవ్వరికీ అనుమానం రాకుండా ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. 400 కేజీల యురేనియంతో దాదాపు 10 అణుబాంబులను తయారుచేయొచ్చు. అణుకేంద్రంలో ఉండాల్సిన ఈ పేలుడు పదార్థం ఇప్పుడు లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ చీఫ్ రఫేల్ మారియానో గ్రస్సీ సైతం ధృవీకరించినట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత శాంతిచర్చలకు సిద్ధమైతే, తమ వద్ద యురేనియం నిల్వలు ఉన్నాయని బెదిరించి ఇరాన్ తన డిమాండ్లను సాధించే వీలుంది. ''చర్చల సమయంలో ఇరాన్ ఇదే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించి తమ డిమాండ్లు నెరవేరాలని కోరవచ్చు. ఈ సమస్యకు పరిష్కారం వెతకాల్సి ఉంది. ఏదేమైనా బాంబులు పేల్చి మేం వాళ్ల యురేనియం శుద్ధి కేంద్రాలను నాశనంచేశాం. ఇప్పట్లో ఇరాన్ మళ్లీ అణుశుద్ధిని మొదలుపెట్టడం అసాధ్యం'' అని ఏబీసీ వార్తాసంస్థతో జేడీ వాన్స్ చెప్పారు. ఈ అంశంపై రఫేల్ మారియానో సీఎన్ఎన్, ది న్యూయార్క్ టైమ్స్ వార్తాసంస్థలతో మాట్లాడారు. ''ఇందులో దాచాల్సిందేమీ లేదు. అంతా బహిరంగ రహస్యమే. తమ యురేనియం నిల్వలను కాపాడుకునే దమ్ము తమకు ఉందని ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. అయితే ఆ యురేనియంతో అణుబాంబును తయారుచేయడం కుదరదు. కనిపించకుండా పోయిన యురేనియం శుద్ధత కేవలం 60 శాతమే. 90 శాతం శుద్ధత ఉంటేనే అణుబాంబుకు అక్కరకొస్తుంది. దాడులకు ఒక వారం ముందు అణు ఇంధన ఏజెన్సీ పర్యవేక్షణ బృంద సభ్యులు ఇస్ఫహాన్ అణుకేంద్రానికి వెళ్లినప్పుడు అక్కడ యురేనియం నిల్వలను చూశారు'' అని రఫేల్ వెల్లడించారు.

ఆ 16 ట్రక్కులు ఎక్కడ?

ఫోర్డో భూగర్భ అణుకేంద్రం ముఖద్వారం వద్దకు దాడులకు ముందు 16 పటిష్టమైన ట్రక్కులు వచ్చినట్లు మాక్సార్ టెక్నాలజీస్ సంస్థ వారి ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ట్రక్కుల నిండా ఏవో బ్యారెళ్లను నింపి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆ ట్రక్కులు ఇప్పుడు ఎక్కడున్నాయో ఎవరికీ తెలీదు. అయితే ట్రక్కులపై అమెరికా నిఘా వర్గాలు ఓ కన్నేశాయని, ట్రంప్ అనుమతి వచ్చాక వాటిపై దాడులుచేసేందుకు అమెరికా సేనలు సిద్ధంగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియాతో మరో కథనం వెలువడింది.

- సాక్షి, నేషనల్ డెస్క్


జపాన్ భూభాగంపై తొలి క్షిపణి పరీక్ష



టోక్యో: చైనాకు ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో జపాన్ తన సైనిక పాటవాన్ని వేగంగా పెంచుకునే ప్రయత్నాల్లో పడింది. ఇందులో భాగంగా తొలిసారిగా మంగళవారం తన భూభాగంపై మొట్టమొదటి క్షిపణి ప్రయోగాన్ని చేపట్టింది. హొక్కైడై దీవిలోని షిజునాయ్ యాంటీ ఎయిర్ ఫైరింగ్ రేంజ్ నుంచి టైప్ 88 సర్ఫేస్ టు షిప్ తక్కువ శ్రేణి క్షిపణి ప్రయోగాన్ని చేపట్టినట్లు వెల్లడించింది. 40 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఈ క్షిపణి ఛేదించిందని తెలిపింది. పరిమిత స్థలం, రక్షణ పరమైన జాగ్రత్తల రీత్యా ఇప్పటి వరకు జపాన్ తన క్షిపణి ప్రయోగాలను విస్తారభూభాగాలున్న అమెరికా, ఆస్ట్రేలియాల్లో చేపడుతూ వచ్చింది. ఈ మేరకు ఆయా దేశాలతో ఒప్పందం కుదుర్చుకుంది. సైనికపరమైన స్వయం సమృద్ధత సాధించే దిశగా మంగళవారం తన భూభాగంలోనే క్షిపణి పరీక్ష చేపట్టింది.

ఉగ్రవాదంపై ఉక్కుపాదమే

ప్రపంచానికి చాటిన సిందూర్: మోదీ



న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై భారత్ ఉక్కుపాదం మోపుతుందని ఆపరేషన్ సిందూర్‌తో మరోసారి ప్రపంచానికి చాటామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పాక్‌పై పోరులో మేకిన్ ఇండియా ఆయుధాలు సత్తా చాటాయని గుర్తు చేశారు. జాతి ప్రయోజనాల పరిరక్షణకు ఎలాంటి చర్యలకైనా తమ సర్కారు వెనకాడే సమస్యే ఉండబోదని స్పష్టం చేశారు. ఆధ్యాత్మికవేత్త, సామాజిక సంస్కర్త నారాయణగురు, మహాత్మాగాంధీ మధ్య చరిత్రాత్మక సంభాషణకు వందేళ్లయిన సందర్భంగా సోమవారం జరిగిన ఓ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధాని మాట్లాడారు. బలోపేతమైన భారత్ కోసం వాళ్లు కన్న కలలను నిజం చేసే దిశగా సాగుతున్నట్టు చెప్పారు. ''11 ఏళ్ల క్రితం వరకూ దేశాన్ని పాలించిన వారి హయాంలో కోట్లాది ప్రజలు అత్యంత దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారు. మా పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 11 ఏళ్లుగా దేశం సామాజికంగా, ఆర్థికంగా అత్యంత బలోపేతమవుతూ వస్తోంది. రక్షణ రంగంలో స్వావలంబన సాధిస్తోంది. భారత్ తయారు చేసే ఆయుధాలు ప్రపంచమంతటా జెండా ఎగరేసే రోజులు ఎంతో దూరం లేవు'' అని ధీమా వెలిబుచ్చారు.

ఇంతకీ గెలిచిందెవరు?

ఎవరికి వారే గెలుపును తమ ఖాతాలో వేసుకున్న ఖమేనీ, ట్రంప్, నెతన్యాహూ

పన్నెండు రోజులపాటు భీకరంగా సాగి కాల్పుల విరమణ ఒప్పందం దిశగా పయనించిన ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంలో తామే విజయం సాధించామని ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా ఎవరికి వారు ప్రకటించుకున్నారు. తన వల్లే యుద్ధం ఆగిందని ట్రంప్ ఇప్పటికే ప్రకటించుకోగా, తమ ప్రయత్నం కారణంగానే సమరం సమసిపోయిందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, ఇరాన్ సుప్రీంనేత అయతొల్లా అలీ ఖమేనీ ప్రకటించారు. దీంతో ఈ ఘర్షణలో నిజంగా గెలుపు జెండా ఎవరు ఎగరేశారనే అంశంపై చర్చ మొదలైంది. అయితే ప్రతి ఒక్కరూ ఎంతో కొంత విజయం సాధించారనే వాదనా వినిపిస్తోంది. అణుక్షేత్రాలను కుప్పకూల్చి ఇరాన్ కోలుకోలేని దెబ్బతీశానని అమెరికా ప్రకటించుకుంది. సైన్యాధికారులు, అణుశాస్త్రవేత్తలుసహా వైమానిక స్థావరాలు, క్షిపణి లాంచర్లను నాశనం చేసి ఇరాన్‌కు బుద్ధి చెప్పానని ఇజ్రాయెల్ గొప్పలు పోయింది. అమెరికాను సైతం ఎదిరించి పోరాడి తమ సత్తా చూపామని ఇరాన్ ప్రకటించుకుంది. ఈ నేపథ్యంలో యుద్ధాగ్ని నుంచి ఎవరు ఏ ప్రయోజనాలు పొందారనేది ఆసక్తికరంగా మారింది.

ట్రంప్‌కు శాంతిదూతగా మార్కులు



ఇజ్రాయెల్– హమాస్ యుద్ధం, ఉక్రెయిన్–రష్యా యుద్ధంలో జోక్యం చేసుకుని శాంతిస్థాపనకు శతథా ప్రయత్నించానని ట్రంప్ చెప్పుకున్నారు. అయితే అక్కడ విఫలమైనా ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధాన్ని ఆపి సఫలీకృతుడిని అయ్యానని ట్రంప్ చెబుతున్నారు. శాంతిని కోరుకుంటూనే ఫోర్డో అణుకేంద్రంపై బాంబులేయడమేంటని అమెరికాలోనూ ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. దోహాలోని తమ స్థావరంపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినా ట్రంప్ సంయమనం కోల్పోలేదు. ఈ విషయంలో ట్రంప్‌కు మంచి మార్కులు పడ్డాయి. శాంతికాముకులు ట్రంప్ నిర్ణయాన్ని మెచ్చుకున్నారు. శాంతి నోబెల్ కోసం ఎదురుచూస్తున్న ట్రంప్ ఆశలు ఈ కాల్పుల విరమణతో చిగురించినట్లే భావించాలి.

గగనతలంపై ఇజ్రాయెల్ విజయం



క్షిపణి లాంచర్లను నాశనం చేయడం ద్వారా ఇరాన్ గగనతలంపై తాము పూర్తి పట్టుసాధించామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటించారు. ఇది తన ఘన విజయమని చెప్పారు. ఇరాన్‌లో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ ఉన్నతాధికారులు, అణు శాస్త్రవేత్తలను అంతమొందించారు. సైనిక, వైమానిక స్థావరాలను ధ్వంసం చేశారు. అణుకేంద్రాలు, మౌలిక వసతులను కోలు కోనంతగా దెబ్బ తీశారు. ఇవన్నీ తన విజయాలేనని నెతన్యాహూ సొంత డబ్బా భజాయించారు. శత్రుదేశాన్ని పలు రకాలుగా దెబ్బ కొట్టడం ద్వారా ఒక రకంగా నెతన్యాహూ భారీ స్థాయిలో పాపులారిటీ, ప్రజాదరణను పెంచుకున్నారు. వచ్చే ఏడాది తమ దేశంలో జరగబోయే ఎన్నికల్లో ఈ యుద్ధపర్వం నెతన్యాహూ పార్టీ విజయావకాశాలు అమాంతం పెంచింది. యుద్ధంలో తనకు తోడుగా అగ్రరాజ్యం కలిసివచ్చేలా ట్రంప్‌ను ఒప్పించడంలోనూ నెతన్యాహూ విజయం సాధించారు.

అగ్రరాజ్యాన్నీ ఢీకొట్టగలనని ఇరాన్ సంకేతం



తమ ఉనికే ప్రశ్నార్థకమైతే అగ్రరాజ్యం అమెరికాను సైతం ఢీకొట్టగలమని దోహా యూఎస్ స్థావరంపై క్షిపణి దాడులతో ఇరాన్ నిరూపించింది. ఘర్షణ మరింతగా విస్తరించకుండా గౌరవప్రదంగా యుద్ధక్షేత్రం నుంచి ఎలా నిష్క్రమించాలో తమకూ తెలుసునని ఇరాన్ రుజువు చేసింది. పశ్చిమాసియాలో ఎన్నో దేశాల్లో అమెరికా స్థావరాలున్నా తమకు మిత్రదేశమైన ఖతార్‌లోని స్థావరం మీదనే ఇరాన్ వ్యూహాత్మకంగా క్షిపణుల్ని ప్రయోగించింది. అమెరికా, ఇరాన్ కయ్యానికి తమ భూభాగం రణక్షేత్రంగా మారొద్దని ఖతార్ సైతం మధ్యవర్తిత్వానికి ముందుకు రావాలనే వ్యూహంతో ఇరాన్ కేవలం అల్ ఉదేయిద్ బేస్‌పైనే దాడులు చేసింది. వందల కేజీల యురేనియంను దాచిపెట్టి మధ్యవర్తిత్వానికి తన వైపు కొన్ని అస్త్రాలున్నాయని ప్రపంచానికి చాటిచెప్పింది.

కొసమెరుపు

ఇప్పటికే హమాస్– ఇజ్రాయెల్ పోరు, ఉక్రెయిన్–రష్యా రణం, హౌతీ తిరుగుబాటుదారులు చమురునౌకలపై దాడులతో అధిక పెట్రో ధరల కత్తి గుచ్చుకుంటుందన్న భయాలతో ప్రపంచదేశాలు అల్లాడుతున్న వేళ 12 రోజులకే ఇజ్రాయెల్, ఇరాన్ వార్ కంచికి చేరడం అందరికీ పెద్ద ఊరట. అయితే అంతెత్తున ఎగసిన యుద్ధజ్వాలలు పూర్తిగా ఆరిపోతాయో లేదోనన్న అనుమానాలూ ప్రపంచదేశాలను పట్టిపీడిస్తున్నాయి. ఈ దేశాలు నివురుగప్పిన నిప్పులా ఉన్న విద్వేషాలను మళ్లీ రాజేసుకుని పశ్చిమాసియా ప్రశాంతతకు గండికొడతాయేమోనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ దాడులతో పాఠం నేర్చుకున్న ఇరాన్ మళ్లీ అత్యంత రహస్యంగా యురేనియంను వేరే చోట శుద్ధిచేస్తే పరిస్థితి ఏంటి? అనే ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేని పరిస్థితీ ఉంది. అందుకే వీలైనంత త్వరగా శాంతిచర్చలు మొదలెట్టి దీనికి శాశ్వత పరిష్కారం కనుక్కోవడం అత్యావశ్యకం.

- సాక్షి, నేషనల్ డెస్క్

నేడు నింగిలోకి యాక్సియం-4

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా తదితర వ్యోమగాములతో కూడిన యాక్సియం-4 ప్రైవేట్ మిషన్ ప్రయోగం నేడు చేపట్టనున్నట్లు నాసా తెలిపింది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఈ ప్రయోగం చేపట్టనున్నారు. పెగ్గీ వాట్సన్ కమాండర్‌గా వ్యవహరించే మిషన్‌లో శుక్లా పైలట్‌గా ఉంటారు. వాస్తవానికి ఈ మిషన్ ప్రయో గం మే 29వ తేదీనే చేపట్టాల్సి ఉంది. సాంకేతిక కారణాలు, అనుకూల వాతావరణ పరిస్థి తుల నేపథ్యంలో పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది.

ఇరాన్, ఇజ్రాయెల్‌ల నుంచి భారతీయుల తరలింపు

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో మంగళవారం ఆ దేశాల నుంచి వెయ్యి మందికిపైగా భారతీయులను కేంద్రం స్వదేశానికి తరలించింది. ఇజ్రాయెల్ నుంచి జోర్డాన్, ఈజిప్టులకు రోడ్డు మార్గంలో చేరుకున్న 594 మందిని ఎయిర్ ఫోర్స్‌కు చెందిన సీ-17 హెవీ లిఫ్ట్ హెలికాప్టర్ ద్వారా తరలించారు. అదేవిధంగా, ఇజ్రాయెల్ నుంచి రోడ్డు మార్గంలో జోర్డాన్ రాజధాని అమ్మన్ చేరుకున్న మరో 161 మందిని ప్రత్యేక చార్టర్డ్ విమానంలో తీసుకువచ్చారు. ముగ్గురు శ్రీలంక పౌరులు, ఇద్దరు నేపాలీలు సహా మొత్తం 573 మందిని ఇరాన్ నుంచి రెండు చార్టర్డ్ విమానాల్లో ఢిల్లీకి చేర్చారు. ఇప్పటికే తరలించిన 2,576 మందితో కలిపి రెండు దేశాల్లోని సుమారు 3,900 మంది భారతీయులను వెనక్కి తీసుకువచ్చినట్లయిందని అధికారులు తెలిపారు. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 17 మంది ఉన్నారని వివరించారు.

బ్లాక్ బాక్స్ విశ్లేషణ బాధ్యత ఏఏఐబీకి: కేంద్రం

పుణే: అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానంలోని బ్లాక్ బాక్స్‌లోని వివరాలను విశ్లేషించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వం ఎయిర్‌క్రాఫ్ట్ యాసిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ)కి అప్పగించిందని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మంగళవారం చెప్పారు. బ్లాక్ బాక్స్‌లోని డేటా విశ్లేషణ ఎప్పటికల్లా పూర్తవుతుందనేది తాము చెప్పలేమని, అది సాంకేతికపరమైన అంశమని మంత్రి వివరించారు. దీనిపై ఏఏఐబీ విచారణ ప్రక్రియను కొనసాగిస్తోందన్నారు. జూన్ 12న ప్రమాదం జరగ్గా విమాన శకలాల్లో 13వ తేదీన బ్లాక్ బాక్స్‌ను కనుగొనడం తెల్సిందే. ఈ పరికరం విమానానికి సంబంధించిన సమాచారాన్ని రికార్డు చేస్తుంది. ప్రమాదానికి కారణాలపై దర్యాప్తునకు ఈ చిన్న పరికరంలోని సమాచారాన్ని విశ్లేషిస్తారు. బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపించి, ప్రమాదానికి దారితీసిన కారణాలను విశ్లేషిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. అవన్నీ వదంతులేనన్నారు. విమాన ప్రమాదంపై దర్యాప్తునకు ఉన్నత స్థాయి కమిటీని కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేయడం తెల్సిందే.

'సుస్థిరాభివృద్ధి'లో భారత్‌కు మెరుగైన ర్యాంక్

న్యూఢిల్లీ: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ) సూచీలో భారత్ తొలిసారిగా మెరుగైన ర్యాంక్‌ను సాధించింది. భవిష్యత్తు తరాల అవసరాలు తీర్చుకునే సామర్థ్యాలను దెబ్బతీయకుండా ప్రస్తుత తరాలు తమ అవసరాలను తీర్చుకునే అభివృద్ధినే సుస్థిరాభివృద్ధిగా పేర్కొంటారు. అలాంటి సుస్థిరాభివృద్ధి సాధనకు కృషిచేస్తున్న దేశాల జాబితాలో భారత్ 99వ ర్యాంక్‌ను సాధించింది. 167 దేశాల ఐక్యారాజ్యసమితి ఎస్‌డీజీ సూచీలో భారత్ టాప్–100లో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారికావడం విశేషం. 2025 ఏడాదికిగాను 67 స్కోర్‌తో భారత్ ఈ మెరుగైన స్థానాన్ని సంపాదించిందని నూతన సుస్థిరాభివృద్ధి నివేదిక(ఎస్‌డీఆర్) ప్రకటించింది. ఈ నివేదికను ఐరాస సుస్థిరాభివృద్ధి పరిష్కారాల నెట్‌వర్క్ రూపొందించింది. తాజాగా ఎస్‌డీజీ సూచీలో బార్బడోస్ తొలి ర్యాంక్ సాధించింది. జమైకా రెండో ర్యాంక్, ట్రినిడాడ్ టొబాగో మూడో ర్యాంక్ సాధించాయి. జీ20 దేశాల్లోచూస్తే 25 ర్యాంక్‌తో బ్రెజిల్ మెరుగైన ర్యాంక్ సాధించింది. 74.4 స్కోర్‌తో చైనా 49వ ర్యాంక్, 75.2 స్కోర్‌తో అమెరికా 44వ ర్యాంక్ సాధించి ముందంజలో ఉన్నాయి. భారత్ పొరుగు దేశాలైన భూటాన్ 70.5 స్కోర్‌తో 74వ ర్యాంక్, 68.6 స్కోర్‌తో నేపాల్ 85వ ర్యాంక్, బంగ్లాదేశ్ 63.9 స్కోర్‌తో 114వ ర్యాంక్ సాధించాయి. పాకిస్తాన్ కేవలం 57 స్కోర్‌తో ఏకంగా 140వ ర్యాంక్ సాధించింది. మాల్దీవులు 53వ ర్యాంక్ సాధించడం విశేషం. తీవ్ర ఆర్థికసంక్షోభం ఉన్న శ్రీలంక సైతం భారత్ కంటే మెరుగైన 93 ర్యాంక్‌ను సంపాదించింది.

మహారాష్ట్ర ఎన్నికల్లో ఓట్ల చోరీ: రాహుల్



న్యూఢిల్లీ: గతేడాది జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ చోటుచేసుకుందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. వెంటనే డిజిటల్ ఓటరు జాబితాను, సీసీటీవీ ఫుటేజీని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. 2024లో లోక్‌సభ ఎన్నికలు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కేవలం ఆరు నెలల వ్యవధి మాత్రమే ఉందని ఆయన మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇంత తక్కువ సమయంలోనే బీజేపీ నేత, సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పోటీ చేసిన నాగపూర్(నైరుతి) అసెంబ్లీ నియోజకవర్గంలో కొత్తగా 29,219 ఓట్లు నమోద య్యాయని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ఓట్లేసినట్లు బూత్ స్థాయి అధికారు లు నివేదించారని కూడా ఆయన చెప్పారు. ఈ వ్యవహారంపై మీడియాతో పాటు ఈసీ కూడా నిశ్శబ్దంగా ఉందన్నారు. అందుకే, వెంటనే డిజిటల్ ఓటరు జాబితాను, సీసీటీవీ ఫుటేజీని విడుదల చేయాలని ఈసీని ఆయన డిమాండ్‌చేశారు.

రైల్వే చార్జీల్లో స్వల్ప పెరుగుదల!

న్యూఢిల్లీ: రైల్వే చార్జీలు త్వరలో నామమాత్రంగా పెరిగే అవకాశముంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ తరగతికి కిలోమీటర్‌కు ఒక పైసా, ఏసీ ప్రయాణాలకు 2 పైసల చొప్పున పెంచే ప్రతిపాదన ఉన్నట్టు రైల్వే శాఖ వర్గాలు వెల్లడించాయి. బోర్డు ఆమోదం లభిస్తే జూలై 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని తెలిపాయి. ''2020, 2013ల్లో చేసిన పెంపుతో పోలిస్తే ఇది సగమే. అంతేగాక రోజువారీ ప్రయాణికుల ప్రయోజనాల దృష్ట్యా సబర్బన్, నెలవారీ, సీజన్ పాసుల చార్జీలు పెంచబోవడం లేదు. ఆర్డినరీ సెకండ్ క్లాస్ టికెట్ల ధరలు కూడా 500 కి.మీ. దాకా పెరగబోవు. ఆ తర్వాత కి.మీ.కి అర పైసా చొప్పున పెంచే ప్రతిపాదన ఉంది'' అని పేర్కొన్నాయి.



గోదారులకు' పరిష్కారమే లక్ష్యంగా..
వర్షా కాలం నేపథ్యంలో నగరంలోని రహదారులు నీట మునగకుండా చూడటమే తమ లక్ష్యమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. -8లో



అపన్నులకు కానుక..
అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో వేడుకలు నిర్వహించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పెళ్లిరోజు, ప్రమోషన్, రిటైర్మెంట్‌లను పంచుకునేందుకు ఉత్సాహం కనబరుస్తున్నారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం
నగరంలో బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.

కన్న కూతురే.. కర్కశంగా మారే..

ప్రియుడితో తల్లిని చంపించిన పదో తరగతి బాలిక





తల్లి మృతదేహంపై పడి రోదిస్తున్న అంజలి చిన్న కుమార్తె మనస్విని



నిందితుడు శివ

- తమ ప్రేమకు అడ్డుగా ఉందని ఘాతుకం
- ఇన్‌స్టాలో పరిచయమైన యువకుడితో కలిసి దారుణం
- జీడిమెట్ల పరిధిలో కలకలం రేపిన ఘటన



హతురాలు అంజలి (ఫైల్)

జీడిమెట్ల:

'నువ్వు వచ్చి మా అమ్మను చంపు.. లేదంటే నీ పేరు రాసి నేను ఆత్మహత్య చేసుకుంటా'నంటూ ప్రియుడిని బెదిరించిన పదో తరగతి బాలిక.. కన్న తల్లినే హత్య చేయించిన ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం కలకలం రేపింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన సట్ల అంజలి (39)కి 16 ఏళ్ల క్రితం దమ్మన్నపేటకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. వీరికి కూతురు (15) ఉంది. 13 సంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో అంజలి కుప్పంకు చెందిన రవి అనే వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. మనస్విని (12) అనే కూతురు జన్మించింది. రవి సైతం గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అంజలి కొన్నేళ్లుగా తెలంగాణ సాంస్కృతిక సారథి విభాగంలో కళాకారిణిగా పని చేస్తూ.. తన ఇద్దరు కుమార్తెలతో కలిసి మూడు నెలలుగా షాపూర్‌నగర్ హెచ్ఎంటీ సొసైటీలోని ఓ ఇంట్లో కిరాయికి ఉంటోంది. షాపూర్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పెద్ద కుమార్తె 10వ తరగతి, చిన్న కూతురు 8వ తరగతి చదువుతున్నారు.

ఇన్‌స్టాలో పరిచయంతో..

అంజలి పెద్ద కుమార్తె (15)కు నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు చెందిన శివ (18)కు ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ప్రేమకు దారితీసింది. 8 నెలలుగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఈ విషయాన్ని బాలిక తల్లికి చెప్పింది. ఇద్దరి సామాజిక వర్గం ఒకటే కావడంతో అంజలి తొలుత అంగీకరించి.. ఆ తర్వాత వద్దని వారించింది. తమ ప్రేమకు తల్లి ఒప్పుకోకపోవడంతో బాలిక ఈ నెల 19న శివతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. అదేరోజు అంజలి తన కూతురు కనిపించడం లేదంటూ శివపై అనుమానం వ్యక్తం చేస్తూ జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పోలీసులు అమ్మాయిని తీసుకుని స్టేషన్‌కు రావాలని చెప్పడంతో ఈ నెల 21న శివతో పాటు బాలిక పీఎస్‌కు వచ్చారు. బాలికను తల్లితో ఇంటికి పంపించారు.

ప్రేమను నిరాకరించిందని..

ఇంటికి వెళ్లిన తర్వాత శివను వదిలేసి చదువుపై దృష్టి పెట్టాలని కూతురును అంజలి బెదిరించింది. శివపై కేసు పెట్టించి జైలుకు పంపిస్తానంటూ కొట్టింది. తమ ప్రేమకు అడ్డొస్తోందనే కసితో తల్లిపై కోపం పెంచుకున్న బాలిక ఆమెను చంపాలని గట్టిగా నిర్ణయించుకుంది. తాను అనుకున్నట్లుగానే తన తల్లిని హైదరాబాద్ వచ్చి చంపాలని శివను కోరింది. చంపకపోతే నీ పేరు రాసి ఆత్మహత్య చేసుకుంటానని శివను బెదిరించింది. దీంతో యువకుడు ఒప్పుకోవడంతో.. బాలిక తన చెల్లెలిని మరో ఇంటికి పంపించింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు శివ, తన తమ్ముడిని (16) తీసుకుని షాపూర్‌నగర్ వచ్చాడు. వచ్చీ రావడంతోనే కుర్చీలో కూర్చున్న అంజలిని ఒక్కసారిగా తోయడంతో ఆమె ముందుకు పడి తలకు గాయమైంది. వెంటనే అంజలి మెడకు గట్టిగా చున్నీ బిగించడంతో ఆమె కొట్టుకోసాగింది. శివ సోదరుడు అంజలి చేతులు పట్టుకోగా శివ చున్నీతో మెడకు గట్టిగా అదిమి పట్టుకున్నాడు. అంజలి ముక్కులోంచి తీవ్ర రక్తస్రావం కావడంతో చనిపోయిందని నిర్ధారించుకున్నారు. తన తల్లి కిందపడి తలకు దెబ్బతగలంతో చనిపోయిందని అందరినీ నమ్మించాలని బాలిక పథకం పన్ని, శివను, అతని సోదరుడిని పంపించేసింది.

బతికే ఉందని.. మళ్లీ రప్పించి..

కొద్దిసేపటి తర్వాత అంజలి మెల్లగా కదలసాగింది. అప్పటికే చిన్న కుమార్తె మనస్విని ఇంటికి రాగా.. అమ్మ ఇంట్లోకి రావొద్దని చెప్పిందంటూ సోదరిని బాలిక బయటే కూర్చోబెట్టింది. 108కు కాల్ చేసినట్లు నటిస్తూ విషయాన్ని ప్రియుడు శివతో మాట్లాడింది. తన తల్లి ఇంకా బతికే ఉందని చెప్పింది. నల్లగొండ వెళ్లేందుకు ఎల్బీనగర్‌లో ఉన్న శివ మళ్లీ తన సోదరుడిని తీసుకుని రాత్రి 7.30 గంటలకు షాపూర్‌నగర్ వచ్చాడు. 'ఎంత ఖర్చయినా పర్వాలేదు. నిన్ను కాపాడతాను ఆంటీ' బాలిక మనస్విని ముందు నటించాడు. వేరే ఆంటీని పిలుచుకు రావాలంటూ ఆమెను ఇంట్లోంచి పంపించారు. తిరిగి అంజలి మెడకు చున్నీ బిగించారు. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాత్రి 10 గంటలకు తన తల్లి చనిపోయిందని పెద్ద కుమార్తె బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం అందించింది.

రాత్రి 11 గంటల తర్వాత జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేశ్‌కు విషయం తెలిసింది. ఈ నెల 19న బాలిక అదృశ్యమైన కేసు జీడిమెట్లలో నమోదు కావడంతో ఇది కచ్చితంగా హత్యేనని నిర్ధారణకు వచ్చారు. వెంటనే రెండు బృందాలను రంగంలోకి దింపి శివను కట్టంగూరులో అదుపులోకి తీసుకున్నారు. అతడి సోదరుడి(15)ని హైదరాబాద్ సంతోష్ నగర్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు నిందితులను విచారణ చేయగా.. అంజలిని తామే చంపివేశామని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. తన తల్లిని పూర్తిగా చంపే వరకు ఇంటి బయటే కాపలా కాసిందని, తల్లి మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా 'క్షమించు మమ్మీ' అంటూ నిందితురాలు బాలిక రోదించిందని స్థానికులు తెలిపారు. అంజలి మృతదేహాన్ని స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లాలోని ఇనుగుర్తికి తరలించినట్లు పోలీసులు చెప్పారు.

అంజలి చాకలి ఐలమ్మ మునిమనవరాలు కాదు..

మృతురాలు అంజలి చాకలి ఐలమ్మకు దూరపు బంధువే తప్పా మునిమనవరాలు కాదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై మీడియాలో వార్తలు నిజం కావన్నారు.

బోన భాగ్యం



రేపటి నుంచి ఆషాఢ మాసం బోనాలు

- గోల్కొండ అమ్మవారికి మొదటి బోనం
- వచ్చే నెల 21 వరకు జాతర ఉత్సవాలు
- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు గురువారం గోల్కొండ శ్రీ జగదాంబ అమ్మవారికి సమర్పించే మొదటి బోనంతో ప్రారంభమవుతున్నాయి. జూలై 13న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి కి భక్తులు బోనాలు సమర్పించనున్నారు. జూలై 20న పాతబస్తీతో పాటు నగరంలో అంగరంగ వైభవంగా బోనాల జాతర ఉత్సవాలు జరగనున్నాయి. జూలై 21న పాతబస్తీలో భక్తిశ్రద్ధలతో అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు, తదనంతరం మారు బోనంతో ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను ఇప్పటికే మంజూరు చేసింది. పాతబస్తీలో నిర్వహించే బోనాల జాతరకు మరో రూ.10 కోట్ల నిధులను అదనంగా కేటాయించాలని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు.

బంగారు బోనమెత్తనున్న శ్యామల, నిషా క్రాంతి, అవిక

ఉత్సవాల్లో భాగంగా సప్త మాతృకల- సప్త బంగారు బోనం పూజా కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించడానికి భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సిద్ధమైంది. కాగా.. ఈసారి బంగారు బోనం ఏడు గుళ్లకు కాకుండా.. కేవలం మూడు దేవాలయాలకు మాత్రమే పరిమితమవుతోంది. గోల్కొండ జగదాంబ అమ్మవారితో పాటు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారు, బల్కంపేట ఎల్లమ్మ తల్లికి నిషా క్రాంతి బంగారు బోనాన్ని సమర్పించనుంది. ఇక విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ తల్లికి జోగిని శ్యామల బంగారు బోనాన్ని ఎత్తనుండగా... మరో జోగిని అవికా పెద్దమ్మ తల్లి, చార్మినార్, లాల్ దర్వాజా అమ్మవార్లకు బంగారు బోనాలు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ నిర్వాహకుల ద్వారా సమర్పించనున్నారు.

బంగారు బోనం షెడ్యూల్ ఇలా..

- జూన్ 26న గోల్కొండ అమ్మవారికి సమర్పించే మొదటి బంగారు బోనంతో ఈసారి ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సప్తమాతృకల సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా గోల్కొండ అ మ్మవారికి మొదటి బోనం సమర్పించనున్నారు.
- భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ తరఫున శ్రీ జగదాంబికా అమ్మవారికి పట్టు వస్త్రాలతో పాటు బంగారు పాత్రలో మొదటి బోనాన్ని సమర్పించనున్నారు.
- 29న విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి 2వ బంగారు బోనం..
- జూలై 2న బల్కంపేట అమ్మవారికి మూడో బంగారు బోనం
- జూలై 4 న, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి నాలుగో బోనం
- జూలై 10న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి 5వ, బంగారు బోనం..
- 15న చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి ఆరో బంగారు బోనం
- జూలై 17న లాల్ దర్వాజా సింహ వాహిని అమ్మవారికి చివరి 7వ బంగారు బోనం సమర్పించనున్నారు.

పటిష్ట బందోబస్తు నడుమ మొహర్రం

- నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

చార్మినార్: మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని ప్రభుత్వం అన్ని వసతులు ఏర్పాటు చేసిందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. మంగళవారం సాలార్జంగ్ మ్యూజియంలో షియా ముస్లిం మత పెద్దలతో పాటు సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలు, బందోబస్తు, ట్రాఫిక్, ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మొహర్రం సందర్భంగా పాతబస్తీ ప్రధాన వీధుల్లో బీబీకా ఆలం సామూహిక ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మొహర్రం సంతాప ఊరేగింపులో పాల్గొనే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన వాహన పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. ట్రాఫిక్‌ను మళ్లిస్తామని తెలిపారు. రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు పోలీస్ ప్లటూన్లు, షీ టీం బృందాలను, హైదరాబాద్ సిటీ పోలీస్ స్టేషన్ల లోని క్రైమ్ టీంలను మోహరిస్తామని చెప్పారు. సమావేశంలో దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొత్వాల్ సీవీ ఆనంద్

ఇక పే అండ్ యూజ్

పనికి రాని పబ్లిక్ టాయ్‌లెట్లకు కొత్త రూపు

- ప్రైవేటుకు నిర్వహణ బాధ్యతలు



సాక్షి, సిటీబ్యూరో: ఉచిత సదుపాయంతో పబ్లిక్ టాయ్‌లెట్లు పరిశుభ్రంగా ఉండవని గ్రహించిన జీహెచ్ఎంసీ వాటిని ప్రైవేటుకు నిర్వహణ కిచ్చేందుకు ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది. జీహెచ్ఎంసీలో దాదాపు 2,200 పబ్లిక్ టాయ్‌లెట్లున్నా, వీటిలో 1,370 తలుపులు ఊడి, డ్రైనేజీ, నీటి సదుపాయాల్లేక వినియోగంలో లేవు. వీటిలో చాలా వాటిని గతంలో ఎన్నికల సమయాల్లో ప్రచార ప్రకటనల సాధనాలుగా మాత్రమే వినియోగించుకున్నారు తప్ప జీహెచ్ఎంసీ వాటి నిర్వహణ గురించి పట్టించుకోలేదు. దీంతో సరైన నిర్వహణ లేక ప్రజలు వెళ్లడానికి వెనుకాడే దుస్థితి నెలకొంది. వాటిలో తలుపులు తదితర సామగ్రి దొంగల పాలైంది. వాటిని రీ యూజ్ చేసేందుకు రీడిజైన్, రీఫర్బిష్‌తో ముందుకొచ్చే సంస్థలకే పే అండ్ యూజ్ విధానంలో నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని జీహెచ్ఎంసీ భావిస్తోంది. తద్వారా జీహెచ్ంసీపై ఎలాంటి ఆర్థిక భారం పడదు. నిర్వహణ బాగుంటేనే ఆదాయం వస్తుంది. పబ్లిక్ టాయ్‌లెట్లు ప్రజల అవసరాలను తీర్చగలుగుతాయని భావిస్తున్న అధికారులు ఆ దిశగా పనులకు సిద్ధమయ్యారు. ఈ అంశాన్ని గురువారం జరగనున్న స్టాండింగ్ కమిటీ ముందుంచి, దాని ఆమోదంతో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. తొలుత ప్రయోగాత్మకంగా ఒక జోన్‌లో ఈ విధానాన్ని అమలు చేసి, ఫలితాల్ని బట్టి అన్ని జోన్లలోనూ అమలు చేసే యోచనలో అధికారులున్నట్లు సమాచారం.

ఎన్నో రకాలు..

జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయ్‌లెట్లలో ప్రీ ఫ్యాబ్రికేటెడ్, ఆర్‌సీసీతో పాటు బయో టాయ్‌లెట్స్, షీ టాయ్‌లెట్స్ ఉన్నాయి. వీటిల్లో కొన్ని పే అండ్ యూజ్ విధానంలోవి ఉన్నాయి. అధ్వాన స్థితిలో వినియోగానికి అనువుగా లేని పబ్లిక్ టాయ్‌లెట్లను ప్రైవేటు ఏజెన్సీలకు నిర్వహణ ఇవ్వాలని దాదాపు ఐదేళ్ల క్రితమే ఆలోచనలు చేసినప్పటికీ, ఆచరణలో చూపలేదు. తిరిగి ఇప్పుడు వాటిపై దృష్టి సారించారు. ప్రైవేటు ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు ఇచ్చినా, అందులో 25 శాతం సఫాయి కర్మచారి కుటుంబాలకు, 10 శాతం శారీరక వికలాంగులకు రిజర్వేషన్లు ఇవ్వాలని కూడా అప్పట్లో తీర్మానం చేశారు. ఈ రంగంలో అనుభవమున్న ఏజెన్సీలను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయాలని భావించారు.

ముసుగులోని విగ్రహాల తరలింపు

త్వరలో వేరే ప్రాంతాల్లో ఆవిష్కరణలు



విగ్రహాలు తొలగించిన ప్రదేశం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఆవరణలో దాదాపు ఒకటిన్నర దశాబ్దాలుగా ముసుగుల్లో ఉన్న మహాత్మాగాంధీ, డా.బీఆర్, అంబేడ్కర్, డా. వైఎస్ రాజశేఖరరెడ్డిల విగ్రహాలను జీహెచ్ఎంసీ తరలించింది. దాదాపు నెల రోజుల క్రితం స్టాండింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయానికనుగుణంగా మూడు విగ్రహాలను వేరే ప్రాంతాల్లో ప్రతిష్ఠించేందుకు వాటిని సోమవారం అర్ధరాత్రి దాటాక తరలించారు. మూడు విగ్రహాలు తొలగించిన ప్రదేశంలో వాటర్ ఫౌంటెన్ నిర్మించాలని స్టాండింగ్ కమిటీలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా త్వరలో ఫౌంటెన్ పనులు ప్రారంభించనున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు. మూడు విగ్రహాలను వేర్వేరు ప్రాంతాల్లో ఆవిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కమిషనర్ కార్యాలయం ఎంట్రన్స్ దగ్గరలో, మహాత్మాగాంధీ, డా.వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను మేయర్ ప్రవేశ ద్వారం వైపు రెండు పార్కుల్లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా ఆలోచించినట్లు సమాచారం.

- గాంధీ, అంబేడ్కర్‌ల విగ్రహాలు శిథిలావస్థకు చేరాయని, తిరిగి ప్రతిష్ఠించేందుకు పనికి రాకుండా ఉండటంతో కొత్త విగ్రహాలు తయారు చేయించి ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమవుతున్నారు. అప్పట్లో రాజకీయ కారణాలతో డా.వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహ ప్రతిష్ఠాపనను అడ్డుకునేందుకు టీడీపీ నాయకుడు హడావుడిగా రాత్రికి రాత్రి ఇన్‌స్టంట్‌గా గాంధీ, అంబేడ్కర్‌ల విగ్రహాలు రెడీమేడ్‌వి తెప్పించి పెట్టడాన్ని ఈ సందర్భంగా పలువురు గుర్తు చేశారు. గాంధీ, అంబేడ్కర్‌ల విగ్రహాలు రాజశేఖరరెడ్డి విగ్రహం కంటే చిన్నగా ఉండటంతో.. వారు ఆయన కంటే తక్కువ వారనే అభిప్రాయం కలుగుతుందని భావించారు. విగ్రహాలు ఆవిష్కరించకుండా మూడు విగ్రహాలనూ ఇంతకాలం ముసుగులతో కప్పేశారు. ముసుగులు చివికి శిథిలమైనప్పుడల్లా రాత్రికి రాత్రి మారుస్తున్నారు. విగ్రహాల ముసుగులు తొలగించాలని ప్రయత్నించిన మేయర్ విజయలక్ష్మి అందుకు సంబంధించి యూనియన్ నేతలతో సంప్రదింపులు జరపడంతో పాటు స్టాండింగ్ కమిటీ ముందుంచడం తెలిసిందే.

జర్నీకి ఝలక్!

వరుస ఘటనలతో బెంబేలు

- నిలిచిపోతున్న విమానాలు
- పర్యాటక టూర్లపై ప్రభావం
- భారంగా మారిన ప్రయాణం



సాక్షి, సిటీబ్యూరో: వరుస పరిణామాలు.. యుద్ధ వాతావరణం పర్యాటక రంగంపై పిడుగుపాటుగా మారింది. పర్యాటకులను బెంబేలెత్తిస్తున్నాయి. విమాన ప్రయాణాలకు శరాఘాతంలా పరిణమించాయి. హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకుల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం దృష్ట్యా పెద్ద ఎత్తున ప్రయాణాలకు బ్రేక్ పడింది. అంతకంటే ముందు భారత్- పాక్ నడుమ నెలకొన్న యుద్ధ వాతావరణంతో కూడా విదేశీ రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లేవారు మినహాయించి హైదరాబాద్ నుంచి యూరప్, పశ్చిమాసియా దేశాలకు వెళ్లే చాలామంది తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. 'పహల్గాం దుర్ఘటన తర్వాత వరుసగా ఏదో ఓ ఘటన జరుగుతూనే ఉంది. ఇటీవల అహ్మదాబాద్ విమాన పేలుడు ప్రకంపనలు సృష్టించింది. ఈ పరిణామాలతో పర్యాటకుల రాకపోకలు చాలా వరకు కుదేలయ్యాయి' అని సికింద్రాబాద్‌కు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు.

బుకింగ్‌లు రద్దు..

- తాజా పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్ నుంచి దుబాయ్, యూఏఈ, సౌదీ అరేబియా, దోహా, కువైట్, జెడ్డా, అబుదాబి, ఖతార్, బహ్రెయిన్, ఇరాక్, మస్కట్ తదితర దేశాలకు విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు హైదరాబాద్ నుంచి యూరప్, అమెరికా దేశాలకు వెళ్లే విమానాలు గల్ఫ్ గగనతలంపై ఆంక్షల కారణంగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల నుంచి వచ్చే విమానాలు సైతం చుట్టూ తిరిగి వచ్చాయి. దీంతో ప్రయాణం భారంగా మారింది. ఇజ్రాయిల్ రాజధాని టెల్-అవీవ్ నుంచి హైదరాబాద్‌కు సాధారణంగా రూ.25000 నుంచి రూ.30,000 వరకు చార్జీ ఉండగా.. రూ.57000 నుంచి రూ.60,000 దాటింది. రెండు, మూడు ఎయిర్‌పోర్టుల నుంచి కనెక్టింగ్ ఫ్లైట్‌లు మారాల్సి వస్తోంది. యూరప్ దేశాల ప్రయాణంపై కూడా చార్జీల భారం రెట్టింపైంది. వారం రోజులుగా పెద్ద సంఖ్యలో బుకింగ్‌లు రద్దయినట్లు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ట్రావెల్స్ ఆపరేటర్లు పలువురు విస్మయం వ్యక్తం చేశారు.
- మొహర్రం సందర్భంగా హైదరాబాద్ నుంచి ఇరాక్ వెళ్లేందుకు ఈ నెలలోనే బుక్ చేసుకున్న 100 మందికి పైగా యాత్రికులు రెండు రోజుల క్రితం తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నట్లు టూర్స్ నిర్వాహకులు ప్రసాద్ తెలిపారు. ఇప్పటికే ఇరాక్ చేరుకున్నవాళ్లు తిరిగి వచ్చేందుకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. పశ్చిమాసియా దేశాలతో పాటు యూరప్, అమెరికా ప్రయాణాలపై యుద్ధ వాతావరణం తీవ్ర ప్రభావం చూపింది. ఎక్కడికక్కడ విమానాల రాకపోకలు స్తంభించడంతో ప్రయాణాలు వాయిదా పడ్డాయి. చాలా మంది ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు తమ ప్రణాళికలను మార్చుకున్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతి రోజు సుమారు 15000 మందికి పైగా విదేశాలకు రాకపోకలు సాగిస్తారు. కొద్ది రోజులుగా ఈ సంఖ్య 10,000 నుంచి 12,000 మధ్య నమోదవుతున్నట్లు అంచనా.

రూట్ మారింది..

తాజా పరిణామాల నేపథ్యంలో చాలా మంది సింగపూర్, మలేసియా, థాయ్‌లాండ్, శ్రీలంక. వియత్నాం, ఇండోనేషియా, మాల్దీవులు వంటి దేశాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ట్రావెల్స్ సంస్థలు పేర్కొంటున్నాయి. యూరప్ వెళ్లాలని భావించేవాళ్లు ఇప్పుడు ఇతర దేశాలకు వెళ్లేందుకు అనుగుణంగా తమ ప్రణాళికలను మార్చుకుంటున్నారు. 'తాజాగా ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఏర్పడటంతో సాధారణ పరిస్థితులు నెలకొని, విమానాల రాకపోకలపైన ఆంక్షలు తొలగినప్పటికీ ఇప్పటికిప్పుడు పర్యాకుల రద్దీ పెరుగుతుందని భావించలేం' అని వాల్మీకి టూర్స్‌అండ్ ట్రావెల్స్ వ్యవస్థాపకులు హరికిషన్ తెలిపారు.

ఇరాన్‌పై అమెరికా దాడి గర్హనీయం

• ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



వైఎంసీఏ చౌరస్తాలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

కాచిగూడ: అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద కాంక్షతో ప్రపంచ దేశాలను మూడో ప్రపంచ యుద్ధం వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌పై అమెరికా బాంబుల దాడిని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర వామపక్ష పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత కాలం పరోక్ష పాత్ర పోషిస్తూ వివిధ దేశాల మధ్య యుద్ధాన్ని సృష్టించిన అమెరికా ఇప్పుడు ప్రత్యక్షంగా ఇరాన్‌పై దాడికి తెగబడడం గర్హనీయమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు వీఎస్ బోసు, ఎస్.ఛాయాదేవి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు చలపతి, కె.గోవర్ధన్, సాధినేని వెంకటేశ్వర్ రావు, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నేతలు హన్మేష్, సూర్యం, ఎస్ఎల్ పద్మ, ఎంసిపిఐయు నేతలు గాదగోని రవి తదితరులు పాల్గొన్నారు.

గో‘దారులకు’ పరిష్కారమే లక్ష్యంగా..

• రహదారులు నీట మునగకుండా చర్యలు
• అన్ని విభాగాలతో హైడ్రా సమన్వయం



సాక్షి, సిటీబ్యూరో: వర్షాల నేపథ్యంలో నగరంలోని రహదారులు నీట మునగకుండా చూడటమే తమ లక్ష్యం కావాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుందనే అంశంపై స్పష్టమైన అవగాహనతో ఉండాలని సూచించారు. వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేస్తే సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందని అన్నారు. మూడు కమిషనరేట్లకు చెందిన ట్రాఫిక్ విభాగం అధికారులతో ఆయన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంయుక్త సీపీలు గజరావు భూపాల్, జోయిల్ డెవిస్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రెండు గంటలు పాటు వర్షం కురిస్తే చెరువుల్లో నీటి మట్టం మీటరు పెరుగుతోందని, ఆ నీరు బయటకు వెళ్లాలంటే వారం రోజులు పడుతోందని రంగనాథ్ వివరించారు.

ఆ 349 ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి...

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో వాటర్ లాగింగ్ ఏరియాలు 349 ఉన్నట్లు గుర్తించారు. వర్షం కురుస్తుందంటూ ముందస్తు సమాచారం తెలియగానే ఈ ప్రాంతాల్లో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ సూచించారు. వీటికి దగ్గరలో ఉన్న చెరువులు, నాలాల్లోని వర్షపు నీరు వెళ్లేలా అనుసంధానమై ఉన్నాయా? లేదా? అనేది పరిశీలించాలన్నారు. వరద కాలువలు ఎక్కడైనా కుంచించుకుపోయినా, పూడిపోయినా ఆ సమాచారం తమకు అందిస్తే పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ, చికోటీ గార్డెన్స్, చింతలబస్తీల మీదుగా సాగే వరద కాలువలను ఇప్పటికే విస్తరిస్తున్నామని చెప్పారు.

మూడు రోజుల్లో విధుల్లోకి మాన్సూన్ టీమ్స్...

ప్రస్తుతం ఉన్న 51 డీఆర్ఎఫ్ బృందాలకు అదనంగా 150 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు ఏర్పాటు చేశామని, ఇవి మూడు రోజుల్లో విధుల్లోకి వస్తాయని రంగనాథ్ పేర్కొన్నారు. సర్కిళ్ల వారీ జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి ఈ బృందాలు పని చేస్తాయని అన్నారు. వీటికి జలమండలి, ట్రాఫిక్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలకు చెందిన సిబ్బంది కూడా తోడైతే నగరానికి వరద ముప్పు చాలావరకు తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ముంపు సమస్య తీవ్రంగా ఉన్న 50 ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇద్దామని అన్నారు.

కబ్జాలపై సమాచారం ఇవ్వండి...

నగరంలోని చెరువులు, నాలాలు కబ్జాకు గురవుతుంటే ఆ సమాచారాన్ని హైడ్రాకు తెలపాలని రంగనాథ్ కోరారు. కబ్జాలకు సంబంధించిన సమాచారాన్ని 8712406899 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో ఫొటోలతో పాటు ఆయా ప్రాంతాలను తెలియజేసే లొకేషన్ సైతం షేర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ హైడ్రా పేరిట ఉండే ట్విట్టర్(ఎక్స్), ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్‌ల ద్వారానూ, 7207923085 నంబరుకు నేరుగా ఫోన్ చేసి సమాచారం పంపవచ్చన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

బావిలో పడి బాలుడి గల్లంతు



ప్రిన్స్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: అప్పటి వరకు ఇంట్లో సందడి చేసిన ఆ బాలుడు ఆడుకుంటూ బయటకు వెళ్లి..ఇంటి సమీపంలోని నీటి బావిలో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన మంగళవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం బిహార్ రాష్ట్రానికి చెందిన చంద్రకుమార్ భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ రాజీవ్‌గృహకల్పలో ఉంటున్నారు. వీరి కుమారుడు ప్రిన్స్(5) మంగళవారం ఇంటి వద్ద ఆడుకుంటూ పక్కనే ఉన్న నీటి బావి వద్దకు వెళ్లి అందులో పడిపోయాడు. స్నేహితుడు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు బావి వద్దకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. హైడ్రా, ఎన్‌డీఆర్ఎఫ్, అగ్ని మాపక సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రైనా బాలుడి ఆచూకీ లభించలేదు. ఉదయాన్నే తిరిగి గాలింపు చర్యలు ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య



రిసా చైదరి (ఫైల్)

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ కథనం ప్రకారం..నేపాల్ పతంపుర గ్రామానికి చెందిన రిసాచౌదరి (21) ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి గుండ్లపోచంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ఓ ఫామ్ విల్లా సమీపంలోని గదిలో గీతాచౌదరి అనే యువతితో కలిసి ఉంటోంది. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి అందరూ భోజనం చేసిన తరువాత నిద్రకు ఉపక్రమించారు. మంగళవారం తెల్లవారుజామున గీతాచౌదరి లేచి చూసే సరికి పక్కనే పడుకున్న రిసాచౌదరి కనిపించలేదు. ఫోన్ అక్కడే పడేసి ఉంది. వెంటనే విల్లా యజమాని శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు రిసాచౌదరి కనిపించడంలేదని తెలిపింది. దీంతో చుట్టు పక్కల చూడగా విల్లా పైకి ఎక్కే రౌండ్ మెట్లు ఉన్న రాడ్‌కు చున్నీతో ఉరి వేసుకుని కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలు చనిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. మృతురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

• నలుగురు నిందితుల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: టెలిగ్రామ్ ఛానల్స్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న నలుగురు నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సైబరాబాద్ ఎస్బీ డీసీపీ సాయిశ్రీ మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 13న మియాపూర్‌కు చెందిన విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు టెలిగ్రామ్ ఛానళ్లపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా చిన్నంశెట్టి నాగ రాకేష్, పొత్తవాతిని దీపక్, గుగులోత్ శ్రీరామ్ నాయక్, హేమంత్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు.

సోషల్ మీడియాలో చురుగ్గా..

నలుగురు నిందితులు సోషల్ మీడియాలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. వీరికి టెలిగ్రాం ఛానల్లో వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. దీనిని తమకు అనుకూలంగా మార్చుకొని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. బెట్టింగ్ యాప్స్, వెబ్ సైట్స్‌పై దృష్టి సారించారు. ఆన్‌లైన్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌లను ప్రోత్సహించే పనిలో పడ్డారు.

పరారీలో ముగ్గురు..

ఈ విధంగా యాప్స్ ప్రమోట్ చేస్తున్న మొత్తం ఏడుగురిపై కేసుల నమోదు చేయగా నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీసీపీ సాయిశ్రీ తెలిపారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారని చెప్పారు. వీరు తాత్కాలిక అకౌంట్స్ తీసుకుని అందులో డబ్బులు వేయిస్తున్నారు. అలాగే బినామీ అకౌంట్స్ ద్వారా డబ్బులు చెలామణి చేస్తున్నారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ ద్వారా నిందితులు ఒక్కొక్కరు కమీషన్ కింద రూ.50 నుండి రూ.60 లక్షలు సంపాదిస్తున్నట్లు డీసీపీ వెల్లడించారు. నిందితులపై గేమింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని, ఈ బెట్టింగ్ యాప్స్ లో డబ్బులు పెట్టి అప్పులపాలై ఇటీవల ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఓయో లాడ్జిలో యువతి ఆత్మహత్య

గచ్చిబౌలి: ఓయో లాడ్జిలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం..నల్లగండ్లలో నివాసం ఉండె జి.అనూష(26) ఆన్‌లైన్ ఆర్డర్లపై బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. గత సంవత్సరం వివాహం జరగ్గా మనస్పర్థల కారణంగా విడిపోయారు. అప్పటి నుంచి అనూష తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. ఈ నెల 22న సాయంత్రం 6 గంటలకు స్నేహితుల వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరింది. రాత్రి ఫోన్ చేసినా స్పందించలేదు. సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో గచ్చిబౌలిలోని ఓ లాడ్జిలో అనూష ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు సమాచారం అందించారు. సీలింగ్ ఫ్యాన్‌కు కర్టన్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని, కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. సంతోష్ అనే వ్యక్తి మొదట సమాచారం అందించాడని, తన సోదరి ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని సోదరుడు రాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మొబైల్ ఫోన్‌లను యజమానులకు అందచేస్తున్న సీపీ సుధీర్‌బాబు

1130 మొబైల్ ఫోన్ల రికవరీ

అల్వాల్: డిజిటల్ వాడకం పెరిగినందున మొబైల్ దొంగతనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత రెండు నెలల్లో పోగొట్టుకున్న రూ.3.5 కోట్ల విలువ గల 1130 మొబైల్ ఫోన్‌లను పోలీసులు రికవరీ చేసి మంగళవారం వారి యజమానులకు అందచేశారు. ఈ సందర్భంగా సీపీ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ఇతరులు ఆ ఫోన్‌తో మిమ్మల్ని బెదిరింపులు, వేధింపులకు గురిచేసే అవకాశం ఉందన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీకి కృషి చేసిన డీసీపీ క్రైమ్స్ అరవింద్‌బాబు, ఏసీపీ క్రైమ్స్ కరుణసాగర్, సీసీఎస్ ప్రత్యేక బృందాలు, ఐటీ సెల్ అధికారులను ఆయన ప్రశంసించారు.

ఆర్టీసీ విలీనం అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా

ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య



ఆర్టీసీ బీసీ ఉద్యోగుల మహాసభలో జ్యోతి ప్రజల్వన చేస్తున్న బీర్ల ఐలయ్య, సజ్జనార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్టీసీని ప్రభుత్వంలో విలినం చేసే అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి తీసుకువెళ్లి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 8వ రాష్ట్ర మహాసభ జరిగింది. సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎస్.తిరుపతయ్య, నిరంజన్, గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధ్యక్షుడు జి.పవన్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభకు ఐలయ్య, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా రోజుకు 60 వేల మంది మహిళలను ఉచితంగా గమ్యానికి చేరుస్తున్న ఘనత ఆర్టీసీ కార్మికులదే అన్నారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావడంతో పాటు సంస్థకు లాభాలు కల్పిస్తోందని అన్నారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌లకు ఇచ్చిన మాదిరిగా బీసీ ఉద్యోగులకు యాజమాన్యం సర్క్యులర్ జారీ చేయిస్తామన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతికి బడ్జెట్‌ను పెంచి ఆర్టీసీ కళాభవన్‌లో ఉత్సవం జరిగేలా కృషి చేస్తామన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల చిన్నచిన్న పొరపాట్లకు సస్పెండ్ అయిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు. కారుణ్య నియమకాలు చేపట్టి వారిని రెగ్యులర్‌గా ఉద్యోగులుగా గుర్తిస్తామన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ నూతనంగా 2800 ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. దీని వల్ల కాలుష్య నివారణ జరుగుతుందన్నారు. ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు ఎలాంటి ఢోకా లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను ఇస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ల తప్పు లేకుంటే వారి పక్షాన యాజమాన్యం నిలబడుతుందని చెప్పారు. ఆర్టీసీ బీసీ ఉద్యోగులకు ఎలాంటి వేధింపులు లేవని, నిబంధన ప్రకారం ప్రమోషన్స్ కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌లు కె.రమేష్, రేణుక, చారి, దుర్గయ్య, స్వరూప, కృష్ణ, భూషణ్, మంగమ్మ, నాగేష్ పటేల్, సీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనే ధ్యేయం

మహేశ్వరం: బీసీల హక్కుల సాధన కోసం మన ఆలోచనల సాధన సమితి (మాస్) పని చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు పేర్కొన్నారు. మహేశ్వరం గ్రామానికి చెందిన కాసంశెట్టి కృష్ణను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ మంగళవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా బీసీల చైతన్యమే లక్ష్యంగా మాస్ పని చేస్తుందని స్పష్టం చేశారు. నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా 37 నియోజకవర్గాల్లో మొదటి విడత గ్రామబాట కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యవర్గాన్ని అభినందించారు. కాసంశెట్టి కృష్ణ మాట్లాడుతూ.. బీసీలను చైతన్యం చేసి హక్కుల సాధన కోసం పని చేస్తామన్నారు.

నగరంలో కొత్త ఎక్సైజ్ స్టేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి ఎక్సైజ్ జిల్లాల పరిధిలో కొత్త ఎక్సైజ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తూ ఎక్సైజ్ శాఖ సర్క్యులర్ విడుదల చేసింది. మొత్తం 14 స్టేషన్లను పునర్వ్యవస్థీకరించారు. ఈ మేరకు గ్రేటర్‌లో బంజారాహిల్స్, మారేడ్‌పల్లి, చిక్కడపల్లి, గండిపేట, కొండాపూర్, మీర్‌పేట్, పెద్దఅంబర్‌పేట్, మేడ్చల్, కూకట్‌పల్లి, కాప్రా, నాచారం, అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్లను కొత్తగా ఏర్పాటు చేశారు. వీటిలో కొన్నింటికి వివిధ ప్రాంతాల్లో కొత్త కార్యాలయాలను అందుబాటులోకి తేగా మరికొన్ని ప్రస్తుతం ఉన్న పాత కార్యాలయాల్లోనే కొనసాగనున్నాయి. పునర్వ్యవస్థీకరణలో భాగంగా అన్ని కార్యాలయాల పరిధులను కొత్తగా నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటు చేసిన వాటికి అధికారులను, సిబ్బందిని కూడా నియమిస్తూ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

మద్యం మత్తులో అసభ్య ప్రవర్తన.. తండ్రిపై పోక్సో కేసు

బొల్లారం: మద్యం మత్తులో కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో చట్టం కింద బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. బొల్లారం కంటోన్మెంట్ క్వార్టర్స్ నివాసి నాగరాజు పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య, కుమార్తెను అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22న అతిగా మద్యం తాగిన నాగరాజు తన కుమార్తెను దుర్భాషలాడడమే కాకుండా, అసభ్యంగా తాకాడని తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.


అకౌంట్‌లో రూ.97 వేలు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

పోచారం: సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి అకౌంట్ నుండి రూ. 97 వేలు కొట్టేసిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. చౌదరిగూడకు చెందిన వెదురూరు ప్రేమ్ స్వరూప్ తిరుమలలో రూమ్ బుకింగ్ చేసుకోవడానికి గూగుల్‌లో వెబ్‌సైట్ వెతికాడు. అందులో వచ్చిన లింక్ ద్వారా వరాహ స్వామి గెస్ట్ హౌస్‌లో రూమ్ కోసం ఈ నెల 15వ తేదీన రూ.2750 ఫోన్‌పే చేశాడు. తర్వాత మరో రూ.50 చెల్లించాలని గెస్ట్ హౌస్ నిర్వాహకులు అడిగారు. ఇంకా రూమ్ బుకింగ్ నిర్ధారణ జరగకపోవడంతో స్వరూప్ స్పందించలేదు. 18వ తేదీన తనకు తెలియకుండానే అకౌంట్ నుండి రూ.1 డెబిట్ అయ్యింది. దీని తర్వాత అతని ఫోన్ పనిచేయలేదు. ఇదిలా ఉండగానే 19వ తేదీన విడతల వారీగా మొత్తం రూ. 95 వేలు బదిలీ అయినట్లు తెలిసింది. ఇప్పటి వరకు అకౌంట్ నుండి మొత్తం రూ. 97,750 డెబిట్ అవడంతో ఇదంతా సైబర్ నేరగాళ్ల పనేనని గ్రహించి సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. పోచారం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘సంధ్య’ శ్రీధర్ రావుపై మరో కేసు నమోదు

గచ్చిబౌలి: సంధ్య కన్వెన్షన్ ఎండీ సరనాల శ్రీధర్ రావుపై మరో కేసు నమోదైంది. బెదిరింపులకు పాల్పడటంతో బాధితుడి ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. రహమత్‌నగర్‌కు చెందిన నర్సింహారెడ్డికి శ్రీధర్ రావు ఫోన్ చేసి చంపేస్తానని బెదిరించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం బాధితుడు నర్సింహారెడ్డి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును కోర్టుకు పంపి అనుమతి తీసుకున్న తరువాత కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం గచ్చిబౌలిలోని ఫెర్టిలైజర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో హైడ్రా అధికారులు సర్వే చేస్తుండగా దాడి చేశారని నటి రమ్యశ్రీ సోదరుడు ప్రశాంత్ ఫిర్యాదు చేశారు. శ్రీధర్‌రావు, అనుచరుడు వెంకటేష్ మరికొంత మందిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. వారం గడవక ముందే మరో కేసు నమోదు కావడం గమనార్హం.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



పవన్ కుమార్ (ఫైల్)

మియాపూర్: స్కూల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...బీహెచ్ఈఎల్‌లోని ఎంఐజీ కాలనీలో నివసించే పారిపెల్లి పవన్ కుమార్ మియాపూర్‌లోని భాగ్యనగర్ గ్యాస్ ఏజెన్సీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం కొండాపూర్‌లో పనిముగించుకుని హోండా బైకుపై మియాపూర్ వైపు వస్తుండగా హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే చిరెక్ స్కూల్ కొండాపూర్ బ్రాంచ్‌కు చెందిన బస్సు వెనుక నుండి వేగంగా ఢీకొట్టింది. దీంతో పవన్‌కుమార్ కిందపడిపోగా తలకు, శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు దగ్గర్లోని ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు తెలిపారు. ప్రమాదం అనంతరం స్కూల్ బస్సుతో సహా డ్రైవర్ ఎస్‌కే.సోహేన్ పరారవుతుండగా అక్కడి వాహనాదారులు వెంబడించి పోలీసులకు అప్పగించారు. మృతుడి బావమరిది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్: శ్రీనగర్‌కాలనీ, నిమ్స్, ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని బంజారాహిల్స్ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సత్యసాయి నిగమాగమం, కమలాపురికాలనీ–1 నుంచి 3, తన్వీర్ హాస్పిటల్, మోడల్ హౌస్ బిల్డింగ్, ఆంధ్రాబ్యాంక్, ద్వారకాపురికాలనీ, పంజగుట్ట, సాయిబాబా దేవాలయం, ఓల్డ్ టెలిఫోన్ ఎక్ఛేంజ్, ద్వారకాపురికాలనీ. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు టెన్నిస్ కోర్టు, ఎస్‌కేనగర్, ప్రగతినగర్, మారుతినగర్, యూసుఫ్‌గూడ బస్తీ, ఫోకస్ బిల్డింగ్, పంజగుట్ట మసీదు, ఐ హాస్పిటల్, బాటాషోరూం, హిమాలయ బుక్ షాపు, పంజగుట్ట పీఎస్, సాయిబాబా టెంపుల్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో పాల్గొన్న మహిళలు

ఫిలింనగర్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని స్వామి వివేకానంద నగర్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి. వరలక్ష్మి సూచించారు. మంగళవారం ఫిలింనగర్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీలో మహిళా పొదుపు గ్రూపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు గ్రూపుల్లో లేని మహిళలు చేరాలన్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాల అపహరణ

వెంగళరావునగర్: ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల అయిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రిటైర్డ్ జీఎస్టీ సూపరింటెండెంట్ ఆకుల శ్రీహరి రావు మధురానగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. ఈనెల 21న తన స్వగ్రామం తాడేపల్లిగూడెంకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. తలుపు తెరిచి చూడగా బెడ్రూం తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అందులోని లాకర్‌లో ఉండాల్సిన దాదాపు రూ.10 లక్షల విలువైన 606 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు కనిపించలేదు. దీంతో బాధితుడు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



పూజల్లో పాల్గొన్న విజయారెడ్డి

పంజగుట్ట: ఎర్రమంజిల్ కాలనీ, రామకృష్ణానగర్‌లోని రేణుకాఎల్లమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి 20వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం జరిపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి'

నాంపల్లి: ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు మంద నవీన్, కె.శ్రీనివాస్ కోరారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తమ్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.



ఎర్రగడ్డలో రేషన్ బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఫైల్)

పక్కదారి పడుతున్న

రేషన్ బియ్యం!.

రూ.10కి కొని రూ.20కు విక్రయం | ఖైరతాబాద్ జోన్‌లో భారీగా బియ్యం పట్టివేత

బంజారాహిల్స్: రేషన్ బియ్యం పక్కదారిపడుతున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్–7 పరిధిలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీలను పోలీసులు పట్టుకున్నారు. రేషన్ డీలర్లతో కుమ్మక్కై అక్రమార్కులు వ్యాపారులు రూ.10కు కొనుగోలు చేసి వాటిని దళారులు రూ.20 చొప్పున విక్రయిస్తున్నట్లు పలువురు ఇటీవల పట్టుబడ్డారు. నాలుగు రోజుల క్రితం ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లో క్వింటాళ్ల కొద్ది రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. వెస్ట్‌జోన్ పోలీసులు ఈ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న పక్కా సమాచారంతో పట్టుకొని సీజ్ చేశారు. నాలుగు వారాల క్రితమే బోరబండలో ఓ వ్యక్తి రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పెద్ద ఎత్తున రేషన్ బియ్యం తరలిస్తుండగా ఖైరతాబాద్ రేషనింగ్–7 అధికారులు, నిఘా వ్యవస్థ పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ విభాగం అధికారులు పక్కదోవపడుతున్న రేషన్ బియ్యాన్ని పట్టుకోవడంలోనూ, పూర్తిగా విఫలమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు రేషన్ డీలర్లు దర్జాగా అధికారుల కళ్లు గప్పి క్వింటాళ్ల కొద్ది బియ్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. నేరుగా రేషన్ డీలర్ల నుంచే కొందరు బియ్యం సేకరిస్తుండగా, మరికొంతమంది కార్డుదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. కర్ణాటకకు చెందిన ఓ బడా వ్యాపారి ఇక్కడ కొంతమంది దళారులను నియమించుకుని రేషన్ బియ్యం కొనుగోలు చేసేటట్లు ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా తెలుస్తోంది.

కమీషన్ పద్ధతిలో..

దళారులు ఇక్కడ బియ్యం కొనుగోలు చేసి కర్ణాటకకు చెందిన వ్యాపారికి కమీషన్ పద్ధతిన విక్రయిస్తున్నట్లుగా తేలింది. గత ఏడాది వ్యవధిలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుకొని సీజ్ చేయగా వ్యాపారులు కూడా కటకటాలపాలయ్యారు. అయినా సరే ఈ దందాకు తెరపడడం లేదు. దర్జాగా కొంతమంది రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ దళారులకు విక్రయిస్తున్నట్లుగా ఇటీవల జరిగిన దాడుల్లో పోలీసులు జరిపిన దర్యాప్తులో తేటతెల్లమైంది. అయితే ఈ దళారుల గుట్టును రట్టు చేయడంలో పెద్దగా దృష్టి కేంద్రీకరించడం లేదు. రేషన్ బియ్యం దందాకు సంబంధించి లింక్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయో, వారిని పట్టుకోవడంలో అటు పోలీసులు ఇటు రేషనింగ్ అధికారులు దృష్టి సారించడం లేదు. ఇక్కడ అక్రమ రేషన్ బియ్యం వ్యాపారులు పట్టుబడ్డప్పుడు వారు ఎవరెవరికి విక్రయిస్తున్నారు..దీని వెనుక ఎవరెవరు ఉన్నారు..అన్నది తేలిస్తే ఈ దందా గుట్టు బయటపడే అవకాశాలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

మానసిక ఆరోగ్యంపై కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్, సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) ఆధ్వర్యంలో 'విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం–ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం' అనే అంశంపై కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఉపాధ్యాయులు, పాఠశాల నాయకుల వృత్తిపరమైన సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. అధ్యాపకుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడం, విద్యార్థుల అభివృద్ధికి సానుకూల వాతావరణం, సమగ్ర విధానాలను సృష్టించడంపై అవగాహన కల్పించారు. చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఇఫాత్ ఇబ్రహీం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు మంచి పరిశీలకులుగా ఉండాలని, పిల్లలకు కమ్యూనికేషన్ ఛానల్ ఎల్లప్పుడూ తెరిచి ఉంచాలన్నారు. వివిధ కార్యకలాపాలు, విలువల ఆధారిత బోధన ద్వారా పాఠశాలల్లో బలమైన మానసిక ఆరోగ్య మద్దతు ఇవ్వాలన్నారు. అభయ స్కూల్ ప్రిన్సిపాల్ అమీర్‌ఖాన్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వమని ప్రోత్సహించడం ద్వారా మారుతున్న విద్యలో నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు.

మాదకద్రవ్య రహిత నగరంగా తీర్చిదిద్దుదాం



అవగాహన కార్యక్రమంలో వైవీఎస్ సుధీంద్ర

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–3లోని సుల్తాన్–ఉల్–ఉలూమ్ జూనియర్ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్య నిరోధక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వైవీఎస్ సుధీంద్ర హాజరై మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికరమైన ప్రభావాలు, విద్యా సంస్థల్లో అలాంటి ప్రభావాలకు దూరంగా ఉండడం ఎలాగో విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడవద్దని, మాదక ద్రవ్యం దుర్వినియోగాన్ని ప్రోత్సహించే స్నేహాలను నివారించాలని డీసీపీ సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి, మాదకద్రవ్య దుర్వినియోగం పరిణామాలను అర్థం చేసుకోవడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్మించడానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బాలస్వామి, నగర భద్రతా మండలి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వరల్డ్ మ్యూజిక్ డే



మ్యూజిక్ డేలో పాల్గొన్న చిన్నారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు పబ్లిక్ స్కూల్‌లో వరల్డ్ మ్యూజిక్ డే పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులు వైవిధ్యభరితమైన సంగీత కార్యక్రమాలను ప్రదర్శించారు. వ్యక్తిత్వ సమగ్ర అభివృద్ధిలో సంగీతం ప్రాముఖ్యత గురించి వివరించారు. బొమ్మ బొమ్మ తాతయ్య అనే మరాఠీ భజన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఆఫ్రికన్ జానపద పాటలు, పాశ్చాత్య సంగీత ప్రదర్శనలు హోరెత్తించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజూ సంగీతాన్ని అభ్యసించాలన్నారు. సామాజిక కార్యకలాపాల్లో భాగంగా తమ విద్యార్థులు జూబ్లీహిల్స్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం భక్తి గీతాలను ఆలపించారన్నారు.

బీజేఆర్ కాలేజీలో ఉపాధి అవకాశాలు

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బాబు జగ్జీవన్ రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)లో ఆర్.ఎస్.టి, సాఫ్ట్‌వేర్ సంస్థ ద్వారా 'టై–అప్ ఎమ్.ఓ.యు' కుదుర్చుకొని విద్యార్థులకు మూడు నెలల పైథాన్, ఏఐలలో ప్రత్యేక సర్టిఫికెట్ కోర్సు చేయించి ఉపాధి అవకాశాలు కల్పించామని ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.ఎం.విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బీజేఆర్ కళాశాల విద్యార్థులకు చక్కటి విద్యతో పాటు కంప్యూటర్ నైపుణ్య సర్టిఫికెట్ కోర్సులు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నామన్నారు. కళాశాల ప్లేస్‌మెంట్ కన్వీనర్ డా.కడారి శ్రీనివాస్ ఈ సంవత్సరం ఏప్రిల్‌లో ఆరంభమైన పైథాన్ కోర్స్ ఆర్.ఎస్.టి(రంజిత్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజిస్) సౌజన్యంతో 210 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 176 మంది సర్టిఫికెట్లు పొందారన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యం ఇవ్వాలి

లిబర్టీ: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలు, నాయకులకు గుర్తింపు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వానికి సీనియర్ నాయకులు వి.సదానంద్ విన్నవించారు. కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జీ జయంతి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, హైదరాబాద్ జిల్ల ఇన్‌చార్జి మంత్రి ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పించి కార్యకర్తల పనితీరును విన్నవించారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో క్షేత్రస్థాయి నుంచి పార్టీ కార్యకర్తలు ద్వితీయ శ్రేణి నాయకత్వం నిరంతరం శ్రమించడంతో అది సాధ్యమైందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిమాయత్‌నగర్: హైదరాబాద్ జిల్లాలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలు, కళాశాలల్లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఎస్‌వీ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ లెక్చరర్స్ ఇంగ్లిష్, ఎకనామిక్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, హిస్టరీ, మైక్రోబయో, జెఎల్, టిహెచ్‌ఎం, జెఎల్ జిఎఫ్‌సీ, పిజిటీలో ఇంగ్లిష్, తెలుగు, మ్యాథ్స్, ఫిజికల్‌సైన్స్, సోషల్, టీజీటీలో ఇంగ్లిష్, జనరల్ సైన్స్ సోషల్, స్టాఫ్ నర్స్, వార్డెన్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ అర్హత పత్రాలను రూమ్ నెం. 606 పబ్లిక్ గార్డెన్, నాంపల్లి హైదరాబాద్ కార్యాలయంలో ఈ నెల 28లోగా సమర్పించాలన్నారు.

సుశీల మెమోరియల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

బంజారాహిల్స్: పంజగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీలోని కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న సుశీల వామన్ రావు మెమోరియల్ స్కూల్‌లో విద్యార్థులకు ఇక నుంచి ప్రతిరోజూ మధ్యాహ్న భోజనాన్ని సైతం పెడుతున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. గత వారం రోజుల క్రితం కమ్యూనిటీ హాల్ నుంచి పాఠశాలను తొలగించాలని బస్తీలోని కొంతమంది వ్యక్తులు పిల్లలను బయటికి పంపి తాళం వేసిన ఘటనలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, విద్యాశాఖాధికారులు కలగజేసుకొని విద్యార్థుల కోసం పాఠశాలను కొనసాగించాలని నచ్చజెప్పిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాలతి, కృష్ణ, జ్యోతి, నాగబాబు, ఉష మాట్లాడుతూ.. తాము విద్యార్థుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోవడం లేదని పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, షూస్ అన్ని ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. దివంగత సీనియర్ జర్నలిస్ట్ వామన్ రావు 1986లో పేద పిల్లల కోసం ఈ పాఠశాలను ఏర్పాటు చేశారని వారి ఆశయాలకు అనుగుణంగా తాము పేద విద్యార్థుల చదువుల కోసం కృషి చేస్తామన్నారు.

సికింద్రాబాద్ గణేష్ ఆలయ పాలకమండలి సమావేశం



సమావేశంలో గణపతి ఆలయ పాలక మండలి సభ్యులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని గణపతి ఆలయంలో మంగళవారం పాలకమండలి సమావేశం ఈవో రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే ఉత్సవాల నుంచి వార్షిక ఉత్సవాలతో పాటు రోజువారీ పూజలకు సంబంధించిన విషయాలను ఆయన పాలకమండలికి వివరించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధిపై కూడా చర్చించారు. అనంతరం, ఆలయానికి సంబంధించిన ఆస్తులు, భూములను పాలకమండలి సభ్యులు సందర్శించారు. సమావేశంలో పాలకమండలి చైర్మన్ ప్రభాకర్ యాదవ్, ట్రస్టీలు నరేష్, సంతోష్, అనిల్ యాదవ్, గాజుల ఆంజనేయులు, మల్లేష్, భిక్షపతి, నాగమణి, టి.నరేంద్ర, వందన, మాణిక్య ప్రభు, శ్రీరామసాయి కుమార్, ఎస్.నరేంద్ర, వేణు గోపాల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: మహాత్మానగర్, కార్మికనగర్, విద్యుత్ టవర్ 11 కేవీ ఫీడర్లు ఎస్‌పీఆర్‌హిల్స్, బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మతుల కారణంగా ఈనెల 25న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు మహాత్మానగర్, హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్–1,2, ఇందిరానగర్, శ్రీరామ్‌నగర్, సంజయ్‌నగర్, కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్, లీలానగర్, విద్యుత్ టవర్, రైల్వే ట్రాక్ ఏరియా ప్రాంతాలు, పిల్లిదర్గా, బోరబండ, దివ్యశక్తి. అలాగే ఆనండ్‌బాగ్ 11 కేవీ ఫీడర్లు, బోరబండ, ఎస్‌పీఆర్‌హిల్స్, బేగంపేట, మైత్రీవనం సబ్‌స్టేషన్ల పరిధిల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు బోరబండ సైట్–3, నూర్ మసీదు, జ్యోతినగర్, సునీల్‌నగర్, నాట్కో స్కూల్, జయవంతినగర్, పెద్దమ్మనగర్, టి.అంజయ్యనగర్, ఇందిరానగర్, గ్రీన్‌పార్క్, రెడ్డి ల్యాబ్, దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్, శేషమహల్ మెయిన్ రోడ్డు, సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్ బిల్డింగ్, ప్లేగ్రౌండ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బంజారాహిల్స్ ఎలక్ట్రికల్ సబ్‌డివిజన్‌లో..

శ్రీనగర్‌కాలనీ: బంజారాహిల్స్ ఎలక్ట్రికల్ సబ్‌డివిజన్‌లో 11కేవీ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ అధికారులు తెలిపారు. శ్రీనగర్‌కాలనీ, కమలాపురికాలనీ, తన్వీర్ హాస్పిటల్, నిమ్స్ మోడల్ హౌస్, పంజగుట్ట, ద్వారకాపురికాలనీ, టెలిఫోన్ ఎక్సేంజ్, సాయిబాబా టెంపుల్, ఓల్డ్ టెలిఫోన్ ఎక్సేంజ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు. అలాగే ఎల్లారెడ్డిగూడ, మారుతీనగర్, టెన్నిస్‌కోర్టు, శ్రీకృష్ణదేవరాయనగర్, ప్రగతినగర్, యూసుఫ్‌గూడ బస్తీ, పంజగుట్ట మజీద్, ఫోకస్ బిల్డింగ్, ఐ హాస్పిటల్, పంజగుట్ట పోలీస్‌స్టేషన్, హిమాలయ బుక్‌స్టోర్, బాటా షోరూం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బంజారాహిల్స్: రైతు భరోసా నిధుల విడుదలను పూర్తి చేసిన సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్లు సంగీతాశ్రీనివాసన్, మహలక్ష్మీ రమణగౌడ్, మాజీ కార్పొరేటర్ షరీఫ్, నరేష్, షాన్వాజ్, శ్రీనివాస్, ఆంటోనీ, సర్ఫరాజ్ పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నూతన క్రీడా పాలసీ ఆమోదంపై హర్షం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా పాలసీని ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్బీస్టేడియంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చి సీఎం, డిప్యూటీ సీఎం, క్రీడా శాఖ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులకు నగదు ప్రోత్సాహం, గుర్తింపు పొందిన క్రీడా సంఘాలకు నిధుల పెంపు, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల మెరుగైన శిక్షణకు అవసరమైన సదుపాయాలు ఇచ్చేందుకు స్పష్టమైన విధానాలు పొందుపరిచినట్లు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.27, నల్లవంకాయ.23, పొడుగువంకాయ.23, బెండకాయ.45, పచ్చిమిర్చి.50, బజ్జిమిర్చి.23, క్యాప్సికం.67, పచ్చి కాకరకాయ.45, పందిరిబీర.35, క్యాబేజీ.21, క్యారెట్.40, దొండకాయ.28, గుండు బిన్నీస్.95, గింజచిక్కుడు.55, గోకరకాయ.40, కీర.15, దోసకాయ.28, బీట్‌రూట్.22, ఉల్లిగడ్డ.25, ఆలుగడ్డ.25, చామగడ్డ.28, మొరంగడ్డ.23, కందగడ్డ.45, క్యాలిప్లవర్.23, సొరకాయ.10, పొట్లకాయ.23, అరిటికాయ.11, మునగకాయ.4, మామిడికాయ.23, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.45. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

రోడ్డుపై గుంత.. రాకపోకలకు చింత

బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14 ప్రధాన రహదారిలో గత కొన్ని వారాల నుంచి మంచినీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. జలమండలి ఇంజినీర్ల నిర్వాకం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఈ రోడ్డంతా గుంతలమయమైంది. మధ్యలో నిలిచిపోయిన పైప్‌లైన్ పనులతో రోడ్లపై భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. మంగళవారం సాయంత్రం రోడ్డుపై భారీ గుంత ఏర్పడగా రాకపోకలు స్తంభించడంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాలను మళ్లించారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు. – బంజారాహిల్స్



రోడ్డంతా మురుగుమయం

చినుకులు కురిస్తే చాలు కృష్ణానగర్ మెయిన్‌రోడ్డులో మురుగు ముంచెత్తుతోంది. మెట్రోపిల్లర్ నెంబర్ 1536 వద్ద రోజుల తరబడి మురుగు నిలుస్తోంది. అసలే ఇరుకు రోడ్డు కావడంతో వాహనదారులకు మరీ ఇబ్బందికరంగా మారింది. అటుగా రాకపోకలు సాగించే పాదచారులపై మురుగు చిమ్ముతోంది. సంబంధిత అధికారులు స్పందించి మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – బంజారాహిల్స్



రాళ్లల్లో పచ్చందం



రెండేళ్ల క్రితం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో అధికారులు వినూత్న ప్రయోగాన్ని చేశారు. సాధారణంగా నేలలో పెరిగే మొక్కలను రెండు, మూడు లేయర్ల మందం బల్లపరపు రాళ్లపై మట్టిని పోసి ఆ మట్టిలో రావి, జువ్వి, మర్రి మొక్కలను నాటారు. ప్రయోగాత్మకంగా చేసిన ఈ షీట్ రాక్ ప్లాంటేషన్ విజయవంతం అయింది. ఇప్పుడు ఈ మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనంతో అలరారుతున్నాయి. పార్కులో సుమారు వెయ్యికి పైగా షీట్ రాక్‌పై ప్లాంటేషన్‌ను చేశారు. – బంజారాహిల్స్

నగరంలో నేడు

- వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోనాలు- చేతివృత్తుల మేళా పేరిట నెక్లెస్ రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం పక్కన గ్రౌండ్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు బీసీ చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లో హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ నోవొటెల్‌లో ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు హైలైఫ్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట వేసవికాలం, వివాహ ప్రత్యేక కలెక్షన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'పీఓడబ్ల్యూ సంధ్యపై దాడి దారుణం'

సాక్షి, సిటీబ్యూరో: ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్యపట్ల పోలీసుల దురుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మానవ హక్కుల వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.జీవన్‌కుమార్, ఎం.సురేష్‌బాబు, వెంకట్‌నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు తెలపడంపై ఈ నెల 19న తొమ్మిది వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసన తెలిపారని, ఈ సందర్భంగా సంధ్యను పోలీసులు అరెస్ట్ చేసే క్రమంలో కుడి కాలుకు తీవ్ర గాయమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె నడవలేని పరిస్థితుల్లో ఉందని తెలిపారు. బాధ్యులైన గచ్చిబౌలి పోలీసుల దుష్ప్రవర్తనపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సంధ్యకు ప్రభుత్వమే వైద్య సహాయం చేయాలని కోరారు.

నేటి నుంచి జీహెచ్‌ఎంసీలో క్రీడా పోటీలు

లక్డీకాపూల్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ)లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు స్పోర్ట్స్ విభాగం అడిషనల్ కమిషనర్ యాదగిరి తెలిపారు. ఈ పోటీలను జీహెచ్‌ఎంసీ బీట్ జర్నలిస్టులు, కార్పొరేటర్లు, జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేశామన్నారు. బుధవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ప్రారంభించే ఈ క్రీడా పోటీలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనున్నాయని చెప్పారు. ముగింపు సందర్భంగా పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తారన్నారు.

ఆస్పత్రుల కిచెన్‌లూ అంతే..



సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల కనుగుణంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు ఆస్పత్రుల కిచెన్లలో నిర్వహించిన తనిఖీల్లో పలు లోపాలు బహిర్గతమయ్యాయి. పరిశుభ్రత లేకపోవడం, ఆహార పదార్థాలు నేలమీదే ఉంచడం, డస్ట్‌బిన్ల మూతలు తెరిచి ఉంచడంతోపాటు ఇతరత్రా అవలక్షణాలు ఆస్పత్రుల కిచెన్లలోనూ బట్టబయలయ్యాయి. మొత్తం 73 ఆస్పత్రుల కిచెన్‌లు తనిఖీ చేసి, 14 శాంపిల్స్ లేబొరేటరీ పరీక్షల నిమిత్తం పంపించారు.

బొటానికల్ గార్డెన్‌లో 5కే రన్



రన్‌లో పాల్గొన్న వారితో జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: పహల్గాం దాడిలో మృతి చెందిన, విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థంగా ప్లకార్డులతో బొటానికల్ గార్డెన్‌లో 5కే రన్‌ను మంగళవారం నిర్వహించారు. శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రన్‌ను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. ఆయన 50వ పుట్టినరోజును పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మొదట మృతులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థం పరుగెత్తడం గొప్పగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మహిళలు, యువకులు, శ్రీకృష్ణ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాల పెంపుపై దృష్టి

- నగరంలోని 25 సర్కారు బడుల్లో ఏఐ ల్యాబ్‌ల ఏర్పాటు
- చదువులో వెనుకబడిన విద్యార్థుల గుర్తింపు
- తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ బేసిక్స్‌పై విద్యార్థులు పట్టు సాధించేలా బోధన



ప్రభుత్వ పాఠశాలలో ఏఐ ల్యాబ్‌లో విద్యార్థులు ఇలా..

సాక్షి,సిటీబ్యూరో: కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) సహాయంతో సర్కారు బడుల్లో ప్రాథమిక విద్య బలోపేతానికి కసరత్తు సాగుతోంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుకు విద్యా శాఖ చర్యలు చేపట్టింది. ప్రాథమిక పాఠశాలల్లో ఏక్‌స్టెప్ ఫౌండేషన్ సహకారంతో కృత్రిమ మేధ సాంకేతికత ఆధారంగా మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్ బేసిక్స్‌పై పట్టు సాధించేవిధంగా కృషి చేస్తోంది. ఈ మేరకు కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. తొలివిడతగా హైదరాబాద్ జిల్లాలోని 25 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి ప్రత్యేక ఏఐ ల్యాబ్‌ల ద్వారా బోధన సాగిస్తోంది. వాస్తవంగా గత విద్యా సంవత్సరం చివరన ల్యాబ్‌లను ఏర్పాటు చేసినప్పటికీ నూతన విద్యా సంవత్సరం నుంచి ఏఐ టూల్స్ బోధనలపై దృష్టి సారించినట్లు కనిపిస్తోంది.

తొలిమెట్టు ద్వారా గుర్తింపు

చదువులో వెనుకబడిన విద్యార్థులను 'తొలిమెట్టు' కార్యక్రమం ద్వారా గుర్తించారు. కంప్యూటర్‌లో ఏఐ టూల్స్‌లను ఉపయోగించుకొని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో అక్షరాలు, సరళ పదాల గుర్తింపు, స్థాయిని బట్టి పదాలు చదవటం, రాయటం, గణితంలో చతుర్విద ప్రక్రియల్లో మెరుగైన సామర్థ్యాలు చాటేలా బోధన అందిస్తారు. ఇందుకోసం కంప్యూటర్లు ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు అనుబంధంగా గల ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. సీ-గ్రేడ్ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించే విధంగా ఏక్‌స్టెప్ ఫౌండేషన్ ప్రత్యేకంగా ఏఐ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఎంపిక చేసిన ప్రతి స్కూల్ నుంచి కంప్యూటర్ నిపుణులైన ఒక ఎస్జీటీని ఎంపిక చేసి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి బోధనకు శ్రీకారం చుట్టింది.

ఇలా నేర్చుకుంటారు...

చదువులో వెనుకబడిన మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులు కంప్యూటర్లలో కృత్రిమ మేధ ఆధారిత టూల్స్ ద్వారా చదవడం, రాయడం వంటి చతుర్విద ప్రక్రియలను నేర్పిస్తారు. ఆర్టిఫిషియల్ లాంగ్వేజీ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ మ్యాథ్స్ లెర్నింగ్ ప్రక్రియగా బోధన కొనసాగుతోంది. వారంలో రెండు రోజులు 20 నిమిషాలకో క్లాస్ చొప్పున తెలుగు, ఆంగ్లం, గణితం అంశాలపై ఏఐ పాఠాలు బోధిస్తుంది. విద్యార్థులు కంప్యూటర్ ముందు కూర్చొని మైక్రోఫోన్ ద్వారా పదాలను వినడం, ఉచ్చరించడం చేస్తారు. టూల్స్ పాఠాలను బాలలు అర్థం చేసుకున్నారా? లేదా అనే విషయాన్ని కూడా ఏఐ గుర్తిస్తుంది. అర్థం కాకుంటే సరళమైన పద్ధతిలో పదే పదే బోధిస్తుంది. అర్థమైతే టూల్స్‌ను ముందుకు తీసుకెళ్తోంది. పదం నుంచి వాక్య నిర్మాణ వరకు అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడే విధంగా ఏఐ ప్రయత్నిస్తోంది.

హైదరాబాద్ జిల్లాలో ఏఐ ల్యాబ్‌లకు ఎంపికైన విద్యార్థులు ఇలా..

తరగతి	విద్యార్థుల సంఖ్య
3వ తరగతి	261
4వ తరగతి	261
5వ తరగతి	260

వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్



ప్రాథమిక తరగతి స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంపై ఫోకస్ పెట్టాం. 25 ఏఐ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి చదువులో వెనుకబడిన దాదాపు 782 మంది విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, గణితం బేసిక్స్‌పై పట్టు సాధించేలా చర్యలు చేపట్టాం. చదువుపై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది. కృత్రిమ మేధ టూల్స్ ద్వారా అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడ్డాయి. దశల వారీగా అన్ని పాఠశాలల్లో ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తాం.

–రోహిణి, జిల్లా విద్యాశాఖాధికారి, హైదరాబాద్

గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ

- 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ బ్రాండ్ మెరిసేలా కొత్త స్పోర్ట్స్ పాలసీ
- బ్యాడ్మింటన్ స్టేడియం ప్రారంభోత్సవంలో ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు



బ్యాడ్మింటన్ స్టేడియంను ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు

కూకట్‌పల్లి: తెలంగాణను గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా మార్చాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ బ్రాండ్ మెరవాలనే సంకల్పంతోనే కొత్త స్పోర్ట్స్ పాలసీకి శ్రీకారం చుట్టామన్నారు. మంగళవారం హైదర్‌నగర్ డివిజన్‌లోని సమతా నగర్‌లో ఎస్‌ఎల్‌వీ ప్రో బ్యాడ్మింటన్ స్టేడియంను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రికెట్‌తోపాటు ఇతర క్రీడలకు ప్రాధాన్యం పెరిగిందని తెలిపారు. తల్లిదండ్రుల ఆలోచన తీరులోనూ మార్పు వచ్చిందని పేర్కొన్నారు. హైదరాబాద్ అంటే అందరికీ బిర్యానీతోపాటు బాడ్మింటన్ కూడా గుర్తుకొస్తుందని అన్నారు. గోపీచంద్, సైనా నెహ్వాల్, పీవీ సింధూ, చిరాగ్, సాత్విక్ లాంటి ప్రముఖ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది చిన్నారులు బ్యాడ్మింటన్‌ను కెరీర్‌గా ఎంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నారని పేర్కొన్నారు. బాడ్మింటన్ హబ్‌గా హైదరాబాద్ మారటంలో గోపీచంద్ పాత్ర కీలకమన్నారు. 2026లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామ పంచాయితీలు, మండల కేంద్రాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. త్వరలో గచ్చిబౌలిలో బాలికల కోసం ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అకాడమీని ప్రారంభించబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల్లో స్పోర్ట్స్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు అందరి సహకారం అవసరం: పొన్నం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర విజయవంతం అయ్యేందుకు అందరి సహకారం అవసరమని, రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జూలై 13, 14వ తేదీల్లో జరగనున్న ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఏర్పాట్లపై దేవాలయ ప్రాంగణంలో మంత్రి వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు చేపడుతున్న ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది జరిగిన పొరపాట్లను సమీక్షించుకుని, ఎక్కడా ఏ చిన్న సమస్య కూడా రాకుండా అధికారులు సమన్వయంగా ముందుకు వెళ్లాలన్నారు. ముఖ్యంగా ఆలయాల వద్ద విద్యుత్ సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, అదనంగా మంచినీరు సరఫరా చేయాలని సూచించారు. మొత్తం 3,600 దేవాలయాల వద్ద జాతర విజయవంతం చేసేందుకు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ దేవాలయం చుట్టు పక్కల మొత్తం సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ హరిచందన, జాయింట్ కమిషనర్ విక్రం సింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్, డీసీపీ రష్మి పెరుమాల్, డిప్యూటీ మేయర్ మోతె శోభన్‌రెడ్డి, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, కార్పొరేటర్ చీర సుచిత్ర, పీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, జలమండలి డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, ఈవో మనోహర్‌రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఖతార్‌లో యువకుడి అదృశ్యం

ఆచూకీ కోసం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించిన తండ్రి



అదృశ్యమైన కాసూర్ నాగరాజు

లక్డీకాపూల్: ఖతార్ వెళ్లి కనిపించకుండా పోయిన కొడుకు ఆచూకీని తెలుసుకోవాలంటూ ఓ తండ్రి ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణం కాశీ హనుమాన్ గల్లీకి చెందిన కాసూర్ నారాయణ కొడుకు నాగరాజు ఖతార్‌కు వలస వెళ్లి స్టార్క్ సెక్యూరిటీ సర్వీసెస్‌లో చేరాడు. ఈ క్రమంలో ఏదో క్రిమినల్ కేసు విచారణ నిమిత్తం నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకొని ఉంటారని తండ్రి అనుమానం వ్యక్తం చేశాడు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ఇండియన్ ఎంబసీ ద్వారా సహాయం చేయాలని నారాయణ అభ్యర్థించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి కూడా సహకరించాలని కోరారు.

ఇజ్రాయిల్ నుంచి జగిత్యాలవాసి మృతదేహాన్ని తెప్పించండి



మృతదేహాన్ని తెప్పించాలని కోరుతూ వినతిపత్రం ఇస్తున్న మాజీమంత్రి రాజేశం గౌడ్

ఇజ్రాయిల్‌లో మృతి చెందిన జగిత్యాలకు చెందిన రేవెల్ల రవీందర్ మృతదేహాన్ని త్వరగా భారత్‌కు తెప్పించాలని మాజీమంత్రి జి.రాజేశం గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రజాభవన్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో స్టేట్ నోడల్ అధికారి దివ్యా దేవరాజన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల ఇజ్రాయిల్‌లో రవీందర్ (57) మృతి చెందాడని చెప్పారు. దివ్యా దేవరాజన్ రాష్ట్ర ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం అధికారి సీహెచ్ శివ లింగయ్యతో మాట్లాడుతూ విదేశాంగ శాఖ, ఇజ్రాయిల్‌లోని ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేసి త్వరగా మృతదేహాన్ని తెప్పించాలని సూచించారు.

ప్రజాభవన్ వద్ద 'అక్షర' బాధితుల బైఠాయింపు

లక్డీకాపూల్: న్యాయం చేయాలని కోరుతూ వరంగల్‌లోని అక్షర చిట్ ఫండ్ బాధితులు ప్రజాభవన్ వద్ద బైఠాయించారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయడానికి బాధితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 900 మందికి పైగా అక్షర బాధితులు ఉన్నారని, వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేశారు. కాగా, ప్రజావాణిలో 317 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 67, రెవెన్యూ శాఖ 62, ఇందిరమ్మ ఇండ్లు 69, విద్యుత్ శాఖ 18, మున్సిపల్ శాఖ 18, ప్రవాసి ప్రజావాణికి 02, పౌర సరఫరా శాఖకు 06 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 76 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించారు.



ప్రజాభవన్ వద్ద బైఠాయించిన అక్షర చిట్‌ఫండ్ బాధితులు

గోడ కూల్చి.. రోడ్డు నిర్మించి..

బాచుపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ ప్రహరీని కూల్చిన హైడ్రా



నిజాంపేట్: నగర శివారు ప్రాంతాల్లో హైడ్రా మళ్లీ కొరడా ఝుళిపించింది. మంగళవారం బాచుపల్లిలోని గేటెడ్ కమ్యూనిటీ ప్రహరీని హైడ్రా అధికారులు కూల్చివేశారు. వివరాలు... గతంలో మల్లంపేట నుంచి బాచుపల్లి ప్రధాన మార్గానికి వెళ్లేందుకు ఓల్డ్ హైదరాబాద్ రోడ్డు ఉండేది. ఆ మార్గంలోనే పీవీఆర్ హై రైజ్ మెడోస్ విల్లాలు వెలిశాయి. విల్లాలు నిర్మించే సమయంలో రోడ్డుకు అడ్డంగా నిర్మాణదారులు గోడ కట్టారు. దీంతో మల్లంపేటలోని డ్రీమ్ వ్యాలీ, ఆకాష్ లే అవుట్, గ్రీన్ పార్క్ కాలనీ, ఏపీఆర్ విలాస్, జీఎల్‌సీ భవన్ వాసులు మల్లంపేట బస్టాప్ నుంచి బాచుపల్లికి చుట్టూ తిరిగి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ భారీగా స్తంభిస్తోంది. ఈ విషయంపై ఆయా ప్రాంతాల ప్రజలు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో చివరకు హైడ్రాను ఆశ్రయించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు ప్రహరిని కూల్చివేసి ఆ ప్రాంతాన్ని జేసీబీలతో చదును చేసి రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే కూల్చివేతలను నిరసిస్తూ ప్రణీత్ ప్రణవ్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీవాసులు ఆందోళనకు దిగారు. ఒకటో డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మీ సుబ్బారావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

భగత్, రితీశ్ సెంచరీలు

- కేంబ్రిడ్జ్ ఎలెవన్ 379 ఆలౌట్
- హెచ్‌సీఏ రెండు రోజుల లీగ్



భగత్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఎ-1 రెండు రోజుల లీగ్ మ్యాచ్‌లో కేంబ్రిడ్జ్ ఎలెవన్ బ్యాటర్లు కె.భగత్ వర్మ, జి.రితీశ్ రెడ్డి సెంచరీలతో చెలరేగారు. స్పోర్టింగ్ ఎలెవన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలి రోజు కేంబ్రిడ్జ్ 83.2 ఓవర్లలో 379 పరుగులకు ఆలౌటైంది. భగత్ వర్మ (139 బంతుల్లో 130; 19 ఫోర్లు, 4 సిక్స్‌లు), రితీశ్ రెడ్డి (159 బంతుల్లో 117; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) శతకాలు సాధించారు. ఇతర బ్యాటర్లలో ప్రమోద్ మహాజన్ (81 బంతుల్లో 49; 8 ఫోర్లు), ఎస్.రాకేశ్ (57 బంతుల్లో 35; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భగత్, రితీశ్ ఆరో వికెట్‌కు 125 పరుగులు జోడించారు. కార్తికేయ కక్ 4 వికెట్లు పడగొట్టగా... తనయ్ త్యాగరాజన్, వరుణ్ గౌడ్, రతన్ తేజ తలా 2 వికెట్లు తీశారు.

లక్ష్య సాధనకు యువత శ్రమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మిస్టర్ ఇండియా-2025 రాకేశ్ ఆర్నె

హిమాయత్‌నగర్: యువత లక్ష్య సాధన కోసం కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధ్యమేనని మిస్టర్ ఇండియా–2025 టైటిల్ విజేత రాకేశ్ ఆర్నె అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడలింగ్ రంగంతో పాటు సామాజిక సేవలో భాగస్వామిగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఫిట్‌నెస్ అంటే కేవలం శరీరానికి మాత్రమే కాకుండా మనస్సుకూ అవసరమని తన అనుభవాల ద్వారా యువతకు సందేశం ఇచ్చారు. త్వరలోనే ఫిట్‌నెస్, మానసిక అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలు ప్రారంభిస్తానని పేర్కొన్నారు.

సినిమా థియేటర్ కార్మికుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సినిమా థియేటర్ కార్మికులు

చిక్కడపల్లి: సినిమా థియేటర్లలో పనిచేసే కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవిస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ సినిమా థియేటర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ ఎదుట సినిమా థియేటర్ల కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మారన్న మాట్లాడుతూ మల్టీప్లెక్స్ థియేటర్లలో ఒకే చోట 8 నుంచి 10 స్క్రీన్లు ఏర్పాటు చేసి 50 మంది చేయాల్సిన పనిని 15 నుంచి 20 మందితో చేయించి శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. రోజుకు 12 నుంచి 14 గంటలు పనిచేసే కార్మికులు రాత్రి సమయాల్లో ఇంటికి వెళ్లడానికి రవాణా సౌకర్యం కల్పించడం లేదన్నారు. రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్స్‌లోని కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. పీవీఆర్, ఐనాక్స్ థియేటర్స్‌లలో పనిచేసే మహిళలపై లైంగిక వేధింపులు, అక్రమ బదిలీలు ఆపాలని, మహిళా రక్షణ బృందాన్ని ఏర్పాటు చేయాలని మారన్న కోరారు. అనంతరం అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు అరుణ్, పుల్లారావు, రామస్వామి, కమలాకర్‌రాజు, సుధాకర్, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్ట్ మహబూబ్ బాషా మృతి



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన సీనియర్ ఫొటో జర్నలిస్ట్ షేక్ మహబూబ్ బాషా(56) మంగళవారం మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌కు చెందిన బాషా ఫొటో జర్నలిస్టుగా 2002లో హైదరాబాద్‌లో కెరీర్ మొదలుపెట్టారు. వార్త, ఆంధ్రప్రభ, సూర్య, మన తెలంగాణ, హైదరాబాద్ మిర్రర్ పత్రికల్లోపనిచేయడంతో పాటు మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ దగ్గర కూడా ఫొటోగ్రాఫర్‌గా సేవలు అందించారు. కొంత కాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్న భాషా గత శనివారం ఆకస్మికంగా తీవ్ర అనారోగ్యానికి గురై నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. బాషాకు భార్య, కుమార్తె, కుమారుడు వున్నారు. ఆయన అంత్యక్రియలు బుధవారం ఉదయం అంబర్‌పేటలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మహబూబ్ బాషా మృతిపై రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, కార్యదర్శి కె.ఎన్.హరి, కార్యవర్గ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

డ్రగ్ 'కంట్రోల్' తప్పుతోందా?

- నగరంలో 15 వేలకుపైగా ఔషధ దుకాణాలు
- కొరవడిన పర్యవేక్షణ.. తనిఖీలు



సాక్షి, సిటీబ్యూరో: ఔషధ దుకాణాలపై డ్రగ్ 'కంట్రోల్'తప్పుతోంది. ఆర్‌ఎంపీ క్లినిక్‌లలోనూ నిబంధనలకు విరుద్ధంగా స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్స్, మత్తు ఇంజెక్షన్లు విరివిగా లభిస్తున్నాయి. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీల్లోనూ ఈ విషయం స్పష్టమైంది. అర్హులైన వైద్యుల చీటీ లేనిదే మందులు అమ్మవద్దన్న నిబంధనను ఔషధ దుకాణదారులు గాలికొదిలేస్తున్నారు. ఫార్మసీ ఉత్తీర్ణులైన పలువురు తమ సర్టిఫికెట్లు దుకాణదారులకు అమ్ముకుంటున్నారు. ఫార్మసీల్లో తనిఖీలు చేయాల్సిన డ్రగ్ కంట్రోల్ విభాగంలో సరిపడా సిబ్బంది లేకపోవడం, ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటులో తాత్సారం వెరసి యజమానుల పాలిట వరంగా మారుతోంది.

15 వేలకుపైగా దుకాణాలు..

రాష్ట్రంలో సుమారు 40 వేల మెడికల్ షాపులు ఉన్నాయి. అందులో 15 వేలకుపైగా దుకాణాలు హైదరాబాద్ జిల్లాలోనే నడుస్తున్నాయి. జిల్లా పరిధిలో డ్రగ్ కంట్రోల్ అథారిటీకి 11 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. మరో ఇద్దరు అదనపు డైరెక్టర్లు పనిచేస్తున్నారు. ఒక్కో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నెలకు కనీసం 25 దుకాణాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన నెలకు 11 మంది డీఐలు 225 నుంచి 250 షాపులను తనిఖీ చేసే అవకాశం ఉంటుంది. ఇలా ఏడాదికి 3 వేల షాపులు తనిఖీ చేయవచ్చు.

15 వేల దుకాణాల తనిఖీకి 5 ఏళ్లు..

జీహెచ్‌ఎంసీ పరిధిలో మెడికల్ దుకాణానికి ఆనుకుని క్లినిక్‌లు, మరికొన్ని చోట్ల నర్సింగ్ హోంలకు ఆనుకుని చిన్న, చిన్న మెడికల్ దుకాణాలు దర్శనమిస్తున్నాయి. అయితే ఆయా దుకాణాలకు ప్రభుత్వ పరంగా అనుమతులు ఉన్నాయా లేదా అనేది ప్రశ్నార్థకమే. ఇలాంటివి మొత్తం నగరంలో 15 వేల దుకాణాలు ఉంటాయి. ఇప్పుడున్న సిబ్బందితో వీటిని అన్నింటిని తనిఖీ చేయాలంటే సుమారు 5 ఏళ్లు పడుతుంది. అవసరాలకు సరిపడా సిబ్బందిని కేటాయిస్తే వంద శాతం దుకాణాల్లో తనిఖీలు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ఉన్న 11 మంది డీఐలు, ఇద్దరు ఏడీల పరిధిలో అధికారులు చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో సుమారు 20 శాతం మందుల దుకాణాల్లో నిబంధనల అతిక్రమిస్తున్నట్లు గుర్తిస్తున్నారు. నెలకు సరాసరి 25 కేసులు నమోదవుతున్నాయి.

ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటులో తాత్సారం

ఫార్మసీ కౌన్సిల్ ఏర్పాటులో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆయా వర్గాలు పేర్కొంటున్నాయి. కౌన్సిల్‌కు మెడికల్ షాపుల అనుమతులు, నిర్వహణ, ఉల్లంఘనలపై చర్యలు తీసుకునే అధికారాలు ఉంటాయి. ఫార్మసీ సర్టిఫికెట్ ఎవరికైనా ఇచ్చినట్లు గుర్తిస్తే దాన్ని రద్దు చేసే అధికారం కౌన్సిల్‌కు ఉంటుంది. ప్రస్తుతం కౌన్సిల్ లేకపోవడంతో తనిఖీలు నీరసించిపోయాయి.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 25, జూన్, 2025

అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో వేడుకలు నిర్వహించేందుకు అనేక మంది వ్యక్తులు, సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. తొలి దశలో తమ పుట్టినరోజులను జరుపుకోడానికి వీటిని నగరవాసులు ఎక్కువగా ఎంచుకున్నప్పటికీ, అనంతర కాలంలో క్రమంగా పెళ్లిరోజు, ప్రమోషన్, రిటైర్మెంట్ ఇలా ప్రతి సందర్భాన్నీ వారితో పంచుకునేందుకు ఆసక్తికనబరుస్తున్నారు. ప్రత్యేక తేదీల నుంచి పండుగలు, నూతన సంవత్సరం వేడుకలు మొదలు.. అనేక రకాల వేడుకలు వీటికి జతకలిశాయి.

- సాక్షి, సిటీబ్యూరో



ఆపన్నులకు కానుక.. అసలైన వేడుక..

- ఛారిటీల్లో ప్రత్యేక వేడుకలకు ఆసక్తి
- నగరవాసుల్లో పెరుగుతున్న సేవాతత్పరత
- పుట్టినరోజు నుంచి పెళ్లిరోజు వరకు
- అనాథలు, వృద్ధుల్లో నూతనోత్సాహం నింపుతూ
- పిండివంటలతో పాటు గిఫ్టులు సైతం అందిస్తూ
- స్వచ్ఛంద సంస్థలకు ప్రోత్సాహం అందిస్తున్న సిటిజనులు









బోలెడంత ఖర్చు పెట్టి పబ్స్, క్లబ్స్‌లో ఫ్రెండ్స్‌తో గడిపేకన్నా.. నిరుపేదల కడుపు నింపడమే మిన్న అని కొందరు అనుకుంటుంటే మరికొందరేమో.. అటు అన్నార్తులతోనూ, ఇటు బంధుమిత్రులతోనూ వేర్వేరుగా వేడుకలు నిర్వహించుకుంటున్నారు. మరికొందరైతే ఏకంగా వృద్ధాశ్రమాలు, అనాథశరణాయాలతోనే సరిపెట్టుకుంటున్నారు. తమకు తోచిన సాయాన్ని అందించడంతోపాటు వారికి అండగా నిలుస్తున్నారు.

ఆద్యంతం.. ఆనందం..

ఈ తరహా వేడుకలు ట్రెండ్ నగరంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పలు స్వచ్ఛంద సంస్థలకు ప్రోత్సాహకరంగా మారింది. ఈ వేడుకల్లో భాగంగా ఆశ్రమాలు, హోమ్స్‌లో ఉన్న వారితో కలిసి కేక్ కటింగ్, ఆటపాటలతో అలరించడం, విందు వినోదాలు, బహుమతులను పంచడంతో పాటు కొందరు ఆర్థిక సహకారం కూడా అందిస్తున్నారు. తద్వారా నిర్వహణ భారాన్ని కూడా పంచుకుంటున్నారు. కొందరు మరింత ముందుకెళ్లి ఆయా హోమ్స్‌లో ఉంటున్నవారిని సినిమాలకు, జూ పార్క్, సిటీ టూర్స్.. తదితరాలకు తీసుకెళుతూ వారికి మరచిపోలేని అనుభవాలను, వారు వ్యక్తిగతంగా పొందలేని ఆనందాన్ని, అనుభవాలను వారికి అందిస్తున్నారు.

ఒంటరితనాన్ని దూరంచేస్తూ..

ఇలాంటి కార్యక్రమాలు తమకు ఎవరూ లేరనే ఆవేదనను ఆపన్నుల నుంచి తాత్కాలికంగానైనా దూరం చేస్తున్నాయి. 'ఎంత డబ్బులు ఖర్చు చేశాం అనేదాని కన్నా ఎంత మందికి నిజమైన సంతోషాన్ని అందించగలిగాం? అనేదే ముఖ్యం. వారిలోని ఒంటరితనాన్ని దూరం చేసేందుకు.. నా పుట్టిన రోజును ప్రతిసారీ ఏదో ఒక వృద్ధాశ్రమంలో, ఆర్ఫన్ హోమ్స్‌లో జరుపుకోవడం ఒక అలవాటుగా మార్చుకున్నాను' అని చెప్పారు నగరానికి చెందిన మహిళా వ్యాపారవేత్త విభాజైన్. తనను చూసి తన స్నేహితులు మరికొంత మంది కూడా ఇదే బాట అనుసరిస్తున్నారంటూ ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

మేము సైతం అంటున్న ఈవెంట్ ఆర్గనైజర్లు..

నగరవాసుల్లో ఈ తరహా వేడుకల నిర్వహణ పట్ల పెరుగుతున్న ఆసక్తి దీని కోసం ప్రత్యేకంగా ఈవెంట్ మేనేజర్లు సైతం పుట్టుకురావడానికి దోహదం చేసింది. సంపన్న వ్యాపారుల పుట్టిన రోజులు, పెళ్లి రోజులు వంటివి అనాథలు, నిరుపేదల నడుమ జరుపుకునేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లూ చేయడం ద్వారా పలువురు ఈవెంట్ నిర్వాహకులు సిటీలో ఈ తరహా కార్యక్రమాలు ఊపందుకోడానికి కారణమవుతున్నారు. అంతేకాకుండా ఇలాంటి వేడుకలకు సోషల్ మీడియా ద్వారా అద్భుతమైన స్పందనను రాబట్టే పని సైతం వీరే నిర్వహిస్తుండడం విశేషం. ఏది ఏమైనా నగరంలో నిరుపేదలకు, అనాథలకు ఈ తరహా వేడుకలు ఎంతో ఉపయుక్తంగా మారాయనేది నిస్సందేహం.



పండుగలు సైతం..

తొలుత ఆర్ఫన్ హోమ్స్, ఆశ్రమాల్లో సిటిజనులు పుట్టినరోజులే ఎక్కువగా జరుపుకునే వారు. అయితే ఆ ధోరణి మరింతగా పుంజుకుంటుండగా.. ప్రస్తుతం కాదేదీ సాయానికి అనర్హం అన్నట్టుగా మరికొన్ని ముఖ్యమైన సందర్భాలనూ వాటికి జతచేస్తున్నారు. ముఖ్యంగా వినాయకచవితి రోజున అనాథ చిన్నారులతో కలిసి వినాయక ప్రతిమలు తయారు చేయడం వంటివి, అలాగే దీపావళి రోజున వృద్ధులు, చిన్నారులతో కలిసి టపాసులు కాల్చడం.. వంటివి చేస్తున్నారు. ఇలా సంప్రదాయ పండుగలు జరుపుకోవడం మొదలుకుని.. ఫ్రెండ్ షిప్ డే, మదర్స్ డే, ఫాదర్స్ డే, న్యూ ఇయర్ వంటి ఆధునిక పార్టీల వరకూ ఈ ట్రెండ్‌కు జతచేస్తున్నారు. 'నా కన్నతల్లి నాకు దూరమైనప్పటి నుంచీ మాతృదినోత్సవం రోజున ఓ వృద్ధాశ్రమంలో ఎందరో కన్నతల్లులతో కలిసి గడపడం ఒక అలవాటుగా మార్చుకున్నాను. అది నాకెంతో సంతృప్తిని అందిస్తోంది' అని చెబుతున్నారు నగరానికి చెందిన డిజైనర్ రజి తారాజ్.



చార్మినార్ కలెక్షన్ ఆవిష్కరణ..

మిస్ యూనివర్స్ తెలంగాణ కశ్వీ, మిసెస్ ఇండియా డా.ప్రీతి అడుసుమిల్లి సందడి

సాక్షి, సిటీబ్యూరో: మిస్ యూనివర్స్ తెలంగాణ 2025 కశ్వీ, మిసెస్ ఇండియా 2024 విజేత డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి నగరంలో సందడి చేశారు. వినూత్న శైలి లగ్జరీని పరిచయం చేస్తూ ఓ ప్రముఖ డైమండ్స్ బ్రాండ్ నగరంలో మొదటి షోరూంను ఏర్పాటు చేయగా.. వీరు ప్రారంభించారు. కోకాపేట వేదికగా జరిగిన ఈ ప్రారంభోత్సవంలో సరికొత్త 'చార్మినార్ కలెక్షన్' ఆవిష్కరించారు. చార్మినార్ స్ఫూర్తితో ఈ కలెక్షన్‌ను ప్రముఖ డిజైనర్ పంకజ్ గుప్తా రూపొందించారు. సంస్థ లాభాల్లోని కొంత భాగాన్ని 'బేటీ బచావో, బేటీ పడావో' ఉద్యమం, హస్తకారుల సంక్షేమానికి కేటాయిస్తామని సంస్థ యాజమాన్యం తెలిపింది.





కుక్కడ్ కార్నివాల్

- జూలై 10వ తేదీ వరకూ అందుబాటులో..
- మటన్, చికెన్, ఫిష్, వెజిటేరియన్ సహా 96 రకాలు


సాక్షి, సిటీబ్యూరో: విభిన్న రుచుల సమ్మేళనాన్ని అమితంగా ఆస్వాదించే భోజనప్రియుల కోసం నగరంలో ప్రతిష్టాత్మక 'కుక్కడ్ కార్నివాల్' ప్రారంభమైంది. ప్రముఖ బఫే డైనింగ్ చైన్ బార్బిక్యూ నేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్నివాల్ చికెన్ ఫుడ్ ఫెస్టివల్ జూలై 10వ తేదీ వరకూ జరగనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజనల్ మేనేజర్ సుమన్ ముఖర్జీ మాట్లాడుతూ.. ఈ ఫెస్టివల్‌లో భాగంగా మటన్, చికెన్, ఫిష్, వెజిటేరియన్ సహా 96 రకాల వంటకాలు ఆస్వాదించవచ్చని తెలిపారు. నగరంలోని అన్ని బ్రాంచ్‌లలో ఈ కార్నివాల్ ఆహార ప్రియులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. చికెన్ హలీం, దమ్‌కా ముర్గ్, ముర్గ్ చేంజేజీ, తందూరీ ఘీ రోస్ట్ చికెన్ బిర్యానీ, తాజా పాలు, కుంకుమ పువ్వుతో తయారయ్యే సంప్రదాయ స్వీటు, ప్రత్యేకంగా తయారు చేసిన కుల్ఫీలు, హనీ ఆల్మండ్, డేట్స్ కుల్ఫీ వంటి విభిన్న రుచులు అలరించనున్నాయన్నారు.

ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న కుబేర సినిమా అనేక మంది విమర్శకుల ప్రశంసలను అందుకుంటూ దూసుకెళ్తోంది. ఎప్పుడూ కొత్త తరహా కథలను తెరకెక్కించే శేఖర్ కమ్ముల ఈ సారి సామాజిక కథాంశంతో పాన్ ఇండియా స్థాయిలో సినిమా తీశారు. ఇది ఎంతగానో ప్రజాదరణ పొందుతోంది. శేఖర్ కమ్ముల డైరెక్షన్ టీంలో ఛీఫ్ అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశారు అరవింద్ ఏవీ. తాను తెలుగు యూనివర్సిటీ, ఉస్మానియా విద్యార్థి. ట్రావెలర్, ఫొటోగ్రాఫర్‌గా అందరికీ సుపరిచితమే. - బంజారాహిల్స్

కుగ్రామం నుండి.. కుబేర వరకూ..

- సత్తా చాటుతున్న తెలంగాణ కుర్రోడు
- పట్టుదలతో ఫిలింనగర్‌కు పయనం







నల్లగొండ జిల్లా దేవరకొండ తాలుక మారుమూల కుగ్రామమైన మేడారంలో పుట్టి పెరిగారు. బాల్యదశలో బతుకు కోసం కుటుంబం సాగించిన వలసలో నడుస్తూ.. హుజూర్‌నగర్, నిడమానూరు, మిర్యాలగూడ, హలియ అనేక ప్రాంతాల్లో జీవించాల్సి వచ్చింది. సంక్షేమ హస్టల్స్‌లో చదువుకుంటూ క్యాటరింగ్, రైస్ మిల్లుల్లో నైట్ షిఫ్ట్స్ చేయడం.. సొంత ఖర్చులను సమకూర్చుకుంటూ చదువుకున్నారు. మరోవైపు దేశభక్తి, ఇతర సామాజిక అంశాల్లో క్రియాశీలకంగా పనిచేయడం బాధ్యతగా భావించారు.

యూనివర్సిటీలో అడుగులు..

యూనివర్సిటీ విద్యార్థిగా తమ గ్రామం నుంచి వచ్చిన మొదటి తరం విద్యార్థి. మాస్ కమ్యూనికేషన్ చదవుతూనే వార, మాస పత్రికలు నడిపారు. చిన్నతనంలో పేపర్ బాయ్‌గా పనిచేయటం వల్ల సాహిత్య పఠనం అలవడింది. అనేక సామాజిక, సాహిత్య అంశాలను స్పృశిస్తూ.. కవితలు, వ్యాసాలు రాశారు.

సాహిత్య ప్రచారం..

కథ, కవిత్వం, నవలలు విరివిగా చదవటం. చదివిన పుస్తకాలను నలుగురికీ పంచడం అవసరమని.. 'ఆలోచన' అనే సంస్థ ద్వారా గ్రామీణ, పట్టణ విద్యార్థులకు చిట్టి–పొట్టి జానపద కథల నుండి దేశభక్తుల జీవిత చరిత్రల వరకూ పరిచయం చేయడం, చదివించడం చేశారు. నగరంలోని యూనివర్సిటీల్లో స్టడీ సర్కిల్స్ నిర్వహణ, పుస్తకాలు, సినిమాలు, ఆర్ట్‌పై సదస్సులు, సభలు నిర్వహించేవారు.

యాత్రలు.. ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్..

దక్షిణ భారతదేశం మొత్తం యాత్రలు చేయడం. ఇందులో భాగంగా ఫొటోగ్రఫీపై అభిరుచి ఏర్పడింది. ఆయ ప్రాంతాల సంస్కృతిని, వైవిధ్యాన్ని, ప్రకృతిని, ఆర్కిటెక్చర్‌ను కెమెరా లెన్స్‌లోంచి చిత్రించారు. వాటిని యూనివర్సిటీల్లో, పట్టణాల్లో ప్రదర్శించారు.

సినిమా రంగంలోకి..

దర్శకులు అనుదీప్ కేవీ సాహిత్య పాఠకుడిగా ఉన్న రోజుల్లో నుంచి స్నేహం వల్ల సినిమాల్లోకి ప్రవేశం దొరికింది. ఆయన కథలను చర్చిస్తుడడం.. రాస్తుండడం.. ఆ క్రమంలోనే ప్రిన్స్ సినిమాకు రచన విభాగంలో పని చేయడం.. రచన నైపుణ్యాన్ని నేర్చుకోవడం జరిగింది.

అత్యంత మరపురాని క్షణాలు..

కుబేర షూటింగ్ మొదలవుతుంది అనుకున్న రెండు నెలల ముందు పిలిచారు. మొదట ఇంటర్న్‌షిప్ జాయిన్ అయ్యాను. యాత్ర అనుభవాల వల్ల ఈ సినిమా కథకు ముంబయి దగ్గర ఉండే లొకేషన్స్ వెతికిపెట్టే పని అప్పగించారు. చాల మేరకు హైదరాబాద్ లొకేషన్స్‌లో ఓకే చేయించుకోవడం.. క్రమంగా ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌కి ఇన్‌ఛార్జిగా ఉండడం.. లెజెండరీ మనుషులైన తోట తరణి, శేఖర్ కమ్ముల నేతృత్వంలో పనిచేయడం.. జీవితంలో ఓ మైలురాయి. డైరెక్టర్ విజన్, ప్రొడక్షన్ డిజైనర్ విజువల్‌ని సెట్‌లో ప్రతిబింబిచడానికి నిద్రాహారాలు పక్కనపెట్టి పనిచేశా.. అయినా కష్టం అనిపించలేదు.. సెట్‌లో తరణి, శేఖర్ అనుభవాలు వినడం జీవితంలో అత్యంత మరపురాని క్షణాలుగా ఉండిపోయాయి. ఆర్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రాజీతో సమన్వయంలో ఉండడం.. టీం చరణ్, రాజు, భార్గవ్‌లతో రాత్రి, పగలు ఆడుతూ.. పాడుతూ షూటింగ్ కంప్లీట్ చేశాము. నేను, మా టీం ఇప్పుడు వీస్తున్న విజయపు గాలిని ప్రశాంతంగా ఆస్వాదిస్తున్నాం. - అరవింద్ ఏవీ, అసోసియేట్ డైరెక్టర్



రాంబాబు బృందానికి మరో పేటెంట్..




ఎకో ఫ్రెండ్లీ 'మల్టీ యుటిలిటీ ట్రే' రూపకల్పన



రాయదుర్గం: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైన్ ఫ్యాకల్టీ డాక్టర్ ముప్పిడి రాంబాబు, కే ఇళయ రాజ, కలపాల వనజ బృందానికి కొత్తగా మరో పేటెంట్ లభించింది. కోల్‌కతాలోని ఇండియన్ పేటెంట్ మేధోసంపత్తి భవనం ద్వారా ఈ పేటెంట్ ప్రకటించినట్లు డాక్టర్ రాంబాబు బృందం మంగళవారం వివరించింది. ముగ్గురు సభ్యులు కలిసి వినూత్న, సృజనాత్మక డిజైన్‌గా ఎకోఫ్రెండ్లీ 'మల్టీ యుటిలిటీ ట్రే' రూపకల్పన చేశారు. అనంతరం పేటెంట్ పొందేందుకు దరఖాస్తు చేసుకోగా దీన్ని పరిశీలించి ఈ బృందానికి పేటెంట్ మంజూరు చేస్తూ సర్టిఫికెట్ జారీ చేశారు. పేటెంట్ కోసం మొత్తం 25 డిజైన్లు సమర్పించగా ఇందులో 13 పేటెంట్లు ఇప్పటి వరకూ మంజూరు కావడం విశేషం.

28న కృష్ణ సంగీత ప్రదర్శన..



సాక్షి, సిటీబ్యూరో: సంగీతంతో ప్రతి మనిషి జీవితాన్నీ సుసంపన్నం చేయడమే తన లక్ష్యమన్నారు ప్రముఖ గాయకులు అమేయా డబ్లీ. రానా దగ్గుబాటి, ఇషా అంబానీ తదితర ప్రముఖుల పెళ్లి వేడుకల్లో వీనుల విందు చేసిన అమేయా.. తన ఇండియా టూర్‌లో భాగంగా ఈ నెల 28న మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో 'కృష్ణ' పేరిట ఓ వినూత్న సంగీత ప్రదర్శన సమర్పిస్తున్నారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని మెర్క్యురి హోటల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో అమేయా డబ్లీ మాట్లాడారు. తాను విజయవంతమైన బ్యాంకర్‌గా కొనసాగుతూన్నప్పటికీ ఆ రంగాన్ని వదిలి సంగీతానికి తన జీవితాన్ని అంకితం చేయడానికి గల కారణాన్ని వివరించారు. సంగీతం ద్వారా సమాజానికి సేవ చేయాలనేదే తన లక్ష్యమని, సమాజాభివృద్ధికి దోహదపడేందుకే ఏకం ఫౌండేషన్ స్థాపించినట్లు తెలిపారు. దాదాపు 4వేల కచేరీలు నిర్వహించినా, ఇటీవల తాను భారతీయ సైన్యం కోసం సమర్పించిన సంగీత ప్రదర్శన తనకెంతో ఇష్టమైన కార్యక్రమమని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతను మేల్కొలిపేలా శ్రీకృష్ణ తత్వానికి పట్టంగడుతూ సాగే తన కృష్ణ సంగీత ప్రదర్శన నగరవాసులను అలరిస్తుందని హామీ ఇచ్చారు.

హలో... హలో.. 120 కోట్లు



తిండి, బట్ట, నీడ.. వీటి సరసన ఇప్పుడు ఫోన్ కూడా చేరిపోయింది. అంతలా మన జీవితంలో ఈ ఉపకరణం భాగమైంది. దీనికంతటికీ కారణం టెలికం సేవలు మారుమూల పల్లెలకూ చొచ్చుకుపోవడమే. ఎంతలా అంటే ఏకంగా 120 కోట్ల మంది భారతీయులకు చేరువయ్యేలా! టెలికం చందాదార్ల సంఖ్య పరంగా ప్రపంచంలో చైనా తర్వాత రెండవ అతిపెద్ద దేశం మనదే.

- సాక్షి, స్పెషల్ డెస్క్



ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా కొత్తగా 30 లక్షల మంది టెలికం చందాదారులు పెరిగారు. ఇందులో మూడింట రెండొంతులు గ్రామీణ ప్రాంతాలవారే కావడం ఆసక్తికరమైన అంశం. టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ ఏప్రిల్ గణాంకాల ప్రకారం మొత్తం చందాదారుల సంఖ్య 120.38 కోట్లకు చేరుకుంది. ఇక దేశంలో ప్రతి 100 మంది జనాభాకు 85.19 టెలిఫోన్ కనెక్షన్స్ ఉన్నాయి. టెలి సాంద్రత పట్టణాల్లోనే అధికం. ఇక్కడ 100 మంది జనాభాకు 131.46 టెలిఫోన్ కనెక్షన్స్ ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 59.26. టెలి సాంద్రత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో 94.77గా ఉంది. ఢిల్లీలో అత్యధికంగా 276.75 ఉంటే, అత్యల్పంగా బిహార్‌లో 57.37 ఉంది. ఇంటర్నెట్ యూజర్లలో సగం వాటా రిలయన్స్ జియో సొంతం చేసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో వైర్‌లెస్ వినియోగదారులు 8.24 కోట్లు కాగా, వైర్‌లైన్ కస్టమర్లు 41.12 లక్షల మంది ఉన్నారు.



జనాభాలో 85% మందికి టెలికం సేవలు	
పదేళ్లలో 9 రెట్లు పెరిగిన నెటిజన్ల సంఖ్య	ఇంటర్నెట్ యూజర్లు 10 కోట్ల నుంచి 94 కోట్లకు
2025 ఏప్రిల్‌లో కొత్తగా 30 లక్షల టెలికం కనెక్షన్లు	ఇందులో మూడింట రెండొంతులు గ్రామీణులే

పల్లెల్లో మోగుతోంది

గ్రామీణ ప్రాంతాల్లో ఫోన్ మోగుతోంది. అవును.. టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు దశాబ్ద కాలంలో పట్టణాల్లో 8.7 కోట్లు పెరిగితే పల్లెల్లో 11.71 కోట్లు అదనంగా వచ్చి చేరారు. చందాదారుల విషయంలో పట్టణాలకు, పల్లెలకు అంతరం తగ్గుతోంది. అంటే గ్రామీణ ప్రాంతాల్లో టెలికం సబ్‌స్క్రైబర్స్ పెరుగుతున్నారన్న మాట. ఈ ఏడాది మార్చితో పోలిస్తే ఏప్రిల్‌లో టెలిఫోన్ చందాదారులు పట్టణ ప్రాంతాల్లో 10 లక్షలు (0.16 శాతం) పెరిగితే గ్రామీణ ప్రాంతాల్లో 19.6 లక్షలు (0.37 శాతం) వృద్ధి చెందడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాలకు టెలికం సేవలు విస్తృతం అవుతుండడమే ఇందుకు కారణం.

నెటిజన్స్ పెరిగారు



దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా టెలికం చందాదారుల సంఖ్య 20 శాతమే పెరిగింది. అంటే కొత్తగా 20 కోట్ల మంది తోడయ్యారు. అదే ఇంటర్నెట్ విషయంలో యూజర్ల సంఖ్య పెరిగిన తీరు చూస్తే ఔరా అనిపించక మానదు. 2015లో నెటిజన్ల సంఖ్య 10 కోట్లు మాత్రమే. 2025 ఏప్రిల్ 30 నాటికి బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్ల సంఖ్య 9 రెట్లు దూసుకెళ్లి ఏకంగా 94 కోట్లు దాటింది. చవక స్మార్ట్‌ఫోన్లు, టెలికం కంపెనీల మధ్య చవక టారిఫ్‌ల యుద్ధం.. వెరసి ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య ఈ స్థాయికి చేరింది. 2015 ఏప్రిల్‌లో మొబైల్ ఇంటర్నెట్ యూజర్లు 8.5 కోట్లు, వైర్డ్ సబ్‌స్క్రైబర్స్ 1.5 కోట్లు ఉన్నారు. తాజా గణాంకాల ప్రకారం వైర్‌లెస్ నెట్ వాడకందారులు 90 కోట్లు, వైర్డ్ చందాదారులు 4.14 కోట్లు.

చైనాలో **170** కోట్ల మంది టెలికం వినియోగదారులు ఉన్నారు.


భారత్‌లో మొత్తం టెలికం చందాదారుల సంఖ్య **120.38 కోట్లు**

ఏప్రిల్‌లో మొబైల్ నంబర్ పోర్టబిలిటీ దరఖాస్తులు **1.35 కోట్లు**

2025 ఏప్రిల్ నాటికి టెలికం గణాంకాలు (కోట్లలో)

విషయం	వైర్‌లెస్	వైర్‌లైన్	మొత్తం
బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు	90.16	4.14	94.3
అర్బన్ టెలిఫోన్ సబ్‌స్క్రైబర్స్	63.33	3.39	66.7
రూరల్ టెలిఫోన్ చందాదారులు	53.3	0.35	53.66
మొత్తం సబ్‌స్క్రైబర్స్	116.64	3.74	120.38
పట్టణ చందాదారుల శాతం	54.29	90.61	55.42
గ్రామీణ సబ్‌స్క్రైబర్స్ శాతం	45.71	9.39	44.58

దశాబ్ద కాలంలో చందాదారులు పెరిగిన తీరు (కోట్లలో)



క్లుప్తంగా...

వచ్చే నెల 4న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే రాక

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వచ్చే నెల 4న హైదరాబాద్‌కు రానున్నారు. ఈ మేరకు ఏఐసీసీ నుంచి షెడ్యూల్ ఖరారైంది. జూలై 4న గాంధీభవన్‌లో జరిగే టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశానికి హాజరయ్యేందుకు ఆయన వస్తారని, ఆ తర్వాత టీపీసీసీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొంటారని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. సాయంత్రం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులతో నిర్వహించే సమావేశానికి కూడా ఆయన హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమ నిర్వహణకు గాను పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు క్షేత్రస్థాయికి వెళ్లి పని చేయాల్సి ఉంటుందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన బాధ్యతలు అప్పగిస్తామని మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో మహేశ్‌గౌడ్ చెప్పారు.

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ భేటీ

పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై చర్చ

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ మంగళవారం గాంధీభవన్‌లో భేటీ అయింది. చైర్మన్, ఎంపీ మల్లు రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కమిటీ సభ్యులు శ్యాంమోహన్, కమలాకర్‌రావు, జాఫర్‌జావేద్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా కమిటీ ముందు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సభ్యులు చర్చించారు. ఈనెల 26న మరోమారు భేటీ కావాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి మాట్లాడుతూ వరంగల్, ఖైరతాబాద్, గజ్వేల్ నాయకుల మధ్య విభేదాలపై చర్చించామని, ఈనెల 26న భేటీ అయి తీసుకోవాల్సిన నిర్ణయాలను తీసుకుంటామని చెప్పారు. పార్టీ నేతల అంతర్గత సమస్యల పరిష్కారానికి కొన్ని నిబంధనలను రూపొందించామని, పార్టీ మూల సిద్ధాంతానికి అనుగుణంగానే ఎవరైనా వ్యవహరించాల్సి ఉంటుందని తెలిపారు. క్రమశిక్షణ కమిటీకి ఎవరిపై ప్రేమ లేదని, కోపం అసలే ఉండదని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై మాత్రమే ప్రేమ ఉంటుందని రవి వ్యాఖ్యానించారు.

కేబినెట్ సమావేశానంతరం 'స్థానిక' ప్రకటన వస్తుందనుకున్నాం

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గంటల కొద్దీ నిర్వహించిన కేబినెట్ సమావేశం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల గురించి స్పష్టమైన ప్రకటన వస్తుందేమోనని ఎదురుచూశామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నెల, రెండు నెలల తర్వాతనైనా ఎన్నికలు నిర్వహిస్తారో లేదో అనే సందేహం నెలకొందని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. 2024, ఫిబ్రవరిలోనే సర్పంచుల పదవీకాలం, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీకాలం.. మున్సిపాలిటీలకు ఆగస్టులో గడువు ముగుస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ లబ్ధికోసం ప్రజాస్వామ్య వ్యవస్థను తుంగలో తొక్కే ధోరణిని మానేయాలని ప్రకాశ్‌రెడ్డి హితవుపలికారు. ఇంత దారుణంగా స్థానిక పరిపాలన లేని పరిస్థితి దేశంలో మరెక్కడా కనిపించదన్నారు. రాష్ట్రప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

దడ పుట్టిస్తున్న జూనోటిక్ డిసీజెస్

- జంతువుల నుంచి మనుషులకు పెరిగిన సంక్రమణలు
- 75–80 శాతం వైరస్‌లు ఈ రకానికి చెందినవే
- జూనోటిక్ వ్యాధుల తీవ్రత భారత్‌లోనూ అధికమే
- రక్షణకు వ్యక్తిగత, కమ్యూనిటీ, ఆరోగ్య వ్యవస్థల స్థాయిలో చర్యలు
- ప్రజారోగ్య నిపుణుడు డాక్టర్ కె. శ్రీనాథ్‌రెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: పట్టణీకరణ పెరిగిపోవటం, జంతు– మనిషి సాన్నిహిత్యం అసాధారణంగా పెరగటంతో మనుషుల్లో 'జూనోటిక్ డిసీజెస్'(జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులు) పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం 75–80 శాతం దాకా వైరస్‌లు ఇలాగే మనుషులకు వ్యాపిస్తున్నాయని అధ్యయనాల్లో తేలింది. భారత్ గత కొన్ని దశాబ్దాలుగా అనేక సంక్రమణ వ్యాధులతో పోరాడుతున్నా.. ఇటీవల జూనోటిక్ వ్యాధుల వ్యాప్తి వేగం పెరిగింది. కరోనా, డెంగ్యూ, రేబిస్, నిఫా వైరస్, లెప్టోస్పైరోసిస్, క్యాసనూర్ ఫారెస్ట్ డిసీజ్ (మంకీ ఫీవర్), స్వైన్ ఫ్లూ, ఎబోలా, ఆంత్రాక్స్, బర్డ్ ఫ్లూ, హెపటైటిస్–ఈ, మలేరియా వంటి వ్యాధులు మనుషులను పీడిస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు ముందుగా పర్యావరణ విధ్వంసాన్ని, విచక్షణారహితంగా వన్యప్రాణులకు నష్టం చేయడాన్ని తగ్గించాలని వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇంటర్నేషనల్) సంస్థ 'కోవిడ్–19: అర్జంట్ కాల్ టు ప్రొటెక్ట్ పీపుల్ అండ్ నేచర్'అనే నివేదికలో సూచించింది. లేదంటే భవిష్యత్‌లో మరిన్ని ప్రాణాంతక వ్యాధులు మానవాళిని ఇబ్బందిపెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మనుషుల్లో ఇన్‌ఫెక్షన్లు సోకడం ద్వారా వ్యాపించే మొత్తం 1,200 వ్యాధుల్లో 816 (75 శాతం) జూనోటిక్ డిసీజెస్‌లేనని నిపుణులు చెబుతున్నారు.

భారత్‌లో జూనోటిక్ వ్యాధుల తీవ్రతకు ఉదాహరణలు..

- 2025 నాటికి భారత్‌లో నమోదైన కరోనా కేసులు 4.5 కోట్లు.. 2021లో దేశంలో కరోనా మరణాలు 5.33 లక్షలు
- రేబిస్ వల్ల ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న మరణాల్లో మనదేశంలోనే 36% ఉంటున్నాయి.
- 2023–24లో దేశంలో విజృంభించిన మొత్తం వ్యాధుల్లో 47% జూనోటిక్ డిసీజ్‌లే.
- నిఫా వైరస్ 2018 నుంచి ప్రతి ఏడాది కేరళలో విజృంభిస్తూనే ఉంది.
- 2024లో కుక్క కాట్లు ఆంధ్రప్రదేశ్‌లో 2,45,174, తెలంగాణలో 1,21,997 నమోదయ్యాయి. రేబిస్ వల్ల కర్ణాటకలో 2024లో 42 మంది మరణించారు.
- 2024లో డెంగ్యూ కేసులు తెలంగాణలో 10,077, కర్ణాటకలో 32,000, తమిళనాడులో 26,740 వెలుగు చూశాయి.
- గతేడాది చికున్ గున్యా (సస్పెక్టెడ్) కేసులు తెలంగాణలో 13,592 రికార్డయ్యాయి.

జూనోటిక్ వ్యాధుల పెరుగుదలకు కారణాలు

అనియంత్రిత పట్టణీకరణ, వాతావరణ మార్పులు, అటవీ నిర్మూలన, సహజ వనరులపై మనుషుల మితిమీరిన జోక్యం

తెలుగు రాష్ట్రాల్లో హెల్త్‌కేర్ వ్యవస్థ బలాబలాలు

బలాలు
- సర్వేలు, అధ్యయనాల్లో వృద్ధి: గతేడాది నుంచి రేబిస్‌ను నోటిఫయబుల్ వ్యాధిగా గుర్తించడం వల్ల డేటా సేకరణ మెరుగైంది.
- ఐసీఎంఆర్ జోక్యం: తెలంగాణ, పంజాబ్, అస్సాంలలో కబేళాల్లో జూనోటిక్ పాథోజెన్లపై రియల్‌టైం మానిటరింగ్ ప్రారంభించారు.
- ఒకే వైద్య విధానంపై దృష్టి: హైదరాబాద్ కేంద్రంగా పశుసంరక్షణ, పర్యావరణం, హెల్త్ డిపార్ట్‌మెంట్లు కలిసి పనిచేయడం ప్రారంభించాయి.

బలహీనతలు
- క్షేత్రస్థాయిలో సమన్వయ లోపం
- బలహీనమైన గ్రామీణ ప్రజారోగ్య వ్యవస్థ
- మనుషుల్లో రోగనిరోధకత తగ్గిపోవటం

వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలు
- వన్ హెల్త్ సర్వైలెన్స్ గ్రిడ్ ఏర్పాటు
- రాష్ట్రస్థాయిలో డిజిటల్ మోడల్ ఆస్పత్రులు, వెటర్నరీ క్లినిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ల్యాబ్స్‌ను ఒకే డాష్‌బోర్డ్‌తో అనుసంధానించటం.
- రోగ లక్షణాలు బయటపడకముందే నీటి నమూనాలు, గాలిలో వ్యాధి జన్యువుల పర్యవేక్షణ.
- సంయుక్త బృందాల ద్వారా ఎకో సర్వేలు, రోగ నిర్ధారణ పరీక్షలు.
- కొత్త వైరస్‌లను ముందుగానే గుర్తించి అప్రమత్తం చేయటం.
- పిల్లలు, రైతులు, శ్రామికులు, వలసదారులకు ప్రత్యేక హెల్త్ ఎడ్యుకేషన్.

కబేళాల్లో బయోసేఫ్టీ ప్రొటోకాల్ తప్పనిసరి చేయాలి



రాబోయే రోజుల్లో జూనోటిక్ డిసీజెస్ వ్యాప్తి తీవ్రంగా పెరగబోతోంది. కొన్ని వ్యాధులు స్థానిక ప్రాంతాలకే పరిమితమైతే, కొన్ని మహమ్మారులుగా మారి ఇతర దేశాలకు కూడా వ్యాప్తిచెందే ప్రమాదం ఉంది. వీటి నుంచి రక్షణకు వ్యక్తిగత, కమ్యూనిటీ, ఆరోగ్య వ్యవస్థల స్థాయిలో చర్యలు చేపట్టాలి. వ్యక్తిగత రక్షణకు మాస్కులు ధరించటం, నివసించేచోట గాలి, వెలుతురు బాగా ఉండేలా చూసుకోవడం, నీరు ఎక్కువగా తాగడం, తాజా పండ్లు, కూరగాయలు తినటం, 6–8 గంటలపాటు నిద్ర ద్వారా రోగనిరోధక వ్యవస్థను పరిరక్షించుకోవాలి. వన్యప్రాణులు, పెంపుడు జంతువులు, మనుషుల్లో 'మైక్రోబియల్ సర్వైలెన్స్'ను పటిష్ట పరచాలి. కబేళాల్లో బయోసేఫ్టీ ప్రొటోకాల్‌ను తప్పనిసరి చేయాలి.

– డాక్టర్ కె. శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు.

రాష్ట్రాన్ని ఎడారిలా మార్చేందుకు చంద్రబాబు కుట్ర

- ఆయన్ను చర్చలకు పిలవాలనే ప్రభుత్వ నిర్ణయం పనికిమాలిన చర్య : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణను ఎడారిగా మార్చేందుకు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కుట్రలు చేస్తున్నాడని మాజీమంత్రి జి.జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసిన ఏపీ.. గోదావరి జలాల్లోనూ అవే చర్యలకు పాల్పడుతోందన్నారు. తెలంగాణభవన్‌లో మంగళవారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబును చర్చలకు పిలవాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పనికిమాలిన చర్య అని, చర్చలతో తెలంగాణకు నష్టం జరుగుతుందని చెప్పారు. చర్చలకు బదులుగా అపెక్స్ కౌన్సిల్ భేటీ ఏర్పాటు కోసం కేంద్రాన్ని డిమాండ్ చేయాలన్నారు. గోదావరి నదీ జలాలు తెలంగాణకు బతుకుదెరువు అని, ఓ వర్గం మీడియా బనకచర్ల అంశాన్ని రాజకీయ పార్టీల పంచాయితీగా చూపే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. గోదావరి బనకచర్లపై అన్ని పార్టీలు తెలంగాణలో ఏకం కావాలన్నారు. 'చంద్రబాబు మాయలో మనం పడొద్దు. గోదావరి ట్రిబ్యునల్ ఏర్పాటు కాక మునుపే 200 టీఎంసీల జలాలపై హక్కు కోసం చంద్రబాబు ప్రయత్నిస్తున్నాడు. బీజేపీకి చంద్రబాబు అవసరం ఉండటంతో ఆ పార్టీ నేతలు మాట్లాడటం లేదు. బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించకపోతే అన్ని రాజకీయ పక్షాలను కలుపుకుని ఉద్యమిస్తాం'అని జగదీశ్‌రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, రవీంద్ర కుమార్, డాక్టర్ మెతుకు ఆనంద్, పార్టీ నేతలు ఒంటెద్దు నరసింహారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిజర్వేషన్ల బిల్లు ఆలస్యమైతే బీసీలకు అన్యాయం

- జూలై 17న రైలు వ్యవస్థను స్తంభింపచేసేలా రైల్‌రోకో: కవిత
- సీపీఎం, న్యూడెమోక్రసీ నేతలతో భేటీ



మీడియాతో మాట్లాడుతున్న కవిత. చిత్రంలో జాన్ వెస్లీ తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో జూలై 17న తాము నిర్వహించే రైల్ రోకోకు మద్దతునివ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వామపక్ష పార్టీలను కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, అడిక్‌మెట్‌లోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సాదినేని వెంకటేశ్వరరావు, జేవీ చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోవర్ధన్‌తో ఎమ్మెల్సీ కవిత మంగళవారం వేర్వేరుగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమతో కలిసి వచ్చే భావసారూప్య పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి రైల్‌రోకో చేపడుతున్నట్టు వెల్లడించారు. బిల్లుల ఆమోదం ఆలస్యమయ్యే కొద్దీ బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు

అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి : జాన్‌వెస్లీ

బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపైనే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేస్తున్న ఉద్యమాలకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ఈ భేటీల్లో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, యూపీఎఫ్ కోఆర్డినేటర్ ఆలకుంట హరి తదితరులు పాల్గొన్నారు.

13 మంది ఇంజనీర్లకు అదనపు బాధ్యతలు

- ఇరిగేషన్ శాఖలో ఉద్యోగ విరమణల నేపథ్యంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న 13 మంది ఇంజనీర్ల స్థానంలో వేరే వారికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ సీఈ ఆర్.మధుసూదన్‌రావుకు కరీంనగర్ సీఈగా, మహబూబ్‌నగర్ ఇన్‌చార్జ్ ఎస్ఈ ఎల్.చక్రధరంకు మహబూబ్‌నగర్ సీఈగా, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) ఎస్ఈ ఎం.సత్యనారాయణరెడ్డికి అదేవిభాగం సీఈగా, భువనగిరి ఎస్ఈ వి.శ్రీనివాస్‌కు గజ్వేల్ సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరితోపాటు మరికొందరికి ఎస్ఈలు, ఈఈలుగా అదనపు బాధ్యతలు ఇచ్చారు.

మేడిగడ్డ ఈఈపై చర్యలు

మహదేవ్‌పూర్ డివిజన్–2 ఈఈగా అదనపు బాధ్యతల నుంచి డివిజన్–1 ఈఈ సీహెచ్. తిరుపతిరావును తప్పించారు. ఆయన స్థానంలో డీఈఈ వి.సూర్యప్రకాశ్‌కు డివిజన్–2 ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మేడిగడ్డ బరాజ్ నిర్మాణం పూర్తికాక ముందే పూర్తయినట్టు ధ్రువీకరిస్తూ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీకి వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్లను సీహెచ్.తిరుపతిరావు జారీ చేయడంతో ఆయనపై క్రిమినల్ చర్యలను చేపట్టాలని విజిలెన్స్ విభాగం ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో ఇటీవల ప్రభుత్వం ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో అదనపు బాధ్యతల నుంచి తిరుపతిరావును తప్పించింది.

డిప్యూటీ ఈఎన్‌సీకి మరో కీలక పోస్టు

నీటిపారుదల శాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ ఈఎన్‌సీ కె.శ్రీనివాస్‌కు ప్రభుత్వం మరో కీలకమైన పోస్టుకు సంబంధించి అదనపు బాధ్యతలు అప్పగించింది. సచివాలయంలోని నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి కార్యాలయంలో సంయుక్త కార్యదర్శి (టెక్నికల్)గా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాహుల్‌బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు.

'పద్మశ్రీ' ఎంఆర్ రాజు కన్నుమూత



కాళ్ల: న్యూక్లియర్ ఫిజిక్స్ శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ముదుండి రామకృష్ణంరాజు(95) మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ చేసిన ఆయన స్వామి జ్ఞానానంద శిష్యుడు. అమెరికాలోని లాస్ ఆల్మాస్ డిఫెన్స్ లేబరేటరీలో శాస్త్రవేత్తగా పనిచేశారు. అనంతరం దేశంలో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను అందించే లక్ష్యంతో పెద అమిరంలో మహాత్మా గాంధీ ట్రస్ట్ ఏర్పాటు చేసి క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు సేవలందించారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 2006లో పెద అమిరంలోని ట్రస్ట్ సందర్శించి ఎం.ఆర్ రాజు సేవలను కొనియాడారు. అటామిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్ డాక్టర్ అనిల్ కకోద్కర్ సైతం ట్రస్ట్‌ను సందర్శించి అభినందించారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా 2013లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి, గాంధీ స్మారక నిధి 2024లో గాంధీ శాంతి పురస్కారం అందించాయి. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

ఆలయాల పాలన ఇతర అధికారులకు..!

- డిప్యుటేషన్‌పై రెవెన్యూయేతర అధికారులకు ఆలయాల బాధ్యత అప్పగించిన సర్కారు
- డిప్యూటీ కమిషనర్ సహా 74 పోస్టుల తక్షణ భర్తీకి అనుమతి
- దేవాదాయశాఖలో పదోన్నతుల్లేక భారీగా ఖాళీలు ఉండటంతోనే..
- ఆలయాల ఉద్యోగుల ఆగ్రహం.. విధులు బహిష్కరిస్తామని హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: దేవాలయాల పాలనావ్యవహారాలను పర్యవేక్షించే ఆలయ కార్యనిర్వహణాధికారుల కుర్చీల్లో దేవాదాయ శాఖతో సంబంధం లేని ఇతర శాఖల అధికారులు కూర్చోబోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. ప్రస్తుతం ఒక డిప్యూటీ కమిషనర్, 6 సహాయ కమిషనర్ పోస్టులు, 6 గ్రేడ్–1 కార్యనిర్వహణాధికారులు, 61 గ్రేడ్–3 కార్యనిర్వహణాధికారుల పోస్టులను తక్షణం ఇతర శాఖల అధికారులకు అప్పగించనుంది. అయితే ఈ వ్యవహారం దేవాదాయ శాఖను కుదిపేస్తోంది. గతంలో రెవెన్యూ శాఖలోని ఆర్డీఓలు, అంతకంటే పైస్థాయి అధికారులను యాదగిరిగుట్ట, భద్రాచలం, వేములవాడ దేవాలయాల కార్యనిర్వహణాధికారులుగా నియమించిన ఉదంతాలు ఉన్నాయి తప్ప ఇతర శాఖల అధికారులను ఈఓలుగా నియమించిన దాఖలాలు లేవు. ఇప్పుడు ఒకేసారి ఐదు ఇతర శాఖల ఉద్యోగులకు దేవాలయాల నిర్వహణ బాధ్యత అప్పగించడాన్ని దేవాదాయశాఖ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వారు విధుల్లో చేరితే తాము విధులు బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు. సొంత శాఖలో పదోన్నతుల వ్యవహారం అస్తవ్యస్తంగా మారడంతో దేవాలయాల్లో పోస్టులు ఖాళీగా కనిపిస్తున్నాయి. దాన్ని పరిష్కరించి పదోన్నతుల ద్వారా ప్రధాన పోస్టులను భర్తీ చేయకుండా ఇలా దేవాలయాలను ఇతర శాఖలకు అప్పగించడం దుమారం రేపుతోంది. అన్నీ కలిపి దేవాదాయశాఖలో ప్రస్తుతం 3 వేల వరకు ఖాళీలున్నాయి.

2011 నుంచి నిలిచిన పదోన్నతులు


దేవాదాయ శాఖలో పదోన్నతుల వ్యవహారం గందరగోళంగా మారింది. 2011 నుంచి ఆ శాఖలో పదోన్నతులు ఇవ్వడం లేదు. గతంలో ఆ శాఖలోని మఫిసిల్ ఉద్యోగులు సూపరింటెండెంట్ పదోన్నతులు పొంది దేవాలయాల్లో ఈఓలుగా నియమితులవడాన్ని రెగ్యులర్ దేవాలయ ఉద్యోగులు వ్యతిరేకిస్తూ పరిపాలనా ట్రిబ్యునల్‌లో కేసువేశారు. వారికి అనుకూలంగా తీర్పు రావడంతో మఫిసిల్ ఉద్యోగుల పక్షాన మరో అధికారి హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. తర్వాత హైకోర్టు కూడా సానుకూల తీర్పు ఇస్తూ మఫిసిల్ ఖాళీల ఆధారంగా పదోన్నతులు కల్పించేలా పదోన్నతుల అంశాన్ని సమీక్షించాలని కమిషనర్‌ను ఆదేశించింది. దానికి వీలుగా ప్రభుత్వం గతేడాది ఉత్తర్వు కూడా జారీ చేసింది. కానీ అది అమలు కాకుండా కొందరు అధికారులు చక్రం తిప్పడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

ఆలయాల ఉద్యోగుల పోరుబాట

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై దేవాలయ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను పట్టించుకోకుండా ముందుకు వెళ్తే న్యాయ పోరాటం చేయాలా లేక పెన్‌డౌన్ సమ్మెకు దిగాలా అనే విషయమై దేవాదాయశాఖ ఉద్యోగుల జేఏసీ నిర్ణయం తీసుకోనుంది.

గొళ్లెం వేసితిరి.. తాళం మరిచితిరి..

- ఆదిలాబాద్‌లో ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది నిర్వాకం
- పెట్రోలింగ్‌లో గుర్తించిన పోలీసులు



బ్యాంకు షట్టర్‌కు తాళం వేయని దృశ్యం



ప్రధాన ద్వారానికి తాళం వేయని దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లే క్రమంలో తాళం వేశామా లేదా అని ఒకటికి రెండుసార్లు చూసుకుంటారు. లక్షల్లో డబ్బు, లాకర్లో భారీగా బంగారం ఉండే బ్యాంకుకు తాళాలు వేశామా లేదా అనేది సిబ్బంది నుంచి అధికారి వరకు తనిఖీ చేయాలి. ఏం జరిగిందో తెలియదు గానీ బ్యాంకుకు లాక్ వేయడమే మరిచారు. పెట్రోలింగ్‌లో పోలీసులు ఈ విషయాన్ని గుర్తించారు. మొదట దొంగలు పడ్డారేమోనని హైరానా చెందారు. తీరా సిబ్బందిని పిలిచి విషయం ఆరా తీస్తే అసలు తాళాలే వేయలేదని స్పష్టమైంది. ఈ ఘటన ఆదిలాబాద్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో ఎస్‌బీఐ ఉండగా, అధికారులు సోమవారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటిబాట పట్టారు. అయితే బ్యాంకు షట్టర్‌తోపాటు లోపల గదికి తాళం వేయాల్సి ఉండగా, ఆ విషయం మరిచిపోయారు. రోజూ మాదిరిగానే టూటౌన్ పోలీసులు జిల్లా కేంద్రంలోని పలు కార్యాలయాలు, బ్యాంకులను పరిశీలించారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో సిబ్బంది బ్యాంక్ షట్టర్‌కు తాళం వేయలేదనే విషయాన్ని గమనించారు. దీంతో బ్యాంకులో చోరీ జరిగిందేమోనని అనుకున్నారు. విషయాన్ని టూటౌన్ సీఐ దృష్టికి తీసుకెళ్లారు. సీఐ పోలీసు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. బ్యాంకు అధికారులకు సమాచారం అందించడంతో మేనేజర్ 3.30 గంటల ప్రాంతంలో వచ్చారు. లోపలకు వెళ్లి సీసీ కెమెరాలను పరిశీలించగా సిబ్బంది బ్యాంకుకు తాళమే వేయలేదనే విషయాన్ని గుర్తించి ఊపిరి పీల్చుకున్నారు.



భర్త నారాయణమూర్తితో సుధామూర్తి

దాంపత్య సుధలివి

ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి బిలియనీర్ మాత్రమే కాదు, చక్కటి కుటుంబ నిర్మాత కూడా. చదవడం, రాయడం పట్ల ఆమెకున్న మక్కువతోపాటు, ఇంటి అవసరాలు తీర్చడం, పిల్లలను పెంచడం, భర్త నారాయణ మూర్తికి సహకారం ఇవ్వడం వంటి వాటితో వృత్తిని, కుటుంబ జీవితాన్ని బాగా బ్యాలెన్స్ చేసుకున్నారు. వృత్తి జీవితంలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, కంప్లైంట్స్ లేకుండా కుటుంబం చక్కగా స్థిరపడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. దాంపత్య జీవితం విజయవంతమవ్వాలంటే భాగస్వాములు ఎలా ఉండాలో నాలుగు పదుల వైవాహిక జీవితం నుంచి ఆమె చెప్పిన ముఖ్యమైన విషయాలతో దాంపత్య సుధలివి!

వివాహం బ్యాలెన్స్ షీట్ కాదు

సమానత్వం ఆరోగ్యకరమైన సంబంధంలో కీలకమైన అంశం. అయితే, కొంతమంది జంటలు వివాహాన్ని ఒక ఒప్పందంగా భావిస్తారు. ప్రతి చర్యను ఫిఫ్టీ–ఫిఫ్టీ ప్రాతిపదికన జాగ్రత్తగా లెక్కిస్తారు. కఠినంగా ఉండే ఇలాంటి మనస్తత్వ సంబంధం సహజత్వాన్ని దెబ్బతీస్తుంది. అది ఒకరి బాధ్యతలను ఒకరు అర్థం చేసుకోవడం, ప్రేమగా నెరవేర్చడంలో చూపించాలి కానీ, కఠినమైన సమానత్వాన్ని కొనసాగించడంలో కాదు.

వివాహంలో పోటీ వద్దు

వివాహం అనేది ఇరు వ్యక్తుల ఏకత్వం కోసం. అంతేకానీ, యుద్ధభూమిగా ఉండకూడదు. భాగస్వాముల మధ్య పోటీ, సంఘర్షణ, ఆగ్రహానికి దారితీస్తుంది. జీవితం అభివృద్ధి చెందుతున్న కొద్దీ, జంట కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారాలి. ఒకరి ప్రాధాన్యతలను మరొకరు గౌరవించుకోవాలి. ఇద్దరూ కలిసి సాధించాల్సిన విజయం కాబట్టి ఎవరు గొప్పో తేల్చుకోనక్కరలేదు.

భాగస్వామ్య లక్ష్యాలు సంబంధాలను బలోపేతం చేస్తాయి

ప్రతి జంట తమ కుటుంబ లక్ష్యాల కోసం కలిసి పనిచేయాలి. వారు ఏం సాధించాలనుకుంటున్నారు, తమ భవిష్యత్తును ఎలా ఊహించుకుంటున్నారు... అనేవి ఇద్దరి మధ్య స్వేచ్ఛగా, నిజాయితీగా అభిప్రాయాలను వ్యక్తపరచగల వాతావరణం ఉండాలి. అప్పుడే ఆ సంబంధంలో పరస్పర గౌరవం ఏర్పడి, బంధం మధ్య స్పష్టతను పెంచుతుంది.

సమస్యలను విస్మరించవద్దు

వివాహ బంధంలో సమస్యలు వస్తున్నప్పుడు వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించుకోవాలి. అదే సమయంలో సమస్య మరింత కఠినంగా మారకుండా చూసుకోవడమూ ముఖ్యమే. సరిచేయడానికి భాగస్వాములిద్దరూ చొరవ తీసుకోవాలి. కౌన్సెలింగ్ తీసుకోవడాన్ని ఎప్పుడూ చిన్న చూపుగానో, బలహీనతగానో చూడకూడదు. తమ బంధాన్ని నిలుపుకునేందుకు, నిబద్ధతకు సంకేతం కూడా. కొన్నిసార్లు బయటకు చెప్పని భావోద్వేగాలను నిపుణుల సహాయంతో వెలిబుచ్చడం వల్ల దంపతుల మధ్య స్పష్టతకు వీలు కల్పిస్తుంది.

కమ్యూనికేషన్ చాలా అవసరం

ప్రతి వ్యక్తి భాగస్వామి తనను అర్థం చేసుకోవాలని, శ్రద్ధ వహించాలని కోరుకుంటాడు. ఇది సహజమే అయినప్పటికీ, జీవితపు ఒత్తిళ్లు కుదురుగా ఉండనివ్వవు. మీ భాగస్వామి మనస్సును చదవడం అంత సులభం ఏ కాదు. ఏదీ బయటకు వ్యక్తపరచనప్పుడు మరింత కష్టంగా కూడా ఉండవచ్చు. అందుకే స్పష్టమైన, నిజాయితీగల కమ్యూనికేషన్ చాలా అవసరం.

వైవాహిక సమస్యలకు సంతానం పరిష్కారం కాదు

పిల్లల పుట్టుకతో సమస్యాత్మకమైన వివాహం సరిదిద్దబడుతుందని చాలామంది నమ్ముతారు. 'ఒక బిడ్డ పుడితే వాళ్లే సరిదిద్దుకుంటారు' అనుకుంటారు. కానీ ఇది ఒక పెద్ద అపోహ. బలమైన సంబంధంలోనే బిడ్డ ప్రేమను పెంచుకోగలడు. కానీ పుట్టిన బిడ్డ విచ్ఛిన్నమైన వైవాహిక సంబంధాన్ని సరిదిద్దలేదు. తల్లిదండ్రులుగా ఉండటం ఆనందాన్ని కలిగించాలంటే, భాగస్వాములిద్దరూ సమన్వయం చేసుకోవాలి. నిబద్ధతతో ఉండాలి. భాగస్వామికి అవసరమైన సమయాన్ని ఇవ్వడానికి, అభివృద్ధికి కృషి చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి.

ఒకరి ఆసక్తులను ఒకరు గౌరవించుకోవాలి

సుమారు 60 శాతం మంది ప్రజలు ఉమ్మడి ఆసక్తులు ఆరోగ్యకరమైన సంబంధానికి దోహదం చేస్తాయని నమ్ముతారు. ఒకే తరహా అభిరుచులు ఉంటే కొంత వరకు సహాయపడగలవు. నిజానికి ఒకరి అభిరుచులను మరొకరు గౌరవించాలి. ఆసక్తులు భిన్నంగా ఉన్నప్పటికీ, వాటిని ఎగతాళి చేయడం లేదా తోసిపుచ్చడం సంబంధానికి హాని కలిగిస్తాయి. మీ భాగస్వామి తనకు ఇష్టమైన విషయాలను మీతో పంచుకున్నప్పుడు ఆసక్తిగా వినాలి. దీని వల్ల మీ భాగస్వామికి తమ పట్ల శ్రద్ధ చూపుతున్నారనే విషయం అర్థం అవుతుంది. మద్దతు ఇవ్వడం అంటే ఒప్పందం మాత్రమే కాదు, ఇది వాగ్దానం కూడా.

సహానుభూతి శక్తిమంతమైన సాధనం

చర్చలు, వాదోపవాదాలు సమస్యలను చాలా వరకు పరిష్కరిస్తాయి. అయితే, దీనికి బదులుగా మీ భాగస్వామి చెప్పుల్లో మీ కాళ్లు పెట్టి వారి దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. సానుభూతి అనేది దీర్ఘకాలిక, అర్థవంతమైన బంధాన్ని పెంపొందించగల శక్తిమంతమైన సాధనం. ప్రతి సంబంధంలో విభేదాలు ఉంటాయి. కానీ, సహనం, సానుభూతి వల్లే సంబంధం నిలబడుతుంది.



ఫస్ట్ టైమ్

జెమ్ జెన్నీ

కొన్ని విజయాలు వ్యక్తిగత విజయాలు మాత్రమే కాదు. ఎంతోమందికి ధైర్యాన్ని, స్ఫూర్తిని ఇచ్చే విజయాలు. 'జీవితం అంటే నిత్య నరకం' అనుకున్న నిరాశామయ, నిస్సహాయ స్థితిలోనూ 'విద్య' అనే ఆయుధాన్ని నమ్ముకుంది ఎస్.జెన్నీ. ఆ ఆయుధం తనకు ఆత్మస్థైర్యాన్ని ఇచ్చింది. దేశంలో ఆంగ్లభాషా విభాగంలో డాక్టరేట్ అందుకున్న, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం అయిన తొలి ట్రాన్స్‌జెండర్‌గా అరుదైన గుర్తింపు తెచ్చుకునేలా చేసింది...

బాల్యం ఎవరికైనా వరం. స్వర్గం. ఒక దశ వరకు ఆ అబ్బాయి స్వర్గంలోనే ఉన్నాడు. క్రమంగా ఆ అబ్బాయి మాటతీరు, నడక తీరులో మార్పులు కనిపించాయి. అవి కొని తెచ్చుకున్న మార్పులు కాదు. అయినప్పటికీ ఆ బాలుడి తల్లిదండ్రులకు బొత్తిగా నచ్చలేదు.

'అలా మాట్లాడుతున్నవేమిటి?'

'అలా నడుస్తున్నావేమిటి!'... ఇలా రకరకాలుగా తిట్టేవాళ్లు.

ఇక స్కూల్లో నిత్యనరకం.

తోటి పిల్లల నుంచి ఉపాధ్యాయుల వరకు ఎవరో ఒకరు ఏదో ఒక కామెంట్ చేసి ఏడిపిస్తూనే ఉండేవారు. ఒకానొక సమయంలో బడికి వెళ్లాలంటే భయపడే పరిస్థితి వచ్చింది. 'బడికి వెళ్లేది పాఠాలు వినడానికా! అవమానాలపాలు కావడానికా!' అని మనసు ప్రశ్నించింది.

అంతా చీకట్లోనూ ఒక ఆశాకిరణం కనిపించింది. ఆ వెలుగు పేరు... చదువు.

ఆ వెలుగు దారిలో ఆ బాలుడి నడక ప్రారంభమైంది. అప్పటి ఆ బాలుడే... నేటి జెన్నీ.

తమిళనాడులోని తిరుత్తణికి చెందిన జెన్నీ చెన్నైలోని అంబేద్కర్ ఆర్ట్స్ కాలేజీలో ఎం.ఏ., ఎం.ఫిల్.లో గోల్డ్‌మెడల్ సాధించింది. ఆ బంగారు పతకాలు తన ఆత్మవిశ్వాసాన్ని మరోస్థాయికి తీసుకువెళ్లాయి. ఇంకా ఏదో సాధించాలి అనే తపనను పెంచాయి.

చెన్నై లయోలా కాలేజీలో ఆంగ్ల భాషా విభాగంలో డాక్టరేట్ అందుకొని, అదే కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం అయ్యింది.

'ఇది నా విజయం కాదు. మా ట్రాన్స్ కమ్యూనిటీ విజయం. నేను ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో బాధలు పడ్డాను. ఎన్నో కష్టాలూ అనుభవించాను. అయితే... చదువు మనుషుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. ధైర్యాన్ని ఇచ్చి విజయాలు సాధించేలా చేస్తుంది' అంటుంది జెన్నీ.

> **ఎందుకు ఆమోదించడం లేదు?**
>
> ట్రాన్స్‌జెండర్‌లను చిన్నచూపు చూడకూడదు. అవమానాలు తట్టుకోలేక ఇంటినుంచి పారిపోయేలా చేయకూడదు. వారిని చదువుకు దగ్గర చేస్తే తమను తాము నిరూపించుకోగలరు. అందుకు నేనే సాక్ష్యం. యూజీ, ఎం.ఏ.లో నేను గోల్డ్‌మెడలిస్ట్. మొదట్లో ఎలా ఉన్నా నేను ఈ స్థితికి రావడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంది. ప్రకృతిని అందరూ ఆమోదిస్తున్నప్పుడు ఆ ప్రకృతిలో భాగమైన మమ్మల్ని మాత్రం ఎందుకు ఆమోదించడం లేదు?
>
> – జెన్నీ

● కిచెన్ టిప్స్

- స్టీల్‌పాత్రలు వెలిసిపోయి పాతపడినట్లుగా అనిపిస్తే... అయిపోయిన టూత్‌పేస్టు ట్యూబ్‌ని ముక్కలుగా కత్తిరించి, లోపల ఉన్న కొద్దిపాటి పేస్టుని స్టీలు పాత్రకు రాసి టూత్ బ్రష్‌తో రుద్దాలి. రెండు చుక్కలు నీళ్లు వేసి రుద్ది, వస్త్రంతో తుడిస్తే కొత్తవాటిలా తళతళా మెరుస్తాయి. వెండిసామాన్లు కూడా టూత్‌బ్రష్‌తో రుద్దితే మురికి అంతా పోయి కొత్తవాటిలా కనిపిస్తాయి.
- మిరియాలు, ఉల్లిపాయ, వెల్లుల్లి పాయలను సమపాళ్లల్లో తీసుకుని కొద్దిగా నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరువాత మిశ్రమాన్ని వడగట్టి స్ప్రే బాటిల్‌లో వేయాలి. ఈ మిశ్రమాన్ని బల్లులున్న ప్రాంతంలో స్ప్రే చేస్తే ఘాటు వాసనకు బల్లులు పారిపోతాయి.
- డ్రెస్సింగ్ టేబుల్ మిర్రర్, చిన్న అద్దాలు మురికి పట్టి సరిగా కనిపించకపోతే కొద్దిగా టూత్‌పేస్టు వేసి రుద్ది, వస్త్రంతో తుడిస్తే దుమ్మూధూళి, మరకలు పోయి అద్దం స్పష్టంగా కనిపిస్తుంది.



బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 24న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,310
బంగారం (22 క్యారెట్లు)	91,690
వెండి	1,07,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,01,170
బంగారం (22 క్యారెట్లు)	91,550
వెండి	1,09,500
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,220
బంగారం (22 క్యారెట్లు)	90,950
వెండి	1,19,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,01,170
బంగారం (22 క్యారెట్లు)	94,300
వెండి	1,09,500
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,800
బంగారం (22 క్యారెట్లు)	89,980
వెండి	1,06,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,870
బంగారం (22 క్యారెట్లు)	91,550
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● పోస్ట్-రిటైర్‌మెంట్

దారి చూపిన డ్రాగన్



ఉపాధ్యాయురాలిగా పనిచేసే రెమబాయి రిటైర్ అయ్యారు. అదే సమయంలో తల్లి చనిపోయారు. ఏదో శూన్యం ఆవరించినట్లు అనిపించింది. ఇంట్లో ఖాళీగా కూర్చుంటే ఏవేవో ఆలోచనలు వస్తుంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టారు కేరళలోని కొల్లమ్‌కు చెందిన రెమబాయి. ఆమెకు అర ఎకరం కూడా వ్యవసాయ భూమి లేదు. ఇంటి టెర్రస్‌నే సాగుభూమిగా మార్చుకున్నారు.

'వ్యవసాయ భూముల్లో కాకుండా టెర్రస్‌పై డ్రాగన్ ఫ్రూట్స్ పండించడం చాలా కష్టం' అనే మాటను సవాలుగా తీసుకున్నాకే సాయిల్‌లెస్ ప్లాంటింగ్ మెథడ్‌తో ముందుకు వెళ్లారు. కూరగాయల వ్యర్థాలు, ఎండుటాకులు... మొదలైన వాటితో సేంద్రియ ఎరువులు స్వయంగా తయారు చేసుకున్నారు.

డ్రాగన్ ఫ్రూట్‌ల ఆరోగ్య ప్రయోజనాల గురించి అప్పుడెప్పుడో విన్న రెమబాయి వాటిని పండించాలనుకున్నారు. రిటైర్‌మెంట్ తరువాత తన కలను నిజం చేసుకున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌ల ద్వారా నెలకు లక్ష రూపాయల వరకు ఆర్జించడం విశేషం!

డ్రాగన్ ఫ్రూట్ సాగులో తన అనుభవాలను పంచుకోవడానికి 'జెసీ వరల్డ్' అనే యూట్యూబ్ ఛానల్ కూడా ప్రారంభించారు రెమబాయి.

ఆమె విజయ రహస్యం ఏమిటి?

'నా వయసు 58 సంవత్సరాలు. అయితే ఎప్పుడూ 20 ఏళ్ల వయసులాగే ఫీలవుతాను' అంటూ తన విజయ రహస్యాన్ని చెప్పకనే చెప్పారు రెమబాయి.

● స్టడీ

రియాలిటీ



మన దేశంలో రియల్ ఎస్టేట్ రంగం 2030 నాటికి లక్ష కోట్లకు చేరుతుందని అంచనా. ఈ రంగంలో మహిళల భాగస్వామ్యం క్రమంగా పెరుగుతోంది. అయితే కొన్ని నివేదికల ప్రకారం ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో వివిధ రూపాల్లో మహిళల ప్రాతినిధ్యం 11–12 శాతం మాత్రమే. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్'కు చెందిన మహిళా విభాగం రియల్ ఎస్టేట్‌రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి కృషి చేస్తోంది.

'వికసిత్ భారత్ 2047 విజన్'పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

డిజైన్, ప్లానింగ్, సైట్ సూపర్‌విజన్, ఫైనాన్సింగ్‌కు సంబంధించి రియల్‌ఎస్టేట్ రంగంలో ముఖ్యపాత్ర పోషించే దిశలో మహిళలను ప్రోత్సహిస్తోంది.

ఫార్మల్ ట్రైనింగ్ ప్లాన్స్, డిజిటల్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌ల ద్వారా సైట్ ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్ ప్లానింగ్‌లలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే లక్ష్యంతో పనిచేస్తోంది 'నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్'కు చెందిన మహిళా విభాగం.

అమ్మానాన్నల హక్కు కాదు

లీగల్



ఉద్యోగం పురుష లక్షణం.. నాన్న సంపాదిస్తాడు. అమ్మ ఇంటిల్లిపాది అవసరాలను చూసుకుంటుంది. అమ్మ, నాన్న అనగానే ఇంచుమించు ఈ భావనలే కలుగుతాయి అందరిలో! ఒకవేళ స్త్రీ ఉద్యోగి అయినా.. ఇంటిపని, వంట పని బాధ్యత కూడా ఆమెదే! ఇందులో పురుషుడి భాగస్వామ్యం ఏమీ ఉండదు. కుటుంబ సభ్యుడిగా అది అతని బాధ్యత కూడా కదా.. అనే భావన సమాజానికి రాదు. అది అతని పని కాదనే జడ్జిమెంట్‌తోనే ఉంటాం. బహుశా దీని ఆధారంగానే కావచ్చు సుప్రీంకోర్టు ఇటీవల ఒక తీర్పునిచ్చింది. ఆ కథేంటంటే..

కేరళకు చెందిన ఒక వ్యక్తి సింగపూర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి ఎనిమిదేళ్ల కూతురు, మూడేళ్ల కొడుకు ఉన్నారు. భార్యతో విడాకులు అయ్యాయి. నెలలో పదిహేను రోజులు కూతురి కస్టడీని తండ్రికి ఇచ్చింది కేరళ హైకోర్టు. కూతురి కోసం ఆ తండ్రి తిరువనంతపురంలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని, నెలలో పదిహేనురోజులు కూతురి దగ్గర ఉండేవాడు. అయితే తల్లి దాన్ని సవాలు చేస్తూ పూర్తి కస్టడీ తనకే ఇవ్వాలని సుప్రీంకోర్టుకు వెళ్లింది. తండ్రిని విచారించిన సుప్రీంకోర్టు.. అతను తన బిడ్డకు ఇంట్లో వండిన రుచి, శుచికరమైన భోజనాన్ని అందించలేకపోతున్నాడని, ఆ అమ్మాయి తన మూడేళ్ల తమ్ముడికి దూరమవుతోందని, ఆ ఇంట్లో ఆమెకు తండ్రి తప్ప వేరే కుటుంబ సభ్యుల ప్రేమానురాగాలు, తోడు, అండ లాంటివేమీ లేవని.. ఇవన్నీ ఆ అమ్మాయి శారీరక, మానసిక ఆరోగ్యం మీద ప్రభావం చూపించి ఆమె పెరుగుదల కుంటుపడే ప్రమాదం ఉందని తండ్రికి ఇంటెరిమ్ కస్టడీని ఆదేశించింది. కూతురిని ఆ తండ్రి ఆల్టర్నేటివ్ వీకెండ్స్‌లో కలుసుకోవచ్చు. వారానికి రెండుసార్లు పిల్లలిద్దరితో వీడియోకాల్ మాట్లాడుకోవచ్చని చెప్పింది. ఎనిమిదేళ్ల వయసులో పిల్లలకు ఇంట్లో వండిన శుభ్రమైన ఆహారం, కుటుంబ వాతావరణం, తన ఈడు పిల్లల సహవాసం, ఇతర కుటుంబ సభ్యుల సాంగత్యం చాలా అవసరమని.. ఇవన్నీ పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడేవనీ ఆ తీర్పులో సుప్రీంకోర్టు పేర్కొన్నది.

> **అస్త్రంగా మారే ప్రమాదం**
>
> తండ్రి దగ్గర పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు కావల్సిన ఆహారం మొదలు సరైన కుటుంబ పరిస్థితులూ లేవంటూ పిల్లల కస్టడీని తిరస్కరించిన సుప్రీంకోర్టు తీర్పు ఆ కేస్ వరకు సమంజసమే. అయితే ఇది కొందరి చేతిలో అస్త్రంగా మారే ప్రమాదం ఉంది. గతంలో సుప్రీంకోర్టు తల్లిదండ్రులిద్దరి ప్రేమకు పిల్లలు అర్హులు. భార్యాభర్తలు విడిపోయినా పిల్లలకు మాత్రం ఇద్దరితోనూ సాన్నిహిత్యం కొనసాగేలా చర్యలు తీసుకోవాలంటూ ఇచ్చిన అనేక తీర్పులకిది భిన్నంగా ఉంది. అంతేకాదు స్త్రీ పురుషుల మధ్య భేదాలు, వారి అలవాట్లు, ఏయే పనులు ఎవరు చేయాలనే జెండర్ కోణంలో పితృస్వామ్య వ్యవస్థ స్థిరపరచిన పని విభజననూ బలపరుస్తున్నట్టుంది. అయితే పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎవరి దగ్గర సురక్షితంగా ఉంటారు, పిల్లలకు అవసరమైన వనరులు ఎవరి దగ్గర ఎక్కువగా ఉన్నాయి, వాళ్లు తమ తల్లిదండ్రులలో ఎవరితో ఎక్కువ అటాచ్‌మెంట్‌తో ఉన్నారనే అంశాలు చైల్డ్ కస్టడీ ఎవరికివ్వాలనే తీర్పును నిర్దేశిస్తాయి. ఒక్కమాటలో ఇది పిల్లల హక్కు – తల్లిదండ్రుల హక్కు కాదు!
>
> 
>
> – శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

నిజమే కానీ..

ఏ కుటుంబంలో అయినా తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికే పిల్లలు అత్యంత మాలిమిగా ఉంటారు. విడాకులు పొందిన అమ్మానాన్నల విషయంలోనూ ఇది వర్తిస్తుంది. తండ్రికి వంట రాకపోయినా.. అమ్మ అద్భుతంగా వంట చేసిపెట్టినా నాన్నంటేనే పిల్లలకు వల్లమాలిన ఇష్టం ఉండొచ్చు. ఏది కావాలని అడిగినా క్షణాల్లో కొనిపెట్టే తండ్రి కన్నా ఏమీ కొనివ్వలేని అమ్మ ఆదరణ పిల్లలకు కొండంత అండగా అనిపించొచ్చు. తీర్పు సమయంలో కోర్టు వీటినీ పరిగణనలోకి తీసుకోవాలి కదా అని కొంతమంది న్యాయవాదుల వాదన. దీనికి ఇటీవల 'వంట మనిషిని/పనిమనిషిని పెట్టుకుని పిల్లలను చూసుకోవడం తప్పేమీ కాదు' అంటూ తల్లి దగ్గర్నుంచి పిల్లల కస్టడీ తండ్రికి ఇవ్వడం కుదరదని ముంబై హైకోర్టు ఇచ్చిన తీర్పును ఉదాహరణగా చూపిస్తున్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు.. కేరళ హైకోర్టు తీర్పును తిరస్కరిస్తూ ఇచ్చిన జడ్జిమెంట్‌లో తండ్రికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, ఇంట్లో ఎవరైనా పనివారిని పెట్టుకుని చూసుకోగలుగుతాడా లేదా అని చాన్స్‌ను ఇవ్వకపోవడం కరెక్ట్ కాదు అంటున్నారు.

హైదరాబాద్ హైకోర్టులో..

ఈమధ్యే హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టు ఇద్దరు చిన్నారుల కస్టడీని ఎన్నారై తండ్రికి ఇచ్చింది. తల్లికి కోపం ఎక్కువ, ఆర్థిక వనరులు లేవు కాబట్టి పిల్లలు తల్లి దగ్గర ఉండటం శ్రేయస్కరం కాదని, ఈ నిర్ణయం తీసుకుంది కోర్టు. తండ్రి దగ్గర నానమ్మ, తాతయ్య కూడా ఉండటం, వారితో చిన్నారులకు అనుబంధం ఉండటం ఈ కేసులో తండ్రి పక్షాన తీర్పు రావడానికి మరో కారణమైంది. కేరళ కేసులో పిల్లల కస్టడీ తల్లికే ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పులోనూ సుప్రీం కోర్టు తల్లికి సంబంధించి ఇలాగే ఆలోచించింది. ఆమె కూడా తల్లిదండ్రులతో కలిసి ఉంటోంది కాబట్టి వాళ్ల సంరక్షణ, ఆప్యాయతానురాగాలు ఆ పిల్లలకు అందుతాయని, పైగా తల్లి వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉండటం వల్ల రోజంతా పిల్లల్ని చూసుకోగలదని, పిల్లలకు ఇంటి భోజనం అందుతుందనే కారణాలన్నిటినీ పరిగణనలోకి తీసుకుంది. ఇంకో కేసులో.. తల్లి దగ్గరే పిల్లలున్నారు. తండ్రి ఆర్థికంగా ఉన్నవాడు. పిల్లల కస్టడీ తమకు కావాలంటే తమకు కావాలంటూ తల్లిదండ్రులిద్దరూ కేసులు వేశారు. ఇరువురి నేపథ్యాలూ పరిశీలించిన ఫ్యామిలీ కోర్టు పిల్లలు తల్లి దగ్గరే ఉండాలని తీర్పు ఇచ్చింది. పిల్లల అంగీకారంతో తండ్రి వీడియో కాల్‌లో మాట్లాడొచ్చని పేర్కొంది. ఆ పిల్లలకు పదేళ్లు నిండాయి. కనుక వాళ్లు చెప్పిన విషయాలను పరిగణించిన కోర్టు.. తండ్రి బాధ్యతారాహిత్యాన్ని ఎత్తిచూపుతూ పిల్లలు తండ్రి ఆధ్వర్యంలో ఉంటే చెడిపోయే ఆస్కారం ఉందని పేర్కొంది.

పైన చెప్పిన రెండు అంశాలను పరిశీలిస్తే.. పిల్లలు ఎక్కడ సురక్షితంగా ఉంటారన్న దాన్నే కోర్టులు పరిగణిస్తాయి తప్ప పిల్లలపై హక్కు ఎవరికి ఉందన్నదాన్ని కాదని అర్థమవుతోంది. ఎనిమిదేళ్లు నిండిన పిల్లలు తామెవరి దగ్గర ఉండాలనుకుంటున్నారో జడ్జికి ప్రైవేటుగా వినిపించవచ్చు. వారి మానసిక పరిస్థితిని అంచనా వేసి నిర్ణయం తీసుకుంటారు న్యాయమూర్తి.




నీరజ్ చోప్రాకు స్వర్ణ పతకం

ఒస్ట్రావా (చెక్ రిపబ్లిక్): భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా... ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. గతవారం పారిస్ డైమండ్ లీగ్ మీట్‌లో 'టాప్'లో నిలిచిన నీరజ్... మంగళవారం జరిగిన పోటీల్లో జావెలిన్‌ను 85.29 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానం దక్కించుకున్నాడు. నాలుగు రోజుల వ్యవధిలో నీరజ్‌కు ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఈ మీట్‌లో తొలిసారి బరిలోకి దిగిన నీరజ్ అందరికంటే మెరుగైన ప్రదర్శనతో విజేతగా నిలిచాడు. డౌ స్మిత్ (84.12 మీటర్లు; దక్షిణాఫ్రికా), అండర్సన్ పీటర్స్ (83.63 మీటర్లు; గ్రెనెడా) వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. తొలి ప్రయత్నంలో ఫౌల్ చేసిన నీరజ్... రెండో ప్రయత్నంలో ఈటెను 83.45 మీటర్ల దూరం విసిరాడు. మూడో ప్రయత్నంలో అత్యుత్తమంగా 85.29 మీటర్ల దూరాన్ని నమోదు చేసుకున్న భారత అథ్లెట్.. తర్వాతి ప్రయత్నాల్లో ఆకట్టుకోలేకపోయాడు. నీరజ్ కోచ్, చెక్ రిపబ్లిక్ గ్రేట్ అథ్లెట్ జాన్ జెలెజ్నీ గతంలో ఈ మీట్‌లో తొమ్మిదిసార్లు విజేతగా నిలిచాడు.

లీడ్స్ వదిలేశారు

తొలి టెస్టులో భారత్ పరాజయం



నిరాశలో భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్

తొలి రోజు నుంచే అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన... రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 835 పరుగులు... గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఐదు సెంచరీలు... బుమ్రా అద్భుత బౌలింగ్ ప్రదర్శన... అన్నీ సానుకూలతలే కనిపించినా... చివరకు ఓటమి మాత్రం తప్పలేదు. తొలి టెస్టుల్లో పలు సందర్భాల్లో ఆధిపత్యం ప్రదర్శించిన భారత్ తుది దశకు వచ్చేసరికి చేతులెత్తేసింది. గెలుపు కోసం చివరి రోజు 350 పరుగుల భారీ స్కోరు చేయాల్సిన ఇంగ్లండ్ మొదటి ఓవర్ నుంచే పరుగుల వేటలో పడింది. వ్యూహాత్మకంగా బుమ్రా బౌలింగ్‌లో సాహసం చేయని బ్యాటర్లు ఇతర బౌలర్లపై చెలరేగి జోరుగా సాగిపోయారు. తాము ఆశించిన రీతిలో 'బజ్‌బాల్' శైలిలో ఎక్కడా తగ్గకుండా 4.54 రన్‌రేట్‌తో దూసుకుపోయిన ఇంగ్లండ్ ఘన విజయాన్ని అందుకుంది. డకెట్ మెరుపు సెంచరీకి క్రాలీ అండగా నిలవగా... చివర్లో రూట్ కీలక అర్ధ సెంచరీతో జట్టును నడిపించాడు. తొలి టెస్టులో ఓటమి పక్షాన నిలిచిన కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ సిరీస్‌లో మున్ముందు ఎలాంటి ఫలితాలు రాబడతాడనేది చూడాలి.

- 5 వికెట్లతో నెగ్గిన ఇంగ్లండ్
- 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఆతిథ్య జట్టు
- డకెట్ సెంచరీ, రాణించిన రూట్
- జూలై 2 నుంచి రెండో టెస్టు

లీడ్స్: ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ పరాజయంతో మొదలు పెట్టింది. హెడింగ్లీ మైదానంలో మంగళవారం ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చివరి రోజు 21/0తో ఆటను మొదలు పెట్టిన ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 82 ఓవర్లలో 5 వికెట్లకు 373 పరుగులు చేసింది. బెన్ డకెట్ (170 బంతుల్లో 149; 21 ఫోర్లు, 1 సిక్స్), జాక్ క్రాలీ (126 బంతుల్లో 65; 7 ఫోర్లు) తొలి వికెట్‌కు 188 పరుగులు జోడించి బలమైన పునాది వేయగా... ఆఖర్లో జో రూట్ (84 బంతుల్లో 53 నాటౌట్; 6 ఫోర్లు), జేమీ స్మిత్ (55 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. రూట్, స్మిత్ ఆరో వికెట్‌కు అభేద్యంగా 71 పరుగులు జత చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌ పని పట్టిన స్టార్ పేసర్ బుమ్రా రెండో ఇన్నింగ్స్‌లో పరుగులు ఇవ్వకుండా కట్టడి చేయగలిగినా ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఇతర బౌలర్ల పేలవ ప్రదర్శన ఇంగ్లండ్‌కు గెలుపు అవకాశాలు సృష్టించింది. ఈ విజయంతో సిరీస్‌లో ఇంగ్లండ్ 1–0తో ముందంజ వేసింది. సిరీస్‌లో రెండో టెస్టు జూలై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లో జరుగుతుంది.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డకెట్ సెంచరీ అభివాదం

భారీ భాగస్వామ్యం...

ఇంగ్లండ్ ఓపెనర్లు క్రాలీ, డకెట్ చివరి రోజు ఆటను జాగ్రత్తగా మొదలు పెట్టారు. అయితే నిలదొక్కుకున్న తర్వాత వీరిద్దరు చక్కటి షాట్లతో ధాటిని పెంచారు. ఈ క్రమంలో ముందుగా 66 బంతుల్లో డకెట్ హాఫ్ సెంచరీ పూర్తయింది. 42 పరుగుల వద్ద క్రాలీ ఇచ్చిన కఠినమైన రిటర్న్ క్యాచ్‌ను అందుకోవడంలో బుమ్రా విఫలమయ్యాడు. లంచ్ వరకు కూడా ఇంగ్లండ్ ఓపెనింగ్ జోడీని విడదీయడంలో భారత్ విఫలమైంది. తొలి సెషన్‌లో ఇంగ్లండ్ 24 ఓవర్లలో 96 పరుగులు సాధించింది. విరామం తర్వాత 111 బంతుల్లో క్రాలీ హాఫ్ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాత వీరిద్దరు మరింత జోరుగా ఆడారు. 97 పరుగుల వద్ద డకెట్ ఇచ్చిన క్యాచ్ జైస్వాల్ వదిలేయడం కూడా జట్టుకు కలిసొచ్చింది. తర్వాతి ఓవర్లోనే డకెట్ 121 బంతుల్లో కెరీర్‌లో ఆరో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత స్వల్ప వర్షం కారణంగా దాదాపు ఇరవై నిమిషాల పాటు ఆటకు అంతరాయం కలిగింది.

గెలిపించిన రూట్, స్మిత్...

వాన ఆగిన తర్వాత భారత్‌కు సానుకూల ఫలితం వచ్చింది. ఎట్టకేలకు క్రాలీని అవుట్ చేసి భారత్‌కు తొలి వికెట్ అందించిన ప్రసిధ్... తన తర్వాతి ఓవర్లోనే ఒలీ పోప్ (8)ను కూడా పెవిలియన్ పంపించాడు. ఈ దశలో డకెట్, రూట్ మళ్లీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేస్తూ మూడో వికెట్‌కు 47 పరుగులు జోడించారు. ఇంగ్లండ్ వేగంగా దూసుకుపోతున్న తరుణంలో శార్దుల్‌కు బంతి అప్పగించడం భారత్‌కు మేలు చేసింది. దూకుడుగా ఆడుతున్న డకెట్‌తో పాటు హ్యారీ బ్రూక్ (0)ను వరుస బంతుల్లో అవుట్ చేసి శార్దుల్ ఒక్కసారిగా టీమిండియా శిబిరంలో ఉత్సాహం నింపాడు. అయితే రూట్, బెన్ స్టోక్స్ (51 బంతుల్లో 33; 4 ఫోర్లు) కలిసి జట్టును విజయం దిశగా నడిపించారు. వీరిద్దరు 77 బంతుల్లో 49 పరుగులు జత చేశారు. అయితే జడేజా బౌలింగ్ పదే పదే రివర్స్ స్వీప్‌కు ప్రయత్నించిన స్టోక్స్ అదే షాట్ ఆడి నిష్క్రమించాడు. ఈ దశలో ఇంగ్లండ్ మరో 69 పరుగులు చేయాల్సి ఉండటంతో భారత బృందంలో కాస్త ఆశలు రేగాయి. అయితే అనుభవజ్ఞుడైన రూట్ అండగా యువ కీపర్ స్మిత్ ఒత్తిడిని అధిగమించి చక్కటి షాట్లు ఆడటంతో ఇంగ్లండ్ గెలుపునకు చేరువైంది. భారత్ కొత్త బంతిని తీసుకున్నా అప్పటికే ఆలస్యమైపోయింది. జడేజా ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన స్మిత్...అదే ఓవర్ చివరి బంతికి మరో సిక్స్ బాది మ్యాచ్‌ను ముగించాడు.



రూట్ గెలుపు సంబరం

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 471; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 465; **భారత్ రెండో ఇన్నింగ్స్:** 364; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలీ (సి) రాహుల్ (బి) ప్రసిధ్ 65; డకెట్ (సి) (సబ్) నితీశ్ రెడ్డి (బి) శార్దుల్ 149; పోప్ (బి) ప్రసిధ్ 8; రూట్ (నాటౌట్) 53; బ్రూక్ (సి) పంత్ (బి) శార్దుల్ 0; స్టోక్స్ (సి) గిల్ (బి) జడేజా 33; స్మిత్ (నాటౌట్) 44; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (82 ఓవర్లలో 5 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1–188, 2–206, 3–253, 4–253, 5–302. **బౌలింగ్:** బుమ్రా 19–3–57–0, సిరాజ్ 14–1–51–0, జడేజా 24–1–104–1, ప్రసిధ్ 15–0–92–2, శార్దుల్ 10–0–51–2.

5 ఒక టెస్టులో ఐదు సెంచరీలు నమోదు చేసిన తర్వాత కూడా ఓటమి పాలైన తొలి జట్టుగా భారత్ నిలిచింది.

2 టెస్టుల్లో ఇంగ్లండ్‌కు ఇది రెండో అతి పెద్ద ఛేదన. 2022లో భారత్‌పైనే బర్మింగ్‌హామ్‌లో 378 పరుగుల లక్ష్యాన్ని అందుకుంది.

6 హెడింగ్లీ మైదానంలో ఇంగ్లండ్ వరుసగా ఆరో టెస్టు గెలిచింది. ఈ ఆరు సార్లు జట్టు లక్ష్యాలను ఛేదించడం విశేషం.

3 టెస్టు మ్యాచ్ నాలుగు ఇన్నింగ్స్‌లలోనూ 350కు పైగా స్కోర్లు నమోదు కావడం ఇది మూడోసారి మాత్రమే.

1673 భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఒకే టెస్టులో నమోదైన మొత్తం పరుగులు. ఈ రెండు జట్ల మధ్య ఇదే అత్యధికం.

> టెస్టు మ్యాచ్ అద్భుతంగా సాగింది. మాకూ మంచి అవకాశాలు వచ్చాయి. అయితే క్యాచ్‌లు వదిలేయడం, లోయర్ ఆర్డర్‌లో ఎక్కువ పరుగులు చేయలేకపోవడం ఓటమికి కారణాలు. నాలుగో రోజు కూడా కనీసం 430 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించాలని అనుకున్నాం. అయితే 25 పరుగులకే చివర్లో వరుసగా వికెట్లు పడటంతో అది సాధ్యం కాలేదు. ఈ రోజు కూడా తొలి వికెట్ తీసిన తర్వాత మాకు మంచి అవకాశం ఉందనిపించింది. కానీ అది జరగలేదు. తొలి సెషన్‌లో మేం బాగానే బౌలింగ్ చేసి వారిని నియంత్రించగలిగినా ఒక్కసారి బంతి పాతబడిన తర్వాత ఏమీ చేయలేకపోయాం. అలాంటి స్థితిలోనూ వికెట్లు తీయడం అవసరం. జడేజా చాలా బాగా బౌలింగ్ చేసి మంచి అవకాశాలు సృష్టించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో అనూహ్యంగా కుప్పకూలడంపై ఇప్పటికే చర్చించాం. ఈ తప్పును మేం మున్ముందు సరిదిద్దుకోవాలి. ఇలాంటి పిచ్‌పై అవకాశాలు అంత సులువుగా రావు. వాటిని వృథా చేసుకోవద్దు. అయితే మాది యువ జట్టు. నేర్చుకునే దశలో ఉంది. మరింత మెరుగవుతాం. బుమ్రా మిగిలిన టెస్టుల్లో ఏవి ఆడతాడో ఇప్పుడే చెప్పలేం. దానికి తగినంత సమయం ఉంది.
> – గిల్, భారత కెప్టెన్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

జై శివనాయకీ...



బేబీ శ్రీరామ్ దిత్య, లయ

'జై బగళాముఖీ, జై శివనాయకీ, జై వనరూపిణీ, జై జయకారిణీ, విద్రుమ రూపిణి, విభ్రమకారిణీ, గగనచత్ర వింధ్యాచలవాసిని....' అంటూ సాగుతుంది 'తమ్ముడు' సినిమాలోని 'జై బగళాముఖీ' పాట. నితిన్ హీరోగా నటించిన చిత్రం ఇది. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమీ గౌడ, స్వసికా విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. శ్రీరామ్ వేణు దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జూలై 4న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'జై బగళాముఖీ...' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''కొండ కోనలందుండి కోటి బ్రహ్మాండములేలే శివనారీ... గుండె గుండెలో అఖండ జ్యోతిగ వెలుగుచుండు ఓంకారి' అంటూ ఈ పాట సాగుతుంది. సంగీతదర్శకుడు అజనీష్ లోకనాథ్ నేతృత్వంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు సాహిత్యం అందించిన ఈ పాటను వి. అబ్బి ఆలపించారు. ''శక్తి స్వరూపిణి అయిన అమ్మ వారి మహిమను కీర్తిస్తూ సినిమాలో జరుపుకునే గ్రామ జాతర సందర్భంగా ఈ పాట వస్తుంది'' అని యూనిట్ పేర్కొంది.

గంగూలీ బయోపిక్‌లో ఫిక్స్



ప్రముఖ క్రికెటర్, టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ బయోపిక్‌కి సన్నాహాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ బయోపిక్‌కి సంబంధించిన పనులు దాదాపు నాలుగేళ్లుగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో గంగూలీగా నటించనున్నారంటూ రణ్‌వీర్ సింగ్, ఆయుష్మాన్ ఖురానా వంటి నటుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఓ కార్యక్రమంలో తన బయోపిక్‌లో రాజ్‌కుమార్ రావు నటించనున్నారన్న సమాచారం ఉందని, అయితే ఆయన కాల్షీట్స్ కేటాయింపులో కొన్ని సమస్యలు ఉన్నాయన్నట్లుగా గంగూలీ పేర్కొన్నారు. తాజాగా గంగూలీ బయోపిక్‌లో రాజ్‌కుమార్ రావు నటించనుండటం కన్ఫార్మ్ అయిపోయింది. ఈ బయోపిక్‌లో నటించనున్నట్లుగా రాజ్‌కుమార్ రావు ఓ జాతీయ ఆంగ్ల మీడియా సంస్థకు వెల్లడించి, ఆనందం వ్యక్తం చేశారు. ''గంగూలీగారి బయోపిక్‌లో నటించడమనేది చాలా పెద్ద బాధ్యత. కాస్త ఆందోళనగా ఉంది. కానీ ఫుల్ ఫన్‌గా కూడా ఉంటుందని అనుకుంటున్నాను'' అని పేర్కొన్నారు రాజ్‌కుమార్. బెంగాలీకి చెందిన క్రికెటర్ గంగూలీ. రాజ్‌కుమార్ రావు భార్య పత్రలేఖ బెంగాలీ. దీంతో తన భార్య వద్ద బెంగాలీ భాషలో నైపుణ్యతను సంపాదించుకున్నారట రాజ్‌కుమార్. సో... భాష, ఉచ్చారణ పరంగా ఆయనకు సమస్య లేదు. ఇక తన బయోపిక్ చిత్రీకరణ 2026 జనవరిలో ప్రారంభమవుతుందని, అదే ఏడాది డిసెంబరులో రిలీజ్ కావొచ్చని ఓ సందర్భంలో గంగూలీ పేర్కొన్నారు.

ప్రేమ తికమక పెడుతుంది!



త్రిష

ఫలానా హీరో, ఫలానా హీరోయిన్ ప్రేమలో ఉన్నారనో, పెళ్లి పీటలెక్కనున్నారనో... ఇలా సెలబ్రిటీల గురించి ఎప్పుడూ ఏవో వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. వాటిని కొన్ని సందర్భాల్లో ఖండిస్తుంటారు సదరు సెలబ్రిటీలు. హీరోయిన్ త్రిష విషయంలోనూ ప్రేమ, పెళ్లి అనే వార్తలు గత కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తమిళ హీరో విజయ్, త్రిష రిలేషన్‌లో ఉన్నారనే వార్తలు కోలీవుడ్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. పైగా ఈ నెల 22న విజయ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'హ్యాపీ బర్త్ డే బెస్టెస్ట్' అంటూ హగ్ సింబల్ జత చేసి విజయ్‌తో కలిసి ఉన్న ఒక ఫొటోను షేర్ చేశారు త్రిష. ఆమె పెంపుడు కుక్కపిల్లని విజయ్ ఎత్తుకొని ముద్దు చేస్తుండగా మురిసిపోతూ చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు త్రిష. ఆ ఫొటోని త్రిష తల్లి ఉమా కృష్ణన్ షేర్ చేసి, హార్ట్ ఎమోజీని జోడించడంతో నెటిజన్స్ ఊహలకు రెక్కలొచ్చాయి. అయితే ఈ వార్తలకు త్రిష స్పందించిన దాఖలాలు లేవు. కానీ తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ షేర్ చేశారామె. ''నువ్వు పూర్తిగా ప్రేమలో మునిగిపోయినప్పుడు... అది కొందర్ని తికమక పెడుతుంది'' అన్నది ఆమె పోస్ట్ సారాంశం. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అయితే ఈ తికమక పోస్ట్ అర్థం ఏంటి? త్రిష ఎవరితో రిలేషన్‌లో ఉంది? అంటూ చర్చలు మొదలయ్యాయి.

ఆరోగ్యంగా అంజనా దేవి



హీరో చిరంజీవి, నటుడు, నిర్మాత నాగబాబు, హీరో పవన్ కల్యాణ్‌ల తల్లి అంజనా దేవి తీవ్ర అస్వస్థతకు గురయ్యారనే వార్తలు మంగళవారం నెట్టింట హల్‌చల్ చేశాయి. ఆమె తీవ్ర అనారోగ్యానికి గురవడంతో చిరంజీవి తన సినిమా చిత్రీకరణ రద్దు చేసుకున్నారని, పవన్ కల్యాణ్ కూడా హుటా హుటిన హైదరాబాద్ చేరుకున్నారనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ వార్తలపై చిరంజీవి పీఆర్ టీమ్ స్పందించింది. 'అంజనా దేవి అస్వస్థతకు గురయ్యారని, సీరియస్‌గా ఉందనీ వస్తున్న వార్తల్లో నిజం లేదు. అవన్నీ కేవలం పుకార్లు మాత్రమే. దయచేసి అలాంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయొద్దు. చిరంజీవిగారు షామిర్‌పేట్‌లో చిత్రీకరణలో ఉన్నారు. పవన్ కల్యాణ్‌గారు వ్యక్తిగత పని మీద హైదరాబాద్ వస్తున్నారు' అని స్పష్టం చేశారు.

అది నేను కాదు

- హ్యాక్ అయిన శ్రుతీహాసన్ ఎక్స్ అకౌంట్



''నా ట్విట్టర్ (ప్రస్తుతం ఎక్స్) అకౌంట్ హ్యాక్ అయింది. దయచేసి ఎవరూ కూడా అందులోని సందేశాలకు స్పందించవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను'' అని హీరోయిన్ శ్రుతీహాసన్ కోరారు. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉండే కథానాయికల్లో శ్రుతీహాసన్ కూడా ఒకరు. ఎప్పటికప్పుడు తన షూటింగ్, వ్యక్తిగత విషయాలు, వర్కౌట్స్... వంటివి అభిమానులతో పంచుకుంటూ ఉంటారామె. అయితే తాజాగా ఆమె 'ఎక్స్' అకౌంట్ నుంచి బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీకి సంబంధించిన సందేశాలు దర్శనమిచ్చాయి. దీంతో ఆమె ఫాలోయర్లు అవాక్కయ్యారు. అయితే ఆమె అకౌంట్ హ్యాక్ కావడం వల్లే ఇలాంటి పోస్టులు దర్శనమిస్తున్నాయట. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలిపారు శ్రుతీహాసన్. ''నా ట్విట్టర్ అకౌంట్ హ్యాక్ అయింది. ఈ విషయాన్ని మీకు తెలియజేయాలనుకుంటున్నాను. నా అకౌంట్‌లో కనబడే పోస్టులు నేను చేసినవి కాదు. నేను తిరిగి నా అకౌంట్‌ని రికవరీ చేసుకునే వరకు దయచేసి ఆ పేజీలో చాట్ చేయొద్దు... ఆ సందేశాలకు ఎవరూ స్పందించొద్దు'' అంటూ చేతులెత్తి దండం పెడుతున్న ఎమోజీతో కూడిన హార్ట్ సింబల్‌ని షేర్ చేశారు శ్రుతి. కాగా ఆమె 'ఎక్స్' అకౌంట్ హ్యాక్‌కి గురికావడం ఇది రెండోసారి. 2017లోనూ ఆమె ఖాతా హ్యాక్‌కి గురైంది. ఈ సంగతి ఇలా ఉంచితే... శ్రుతీహాసన్ ప్రస్తుతం 'కూలీ, జన నాయగన్, ట్రైన్' వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీ బిజీగా ఉన్నారు.

కన్నప్ప గురించి చాలా పరిశోధన చేశాను

- దర్శకుడు ముఖేష్‌కుమార్ సింగ్



''నేను ఏ ప్రాజెక్ట్ చేపట్టినా ఆ ప్రాజెక్ట్‌ను లోతుగా పరిశోధన చేస్తాను. లేకపోతే హార్ట్‌ఫుల్‌గా చేయలేమని నా భావన. అలా 'కన్నప్ప' గురించి ఉన్న ఆర్టికల్స్, వీడియోలు చూశాను. నాకు భాష అర్థం కానప్పుడు నా అసిస్టెంట్స్ సహాయంతో అర్థం చేసుకున్నాను. అలాగే 'కన్నప్ప' గురించి ఇతర భాషల్లో ప్రముఖ నటులు నటించిన 'కన్నప్ప' సినిమాలు చూశాను. ఇక విష్ణుగారు కన్నప్ప పాత్రకు వంద శాతం న్యాయం చేశారు. కథలో చివరి గంట అద్భుతంగా ఉంటుంది'' అని అన్నారు దర్శకుడు ముఖేష్‌కుమార్ సింగ్. విష్ణు మంచు టైటిల్ రోల్ చేసిన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై ఎం. మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో ముఖేష్ కుమార్ మాట్లాడుతూ– ''మహాభారతం' సీరియల్ (2013)కు సంబంధించిన కొన్ని ఎపిసోడ్స్‌కు దర్శకత్వం వహించాను. కాగా 'ఆచారి అమెరికా యాత్ర' (విష్ణు హీరోగా నటించన చిత్రం) సినిమాకు పని చేసిన అనూప్‌సింగ్ ఠాగూర్‌కు, మంచు విష్ణుకు మధ్య నా గురించి చర్చ వచ్చిందట. ఆ తర్వాత విష్ణు నన్ను హైదరాబాద్ రమ్మని, కన్నప్ప స్క్రిప్ట్ గురించి చెప్పారు. నేను చాలా రీసెర్చ్ చేశాను. ఆ తర్వాత మోహన్‌బాబుగారు పిలిచి, మహాభారతం సీరియల్ గురించి మాట్లాడి, 'కన్నప్ప' సినిమాకు దర్శకుడిగా నన్ను ఖరారు చేశారు. నేను సీరియల్స్‌కు పని చేసినా, సినిమా నాకు కొత్తేం కాదు. ఎందుకంటే అంతర్జాతీయ సంస్థలతో కలిసి మూడు నాలుగు సినిమాలను నిర్మించాను. సీరియల్స్ చేసినా, వెండితెరకు చేసినా ఒకే మైండ్ సెట్‌తో చేస్తాను. 'కన్నప్ప' మైథాలజీ కాదు. మన చరిత్ర. ఈ సినిమాలో రెండో శతాబ్దం వాతావరణం తెరపైకి తీసుకు రావడానికి చాలా ప్రయత్నించాం. అందుకే న్యూజిలాండ్‌కు వెళ్లి షూటింగ్ చేశాం. ప్రభాస్, మోహన్‌లాల్, మోహన్‌బాబు, విష్ణు, బ్రహ్మానందంగార్లు వీరందరితో కలిసి పని చేయడం అద్భుతంగా అనిపించింది. మోహన్‌బాబుగారి పాత్రను స్క్రీన్‌పై కొత్తగా చూస్తారు. ప్రభాస్‌గారి పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఇక ఈ సినిమాలోని బ్రహ్మానందంగారు, సప్తగిరి పాత్రలకు సంబంధించి ఓ వర్గం వారు అభ్యంతరాలు తెలిపారనే వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించి మా టీమ్ ఆల్రెడీ స్పందించింది. ఇకపోతే నేనూ బ్రాహ్మణుడినే. ఇక మహాభారతం సినిమాను మూడు భాగాలుగా తీయాలనే ఆలోచన ఉంది. ఇందుకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ మొదలైంది. రాజమౌళి, ఆమిర్ ఖాన్ గార్లు కూడా మహాభారతంపై సినిమాలు తీయవచ్చు. పబ్లిక్ డొమైన్‌లో ఉన్న సబ్జెక్ట్ గురించి ఎవరైనా సినిమాలు తీయవచ్చు'' అని అన్నారు.

నాకు తెలిసింది సినిమా ఒక్కటే

- హీరో నవీన్ చంద్ర



కామాక్షీ భాస్కర్ల, నవీన్ చంద్ర

''నాకు తెలిసింది సినిమా ఒక్కటే... అది హిట్ అయినా, ఫ్లాప్ అయినా. అయితే ప్రేక్షకులకు నచ్చే చిత్రాలే చేస్తాను. 'షో టైం' మంచి కథ. జూలై 4న ప్రేక్షకులతో కలిసి నేనూ థియేటర్లో చూస్తాను. మా చిత్రం అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని నవీన్ చంద్ర అన్నారు. మదన్ దక్షిణామూర్తి దర్శకత్వంలో నవీన్ చంద్ర, కామాక్షీ భాస్కర్ల జోడీగా నటించిన చిత్రం 'షో టైం'. అనిల్ సుంకర సగర్వ సమర్పణలో కిశోర్ గరికిపాటి నిర్మించిన ఈ చిత్రం జూలై 4న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నవీన్ చంద్ర మాట్లాడుతూ– ''మంచి సినిమా చేసినప్పుడు ఆసక్తి, ఉత్సాహం, భయం ఉంటాయి. 'షో టైం' అలాంటి చిత్రమే. మా సినిమాపై ఎంత నమ్మకం ఉంటే అనిల్ సుంకరగారు సమర్పకులుగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు'' అని చెప్పారు. మదన్ దక్షిణామూర్తి మాట్లాడుతూ– ''పరిశ్రమలో ఒక పెద్ద వ్యక్తి మా సినిమా చూసి 'ఇది రియల్ షో టైం' అన్నారు. దీంతో మా చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం వచ్చింది'' అన్నారు. ''మా సినిమాలో మంచి కంటెంట్ ఉంది'' అని కామాక్షీ భాస్కర్ల పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
158	72
82,055	25,044

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	19,932	▲	301
డోజోన్స్	43,069	▲	487
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,759	▲	1
డాక్స్	23,642	▲	373
షాంఘై	3,420	▲	39
నికాయ్	38,790	▲	436

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.75	86.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.60	118.04
€	యూరో	ఎస్‌బీఐ	98.74	101.48
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.48	59.99
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.04	57.90
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.79	69.47
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.03	23.54
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.52	24.30
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.11	12.93



స్మార్ట్‌ఫోన్.. ఆఫ్‌లైన్ రూట్!

చిన్న పట్టణాలపై కంపెనీల మరింత దృష్టి
- ఆకర్షణీయమైన మార్జిన్లతో రిటైలర్లకు గాలం
- ఈ-కామర్స్‌కి షిప్‌మెంట్లు కుదింపు

ఇప్పటివరకు ఆన్‌లైన్ మాధ్యమానికి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లు క్రమంగా ఆఫ్‌లైన్ బాట పడుతున్నాయి. సులభతరమైన ఫైనాన్సింగ్ అవకాశాల దన్నుతో అమ్మకాలను పెంచుకునేందుకు చిన్న పట్టణాలపై మరింతగా దృష్టి పెడుతున్నాయి. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు వరుసగా ఏడు నెలల పాటు ఆన్‌లైన్ రిటైలర్లకు షిప్‌మెంట్లు (టోకు విక్రయాలు) తగ్గడం, ఆఫ్‌లైన్ రిటైలర్లకు పెరగడం ఇందుకు నిదర్శనమని మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఆన్‌లైన్ రిటైలర్లకు వరుసగా రెండో నెల ఏప్రిల్‌లో రెండంకెల స్థాయిలో తగ్గినట్లు వివరించాయి. ఏప్రిల్‌లో షిప్‌మెంట్లు ఏకంగా 20 శాతం మేర క్షీణించాయి. మరోవైపు, ఆఫ్‌లైన్ రిటైలర్లకు 10 శాతం పెరిగాయి. వరుసగా ఎనిమిది నెలల పాటు ఆఫ్‌లైన్‌కి షిప్‌మెంట్లు పెరిగినట్లయిందని ఐడీసీ ఇండియా రీసెర్చ్ మేనేజర్ ఉపాసనా జోషి తెలిపారు. మొత్తం షిప్‌మెంట్లను పరిగణనలోకి తీసుకున్నప్పుడు మార్చితో పోలిస్తే ఏప్రిల్‌లో పెద్దగా మార్పు లేకుండా 1.2 కోట్ల స్థాయిలో ఉన్నట్లు వివరించారు.

మోటరోలా షిప్‌మెంట్లు 64 శాతానికి డౌన్..

మార్కెట్ రీసెర్చ్ సంస్థ కెనాలిస్ ప్రకారం 2025 తొలి త్రైమాసికంలో మోటరోలా ఆన్‌లైన్ షిప్‌మెంట్లు 64%కి పరిమితమయ్యాయి. అంతక్రితం క్యూ1లో ఇవి 82%గా నమోదయ్యాయి. ఇక వన్‌ప్లస్ విషయానికొస్తే ఇదే వ్యవధిలో షిప్‌మెంట్లు 85% నుంచి 71%కి తగ్గాయి. మరోవైపు, ఈ-కామర్స్ ఫ్లాష్ సేల్స్‌తోనే భారత మార్కెట్లోకి ప్రవేశించిన షావోమీ సైతం ఆమ్నిచానల్ బాట పట్టింది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఆమ్నిచానల్ వ్యూహం..

ప్రాథమికంగా ఆన్‌లైన్ మాధ్యమం మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకునేందుకు బాగా ఉపయోగపడినప్పటికీ, దేశీయంగా ఈ-కామర్స్ విస్తృతి ఇప్పటికే ఒక స్థాయికి చేరిన విషయాన్ని బ్రాండ్లు గుర్తిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. కోవిడ్ అనంతరం ఒక్కసారిగా ఆన్‌లైన్ అమ్మకాలు ఎగిసినప్పటికీ ఆ తర్వాత అదే స్థాయిలో కొనసాగలేదు. గ్రామీణ ప్రాంతాల కొనుగోలుదారులు పూర్తిగా ఆన్‌లైన్ మాధ్యమంపైనే ఆధారపడటం లేదు. ఇప్పటికీ ఆఫ్‌లైన్ స్టోర్స్ వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో విక్రయాలను పెంచుకునేందుకు ఏదో ఒక మాధ్యమంపైనే ఎక్కువగా దృష్టి పెట్టకుండా, అన్ని మార్గాలను ఉపయోగించుకునే ఆమ్నిచానల్ వ్యూహాన్ని బ్రాండ్లు అనుసరిస్తున్నాయి. ఆఫ్‌లైన్ రిటైలర్లను ఆకర్షణీయమైన మార్జిన్లు, సపోర్ట్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఆన్‌లైన్‌లో విక్రయించే ఉత్పత్తులను అదే రేటుకు ఆఫ్‌లైన్‌లోనూ అందిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ సరఫరాలను తగ్గిస్తున్నాయని మార్కెట్ వర్గాలు వివరించాయి.

పసిడి రూ.900 డౌన్

- ఢిల్లీ మార్కెట్లో రూ.98,900
- రూ.1,000 తగ్గిన వెండి ధర



న్యూఢిల్లీ: ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారంతో.. సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడిలో లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపించారు. అమ్మకాల ఒత్తిడితో బంగారం 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) ఢిల్లీ మార్కెట్లో రూ.900 నష్టపోయి రూ.98,900 స్థాయికి దిగొచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత బంగారం సైతం రూ.800 నష్టపోయి రూ.98,300 స్థాయిలో ట్రేడ్ అయ్యింది. మరోవైపు వెండి సైతం కిలోకి రూ.1,000 నష్టపోయి రూ.1,04,200 స్థాయికి చేరుకుంది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో బంగారం ఔన్స్‌కు 46 డాలర్లు క్షీణించి 3,323 డాలర్ల స్థాయిలో ట్రేడ్ అయ్యింది. ''ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య పూర్తిస్థాయి కాల్పుల విరమణకు అంగీకారం కుదిరిందంటూ యూఎస్ ప్రకటించడంతో బంగారం ధరలు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మరింత ఉద్రిక్తతలు పెరుగుతాయన్న అంచనాలు తగ్గడంతో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించారు'' అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా వివరించారు.

యూపీఐ, ఏటీఎంల ద్వారా
పీఎఫ్ డబ్బు విత్‌డ్రాయల్

- ప్రాజెక్టుపై కసరత్తు చేస్తున్న కార్మిక శాఖ
- ఆటో–సెటిల్మెంట్ కింద పరిమితి రూ. 5 లక్షలకు పెంపు



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి ఈపీఎఫ్‌వో చందాదారులకు శుభవార్త. ఏటీఎంలు, యూపీఐ తదితర మాధ్యమాల ద్వారా తమ ఖాతాల నుంచి ఈపీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే సదుపాయం త్వరలో అందుబాటులోకి రానుంది. ఇందుకోసం ఉద్యోగులు తమ బ్యాంకు ఖాతాలను ఈపీఎఫ్‌కు అనుసంధానించుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుపై కార్మిక శాఖ కసరత్తు చేస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీని ప్రకారం ఈపీఎఫ్‌లో నిర్దిష్ట నిష్పత్తిలో కొంత భాగాన్ని పక్కన పెట్టి, మిగతా మొత్తాన్ని విత్‌డ్రాయల్‌కు అందుబాటులో ఉంచుతారని పేర్కొన్నాయి. ఏటీఎం డెబిట్ కార్డులు, యూపీఐలాంటి మాధ్యమాల ద్వారా బ్యాంక్ అకౌంట్ నుంచి ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చని వివరించాయి. ఈ విధానాన్ని అమలు చేసేందుకు ప్రస్తుతం సాఫ్ట్‌వేర్‌పరమైన సవాళ్లు ఉన్నాయని, వాటిని పరిష్కరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపాయి. ఈపీఎఫ్‌వోకి బ్యాంకింగ్ లైసెన్సులు లేనందువల్ల ఈపీఎఫ్ ఖాతాల నుంచి నేరుగా ఉపసంహరించుకునేందుకు వీలుండదని సంబంధిత వర్గాలు చెప్పాయి. మరోవైపు, ఆటో–సెటిల్మెంట్ విధానం కింద విత్‌డ్రాయల్ పరిమితిని ప్రస్తుతమున్న రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచారు. ఆటో–సెటిల్మెంట్ విధానంలో దరఖాస్తు చేసుకున్న మూడు రోజుల వ్యవధిలోనే క్లెయిమ్ విత్‌డ్రాయల్ ప్రక్రియంతా ఎలక్ట్రానిక్ విధానంలో సెటిల్ అవుతుంది. కోవిడ్ సమయంలో అవసరార్థులకు ఆర్థికంగా తక్షణ సాయం అందాలనే లక్ష్యంతో దీన్ని ప్రవేశపెట్టారు.

రూపాయి అయిదేళ్లలో
అతి పెద్ద ర్యాలీ

- 73 పైసలు బలపడి 86.05 వద్ద ముగింపు
- చల్లారిన క్రూడాయిల్ ధరల ప్రభావం



ముంబై: రూపాయి విలువ అయిదు నెలల కనిష్టం నుంచి కోలుకొని రికార్డు స్థాయిలో ర్యాలీ చేసింది. డాలర్ మారకంలో 73 పైసలు బలపడి 86.05 వద్ద స్థిరపడింది. గడిచిన అయిదేళ్లలో ఒకేరోజు ఈ స్థాయిలో పుంజుకోవడం ఇదే తొలిసారి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గొచ్చనే అంచనాలతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగిరావడం రూపాయికి కలిసొచ్చింది. అలాగే దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో నెలకొన్న సానుకూల సంకేతాలూ ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఇంట్రాడేలో ఏకంగా 87 పైసలు ఎగసి 85.91 వద్ద గరిష్టాన్ని తాకింది. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య సీజ్‌ఫైర్ ప్రకటనతో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 3.50% క్షీణించి 67.05 స్థాయికి దిగివచ్చింది.

సీజ్‌ఫైర్ ఉల్లంఘన.. స్వల్ప లాభాలతో సరి

- ఇరాన్–ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ఒప్పందం అతిక్రమణ
- ఆరంభ లాభాలు ఆవిరి...
- ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,121 పాయింట్లు జంప్
- 158 పాయింట్ల లాభంతో ముగింపు
- 25,000 స్థాయిపైనే నిఫ్టీ



ముంబై: ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పడటంతో దేశీయ స్టాక్ సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. మంగళవారం ఇంట్రాడేలో 1,121 పాయింట్లు బలపడిన సెన్సెక్స్ ఆఖరికి 158 పాయింట్ల స్వల్ప లాభంతో 82,055 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 72 పాయింట్లు పెరిగి 25,044 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో ఉదయం సూచీలు లాభాలతో మొదలయ్యాయి. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనతో ప్రథమార్థంలో కొనుగోళ్ల జోరు కనిపించింది ఒక దశలో సెన్సెక్స్ 1,121 పాయింట్లు ర్యాలీ చేసి 83,018 వద్ద, నిఫ్టీ 346 పాయింట్లు దూసుకెళ్లి 25,318 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. అయితే ఇరాన్ సీజ్‌ఫైర్ ఒప్పందాన్ని అతిక్రమిస్తూ క్షిపణులతో దాడులు చేస్తోందంటూ ఇజ్రాయెల్ ఆరోపణలతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో సూచీల ఆరంభ లాభాలన్నీ ఆవిరయ్యాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు – 2–3% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు ఒక శాతం లాభంతో ట్రేడవుతున్నాయి.

- రంగాల వారీగా బీఎస్‌ఈ ఇండెక్సుల్లో సర్వీసెస్ 2%, టెలికమ్యూనికేషన్, మెటల్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకెక్స్ ఇండెక్సులు ఒకశాతం పెరిగాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.75%, 0.50 శాతం చొప్పున లాభపడ్డాయి.

సూచీలకు అదానీ షేర్ల దన్ను...

అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు రాణించి సూచీల పతనాన్ని అడ్డుకున్నాయి. వివిధ వ్యాపారాలపై వచ్చే అయిదేళ్లలో 15–20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే యోచనలో ఉన్నట్లు చైర్మన్ గౌతమ్ అదానీ ప్రకటనతో అదానీ గ్రూప్ షేర్లకు డిమాండ్ లభించింది. అంబుజా సిమెంట్స్ 4%, సంఘీ ఇండస్ట్రీస్, అదానీ గ్రీన్ ఎనర్జీ 3%, అదానీ పోర్ట్స్ 2.60%, ఏసీసీ, అదానీ ఎనర్జీ 2% లాభపడ్డాయి.

- బ్రెంట్ క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో ఆయిల్ మార్కెట్ కంపెనీలు, ఏవియేషన్, పెయింట్స్, అడెషివ్స్ షేర్లకు కలిసొచ్చింది. హెచ్‌పీసీఎల్ 3%, ఐఓసీ, బీపీసీఎల్ 2% లాభపడ్డాయి. ఇండిగో ఏవియేషన్ 2.5%, స్పైస్‌జెట్ 2.15% పెరిగాయి. కన్సాయ్ నెరోలాక్ పెయింట్స్, షాలీమార్ పెయింట్స్ 2% లాభపడ్డాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
త్వరలోనే యూఎస్, ఈయూలతో ఒప్పందం | భారత వృద్ధి మెరుగే అంచనా పెంచిన ఎస్‌అండ్‌పీ

ప్రజాస్వామ్యానికి సంకెళ్లు

ఎమర్జెన్సీ కళంకానికి 50 ఏళ్లు


1975. జూన్ 25. స్వతంత్ర భారత చరిత్రలోనే అత్యంత చీకటిమయమైన అధ్యాయానికి తెర లేచిన రోజు. దేశం ఎన్నటికీ మర్చిపోలేని రోజు. అధికారాన్ని కాపాడుకునేందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ విధించిన రోజు. ఆ నిశిరాత్రి వేళ ఆమె తీసుకున్న చీకటి నిర్ణయం ఏకంగా 21 నెలల పాటు దేశ ప్రజల పాలిట నిత్య కాళరాత్రే అయింది. ఎటుచూసినా దమనకాండ. రాజకీయ ప్రత్యర్థులు మొదలుకుని సామాన్యుల దాకా దేశవ్యాప్త నిర్బంధాలు. ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన మౌలిక హక్కులు దేవుడెరుగు, జీవించే హక్కుకే దిక్కు లేని దుస్థితి. పత్రికా స్వేచ్ఛను ఉక్కుపాదంతో తొక్కిపెట్టిన పరిస్థితి! సర్వం సహా అధికారమంతా ఇందిర చిన్న కుమారుడు సంజయ్‌గాంధీ రూపంలో ఓ రాజ్యాంగేతర శక్తి చేతుల్లో కేంద్రీకృతం! అసలే దుందుడుకుతనానికి మారుపేరు. ఆపై బాధ్యతల్లేని అధికారం. దాని అండతో, సన్నిహిత కోటరీ చెప్పినట్టల్లా ఆడుతూ ఆయన పాల్పడ్డ అరాచకాలు అన్నీ, ఇన్నీ కావు. అనుమానం వచ్చిన వారల్లా జైలుపాలే. చివరికి జనాభాను తగ్గించే చర్యల పేరిట కంటబడ్డ వారికల్లా బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిపారేయడం సంజయ్ నియంతృత్వ పోకడలకు పరాకాష్టగా నిలిచింది. మొత్తంగా దేశమే ఓ జైలుగా మారి 21 నెలల పాటు అక్షరాలా హాహాకారాలు చేసింది. అయితే అంతిమ విజయం ప్రజాస్వామ్యానిదే అయింది. ఎమర్జెన్సీ ఎత్తివేత అనంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరను ఓడించి, నియంత పోకడలు పోయేవారికి ప్రజలు మర్చిపోలేని పాఠం నేర్పారు. అలాంటి ఎమర్జెన్సీ చీకటి అధ్యాయానికి తెర లేచి నేటికి సరిగ్గా 50 ఏళ్లు. ఈ సందర్భంగా, అందుకు దారి తీసిన పరిస్థితులు, ఎమర్జెన్సీ అకృత్యాలు, దాని పరిణామాలు తదితరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం...



అధికారం నిలుపుకొనేందుకు ఇందిర నిర్ణయం
21 నెలలపాటు దేశవ్యాప్త దమనకాండ

..అలా మొదలైంది

నిజానికి ఎమర్జెన్సీ నాటికి దేశమంతటా నానారకాలుగా అస్థిరత రాజ్యమేలుతోంది. ఇందిరకు వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ తదితరుల సారథ్యంలో విపక్షాలు సంఘటితమవుతూ వస్తున్నాయి. అయితే ఎమర్జెన్సీకి పూర్వ రంగాన్ని సిద్ధం చేసింది మాత్రం ఇందిర ఎన్నికను రద్దు చేస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగ్‌మోహన్‌లాల్ సిన్హా వెలువరించిన చరిత్రాత్మక తీర్పే. 1971 లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి ఇందిరపై తలపడి ఓడిన సోషలిస్టు పార్టీ అభ్యర్థి రాజ్ నారాయణ్ ఆమె ఎన్నికను సవాలు చేస్తూ కోర్టుకెక్కారు. ఇందిర ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇందిర ఎన్నికల ఏజెంటు యశ్‌పాల్ కపూర్ ప్రభుత్వోద్యోగిగా ఉంటూనే ఆమె కోసం పని చేశారని పేర్కొన్నారు. ఈ కేసును కొద్దిరోజులకు అంతా మరచిపోయినా బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం తాలూకు ఆర్థిక భారం కారణంగా నాలుగేళ్లుగా జనంలో రగులుతున్న అసంతృప్తి ఇందిర సర్కారుపై ఆగ్రహంగా మారుతున్న సందర్భమది. మూడేళ్ల పాటు ఇందిర సర్కారుకు వ్యతిరేకంగా విపక్షాలు నానాటికీ బలం పుంజుకోసాగాయి. అలాంటి సమయంలో ఎంపీగా ఇందిర ఎన్నికను కొట్టేస్తూ జస్టిస్ సిన్హా 1975 జూన్ 12న అనూహ్యంగా సంచలన తీర్పు వెలువరించారు. అంతేగాక ఆమె ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు కూడా వేశారు! దానిపై ఇందిర సుప్రీంకోర్టుకు వెళ్లినా లాభం లేకపోయింది. ఆమెను ప్రధానిగా కొనసాగనిచ్చినా, పార్లమెంటులో ఓటు హక్కులకు మాత్రం కత్తెర వేస్తూ జూన్ 24న సుప్రీం తీర్పునిచ్చింది. ఇది విపక్షాలకు అతి పెద్ద ఆయుధంగా అందివచ్చింది. జేపీ ఇచ్చిన సంపూర్ణ క్రాంతి (సంపూర్ణ విప్లవ) నినాదం అప్పటికే దేశమంతటా కార్చిచ్చులా వ్యాపిస్తోంది. చూస్తుండగానే దేశమంతటా, ముఖ్యంగా ఉత్తరాదిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు మిన్నంటసాగాయి. సుప్రీం తీర్పు వచ్చిన మర్నాడు జూన్ 25న విపక్షాలన్నీ ఢిల్లీ రాంలీలా మైదాన్‌లో భారీ స్థాయిలో నిర్వహించిన సంపూర్ణ విప్లవ ర్యాలీ సర్కారు పునాదులనే కదిలించింది. పౌరులు సహాయ నిరాకరణ చేయాలని, పోలీసులు, సైనిక బలగాలు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కాకుండా అంతరాత్మ ప్రబోధానుసారం నడచుకోవాలని జేపీ ఇచ్చిన పిలుపు కేంద్రం గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. పరిస్థితులు చేయి దాటుతున్నాయని భావించిన ఇందిర సన్నిహితులతో సంప్రదించి ఓ నిర్ణయానికి వచ్చారు. 'అంతర్గత భద్రతకు ముప్పు పొంచి ఉన్నందున దేశమంతటా ఎమర్జెన్సీ విధించా'లంటూ ఆ అర్ధరాత్రే రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు సిఫార్సు చేయడం, క్షణాల మీద ఆయన ఆమోదముద్ర వేయడం చకచకా జరిగిపోయాయి.


1975 జూన్ 25న ఢిల్లీ రాంలీలా మైదానంలో ఇందిరకు వ్యతిరేకంగా విపక్షాలు సంయుక్తంగా నిర్వహించిన సంపూర్ణ క్రాంతి ర్యాలీకి లక్షలాదిగా హాజరైన ప్రజలు. వారినుద్దేశించి ప్రసంగిస్తున్న లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్

ఏం జరిగింది?

- ఎమర్జెన్సీ కారణంగా వాక్ స్వాతంత్ర్యంతో పాటు ప్రజల రాజ్యాంగపరమైన హక్కులన్నీ రద్దయ్యాయి.
- మీడియాపై కనీవినీ ఎరగని రీతిలో పూర్తి స్థాయి ఆంక్షలు కొనసాగాయి.
- అనుమానం వస్తే చాలు, ఎంతటివారినైనా ముందస్తు నిర్బంధంలోకి తీసుకోవడం పరిపాటిగా మారింది.
- జేపీతో పాటు అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అడ్వాణీ, మధు దండావతే, నానాజీ దేశ్‌ముఖ్, ప్రకాశ్‌సింగ్ బాదల్, కరుణానిధి, జార్జి ఫెర్నాండెజ్, ప్రకాశ్ కారత్ తదితర విపక్ష నేతలందరినీ నిర్బంధించి జైలుపాలు చేశారు.
- డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్, మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్ (మీసా) వంటి చట్టాలతో ఎవరినైనా కటకటాల్లోకి నెట్టారు.
- ఈ నిర్బంధాలకు గుర్తుగా ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆ సమయంలో పుట్టిన తన కూతురికి మీసా భారతి అని పేరు పెట్టుకోవడం విశేషం!
- న్యాయవ్యవస్థ హక్కులకు కూడా కోత పడింది. విపక్ష నేతలను అరెస్టు చేయాలంటూ జారీ చేసే కార్యనిర్వాహక ఉత్తర్వులను న్యాయస్థానాలు సమీక్షించకుండా వాటి అధికారాలకు కత్తెర వేశారు.
- జనాభా పెరుగుదలకు అడ్డుకట్ట వేసేందుకంటూ దేశవ్యాప్తంగా లక్షలాది మందికి బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు.
- సుందరీకరణ పేరుతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లోని మురికివాడలన్నింటినీ అధికారులు నేలమట్టం చేసి లక్షలాది మందికి నిలువ నీడ లేకుండా చేశారు.


జార్జి ఫెర్నాండెజ్ నిర్బంధం

చివరికేమైంది?

- ఎమర్జెన్సీ ఎత్తేశాక 1977 జనవరి 20న లోక్‌సభను రద్దు చేశారు. తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తొలిసారి ఓటమి పాలైంది.
- ఇందిరతో పాటు ఆమె తనయుడు సంజయ్ కూడా ఓటమి చవిచూశారు.
- మొరార్జీ దేశాయ్ ప్రధానిగా మార్చి 24న జనతా పార్టీ సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరింది.
- లుకలుకలతో కొద్దికాలానికే కుప్పకూలినా, కేంద్రంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోయింది.
- ఎమర్జెన్సీ ఆందోళనల్లోంచే ఫెర్నాండెజ్, కారత్ వంటి కొత్త తరం నాయకులు ఎదిగి వచ్చారు.

మీడియాకూ చుక్కలే

- ఎమర్జెన్సీ కాలంలో మీడియాపై ఇందిర సర్కారు, ముఖ్యంగా ఆమె తనయుడు సంజయ్ గాంధీ అక్షరాలా ఉక్కుపాదం మోపారు! అందుకోసం ప్రివెన్షన్ ఆఫ్ పబ్లికేషన్ ఆఫ్ అబ్జెక్షనబుల్ మ్యాటర్ పేరుతో చట్టమే తెచ్చారు.
- మాట విననందుకు 200 మందికి పైగా జర్నలిస్టులను అరెస్టు చేశారు. వారిపై పన్నుల ఎగవేత వంటి పలు అభియోగాలు మోపారు.
- జేపీ ఉద్యమానికి కవరేజీ ఇచ్చినందుకు కుల్‌దీప్ నయ్యర్, కె.ఆర్.మల్కానీ వంటి జర్నలిస్టులను జైలుపాలు చేశారు.
- మాట వినని పత్రికలకు న్యూస్ ప్రింట్ అందకుండా చేశారు.
- చివరికి గాంధీ స్వయంగా స్థాపించిన నవజీవన్ ప్రెస్ తాలూకు ప్రింటింగ్ యంత్రాలన్నింటినీ జప్తు చేశారు.
- ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ), యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యూఎన్‌ఐ), హిందూస్తాన్ సమాచార్, సమాచార్ భారతి వంటి వార్తా సంస్థలను 'సమాచార్' పేరిట బలవంతంగా విలీనం చేసిపారేశారు.
- వార్తా పత్రికలపై నియంత్రణ కోసం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో ఒక ఐపీఎస్ అధికారిని ప్రత్యేకంగా నియమించారు. ప్రతి వార్తనూ అక్షరాక్షరం క్షుణ్నంగా చదివి సరేనన్న మీదటే ప్రింటుకు వెళ్లేది.
- ఇన్ని చేసినా కలానికి మాత్రం సంకెళ్లు వేయలేకపోయారు. నియంతృత్వాన్ని నిరసిస్తూ మీడియా గళం విప్పింది.
- ఎమర్జెన్సీ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబడుతూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఖాళీ ఎడిటోరియల్ ప్రచురించింది.

సినిమాలకూ చీకటి రోజులే!

బాలీవుడ్‌తో పాటు దేశ సినీ పరిశ్రమకు కూడా ఎమర్జెన్సీ చీకటి కాలంగానే మిగిలిపోయింది.

సంజయ్‌గాంధీని ప్రస్తుతించేందుకు నిరాకరించారని బాలీవుడ్ స్టార్ దేవానంద్ సినిమాలను దూరదర్శన్‌లో నిషేధించారు.

ప్రభుత్వ 20 సూత్రాల పథకాన్ని పొగిడేందుకు ఏర్పాటు చేసిన గాన విభావరిలో పాల్గొనేందుకు ససేమిరా అన్న గాయక దిగ్గజం కిశోర్‌కుమార్ గొంతు ఆలిండియా రేడియోలో విన్పించకుండా, ఆయన పాటలు దూరదర్శన్‌లో కన్పించకుండా చేశారు.

ఇందిరను పోలిన పాత్రలో సుచిత్రాసేన్ జీవించిన 'ఆంధీ', నియంతృత్వంపై వ్యంగ్యాస్త్రాలు విసిరిన 'కిస్సా కుర్సీ కా' వంటి సినిమాలను నిషేధించారు.

ఇందిర నియంతృత్వాన్ని సినీ పరిశ్రమ ఎదిరించింది. దేవానంద్ ఏకంగా నేషనల్ పార్టీ ఆఫ్ ఇండియా పేరిట కొత్త పార్టీయే పెట్టారు.

శత్రుఘ్న సిన్హా, ప్రాణ్, డానీ డెంగ్జోంగ్పా వంటి బాలీవుడ్ దిగ్గజాలు పొలిటికల్ స్టార్ బ్రిగేడ్ పేరిట జనతా పార్టీకి మద్దతిచ్చారు.

విప్లవ ఇతివృత్తంతో పట్టాభి రామారెడ్డి దర్శకత్వం వహించిన కన్నడ సినిమా చండ మారుతను నిషేధించడమే గాక అందులో నటించిన ఆయన భార్య స్నేహలతారెడ్డిని కటకటాల్లోకి నెట్టారు. ఏడాదికి పైగా తీవ్ర నిర్బంధంలో గడిపిన ఆమె తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. పెరోల్‌పై బయటికొచ్చిన ఐదు రోజులకే కన్నుమూశారు.

హోం మంత్రికే తెలియదు!

దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయం మర్నాటిదాకా సాక్షాత్తూ నాటి కేంద్ర హోం మంత్రి ఓం మెహతాకే తెలియదు! ఉదయం పత్రికల్లో చదివి విస్తుపోవాల్సి వచ్చింది. తర్వాత కాసేపటికే కేంద్ర కేబినెట్‌ను సమావేశపరిచిన ఇందిర, ఎమర్జెన్సీ విధింపు గురించి సహచర మంత్రులకు తీరిగ్గా వెల్లడించారు. అనంతరం ఆలిండియా రేడియోలో జాతినుద్దేశించి ప్రసంగించారు. తన సర్కారుకు వ్యతిరేకంగా భారీ స్థాయిలో లోతైన కుట్ర జరుగుతున్నందున తనకు మరో దారి లేకపోయిందని చెప్పుకొచ్చారు.

> “ఇది ప్రజాస్వామ్యానికి ఇందిర పాతర వేసిన రోజు”
> – ఎమర్జెన్సీ నిర్ణయంపై లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్

– సాక్షి, నేషనల్ డెస్క్

- ప్రియుడితో ఫోన్ మాట్లాడొద్దని మందలించిన కన్న తండ్రిని.. తల్లి, అక్కతో కలిసి కొట్టి చంపిన కూతురు.. మహబూబాబాద్ జిల్లాలో ఘటన
- ఆస్తి వివాదం కోసం కన్న తండ్రి ఎదుటే సోదరుడిని తుదముట్టించిన చెల్లెళ్లు.. జగిత్యాల జిల్లాలో ఘోరం
- ప్రేమకు అడ్డు వస్తోందని కన్నతల్లినే ప్రియుడితో హత్య చేయించిన 15 ఏళ్ల బాలిక.. తాజాగా హైదరాబాద్ జీడిమెట్ల పరిధిలో దారుణం



- సాక్షి
సెంట్రల్ డెస్క్

బంధం.. బలహీనం!

మానవ సంబంధాలు మృగ్యమైపోతున్నాయనడానికి వరుసగా జరుగుతున్న ఇలాంటి ఘటనలే నిదర్శనం. చిన్న చిన్న కారణాలకు అయిన వాళ్లను, ఆప్తులను అంతమొందించే పరిస్థితులు పెరిగిపోతున్నాయ్. ఓవైపు విజ్ఞానం పెరుగుతున్నా.. మరోవైపు ఇలాంటి అజ్ఞానమూ తాండవిస్తోంది. కుటుంబం అంటే అందమైన పొదరిల్లు అనే భావన క్రమంగా అంతర్ధానమవుతోంది. ఒకప్పుడు కుటుంబ సభ్యులతో చిన్నచిన్న పంతాలు, పట్టింపులు మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడవి పగలు, హత్యల వరకు వెళ్లిపోయాయి. తమ ఆనందం కోసం ఏం చేయడానికైనా, ఎంతకు తెగించడానికైనా వెనకాడటంలేదు. తల్లి లేదు.. తండ్రి లేదు.. తోబుట్టువులైనా.. కట్టుకున్న వాళ్లైనా.. బంధనాల్లాంటి బంధాలు మాకొద్దు.. మా లైఫ్.. మా ఇష్టం.. మా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అడ్డొస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు.. అనే తీరు నేడు ఎక్కువైపోయింది.

మృగ్యమైపోతున్న మానవ సంబంధాలు	కన్నవాళ్లనే కడతేరుస్తున్న పిల్లలు	స్వేచ్ఛాయుత జీవితం మోజులో ఘోరాలు

రక్తపాతమే కావాలా?

ఫోన్ మాట్లాడొద్దన్నారని.. ప్రేమ పెళ్లికి అంగీకరించడంలేదని.. కన్నవాళ్లనే కడతేరుస్తున్నారు. నిజానికి ఇలాంటి అంశాల్లో వారికి వేరే ఆప్షన్లు ఉన్నప్పటికీ, రక్తపాతాన్నే ఎందుకు ఎంచుకుంటున్నారు? హత్య చేస్తే జైలుకు వెళతామనే ఆలోచన కూడా లేకుండా ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారు? పోలీసు అధికారులు, మానసిక వైద్య నిపుణులు చెబుతున్న ప్రకారం.. ఇలాంటి ఘటనల వెనుక కారణాలు అన్ని కేసుల్లో ఒకేలా ఉండవు. పరిస్థితులు, అవసరాలను బట్టి పలు అంశాలు ఇందులో ఇమిడి ఉంటాయి. అయితే, ఇవేవీ ఆకస్మిక కోపం వల్లో, క్షణికావేశంలోనో జరిగే నేరాలు మాత్రం కావు. నిందితులకు ఉన్న మానసిక రుగ్మతలు, ఒత్తిడి, విభ్రాంతికరమైన ఆలోచనలు, కోరుకున్న వాతావరణం ఇంట్లో లేకపోవడం, తమకు ఎలాంటి అడ్డంకులూ ఉండకూడదనుకోవడం వంటివి ఇందుకు ప్రధాన కారణాలు.

పిల్లల్లో పెడాలోచనలు ఎందుకు?

మా పిల్లలు మాట వినరు.. సరిగ్గా చదవరు.. ఎప్పుడూ ఫోన్‌తోనే ఉంటారని చెప్పని తల్లిదండ్రులే లేరంటే అతిశయోక్తి కాదు. మారుతున్న ప్రపంచంతోనే అందరి అలవాట్లలోనూ మార్పులు వస్తున్నాయి. పిల్లల ఆలోచనలు, అలవాట్లలో కూడా ఇదే కనిపిస్తోంది. పిల్లల్లో విపరీత మనస్తత్వానికి కారణం ఏమిటి అంటే... స్మార్ట్ ఫోన్ అనే సమాధానం ఠక్కున వస్తుంది. కొంతవరకు ఇది నిజమే అయినా.. ఇతర కారణాలూ ఉన్నాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు ఇరువురూ కలిసి సంపాదిస్తే తప్ప.. అవసరాలు తీరని పరిస్థితి. ఈ నేపథ్యంలో పిల్లలతో కలిసి గడిపేందుకు సమయమే ఉండటంలేదు. వారితో ప్రేమగా మాట్లాడి, అవసరాలు తెలుసుకుని తీర్చే పరిస్థితి లేదు. ఇది క్రమంగా వారిలో ఒంటరితనానికి దారితీసి.. తమకు కావాల్సింది స్మార్ట్ ఫోన్‌లో వెతుక్కోవడం మొదలుపెడుతున్నారు. ఇంట్లో లభించని ప్రేమానురాగాలు బయటి వ్యక్తి చూపిస్తే.. అది నిజమో, అబద్ధమో కూడా తెలుసుకోకుండా వారికి దాసోహమైపోతున్నారు. అదే సమయంలో ఇంట్లో తల్లిదండ్రులు తమను కంట్రోల్ చేయడం వారికి నచ్చడంలేదు. బయట తమకు ఎంతో స్వేచ్ఛ ఉందని.. ఇంట్లో అన్నింటికీ తల్లిదండ్రులు అడ్డుపడుతున్నారనే భావన క్రమంగా పెరిగి.. వారిపై కోపం పెంచుకుంటున్నారు. అది ఏకంగా కన్నవారి అడ్డు తొలగించుకోవాలనుకునే స్థాయికి వెళ్లిపోతోంది. అయితే, అందరూ ఇలాగే ఉన్నారని కాదు. మానసిక రుగ్మతలు ఉన్నవారు, చాలాకాలంగా తల్లిదండ్రుల వైఖరితో విభేదిస్తున్నవారు, ప్రేమ వంటి విపరీతమైన భావోద్వేగంలో కూరుకుపోయి ఉన్నవారు.. ఏదీ ఆలోచించే పరిస్థితిలో ఉండరు. ఇలాంటివారు పర్యవసానాలను పట్టించుకోకుండా తాము అనుకున్నది చేయడానికే మొగ్గు చూపిస్తారు.

తల్లిదండ్రులు ఏం చేయాలి?

తమ పిల్లల ప్రతి చర్యకూ తల్లిదండ్రుల బాధ్యత తప్పకుండా ఉంటుంది. కాలానికి తగ్గట్టే తల్లిదండ్రుల ప్రవర్తనలోనూ మార్పులు రావాలి. పిల్లలను ఎక్కువగా నియంత్రించడం, ఆంక్షలు పెట్టడం వంటివి చేయకూడదు.. అలా అని పూర్తిగా వదిలేయకూడదు. రెండింటినీ సమపాళ్లలో బ్యాలెన్స్ చేయాలి. పిల్లలను అదేపనిగా కట్టుదిట్టం చేస్తే ఒత్తిడిలో కూరుకుపోయి నిరాశలో మునిగిపోతారు.. లేదా తిరగబడతారు. రెండూ ప్రమాదకరమే. రోజులో వీలైనంత సమయం వారితో మాట్లాడాలి. ఏం కోరుకుంటున్నారో తెలుసుకోవాలి. అన్నింటికీ మేం ఉన్నాం అనే భరోసా కల్పించాలి. కుటుంబ బంధాలు, విలువల గురించి అర్థమయ్యేరీతిలో చిన్నప్పటి నుంచే తెలియజెప్పాలి.



వ్యక్తిత్వ లోపాలే కారణం

అకారణంగా హత్యలకు పాల్పడే వాళ్లకు ఐక్యూ లెవల్స్ తక్కువ ఉంటాయి. ఈ బెడద నుంచి తప్పించుకోవాలన్న తాత్కాలిక ఆలోచన వల్లే చంపుతున్నారు. వారి వ్యక్తిత్వంలోనే లోపాలు ఉంటాయి. మానసిక రుగ్మతలు ఉన్న వాళ్లు మాత్రమే ఇలాంటి కుట్రలు చేసి, ఇతరులను కూడా ఇందులో భాగస్వామ్యం చేస్తారు.. కుట్రలో పాల్గొనే వారందరికీ వ్యక్తిత్వ లోపాలు ఉంటాయి. ఇలాంటి వారిలో చాలామంది.. చిన్నప్పటి నుంచి కుటుంబంలో ఒకరకమైన అనిశ్చితి, హింస, కోపాలకు గురై ఉంటారు. వారికి తాము చేసిన నేరం సమంజసమే అనిపిస్తుంది. - వీరేందర్, సైకాలజిస్ట్

కనుమరుగవుతున్న బంధాలను కాపాడుకోవాలి




కన్నవాళ్లను, కట్టుకున్నోళ్లను కడతేర్చడం వంటివి మామూలు హత్యకేసులు కావు. సమాజంలో కనుమరుగవుతున్న బంధాలు, అనుబంధాలకు నిదర్శనంగా వీటిని అర్థం చేసుకోవాలి. ఈ రోజుల్లో సినిమాల్లో, సోషల్ మీడియాలో కనిపించే ప్రేమను నిజమని నమ్మేస్తున్నారు. దానికి అడ్డుగా నిలిచినవారిని తొలగించాలనే తప్పుడు భావనలు పెరిగిపోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య భావోద్వేగ బంధం లేనప్పుడు ప్రేమ ఒక వ్యసనంగా మారుతుంది. పిల్లలకు చిన్న వయసులోనే ఎమోషనల్ ఎడ్యుకేషన్ అందించడం ఇందుకు ఒక పరిష్కారం. తల్లిదండ్రులు పిల్లల మార్కులు, ర్యాంకుల కంటే వారితో బంధానికి ఎక్కువ విలువనివ్వాలి. వారి భావాలను అర్థం చేసుకోవాలి, వారి ప్రైవసీని గౌరవించాలి. - సైకాలజిస్ట్ విశేష్

విలువలు నేర్పకపోవడం వల్లే..



చిన్న వయసులోనే ప్రేమ అనే భ్రమలో పడుతున్నారు. అది తల్లిదండ్రుల కంటే ఎక్కువనుకుంటున్నారు. తల్లిదండ్రులతో సరైన సంబంధాలు లేకపోవడం, వాళ్లని సరిగా అర్థం చేసుకోలేకపోవడం ఇందుకు కారణాలు.అందుకే పిల్లలతో ఎంత సమయం గడుపుతున్నారనేది చాలా ముఖ్యం. చాలా మంది టీచర్లు, తల్లిదండ్రులు పిల్లలకు ఎలాంటి విలువలు నేర్పడంలేదు. బాల్యం నుంచే విలువలతోపాటు నేరాలు-చట్టాలపై అవగాహన కల్పించాలి. - డా. మమతా రఘువీర్, తరుణి స్వచ్ఛంద సంస్థ





'మక్క'వోని కృషి..

వానలు లేక ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించి పోస్తున్న రైతు

భిక్కనూరు: వరుణుడు మొహం చాటేయడంతో రైతులు దిగాలు పడుతున్నారు. వేసిన పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లికి చెందిన ఆముదాల రమేశ్ ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని మక్క పంట వేశాడు. పంటను కాపాడుకోవడానికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నాడు. ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించి, బకెట్లలో నింపి మగ్గులతో మొక్కల మొదళ్లలో పోస్తూ పంట ప్రాణాలు నిలిపే ప్రయత్నం చేశాడు.



వానలు కురిపించి బతుకునివ్వమ్మా..

రాజాపేట: కొన్ని రోజులుగా వర్షం కురవకపోవడంతో పత్తి మొలకలు ఎండిపోతున్నాయి. దీంతో వర్షాలు కురవాలని కోరుకుంటూ మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలో మహిళా రైతులు బతుకమ్మ ఆట ఆడారు. నీళ్ల బిందెల్లో పసుపు, కుంకుమ వేసి, వేప కొమ్మలు అమర్చి వరుణుడు, శివుడు, గంగామాతను వేడుకుంటూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం శివాలయం, గంగాభవాని దేవాలయాలు, బొడ్రాయి పైన జలాభిషేకం నిర్వహించారు.

'ఆద్య కళా - జనజాతి దర్పణ్' మ్యూజియాల ఎంఓయూ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రపతి భవన్‌లోని జనజాతి దర్పణ్ మ్యూజియం రెండో ఏడాది ప్రదర్శనకు ఆద్య కళా మ్యూజియం సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ కార్యక్రమం మంగళవారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఐజీఎన్‌సీఏ మెంబర్ సెక్రటరీ సచ్చిదానంద జోషి, ఆద్య కళా మ్యూజియం సేకర్త జయధీర్ తిరుమలరావు, ఆచార్య కె.అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జూలైలో తిరుమలలో విశేష ఉత్సవాలివే...

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలైలో జరగనున్న విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ మంగళవారం వెల్లడించింది. 5న పెరియాళ్వార్ శాత్తుమొర, 6న శయన ఏకాదశి, చాతుర్మాస్య వ్రతారంభం, 7న శ్రీనాథ మునుల వర్ష తిరు నక్షత్రం, 10న గురు పౌర్ణమి గరుడ సేవ, 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం, 25న చక్రత్తాళ్వార్ వర్ష తిరు నక్షత్రం, 28న తిరుమల శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేపు, 29న గరుడ పంచమి, శ్రీవారి గరుడ సేవ, 30న కల్కి జయంతి, కశ్యప మహర్షి జయంతిని నిర్వహించనుంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
బుధవారం । 25 । జూన్ । 2025

కబళిస్తున్న 'కేన్సర్'!


మూడేళ్లలో దేశవ్యాప్తంగా పెరిగిన కేసులు

- ఇదే కొనసాగితే 2040 నాటికి తీవ్రరూపం
- అత్యధికంగా రొమ్ము, గొంతు, రక్త, నోటి కేన్సర్‌లు
- విస్తృతిలో ముందున్న యూపీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్‌లు
- 8, 11 స్థానాల్లో ఏపీ, తెలంగాణ
- హైదరాబాద్‌లో రొమ్ము కేన్సర్ కేసులు.. ఉమ్మడి వరంగల్‌లో రక్త, ఎముక కేన్సర్‌లు

సాక్షి ప్రతినిధి, వరంగల్: విస్తృతంగా విస్తరిస్తున్న కేన్సర్ మహమ్మారి ప్రజలు, ప్రభుత్వాలకు సవాల్ విసురుతోంది. వేగంగా ప్రబలుతున్న ఈ వ్యాధి దేశాన్నే కలవరపెడుతోంది. చాపకింద నీరులా అయిదేళ్లుగా తెలుగు రాష్ట్రాల్లోనూ ఎగబాకింది. అధికారిక గణాంకాల ప్రకారం.. దేశవ్యాప్తంగా 5 ఏళ్లలో కేన్సర్ కేసుల సగటు పెరుగుదల 11.55 శాతంగా ఉంది. ఏపీలో 9 శాతం, తెలంగాణలో 10 శాతం చొప్పున కేసులు పెరిగాయి. మృతుల సంఖ్య కూడా దేశవ్యాప్తంగా లక్షల్లోనే ఉంది. రాష్ట్రంలో నమోదవుతున్న కేసుల్లో 41 శాతం రొమ్ము, గర్భాశయ ముఖద్వార, రక్త, నోటి కేన్సర్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా రాష్ట్రాలు / యూటీలలో కేన్సర్ పరిస్థితిపై ఇటీవలి భారతీయ ప్రజారోగ్య సంస్థ (ఐపీహెచ్) నివేదికపై ఏప్రిల్ 1న పార్లమెంట్‌కు కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపిన ఈ వివరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కాగా కేన్సర్ ఇదే విధంగా కొనసాగితే.. జనాభాలో మార్పుల కారణంగా 2040 నాటికి కేసులు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని నిపుణులు, నివేదికలు హెచ్చరిస్తున్నాయి.

కేన్సర్ వ్యాప్తికి ఇవే కారణాలు

90–95 శాతం కేన్సర్లు జీవనశైలి, పర్యావరణ కారకాల వల్ల వస్తాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ధూమపానం, మద్యపానం, పాన్, గుట్కా వంటివి నమలడం, ఊబకాయం, మానసిక ఒత్తిడి, మర్మావయవాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం, ఎక్కువ మందితో లైంగిక సంబంధాలు కేన్సర్‌కు కారకాలుగా చెబుతున్నారు. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పౌష్టికాహారం లోపించడం, 18 ఏళ్లలోపే పెళ్లి కావడం, పిల్లలు పుట్టడం, ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం, 35 ఏళ్లు దాటాక గర్భధారణ, బిడ్డకు తల్లిపాలు పట్టకపోవడం, తక్కువ పండ్లు, కూరగాయల వినియోగం కేన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయని అంటున్నారు. వ్యవసాయంలో రసాయనాల వాడకం కూడా కేన్సర్ వ్యాప్తికి ఒక కారణం కావచ్చని నివేదికలు చెబుతున్నాయి.



స్క్రీనింగ్ టెస్టులకు ముందుకు రావాలి..



కేన్సర్‌ను గుర్తించేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించింది. జిల్లాల్లో 18 ఏళ్లు నిండిన వారికి ఉచితంగా స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నారు. హనుమకొండ జిల్లాలో ఏడాదిలో 600కు పైగా కేన్సర్ కేసులున్నాయి. వీరిలో 102కు పైగా నోటి కేన్సర్‌తో బాధపడుతున్న వారే.. గుట్కా, పొగాకు వల్ల నోటి కేన్సర్, ధూమపానం వల్ల ఊపిరితిత్తుల కేన్సర్ వస్తున్నాయి. నలభయ్యేళ్లు దాటిన స్త్రీలు రొమ్ము కేన్సర్ రాకుండా ఆరు నెలలకోసారి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

– ఎ.అప్పయ్య, డీఎంహెచ్‌వో, హనుమకొండ జిల్లా

తెలుగు రాష్ట్రాల్లోనూ అధికమే..



కేన్సర్ కేసుల ఉధృతి తెలుగు రాష్ట్రాల్లోనూ ఎక్కువగానే ఉంది. దేశవ్యాప్తంగా చూస్తే.. ఆంధ్రప్రదేశ్ 8, తెలంగాణ 11 స్థానాల్లో ఉన్నాయి. ఏపీలో 2022లో 73,536 కేసులు ఉండగా, 2023లో 75,086, 2024లో 76,708గా, తెలంగాణలో మూడేళ్లలో 49,983, 51,145, 52,334ల కేసులు నమోదయ్యాయి. కాగా తెలంగాణలోని హైదరాబాద్‌లో రొమ్ము కేన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, పొగాకు, మద్యపానం, ఆహారపుటలవాట్లు, వ్యవసాయంలో రసాయనాల వాడకం వంటివి వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఉమ్మడి వరంగల్‌కు వస్తే పురుషుల్లో ఊపిరితిత్తులు, శ్వాసనాళం, తల, గొంతు, బోన్, రక్త (లుకేమియా), ప్రోస్టేట్ కేన్సర్లు ఎక్కువగా ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అత్యల్పంగా 28, 31, 32 కేసుల చొప్పున వరుసగా మూడేళ్లలో లక్షద్వీప్‌లో, డామన్‌లో 150 నుంచి 173, దాద్రా నగర్ హవేలీలో 238ల నుంచి 268లు, లద్దాఖ్‌లో 302 నుంచి 318కు కేన్సర్ కేసులను గుర్తించారు.

మొదటి స్థానాల్లో యూపీ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌లు

కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వశాఖ ఈ ఏడాది ఏప్రిల్ 1న పార్లమెంట్‌లో.. మూడేళ్లలో విస్తరించిన కేన్సర్ కేసులపై రాష్ట్రాల వారీగా నివేదిక సమర్పించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 2022లో 14,61,427 కేసులు నమోదైతే, 2023 నాటికి 14,96,972కు పెరిగాయి. 2024 వచ్చేసరికి కేసుల సంఖ్య 15,33,055 గా నమోదైంది. కాగా రాష్ట్రాల వారీగా చూస్తే 2022, 2023, 2024లలో మూడేళ్లపాటు వరుసగా 2,10,958, 2,15,931, 2,21,000 కేసులతో.. దేశంలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో 1,21,717, 1,24,584, 1,27,512లతో మహారాష్ట్ర, ఆ తర్వాత స్థానంలో పశ్చిమ బెంగాల్‌లో 1,13,581, 1,16,230, 1,18,910 కేన్సర్ కేసులు పెరిగాయి. 4, 5, 6, 7 స్థానాల్లో బిహార్, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లు ఉన్నాయి.

దేశంలో గత మూడేళ్లలో గుర్తించిన అన్ని రకాల కేన్సర్ కేసులు

రాష్ట్రం	2022	2023	2024
జమ్మూకశ్మీర్	13,395	13,744	14,112
లద్దాఖ్	302	309	318
హిమాచల్ ప్రదేశ్	9,164	9,373	9,566
పంజాబ్	40,435	41,337	42,288
చండీగఢ్	1,088	1,120	1,152
ఉత్తరాఖండ్	12065	12,348	12,642
హరియాణా	30,851	31,679	32,513
ఢిల్లీ	26,735	27,561	28,387
రాజస్తాన్	74,725	76,655	78,604
ఉత్తరాప్రదేశ్	2,10,958	2,15,931	2,21,000
బిహార్	1,09,274	1,12,180	1,15,123
సిక్కిం	496	525	561
అరుణాచల్‌ప్రదేశ్	1,087	1,125	1,143
నాగాలాండ్	1854	1890	1,935
మణిపూర్	2,097	2,169	2,260
మిజోరం	1,985	2,063	2,114
త్రిపుర	2,715	2,790	2871
మేఘాలయ	3,025	3,099	3,168
అస్సాం	39,787	40,721	41,713
పశ్చిమ బెంగాల్	1,13,581	1,16,230	1,18,910
జార్ఖండ్	35,860	36,840	37,824
ఒడిశా	52,960	54,136	55,335
ఛత్తీస్‌గఢ్	29,253	30,014	30,763
మధ్యప్రదేశ్	81,901	84,029	86,124
గుజరాత్	73,382	75,290	77,205
డయ్యూ డామన్	150	161	173
దాద్రా నగర్‌హవేలీ	238	252	268
మహారాష్ట్ర	1,21,717	1,24,584	1,27,512
తెలంగాణ	49,983	51,145	52,334
ఆంధ్రప్రదేశ్	73,536	75,086	76,708
కర్ణాటక	90,349	92,560	94,832
గోవా	1,700	1,735	1,783
లక్షద్వీప్	28	31	32
కేరళ	59,143	60,162	61,175
తమిళనాడు	93,536	95,944	98,386
పుదుచ్చేరి	1,679	1,753	1,823
అండమాన్ నికోబార్	393	401	408
మొత్తం	14,61,427	14,96,972	15,33,055

బీసీ రిజర్వేషన్లపై ప్రధానిని బీజేపీ మంత్రులెందుకు కలవరు?

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచకుండా అన్యాయం చేస్తుంటే.. రాష్ట్ర బీజేపీ నేతలు రిజర్వేషన్లు అమలు కాకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరడం ఏంటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలని ప్రధాని నరేంద్రమోదీని కేంద్రమంత్రులు ఎందుకు కలవరని మంగళవారం ఒక ప్రకటనలో నిలదీశారు. బీసీ బిల్లు కేంద్రంలో ఆమోదించకుండా రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించాలనడం కిషన్‌రెడ్డి, మహేశ్‌రెడ్డికి తగదని, కోర్టు తీర్పు ఎలా ఉన్నా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడిని పెంచాలని డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్ చేర్చి అమలు చేయాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జరిగిన కేబినెట్ సమావేశంలో అందరూ ఊహించినట్టు కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయాన్ని తీసుకోకపోవడాన్ని స్వాగతిస్తున్నామని జాజుల అన్నారు. ఇదే సమయంలో కేంద్రంపై ఇంకా ఒత్తిడి పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని తీసుకుని ఢిల్లీకి వెళ్లి ప్రధానిని కలవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి జూలై మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులను దిగ్బంధిస్తామని, రాష్ట్రంలో బీసీ ద్రోహుల పార్టీ కార్యాలయాలను ముట్టడించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని జాజుల హెచ్చరించారు.



తిరుమల శ్రీవారిని దర్శించుకున్న శాసన మండలి చైర్మన్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, కుటుంబ సభ్యులు

బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి కవలలు: కాసం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్–కాంగ్రెస్ అవినీతిలో కవలలని.. పరస్పరం రక్షించుకోవడానికి ఎన్ని కసరత్తులు చేస్తున్నాయో స్పష్టంగా కనిపిస్తోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ఆరోపించారు. మంగళవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న సీఎం రేవంత్‌రెడ్డి... ఇప్పటివరకు సీబీఐ విచారణను ఎందుకు కోరడంలేదని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డిని కేసీఆర్ కాపాడితే.. ఇప్పుడు కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్‌ను రేవంత్ కాపాడుతున్నారని దుయ్యబట్టారు. గతంలో కేసీఆర్ రూ. 10 లక్షల కోట్ల మేర అప్పులు చేశారంటూ విమర్శించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు సీఎం పగ్గాలు చేపట్టాక అదే దారిలో కొనసాగుతున్నారని కాసం విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు మొట్టికాయలు వేస్తుందన్న భయంతోపాటు పోటీకి అభ్యర్థులు దొరకరన్న ఆందోళనతోనే రైతు భరోసా పేరిట ప్రభుత్వం హడావుడిగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గంటలపాటు కేబినెట్ భేటీ నిర్వహించినా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ఏమీ తేల్చలేదని కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు.

శంకరయ్య ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత

తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: మాజీ సర్పంచ్ దాసరి శంకరయ్య ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుర్వి యాదయ్యగౌడ్, రాంపాక నాగయ్య డిమాండ్ చేశారు. వారు మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గొల్లపల్లి మండలం బీబీరాజ్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ దాసరి శంకరయ్య రూ.10 లక్షలు అప్పు చేసి అభివృద్ధి చేశారన్నారు. ఇప్పుడు ఆ బిల్లులు రాకపోవడంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి గ్రామ అభివృద్ధి చేశామని, ఇప్పుడు ఆ బిల్లులు రాక మాజీ సర్పంచ్‌ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.



మేడిపల్లి ఓసీపీ క్వారీలో నీటి నిల్వలు

సింగరేణి విద్యుత్ ప్లాంట్‌కు ముందడుగు

గోదావరిఖని

సింగరేణి జల విద్యుదుత్పత్తికి మరో ముందడుగు పడింది. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని మేడిపల్లి ఓసీపీలో ఏర్పాటు చేయనున్న సింగరేణి పంప్‌డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్ డీపీఆర్ రూపకల్పనకు.. ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ వ్యాప్కోస్ లిమిటెడ్‌తో సింగరేణి ఒప్పందం కుదుర్చుకుంది. సంస్థ తన వ్యాపార విస్తరణలో భాగంగా ఆధునిక టెక్నాలజీతో నడిచే పంప్‌డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే థర్మల్, సౌర విద్యుత్ రంగాల్లో పటిష్టంగా ముందుకు సాగుతూ లాభాలను ఆర్జిస్తోంది. తాజాగా మూసివేసిన మేడిపల్లి ఓసీపీలో పంప్‌డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పాలని నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రాథమిక అధ్యయనాలను సంస్థ ఇప్పటికే పూర్తి చేసింది. పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టు రూపొందించడానికి.. దీనిలో అనుభవం ఉన్న వ్యాప్కోస్ సంస్థకు లెటర్ ఆఫ్ అవార్డును అప్పగించింది.

రాష్ట్రంలో ఇదే ప్రథమం..

ఈ తరహా ప్రాజెక్టు ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎవరూ చేపట్టలేదు. సింగరేణి సంస్థ దీన్ని ప్రయోగాత్మకంగా నిర్మిస్తోంది. ఈ ప్రాంతాన్ని గతేడాది సెప్టెంబర్‌లో ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క సందర్శించి వెళ్లారు. ఈప్రాజెక్టు ఏర్పాటుతో సంస్థకు అదనపు ఆదాయం లభించడంతోపాటు వృథాగా ఉన్న ప్రాజెక్టు క్వారీని వినియోగం తీసుకురావచ్చని సంస్థ భావిస్తోంది.

సాంకేతిక విశ్లేషణ..

పంప్‌డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్‌లో ఆధునిక టెక్నాలజీని వినియోగించనున్నారు. వ్యాప్కోస్ సంస్థ మేడిపల్లి ఓపెన్‌కాస్ట్‌లో సంపు ఆధారంగా 500 మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మించడానికి అధ్యయనం జరుపుతోంది. జియొలాజికల్, జియోటెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాలతో పాటు సివిల్ డిజైన్లు, ఉత్పత్తి సామర్థ్యం, మెకానికల్, ఎలక్ట్రికల్ డిజైన్లు, పర్యావరణ సంబంధిత అంశాలు, రక్షణ చర్యలు వంటి విషయాలపై సమగ్ర అధ్యయనాన్ని జరిపి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను రూపొందిస్తుంది. ప్లాంట్ నిర్మాణానికి పట్టే సమయం, నిర్మాణ ఖర్చు, ప్లాంట్ పూర్తయిన తర్వాత ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్‌పై సింగరేణికి నివేదికను అందించనుంది.



సాధ్యమైనంత త్వరలోనే..

సాధ్యమైనంత త్వరగా డీపీఆర్ పూర్తి చేసుకుని నిర్మాణ దశలోకి వెళ్తాం. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పంప్‌డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్ నెలకొల్పడం గర్వకారణం. దీనివల్ల 500 మెగావాట్ల విద్యుదుత్పత్తి అందుబాటులోకి వస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. మూడు నెలల్లో నివేదిక అందజేయాలని కోరాం. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ, సెంట్రల్ వాటర్ కమిషనర్ అనుమతి కూడా కోరాం. అవన్నీ సమకూర్చుకుని త్వరగా పనులు ప్రారంభిస్తాం.

– ఎన్.బలరాం, సీఎండీ, సింగరేణి

- వ్యాప్కోస్‌కు పంప్‌డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్ డీపీఆర్ బాధ్యతలు
- ఇప్పటికే పరిశీలించి వెళ్లిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మూడునెలల్లో ప్రాజెక్టు రిపోర్టు అందే అవకాశం

పీఎస్‌పీ సమాచారం

ప్రాజెక్టు పేరు	: పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్
విద్యుదుత్పత్తి	: 500 మెగావాట్లు
ప్రాజెక్టు వ్యయం	: రూ.3 వేల కోట్లు
జీవిత కాలం	: 40 ఏళ్లు
డీపీఆర్ పొందిన సంస్థ	: వ్యాప్కోస్ లిమిటెడ్



ప్లాంట్ శాటిలైట్ ముఖచిత్రం

500 మెగావాట్ల విద్యుత్..

ప్రస్తుతం మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ గనిలో సుమారు 157 మీటర్ల లోతున భారీ నీటిసంపు ఏర్పడి.. ఏడాది పొడవునా భారీ పరిమాణంలో నీరు నిల్వ ఉంటుంది. నీటిని పైకి ఎత్తిపోసి.. నిల్వ కోసం 2,350 మీటర్ల పొడవుతో 23 మీటర్ల లోతున్న రిజర్వాయర్‌ను నిర్మించనున్నారు. ఈ రిజర్వాయర్‌లో 9.64 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ చేస్తారు. దీనిలో నుంచి పంపింగ్ కోసం 8 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని వినియోగిస్తారు. ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.3000 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. నలభయ్యేళ్ల జీవితకాలం ఉండే ఈ పంప్‌డ్ స్టోరేజీ ప్లాంట్ మంచి లాభాలను ఆర్జిస్తుందని ఆశిస్తున్నారు.



మబ్బుల ముసుగులో మహానగరం

ఒకవైపు అఖండ జలధి.. మరోవైపు మేఘాలను తాకే మేరువులు, వీటి మధ్య ఒద్దికగా ఒదిగిపోయిన సుందర విశాఖ నగరం. మంగళవారం మధ్యాహ్నం నగరాన్ని మబ్బులు చుట్టుముట్టిన సమయంలో కైలాసగిరిపై నుంచి చూస్తే పచ్చని కొండలు, ఆకాశ హార్మ్యాలతో విశాఖ నగరం పర్యాటకులను అమితంగా ఆకట్టుకుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఫీట్లు చేస్తే తప్పవు పాట్లు

సెల్ఫీ మోజులో పడి కొంతమంది యువత ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్న వీరిలో మార్పు రావడం లేదు. విశాఖ పైనాపిల్ కాలనీ బీఆర్‌టీఎస్ రోడ్డులో ఓ యువకుడు వేగంగా వెళ్తున్న సీటుపై నిలబడి ఇలా సెల్ఫీ తీసుకున్నాడు. అతని పక్కన వెళ్తున్న వారంతా పడిపోతాడేమో అని ఆందోళన చెందారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





ఫలరాజుకు గడ్డుకాలం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి దారుణంగా తయారయ్యింది. పండిన పంటను మార్కెట్‌కు తీసుకుపోతే కొనేవారులేని పరిస్థితి. తిరుచానూరు మార్కెట్‌కు మామిడికాయలు తీసుకొచ్చిన రైతులు అక్కడ కొనేవారు లేకపోవడంతో ఇలా పక్కనే పారబోసేస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

క్లుప్తంగా...

విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల బోర్డు ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహకార సంస్థ (ఏపీడీఏఎస్‌సీఏసీ)కు ప్రభుత్వం బోర్డు ఏర్పాటు చేసింది. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు సంబంధించిన అంశాలపై నిర్ణయాలు తీసుకునేందుకు ఈ బోర్డుకు అధికారం ఉంటుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి చైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ బోర్డులో ఏపీడీఏఎస్‌సీఏసీ మేనేజింగ్ డైరెక్టర్‌ను కన్వీనర్‌గా నియమించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మానసిక ఆరోగ్య కౌన్సిలర్లు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించేందుకు మానసిక ఆరోగ్య కౌన్సిలర్లు, పాఠశాల కౌన్సిలర్లను పునర్నియమిస్తూ సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. గత విద్యా సంవత్సరం రెండు విడతల్లో విధుల్లోకి తీసుకున్న 255 మంది సేవలను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పొడిగించారు. ప్రతి కౌన్సిలర్‌కు రెండు లేదా మూడు మండలాల్లోని 18 నుంచి 20 పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు.

ఒకే రోజు విచారిస్తాం

విద్యుత్ సంస్థల పిటిషన్లపై ఏపీఈఆర్‌సీ

సాక్షి, అమరావతి : ఏపీ ట్రాన్స్‌కో, ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు సమర్పించిన పిటిషన్లపై జూలై 9న ఒకేరోజు బహిరంగ విచారణ చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) మంగళవారం వెల్లడించింది. అదే విధంగా యాక్టివ్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 1.4 మెగావాట్ల మినీ హైడల్ ప్రాజెక్ట్ నుంచి విద్యుత్ తీసుకునేందుకు ఏపీసీపీడీసీఎల్ సమర్పించిన పిటిషన్‌పైనా కమిషన్ అదే రోజు విచారించనుంది. ఈ ప్రాజెక్టు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణది కావడం గమనార్హం.

రెడ్‌క్రాస్ వాహనాలకు రోడ్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలి

సాక్షి, అమరావతి : రెడ్‌క్రాస్ అంబులెన్సులు, రక్త సేకరణ వాహనాలకు రోడ్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ చైర్మన్ వైడీ రామారావు, ఆ సంస్థ రాష్ట్ర కోశాధికారి పి. రామచంద్రరాజు ప్రభుత్వాన్ని కోరారు. వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు.

ఆయిల్‌పామ్ ధర పతనం



పదిరోజుల వ్యవధిలో టన్నుకు రూ.2 వేల వరకు తగ్గిన ధర

- దిగుమతి సుంకం తగ్గడమే కారణం
- ఆందోళనల్లో ఆయిల్‌పామ్ రైతులు
- సీజన్‌లో మరింత పతనమవుతాయని ఆందోళన

సాక్షి ప్రతినిధి,ఏలూరు: కోకో ధరలు మాదిరిగానే ఆయిల్‌పామ్ ధరల పతనం ప్రారంభమైంది. గతేడాది నిలకడగా కొనసాగిన ధరలు నేడు పూర్తిగా తిరోగమన బాట పట్టాయి. పది రోజుల వ్యవధిలోనే టన్నుకు రూ.2 వేల మేర తగ్గింది. ఈ ధర మరింత తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుమతి సుంకం తగ్గింపు ప్రభావం ధరలపై పడటంతో అంతిమంగా రైతులు నష్టపోతున్నాడు. పది రోజుల క్రితం వరకు రూ.20,290 పలికిన టన్ను ధర రూ.18,650కు చేరింది. రాష్ట్రంలోనే ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది.

అంతర్జాతీయ పరిణామాలు, ముడిచమురు ధరల ఆధారంగా ఆయిల్‌పామ్ ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతుంటాయి. అంతర్జాతీయంగా ఆయిల్‌పామ్‌కు మంచి డిమాండ్ ఉన్నా కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఇతర పరిస్థితులతో రైతు పూర్తిగా నష్టపోతున్నాడు. గతేడాది వరకు ఆయిల్ పామ్ దిగుమతిపై 27.50 శాతం దిగుమతి సుంకం ఉండటంతో దేశీయ సాగు విక్రయాలపైనే నూరు శాతం ఆధారపడి డిమాండ్‌ను బట్టి దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 27.50 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని 17.50 శాతానికి తగ్గించారు. దీన్నే అదునుగా భావించి మార్కెట్‌లో కంపెనీలు, వ్యాపారులు ధరలు తగ్గించుకుని కొనుగోళ్లకు తెరదీశారు. వారానికి సగటున టన్నుకు వెయ్యి మేర పతనమవుతూ రెండు వారాల్లోనే రూ.2 వేల మేర పతనమైంది. 2023లో రికార్డు స్థాయిలో రూ.23 వేలు పలికిన ఆయిల్‌పామ్ టన్ను ధర ప్రస్తుతం రూ.18 వేలకు చేరింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గోదావరి పరివాహక ప్రాంతం కావడంతో గాలిలో తేమ శాతం కొంత మేర అధికంగా ఉండటంతో ఆయిల్‌పామ్ సాగుకు జిల్లా వాతావరణం పూర్తిగా అనుకూలం. దీంతో గత 15 ఏళ్ళుగా ప్రతి ఏటా జిల్లాలో సాగు విస్తీర్ణం పెరుగుతూనే వచ్చింది. రెండేళ్ళ క్రితం వరకు 1.27 లక్షల ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్ సాగు ప్రస్తుతం 1.40 లక్షల ఎకరాలకు చేరింది. ఆయిల్‌పామ్ ధర పతనంతోపాటు అనుబంధ ఉత్పత్తులైన ఫైబర్, గింజ, మొలాసిస్ ధరలు కూడా పతనమవుతూ ఉన్నాయి. సగటున రూ.3 వేల వరకు అనుబంధ ఉత్పత్తులకు టన్ను ధర రావాల్సి ఉన్నా రైతుకు వెయ్యికి మించి దక్కని పరిస్థితి. దిగుమతి సుంకం ప్రభావం దీనిపై అధికంగా ఉంది.

2022లో రికార్డు స్థాయి ధర

ఆయిల్ పామ్ రైతులకు 2022 సువర్ణయుగంగా ప్రకటిస్తారు. రికార్డు స్థాయిలో ఎన్నడూ లేని విధంగా టన్నుకు రూ.26 వేల ధర లభించింది. ఇప్పటి వరకు కూడా ఇదే ఆల్‌టైం అత్యధిక ధర. 2017 నుంచి ఆయిల్‌పామ్ ధరల్లో పెరుగుదల ప్రారంభమైంది. 2018లో రూ.8600, 2020లో రూ.10 వేలు, 2021లో రూ.17,951, 2022లో రూ.26 వేలు, 2023లో టన్ను ధర రూ.23 వేలు ఉండగా.. 2024 మే నాటికి మళ్లీ తిరోగమనబాట పట్టి రూ.13,180కు చేరింది. ఈ ఏడాది జనవరి నాటికి రూ.20 వేల వరకు చేరడంతో రైతు ఊపిరి పీల్చుకున్నాడు. జిల్లాలో అత్యధిక మండలాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉంది. రికార్డు స్థాయిలో ధర రావడంతో ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు ఉన్న కౌలు మూడేళ్ళ వ్యవధిలోనే రూ.లక్ష దాటింది. ఇప్పుడు ధర తగ్గడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 7 నుంచి 10 టన్నుల దిగుబడి వస్తుంది. సరాసరి 8 టన్నులు విక్రయిస్తే రూ.1.48 లక్షలు ఆదాయం రాగా లక్ష కౌలు, పెట్టుబడులు రూ.60 వేలు కలిపి రూ.1.60 లక్ష ఖర్చుతో కౌలు రైతు అప్పుల్లో మునిగిపోతున్న పరిస్థితి.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం పరిపాలనలో ఉన్న నేపథ్యంలో ఆయిల్ పామ్ రైతులను ఆదుకుని మద్దతు ధర కల్పించాలి. ఇప్పటికే ఆయిల్‌పామ్ ధరలు పతనమవుతున్నాయి. వాటిని స్థిరీకరించి రైతు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి. ఇంతవరకు రైతు ఎంత వరకు నష్టపోయారో నష్టపరిహార రూపంలో అందించాలి. రైతుల విషయంలో సమీక్షల పేరుతో కాలయాపన చేయకుండా త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలి.
–కే.శ్రీనివాస్, రాష్ట్ర రైతు సంఘ నేత

దిగుమతి సుంకంతో నష్టం



ఆయిల్‌పామ్‌కు గతంలో 27.5 శాతంగా ఉన్న దిగుమతి సుంకం ఇప్పుడు 10 శాతం తగ్గించటంతో పెట్టుబడి పెరిగి పామాయిల్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో టన్ను రూ.23 వేలు ఉన్న ధర ప్రస్తుతం దిగజారిపోయింది. ప్రభుత్వం స్పందించి పామాయిల్ ధర పెంచి రైతులను ఆదుకోవాలి.
–సాయన కనకరాజు, రైతు, కామవరపుకోట

26 ఎకరాలైనా చూపించండి... తల్లికి వందనమైనా ఇప్పించండి!

కోడుమూరు రూరల్: ' నా ముగ్గురు పిల్లలకు ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకం కింద డబ్బులు రాలేదు. కారణం అడిగితే 26 ఎకరాల పొలముందంటూ చెబుతున్నారు.. డబ్బులైనా ఇప్పించండి.. లేదా పొలమైనా చూపించండంటూ' కోడుమూరుకు చెందిన గాయత్రి అనే మహిళ అధికారులను వేడుకుంటోంది. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ నాగరాజుకు మొర పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు నలుగురు సంతానం కాగా, ముగ్గురు కుమార్తెలు, రెండేళ్లలోపు ఒక బాలుడు ఉన్నారన్నారు. ఇందులో ముగ్గురు కుమార్తెలు ప్రస్తుతం 1, 4, 5వ తరగతులు చదువుతున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం డబ్బులు జమ కాలేదన్నారు. విషయం తెలుసుకోగా తమ కుటుంబం పేరు మీద 26 ఎకరాల భూమి ఉన్నట్లుగా చూపిస్తోందని, దీని వల్ల తమకు తల్లికి వందనం పథకం డబ్బులు పడలేదని వాపోయారు. తమ పేరు మీద కేవలం ఎకరా 85 సెంట్ల భూమి మాత్రమే ఉందని, అధికారులు చర్యలు తీసుకుని తమకు తల్లికి వందనం పథకం వర్తించేలా చూడాలని ఆమె తహసీల్దార్‌తో మొరపెట్టుకున్నారు. గాయత్రి ఇచ్చిన అర్జీని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు.



తహసీల్దార్ నాగరాజుకు అర్జీ అందజేస్తున్న మహిళ గాయత్రి

డబుల్ ఇంజిన్ కాదు... డబుల్ భారాల సర్కారు

- తలకిందులుగా కూటమి ప్రభుత్వ ఏడాది పాలన
- చంద్రబాబు సమర్థత ఆగిపోయింది
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు వరాలు ఇస్తూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలన తలకిందులుగా నడుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ఇది డబుల్ ఇంజన్ సర్కారు కాదని, డబుల్ భారాల సర్కారు అని చెప్పారు. కూటమి ఏడాది పాలన సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన ప్రజెంటేషన్‌పై శ్రీనివాసరావు విజయవాడలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 2014 తరువాత చంద్రబాబులో సమర్థత, అనుభవం ఆగిపోయిందన్నారు. రాష్ట్రానికి రూ.9.40 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు కూటమి ప్రభుత్వం చెబుతోందని, ఆ పెట్టుబడులతో వచ్చిన పరిశ్రమలు ఏంటో, ఉపాధి ఏంటో, ప్రజలకు చెప్పాలన్నారు. ప్రభుత్వ రంగంలోని మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తున్నారని విమర్శించారు. పి–4 పేరుతో కార్పొరేట్లు పేదలను ఆదుకుంటారని చెబుతున్నారని, నిజంగా వారికి అంత ప్రేమే ఉంటే వారి కంపెనీలు, పరిశ్రమల్లో కార్మికుల వేతనాలు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ భాష శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉందని, తీరు మార్చుకోకపోతే రాష్ట్రంలో అరాచకం, అశాంతి పెరిగిపోతాయన్నారు.

అమ్మ ఓడి.. పోయింది

కన్న కొడుకును చూసి కనుమూయాలని చివరి క్షణం వరకు తల్లి ఆవేదన

- 20 ఏళ్ల క్రితం విడిచిపోయిన కొడుకు
- తల్లి చావుబతుకుల్లో ఉందంటే చూసేందుకైనా రాని కాఠిన్యం
- అధికారుల వార్నింగ్‌తో అంతిమ సంస్కారాలకు హాజరు

చివరి రోజుల్లో.. చిట్టచివరి క్షణాల్లో.. కొడుకు కంటి చూపు, స్పర్శ కోసం పరితపించిన ఓ తల్లి వ్యథ ఇది. కాటికేగే వేళ కన్నబిడ్డను కళ్లారా చూసుకుంటే చాలనుకున్న ఓ వ్యథార్థ మాతృమూర్తి యథార్థ గాథ ఇది. అంతిమ ఘడియల్లో అన్నీ తెలిసి కొడుకు కావాలనే రాలేదన్న గుండె పగిలే చేదు నిజాన్ని తాళలేక ఆ కన్నీటి వ్యథతోనే కన్ను మూసిన ఓ అమ్మ కథ ఇది. అప్పుడెప్పుడో 20 ఏళ్ల క్రితం వదిలిపోయావనీ, నాటి నుంచి కంటికి కానరాలేదనీ, చిట్టచివరిగా ఒక్కసారి కనిపించి వెళ్లపో నాయనా అంటూ తల్లి అచేతన స్థితిలో వీడియో పంపి మరీ వేడుకున్నా ఆ కొడుకు మనసు కరగలేదు. పుత్రరత్నం తాను ఉన్న హైదరాబాద్ నుంచి తల్లి ఉన్న కాకినాడకి తీరిక చూసుకొని చేరేసరికి ఆయువు పోసిన అమ్మ ఊపిరి అనంత వాయువుల్లో కలిసిపోయింది. ఆ అమాయకపు తల్లి రాజేశ్వరి అయితే, కాఠిన్యం నిండిన ఆ కొడుకు పేరు జోష్యబట్ల రాజశేఖర్. తనువు చాలించే వేళ బిడ్డను చూస్తే చాలనుకుంది. పున్నామ నరకం నుంచి తప్పించడమే ఎక్కువనుకొని చిట్ట చివరి వేళ కట్టె గుట్టకి నిప్పంటించి నిష్క్రమించాడా కొడుకు. ఈ హృదయ విదారక ఘటన కాకినాడలో చోటు చేసుకుంది. – కాకినాడ క్రైం



జోష్యబట్ల రాజేశ్వరి(ఫైల్)

కొడుకు కోసమే యావత్ జీవితం

కాకినాడ దేవాలయం వీధి వినుకొండ వారి వీధికి చెందిన జోష్యబట్ల రాజేశ్వరి(70) తన ఒక్కగానొక్క కుమారుడి కోసం తన యావత్ జీవితాన్ని అర్పించింది. ఈమెకి 45 ఏళ్ల కుమారుడు రాజశేఖర్ ఉన్నాడు. బిడ్డను కని భర్త వదిలిపోయినా టైలరింగ్ చేస్తూ కుమారుడిని చదివించింది. పదవ తరగతి అనంతరం విడిచిపోయిన తండ్రి పిలుపుతో రాజశేఖర్ కేరళ వెళ్లాడు. కొన్నేళ్ల తర్వాత తల్లి వద్దకు వచ్చాడు. ఉద్యోగం కోసం వెతుకుతుంటే తల్లి.. తెలిసిన వారి సాయంతో కాకినాడలో ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం వేయించింది. అదే సమయంలో తల్లిని పిలవకుండానే ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. ఒకసారి భార్యను చూపించి, నాటి నుంచి తల్లిని వదిలిపోయాడు.

వదిలిపోయి 20 ఏళ్లు

20 ఏళ్ల క్రితం తల్లిని వదిలిపోయిన రాజశేఖర్ మళ్లీ తల్లిని ఒక్క రోజైనా చూడలేదు. రాజేశ్వరి కొడుకు వస్తాడని ఏళ్లకు ఏళ్లు ఎదురు చూస్తూ ఓ అద్దె ఇంట్లో ఉంటూ అనారోగ్యంతో టైలరింగ్ చేసుకుంటూ తనని తాను పోషించుకునేది. ఐదేళ్ల క్రితం తన పనులు తాను చేసుకోలేని నిస్సహాయ స్థితికి చేరింది. ఆమె దయనీయ స్థితిని చూసి పొరుగు వారు అప్పటి కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న దృష్టికి తీసుకువెళ్లారు. కార్పొరేటర్ చొరవ తీసుకొని వలసపాకలలో ఉన్న రెడ్ క్రాస్ వృద్ధాశ్రమంలో రాజేశ్వరిని చేర్చారు. అక్కడికి వెళ్లాక కూడు,గూడులోటు లేకున్నా కొడుకు కోసం పరితపిస్తున్న మనోవేదన మాత్రం ఆమె ఆరోగ్యాన్ని మరింత క్షీణింపజేసింది. తోటి వృద్ధులతో కొడుకు ఉండీ ఇలా అనాథలా బతుకుతున్నానని చెప్పుకొని కన్నీటిపర్యంతమయ్యేది.

కార్పొరేటర్ చొరవతో..

అనాథాశ్రమంలో రాజేశ్వరి పరిస్థితి దయనీయంగా మారింది. ఆశ్రమ నిబంధనల ప్రకారం స్వయంగా తమ పనులు తాము చేసుకునేవారికే అక్కడ స్థానం ఉంటుంది. నానాటికీ క్షీణిస్తున్న ఆరోగ్య పరిస్థితితో రాజేశ్వరి మంచానికి పరిమితం అయింది. ఆశ్రమ యాజమాన్యం రాజేశ్వరిని చేర్చిన కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్నకు విషయం చెప్పడంతో ఆమె రాజేశ్వరిని కాకినాడ జీజీహెచ్‌లో చేర్చి సేవలు చేశారు. నివాసాన్ని కోరుతూ కలెక్టర్ షణ్మోహన్‌కు లక్ష్మీప్రసన్న ఈ ఏడాది మే 12వ తేదీన లేఖ రాశారు. తక్షణమే స్పందించిన ఆయన వైద్య సదుపాయాలు కల్పించడంతో పాటు, రాజేశ్వరి బాగోగులు పరిశీలించి తగిన నివాస సదుపాయం కల్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ రంగనాథం శైలజ రాజేశ్వరి బాగోగుల బాధ్యతలు చూసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు, పెద్దాపురంలో బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘మన ఇల్లు’ వసతి గృహానికి రాజేశ్వరిని తరలించారు.

కొడుకా అని కలవరిస్తూ...

నాటి నుంచి రాజేశ్వరి తన కుమారుడి పేరును కలవరిస్తూనే ఉంది. వసతి గృహ వ్యవస్థాపకుడు సత్యనారాయణ, బృందం ఆమెకి సపర్యలు చేసేది. రాజేశ్వరి చివరి కోరికను తెలుసుకున్న సత్యనారాయణ విషయాన్ని శైలజ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె రాజేశ్వరి కుమారుడు రాజశేఖర్‌ను సంప్రదించి తల్లి దీనావస్థను వివరిస్తే రావడానికి తనకు తీరిక లేదని ఫోన్‌లో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. సత్యనారాయణ, ఆయన బృందం రాజశేఖర్‌తో మాట్లాడినా ఫలితం లేకపోయింది. తాను సంగీత దర్శకత్వం చేస్తుంటానని, చాలా బిజీగా ఉంటానని తనకు మాటి మాటికీ ఫోన్లు చేయవద్దని విసుక్కున్నాడు. అప్పటికే రాజేశ్వరి చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతోంది. తిండి మానేసింది, మందులు తీసుకోవడానికి శరీరం కూడా సహకరించడం లేదు. అటువంటి నిస్సత్తువలో కూడా కొడుకు కోసమే పరితపించేది. కొడుకా కొడుకా అంటూ కలవరించేది.

పోలీసుల వార్నింగ్

రాజశేఖర్ తన తల్లి స్థితిని కళ్లకు కట్టేలా వీడియోలు పంపి వివరించినా ఏ మాత్రం చలించలేదు. పైగా చెబుతున్న వారందరినీ తిట్టడం మొదలు పెట్టాడు. దీంతో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. కాకినాడ టూ టౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు సూచనలతో పోలీసులు రాజశేఖర్‌కి కాల్స్ చేశారు. వచ్చి తల్లికి కనిపించి వెళ్లకపోతే సీనియర్ సిటిజన్ ప్రొటెక్షన్ యాక్ట్–2019 ప్రకారం కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో మరో మార్గం లేక రాజశేఖర్ హైదరాబాద్ నుంచి బయల్దేరి ఈ నెల 10వ తేదీన ఉదయం వచ్చాడు. అయితే కొడుకు రాకకోసం పరితపించి అతడు రావడానికి కొద్ది గంటల ముందే ప్రాణాలు విడిచింది.



రాజేశ్వరి మృతదేహాన్ని కాటికి తరలిస్తున్న బాధ్యత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సత్యనారాయణ బృందం



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజేశ్వరి ఆరోగ్య స్థితిని పరిశీలిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్ బృందం

అంతిమ సంస్కారాలు మీరే చెయ్యండి

రాజశేఖర్ వచ్చి తల్లి మృతదేహాన్ని చూసి మండిపడ్డాడు. ఇంత మాత్రానికే తనను ఎందుకు ఇబ్బంది పెట్టారని విసుక్కున్నాడు. అంతిమ సంస్కారాలు కూడా మీరే చేసేయండని ఎంత కావాలన్నా ఇచ్చేస్తానని బేరాలాడాడు. శైలజ ఆమె బృందం నచ్చజెప్పారు. నిన్ను చూడాలన్న ఆమె ఆఖరి కోరిక ఎలాగో తీర్చలేదు, కనీసం తలకొరివి అయినా పెట్టమని అడిగారు. సఖి వన్‌స్టాప్ సెంటర్, బాధ్యత ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. ఎట్టకేలకు రాజశేఖర్ మాతృమూర్తి మృతదేహానికి తలకొరివి పెట్టాడు. అంతిమ సంస్కారాలు బలవంతంగా చేయించిన అధికారులు, ఫౌండేషన్ సభ్యులపై విసుక్కొని వెళ్లిపోయాడు.

సాగుబడి

ఆరుద్ర కార్తె
జూన్ 22 నుంచి

మకడమియ.. క్వీన్ ఆఫ్ నట్స్. మకడమియ కాయ లోపల ఉండే గింజలు డైటరీ ఫ్యాట్‌కు పెట్టింది పేరు. మకడమియ కాయలు పెద్ద గోళీకాయంత సైజులో ఉంటాయి. పచ్చి కాయ ఆకుపచ్చగా, ఎండుకాయ ముదురు గోధుమ రంగులో ఉంటుంది. దాని పైపొర గట్టిగా ఉంటుంది. దాన్ని పగులగొడితే లోపల వెన్న రంగు లేదా లేత గోధుమ రంగులో గింజ ఉంటుంది. అంచేత.. దీన్ని తెలుగులో 'వెన్న గింజ' అందాం!



క్వీన్ ఆఫ్ నట్స్ వెన్న గింజ

కమ్మటి రుచి

మకడమియ గింజలకు ఇంత ప్రాచుర్యం రావటానికి కారణం అందులోని సుసంపన్నమైన పోషక విలువలతో పాటు వెన్న వంటి రూపం, రుచి, సువాసనతో గింజ రుచిగా ఉండటమే. ఈ గింజను కాయలో నుంచి వెలికితీసిన తర్వాత అలాగే తినొచ్చు లేదా వేపుకొని తినొచ్చు. చాక్లెట్లు, అనేక చిరుతిళ్లలో వాడుతున్నారు. 78% వరకు నూనె ఉంటుంది. వంటకు, సౌందర్య సాధనాల తయారీలో వాడుతున్నారు. డెయిరీ ఫ్రీ బటర్స్, స్ప్రెడ్స్ తయారీలో ఈ నూనె వాడుతున్నారు. మకడమియ ఆయిల్‌ను ప్రీమియం హెయిర్‌కేర్, స్కిన్‌కేర్, మసాజ్ ఉత్పత్తుల్లో వాడుతున్నారు. ఒమెగా 7 ఫ్యాటీ ఆసిడ్స్, మోయిశ్చరైజింగ్ ప్రోపర్టీస్ కారణంగా దీనికి ప్రాధాన్యం ఉంది.

250 కోట్ల డాలర్ల మార్కెట్

ప్రపంచవ్యాప్తంగా మకడమియ గింజలకున్న ప్రస్తుత మార్కెట్ విలువ 250 కోట్ల డాలర్లు. వచ్చే పదేళ్లలో చాలా పెరుగుతుందని చెబుతున్నారు. మకడమియ పోషక విలువల గురించి ఆరోగ్య స్పృహ గల వారిలో అవగాహన పెరుగుతుండటం.. మొక్కల నుంచి వచ్చే కొలెస్ట్రాల్ లేని ఆయిల్స్‌కు ఆదరణ పెరుగుతుండటం.. ఆసియా, యూరప్ దేశాల్లో స్పెషాలిటీ, గౌర్‌మెట్ స్నాక్ మార్కెట్లు విస్తరిస్తుండటం.. ప్లాంట్ బేస్డ్ డెయిరీ ప్రత్యామ్నాయాలకు ఆదరణ పెరటంతో మకడమియ గింజలతో తయారుచేసే పాలకు ప్రజాదరణ రావటం.. వంటి కారణాల వల్ల మకడమియ వాణిజ్యపరంగా ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. కరువు ప్రాంతాల్లో సాగు చేసేటప్పుడు నీటి యాజమాన్యంలో జాగ్రత్తలు తీసుకోవటం, పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాల్లో మకడమియ సాగును విస్తరింపజేసే దశలో జీవవైవిధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవటం, చిన్న-సన్నకారు రైతులకు సంబంధించి న్యాయబద్ధమైన వాణిజ్య ప్రయోజనాలు అందేలా చేయటం ద్వారా మకడమియ సాగును పెంపొందించుకోవడానికి అవకాశం ఉంది.

అవకాడోను 'వెన్న పండు' అంటారు. 100 గ్రాముల పండులో వెన్న రంగులో ఉండే గుజ్జు 15 గ్రాముల ఆరోగ్యకరమైన కొవ్వు ఉంటుంది. దీని కన్నా చాలా ఎక్కువ మోతాదులో మకడమియ గింజల్లో ఆరోగ్యకరమైన కొవ్వు ఉంటుంది. తక్కువ పిండి పదార్థం, ఎక్కువ కొవ్వు, ప్రొటీన్‌ను కలిగి ఉండటం దీని విశిష్టత. 100 గ్రాములు మకడమియ గింజల్లో కొవ్వు 76 గ్రాములు, మాంసకృత్తులు 8 గ్రా., పిండి పదార్థాలు 14 (పీచు 8.6 తీసేస్తే నికర పిండి పదార్థం 5.4) గ్రాములు ఉంటాయి. లో కార్బ్ హెల్దీ ఫ్యాట్ డైట్ తీసుకునే శాకాహారులకు, వీగన్ ఆహారాన్ని తీసుకునే వారికి ఆరోగ్యకరమైన కొవ్వు, మాంసకృత్తులకు మకడమియ గింజలు అద్భుతమైన వనరు. ట్రీ నట్ జాతుల్లో పేరెన్నిక గన్న మకడమియ పుట్టిల్లు ఆస్ట్రేలియా అయినప్పటికీ ఉత్పత్తిలో దక్షిణాఫ్రికా ముందుంది. కెన్యా, మలావితో పాటు అమెరికాలోని హవాయి దీవుల్లోనూ విస్తారంగా సాగవుతోంది. మన దేశంలో కర్ణాటక, తమిళనాడు ముందున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలే సాగు ప్రారంభమైంది. అధిక విలువైన గింజలనిచ్చే దీర్ఘకాలిక చెట్టు మకడమియ. వాణిజ్యపరంగా కూడా మంచి భవిష్యత్తు ఉందని చెప్పొచ్చు.

మకడమియ గింజల ఉత్పత్తి ప్రపంచవ్యాప్తంగా క్రమంగా పెరుగుతోంది. వరల్డ్ మకడమియ ఆర్గనైజేషన్ (డబ్ల్యూ.ఎం.ఓ.) సమాచారం ప్రకారం.. 2022లో 2,98,914 టన్నుల మకడమియ కాయల నుంచి తీసిన గింజల ఉత్పత్తి జరిగింది. 2027 నాటికి ఇది రెట్టింపవుతుందని అంచనా. 2030 నాటికి 6,60,000 మెట్రిక్ టన్నులకు పెరుగుతుందని డబ్ల్యూ.ఎం.ఓ. ఊహిస్తోంది.


ఆరోగ్యదాయకమైన నట్స్‌ను ఆహారంలో భాగం చేసుకుంటున్న వారి సంఖ్య ఆసియా దేశాల్లో, ముఖ్యంగా చైనా, భారత్‌లలో, అంతకంతకూ పెరుగుతుండటం.. ఈ దేశాల్లో ప్రజల ఆదాయాలు వేగంగా పెరుగుతుండటం, పాశ్చాత్య ఆహారపు అలవాట్లు విస్తరిస్తుండటం వంటి కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా వంటశాలల్లోనూ, ఆహారోత్పత్తుల పరిశ్రమల్లోనూ మకడమియ గింజల వినియోగం పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు.

చెట్ల ఎత్తు 7 నుంచి 40 అడుగులు

మకడమియ చెట్లు ఏ కాలంలో అయినా పచ్చగా ఉంటాయి. ఈ చెట్టు 2-12 మీటర్ల (7-40 అడుగులు) ఎత్తు పెరుగుతుంది. ఈ చెట్టుకు పొడవాటి పూల జడ మాదిరిగా పూలు పూచి, కాయలుగా మారతాయి. కాయలో ఒకటి లేదా రెండు గింజలు ఉంటాయి. పెద్ద సైజు కాబూలి శనగల గింజల్లాగా ఉంటాయి. కాయ పైన పెంకు చాలా గట్టిగా ఉంటుంది. ఏదైనా పదార్థం గట్టితనాన్ని కచ్చితంగా చెప్పాలంటే.. 'విక్కర్స్ హార్డ్‌నెస్' స్కోర్‌లో కొలుస్తారు. దీని స్కోరు 35. దీన్ని తొలిగా వాణిజ్య స్థాయిలో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ఒకటైన హవాయిలో సాగు చేశారు. ఆస్ట్రేలియా నుంచి 1880వ దశకంలో మకడమియ విత్తనాలు తీసుకెళ్లి హవాయిలో సాగు ప్రారంభించారు. తర్వాత వందేళ్ల వరకు హవాయినే అత్యధిక సాగుదారు. 2010వ దశకం నుంచి సాగు చేస్తున్న దక్షిణాఫ్రికా ఇప్పుడు అత్యధిక ఉత్పత్తిదారుగా మారింది. ప్రపంచవ్యాప్తంగా సాగవుతున్న ఆస్ట్రేలియాకు చెందిన ఆహార పంట ఇదే!

రెండు వంగడాలు

మకడమియ చెట్టు జాతులు నాలుగు. ఇందులో రెండు రకాలను వాణిజ్యపరంగా సాగు చేస్తున్నారు. మొదటిది మకడమియ ఇంటెగ్రిఫోలియ. దీని కాయ పెంకు నున్నగా ఉంటుంది. రెండోది మకడమియ టెట్రాఫిల్లా. దీని కాయ పైపెంకు గరుకుగా ఉంటుంది. దీనికి మరింత సువాసన ఉంటుంది. కొత్త చిగుళ్లు ఎర్రగా, ఆకులు ముదురు ఆకుపచ్చగా ఉంటాయి. నాటిని నాలుగేళ్లలో కాపుకొస్తుంది. పొడవాటి కంకికి పూత పూస్తుంది. గెలలుగా కాయలు కాస్తాయి. 8 ఏళ్ల చెట్టు ఏటా 18 కేజీల కాయలు కాస్తుంది. కాయల బరువుకు కొమ్మలు విరిగే పరిస్తితి కూడా ఉంటుందట. అయితే, కాయల బరువులో పైన పెంకు బరువు 72.4% పోగా 27.6% తినదగిన గింజలు వస్తాయి.



దక్షిణాఫ్రియా సూటబుల్

ప్రస్తుతం మకడమియ నట్స్ సాగులో దక్షిణాఫ్రికాదే ఆధిపత్యం. ఆ దేశపు వాతావరణం, సారవంతమైన నేలలు, ఆధునిక పద్ధతుల్లో సాగుకు అధిక పెట్టుబడులు పెట్టడంతో దక్షిణాఫ్రికాలోని లింపొపో, క్వాజులు-నటల్, ఫుమలంగ రాష్ట్రాల్లో సాగు మకడమియ సాగు విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ నట్స్‌కు డిమాండ్ కారణంగా పెద్ద కమతాల రైతులు ఆసక్తి చూపటంతో విస్తీర్ణం త్వరితగతిన పెరిగింది. ప్రాసెసింగ్ సదుపాయాలు, ఎగుమతి వసతులకు సంబంధించి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టటం, చీడపీడలను తట్టుకునే నాణ్యమైన అధికోత్పత్తి వంగడాలను వాడటం దక్షిణాఫ్రికాకు కలిసి వచ్చింది. ప్రస్తుతం 60 వేల మెట్రిక్ టన్నుల మకడమియ కాయలను ఏటా ఉత్పత్తి చేస్తోంది. ప్రపంచ మార్కెట్ సరఫరాలో ఇది 30%.

ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియాలోని న్యూసౌత్ వేల్స్ ఈశాన్య ప్రాంతం, క్వీన్స్‌లాండ్ మధ్య, ఆగ్నేయ ప్రాంతాల్లో ఆది నుంచి విస్తారంగా సాగవుతోంది. అందుకే దీనికి క్వీన్స్‌లాండ్ నట్, బుష్ నట్, మరూచి నట్, బాపిల్ నట్ అని కూడా పిలుస్తారు. అక్కడి ఆదివాసులకు ఇదొక ముఖ్య ఆహారం. యూరోపియన్లు ఆస్ట్రేలియాకు రాక మునుపు నుంచే వారు వీటిని తింటున్నారనటానికి ఆధారాలున్నాయని చెబుతారు. పొదలా పెరిగే చెట్టుకు కాచేది కాబట్టి బుష్ నట్ అన్నారు. ఆస్ట్రేలియా 45 వేల నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల కాయలను ప్రతి ఏటా ఉత్పత్తి చేస్తోంది. పండించిన దాంట్లో నుంచి 70% వరకు జపాన్, అమెరికా, చైనాలకు ఎగుమతి చేస్తోంది.

మలావి

ఆఫ్రికా ఖండంలో వ్యవసాయ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం మలావి. గత పదేళ్లలో మకడమియ సాగు ఈ దేశంలో బాగా విస్తరించింది. ఈ దేశపు వాతావరణం, సారవంతమైన భూములు అనుకూలిస్తున్నాయి. ప్రస్తుతం ఏటా 8 వేల నుంచి 10 వేల టన్నుల వరకు ఉత్పత్తి చేస్తోంది.

కెన్యా

మలావి మాదిరిగానే కెన్యా కూడా కాఫీ, తేయాకు పంటలకు బదులుగా మకడమియ సాగును ప్రోత్సహిస్తోంది. 6 వేల నుంచి 8 వేల మకడమియ నట్స్‌ను కెన్యా ఏటా పండిస్తోంది. అందుకు అనుగుణంగా ప్రాసెసింగ్ సదుపాయాలను కూడా సమకూర్చుకుంది.

హవాయి

అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో భాగమైన హవాయి దేశంలోని మిగతా రాష్ట్రాలకు వందల మైళ్ల దూరంలో ఉండే ద్వీప రాష్ట్రం. ఈ ఒక్క రాష్ట్రంలోనే మకడమియ సాగవుతోంది. 20వ దశాబ్దంలో ఇదే అత్యధికంగా పండించింది. తర్వాత కాలంలో దక్షిణాఫ్రియా మొదటి స్థానాన్ని ఆక్రమించింది. ప్రస్తుతం హవాయి ఏటా 5-6 వేల మెట్రిక్ టన్నులు పండిస్తోంది.



నీటి కుంటలతో కరువుపై పోరాటం

కరువుకు ప్రత్యామ్నాయపదంగా మారిన రాజస్థాన్‌లో పొలాల్లో నీటి కుంటలు జలసిరులను అందిస్తున్నాయి. జైపూర్ జిల్లా కుకాస్ గ్రామంలోని వాతావరణ ప్రతికూలతలను తట్టుకొని సాగు నీటి భద్రతను కల్పించే పరివర్తనాత్మక గ్రామీణ నీటి సంరక్షణ నమూనా అమల్లో ఉంది. ఈ గ్రామపరిసరాల్లోనే 50 వ్యవసాయ నీటి కుంటలు (ఫామ్ పాండ్స్)ను తవ్వారు. ఈ వర్షాకాలంలో వీటి రరా పది కోట్ల లీటర్ల వాన నీటిని ఒడిసిపట్టాలని గ్రామస్తులు ఆశిస్తున్నారు. ఈ నీటి కుంటలను శాస్త్రీయ పద్ధతిలో నిర్మించారు. వానాకాలంలో వాన నీటిని ఒడిసిపట్టి, ఏడాది పొడవునా పంటలకు సాగునీటి కొరత లేకుండా చూడటం ద్వారా గ్రామీణుల జీవనోపాధులను మెరుగుపరచటమే లక్ష్యంగా ఈ ఫామ్ పాండ్లను నిర్మించారు. ఈ ఫామ్‌పాండ్లను 'కుకాస్ నమూనా' అని పిలుస్తున్నారు.



రాజస్థాన్‌లో ప్రాచుర్యం పొందుతున్న 'కుకాస్ నమూనా'

కుకాస్ నమూనా ప్రత్యేకతలు

వానాకాలంలో వాన నీటి సంరక్షణ సామర్థ్యం: 10 కోట్ల లీటర్ల వానాకాలపు వరద నీటిని ఒడిసిపట్టుకోవాలి.

ఇదీ ఫామ్ పాండ్ డిజైన్: ప్లాస్టిక్ లైనింగ్, ప్రతి రైతు పొలంలో 5% స్థలంలో 10 అడుగుల లోతు తవ్వి ఫామ్ పాండ్ నిర్మాణం. చుట్టూ పకడ్బందీగా ఇనుప కంచె నిర్మాణం.

ప్రాజెక్టు పరిధి: దాస జిల్లాలో 250 నీటి కుంటల తవ్వకం ద్వారా వాననీటి సంరక్షణ ద్వారా సాగు నీటి భద్రతకు విజయవంతంగా కృషి చేసిన స్ఫూర్తితో కుకాస్ జిల్లాలో ఈ నమూనాను అమలు చేస్తున్నారు.

నీటి భద్రత, వ్యవసాయానికి జరిగిన మేళ్లు...

- జైపూర్ జిల్లా వ్యవసాయం 99.4% మేరకు భూగర్భ జలాలపైనే ఆధారపడి ఉంది.
- భూమిలోకి వాన నీరు ఇంకేదానికన్నా 2.22 రెట్లు బోర్ల ద్వారా తోడేస్తున్నారు.
- ఈ సమస్యను అధిగమించానికి ఫామ్ పాండ్స్‌ను నిర్మిస్తున్నారు.
- ఖరీఫ్, రబీ పంటలకు నీటి అవసరాలు తీర్చటం కోసం వీటిని నిర్మిస్తున్నారు.
- ఏడాది పొడవునా సాగయ్యే పంటలు, తోటల సాగు, పశువుల పెంపకం, ఉద్యాన తోటల పెంపకానికి దోహదం.
- పంట మార్పిడిని ప్రోత్సహించటం.. ఉదా.. వేరుశనగ, బొబ్బర్లు.
- సుస్థిరత, అభివృద్ధిపై ప్రభావం: ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని పంట దిగుబడులు తీసుకునే శక్తిని నీటి కుంటల వ్యవస్థ పెంపొందిస్తుంది. వైవిధ్య పూరితమైన జీవనోపాధులకు దోహదం చేస్తుంది. ఆహార భద్రతను కల్పిస్తుంది. పాడి పరిశ్రమ, ఆహార శుద్ధి పరిశ్రమలు, మార్కెటింగ్ సదుపాయాలను కల్పించడానికి అవకాశాలు మెరుగుపడ్డాయి.

ఖరగ్‌పూర్ ఐఐటీ పూర్వ విద్యార్థి విప్ర గోయల్ ఈ నీటి కుంటల ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తున్నారు. గ్రామంలో ఇప్పటికి 50 నీటి కుంటలు నిర్మించామని, మరో 25 నిర్మించబోతున్నామని ఆయన చెబుతున్నారు. వీటిలో వాన నీటిని సంరక్షిస్తే ఈ ప్రాంతంలో 50 వేల మంది ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

వాన నీటిని రెండు పంటలకూ అందించే ఏర్పాటు చేసినందున తక్కువ నీటితో పండించగల పంటలు, అధికాదాయాన్నిచ్చే పంటలను శ్రద్ధగా సాగు చేసుకుంటూ స్వావలంబనతో జీవించే అవకాశం రైతులకు దక్కిందని కుకాస్ సర్పంచ్ రాధేశ్యాం మీనా సంతోషపడుతున్నారు.

జైపూర్ ప్రాంతంలో హెక్టారుకు 14 నుంచి 21 లక్షల లీటర్ల వాన నీరు వృథాగా పోతోందని గోయల్ లెక్కగట్టారు. నదులు, కాలువలు లేని ఈ ప్రాంతంలో నీటి కుంటలు ఆధారపడదగినవిగా ఉన్నాయన్నారు. నిరంతరం ఫామ్ పాండ్ ద్వారా నీటి సదుపాయం ఉంటుంది కాబట్టి భూగర్భ జలాలు ఆదా అవుతాయన్నారు. గతంలో నీతి ఆయోగ్‌తో పనిచేసిన అనుభవం గల గోయల్ ఒక టూవీలర్ తయారీ కంపెనీ ఆర్థిక సహకారంతో కుకాస్ గ్రామంలో వాననీటి సంరక్షణకు ఫామ్ పాండ్స్ నిర్మాణం చేయిస్తుండటం ప్రశంసనీయం. తన వంతు కృషి చేస్తూ కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు కోసం ఆయన ప్రయత్నిస్తున్నారు.

బిజినెస్ రీల్

వొడాఫోన్‌తో సైయెంట్ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజినీరింగ్ సొల్యూషన్స్ సంస్థ సైయెంట్ తాజాగా టెలికం సంస్థ వొడాఫోన్‌తో చేతులు కలిపింది. డేటా ఆధారిత ఏఐ ఆధారిత గ్లోబల్ నెట్‌వర్క్ కాన్ఫిగరేషన్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్ 'విస్మోన్'ను ఆవిష్కరించింది. నెట్‌వర్క్ ఇంజినీరింగ్, కార్యకలాపాల నిర్వహణలో మార్పులు తెచ్చే దిశగా ఇదొక కీలక మైలురాయని సైయెంట్ వైస్ ప్రెసిడెంట్ జోక్విమ్ క్రోకా తెలిపారు. దీనితో వివిధ మార్కెట్ రిపోర్టులను క్రోడీకరించేందుకు సిబ్బందికి పట్టే సమయం 70 శాతం తగ్గుతుందని, నిర్ణయాల ప్రక్రియ మూడు రెట్లు వేగవంతమవుతుందని, తప్పిదాలు 50 శాతం తగ్గుతాయని వొడాఫోన్ మేనేజర్ ముస్తఫా నూరెల్డీన్ చెప్పారు.

జీఆర్‌టీ 'గోల్డ్ ఫర్ ఆల్' ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్ 'గోల్డ్ ఫర్ ఆల్' పేరుతో ఆఫర్ ప్రకటించింది. ఇందులో భాగంగా వేస్టేజీ చార్జీలు కేవలం 5% నుంచి ప్రారంభమవుతాయి. దీంతో ఆభరణాల తయారీ చార్జీలు తగ్గుతాయని కంపెనీ భావిస్తోంది. పసిడి ధరలు ఆకాశాన్ని తాకిన ప్రస్తుత రోజుల్లో అందరికి బంగారాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో 'గోల్డ్ ఫర్ ఆల్' ఆఫర్ ప్రకటించామని కంపెనీ ఎండీ జీ.ఆర్.ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. మేలిరకపు ఆభరణాలు అందుబాటులో ఉంచే దిశగా ఇది ఒక అడుగు. కస్టమర్లు ప్రత్యేక ఆఫర్‌ను వినియోగించుకోవాలని కోరారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 400వ షోరూం ప్రారంభం



హైదరాబాద్: అగ్రగామి ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఉత్తరప్రదేశ్ నోయిడా సెక్టార్18లో 400వ షోరూంను ప్రారంభించింది. వ్యాపార విస్తరణలో మరో మైలురాయిని అధిగమించామని కంపెనీ చైర్మన్ ఎం.పి.అహ్మద్ సంతోషం వ్యక్తం చేశారు. ''ఈ ఆర్థిక సంవత్సరంలో 60 నూతన షోరూమ్‌లు ప్రారంభంతో పాటు తయారీ యూనిట్ల పెంపు లక్ష్యంగా పెట్టుకున్నాము. ప్రస్తుతం రూ.63 వేల కోట్లున్న టర్నోవర్‌ను రూ.78 వేల కోట్లకు చేర్చే ప్రయత్నాల్లో భాగంగా రూ.5,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక సిద్ధం చేసుకున్నాము. ప్రపంచంలో నెంబర్‌వన్ గ్లోబల్ జ్యువెలరీ రిటైలర్‌గా ఎదిగాలనే ఆశయానికి సహకరిస్తున్న కస్టమర్లు, నిర్వహణ బృందం, వాటాదారులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు'' అన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-6-2025

విశాఖ	570-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,394.00	2.89
JIOFIN	301.5	2.85
SHRIRAMFIN	675.5	2.09
GRASIM	2,779.70	2.06
TATASTEEL	155.03	1.71

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	244.09	-2.9
POWERGRID	286.1	-1.43
INDUSINDBK	831.45	-1.01
TRENT	6,071.00	-0.8
HCLTECH	1,691.00	-0.72

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	11,364
ఎన్‌ఎస్‌ఈ	1,11,594
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	4,74,856
ఎఫ్‌ఐఐ	- 5,266
డీఐఐ	+ 5,209

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.50 (రాత్రి 11.30కు)	$ 68.51 (క్రితం ముగింపు)
బ్రెంట్	66.31 (రాత్రి 11.30కు)	$ 70.52 (క్రితం ముగింపు)

త్వరలోనే యూఎస్, ఈయూలతో వాణిజ్య ఒప్పందాలు



చర్చలు వేగంగా, ఫలప్రదంగా సాగుతున్నాయి

భారత్ టారిఫ్‌ల కింగ్ కాదు • కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: అమెరికా, ఐరోపా యూనియన్ (ఈయూ)లతో ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై చర్చలు ఎంతో వేగవంతంగా, ఫలప్రదంగా కొనసాగుతున్నాయని.. త్వరలోనే ముగుస్తాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2030 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ప్రతిష్టాత్మక ఎగుమతుల లక్ష్యాలన్ని చేరుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే యూఏఈ, ఆస్ట్రేలియా, నాలుగు దేశాలతో కూడిన యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ)తో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను మంత్రి ప్రస్తావించారు. యూకేతో చర్చలు ముగిసినట్టు చెప్పారు. మరిన్ని స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడానికే తమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. ఇండియన్ ఎగ్జిమ్ బ్యాంక్ నిర్వహించిన వాణిజ్య సదస్సును ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో వస్తు సేవల ఎగుమతులు రికార్డు స్థాయిలో 825 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు మంత్రి సీతారామన్ గుర్తు చేశారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 6 శాతం వృద్ధి నమోదైనట్టు చెప్పారు. ఇదే కాలంలో అంతర్జాతీయంగా ఎగుమతుల్లో వృద్ధి 4 శాతంగానే ఉన్నట్టు పేర్కొన్నారు. 2013-14లో ఎగుమతులు 466 బిలియన్ డాలర్లతో పోల్చి చూస్తే గణనీయంగా వృద్ధి చెందినట్టు తెలిపారు.

ఆవిష్కరణలపై దృష్టి సారించాలి..

ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఎగుమతిదారులకు మంత్రి సీతారామన్ పిలుపునిచ్చారు. తమ ఉత్పత్తులకు కొత్త మార్కెట్లను అన్వేషించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు లభిస్తుందని హామీ ఇచ్చారు. అంతర్జాతీయంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవాహం 11 శాతం తగ్గిన సమయంలోనూ భారత్ మెరుగైన పనితీరు చూపించిందన్న యూఎన్‌సీటీఏడీ నివేదికను ప్రస్తావించారు. గడిచిన 24 ఏళ్లలో భారత్ 991 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐని ఆకర్షించగా, అందులో 67 శాతం (668 బిలియన్ డాలర్లు) 2014-2024 మధ్యకాలంలో వచ్చినట్టు తెలిపారు. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ మరింత అనుసంధానమైనదన్నారు. యాపిల్ ఐఫోన్ భారత కాంట్రాక్టు తయారీదారులు దేశీయంగా 20 శాతం విలువ జోడింపును సాధించినట్టు చెప్పారు. అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నెలకొన్నప్పటికీ.. భారత వృద్ధి అవకాశాలు మెరుగ్గా ఉన్నట్టు ఇదే కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు తెలిపారు.

భారత్‌లో టారిఫ్‌లు చాలా తక్కువ

భారత్‌ను టారిఫ్ కింగ్ అన్న ఆరోపణలను మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా ఖండించారు. 2025-26 బడ్జెట్‌లో మొత్తం టారిఫ్‌లను ఎనిమిదింటికి తగ్గించామని చెబుతూ.. వాస్తవ రేటు ఎంతో తక్కువ అని స్పష్టం చేశారు. తయారీ, ఎగుమతులకు ప్రోత్సాహకంగా టారిఫ్‌ల సంఖ్యను కుదించినట్టు చెప్పారు. భారత్‌ను టారిఫ్ కింగ్‌గా పేర్కొంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒకటికి మించిన సందర్భాల్లో వ్యాఖ్యానించిన నేపథ్యంలో మంత్రి ఈ స్పష్టతనిచ్చారు. 2023-24 బడ్జెట్‌లో ఏడు టారిఫ్‌లను మంత్రి సీతారామన్ తొలగించగా, ఇటీవలి బడ్జెట్‌లోనూ మరో ఏడు టారిఫ్ రేట్లను ఎత్తివేయడం గమనార్హం. దీంతో భారత సగటు కస్టమ్స్ సుంకం 11.65 శాతం నుంచి 10.66 శాతానికి దిగొచ్చినట్టు మంత్రి తెలిపారు. దక్షిణాసియా దేశాల స్థాయిలోనే ఇది ఉన్నట్టు చెప్పారు.

పన్ను ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి

పన్ను చెల్లింపుదారుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం, సకాలంలో రిఫండ్‌లను ప్రాసెస్ చేయడంపై దృష్టి సారించాలంటూ ఆదాయపన్ను శాఖ అధికారులకు మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ల సమావేశాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రత్యక్ష హాజరు అవసరం లేని అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ముందు పెండింగ్‌లో ఉన్న వివాదాస్పదన పన్ను డిమాండ్లను వేగంగా పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. సకాలంలో పరిష్కారం చూపించడం వల్ల వ్యవస్థపై పన్ను చెల్లింపుదారుల్లో విశ్వాసం ఇనుమడిస్తుందన్నారు.

భారత్ నుంచి మరిన్ని కొనుగోళ్లు

2027 నాటికి ఏటా 10 బిలియన్ డాలర్ల లక్ష్యం

• సరఫరాదార్లతో పని చేస్తున్న వాల్‌మార్ట్



న్యూఢిల్లీ: అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ 2027 నాటికి భారత్ నుంచి కొనుగోళ్ల పరిమాణాన్ని ఏటా 10 బిలియన్ డాలర్ల స్థాయికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీన్ని సాధించేందుకు స్థానిక సరఫరాదార్లతో కలిసి క్రియాశీలకంగా పని చేస్తోంది. రెండు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చిన కంపెనీ సీఈవో డగ్ మెక్‌మిలన్ ఈ విషయాలు తెలిపారు. ఈ సందర్భంగా తమ వాల్‌మార్ట్ వృద్ధి కార్యక్రమం కింద శిక్షణ కల్పించిన కొందరు విక్రేతలను ఆయన కలిశారు. తమ ఈ-కామర్స్ విభాగం ఫ్లిప్‌కార్ట్, డిజిటల్ చెల్లింపుల యాప్ ఫోన్‌పే లాంటి వ్యాపారాల నుంచి కొత్త ఆవిష్కరణలు, మరింత మంది కస్టమర్లకు సర్వీసులు అందించడం, విక్రేతలను పెంచుకోవడం తదితర అంశాలకు సంబంధించి ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నామని మెక్‌మిలన్ వివరించారు. భారత్‌తో తమకు రెండు దశాబ్దాల పైగా అనుబంధం ఉందని ఆయన చెప్పారు. గత దశాబ్ద కాలంలో భారత మార్కెట్ గణనీయంగా వృద్ధి చెందిందని, వచ్చే దశాబ్ద కాలం కూడా ఇదే జోరు కొనసాగబోతోందని ఫ్లిప్‌కార్ట్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి చెప్పారు.

వచ్చే మూడేళ్లలో తమ వృద్ధి ప్రోగ్రాం కింద ఒక లక్ష పైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు చేరువ కానున్నట్లు వాల్‌మార్ట్ ఇటీవలే ప్రకటించింది. ఈ ప్రోగ్రాం ద్వారా వాల్‌మార్ట్ భారతీయ చిన్న, మధ్య తరహా సంస్థలకు వ్యాపార నైపుణ్యాల్లో శిక్షణ, మార్కెట్ యాక్సెస్ విషయంలో సహాయ, సహకారాలు అందిస్తోంది. భారతీయ తయారీదార్లు అమెరికా, కెనడా, మెక్సికో తదితర దేశాల్లోని వాల్‌మార్ట్ స్టోర్స్‌కి ఎగుమతులు చేసేందుకు వీలు కల్పించేలా 2002లో బెంగళూరులో వాల్‌మార్ట్ గ్లోబల్ తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది.

3 కంపెనీలు రెడీ

ఐపీవో స్ట్రీట్

సెబీ నుంచి తాజాగా గ్రీన్‌సిగ్నల్

జాబితాలో జీఎస్‌జీ, గ్లోటిస్, అమంతా



న్యూఢిల్లీ: కొత్త ఆర్థిక సంవత్సరంలో జోరందుకున్న ప్రైమరీ మార్కెట్లు పలు అన్‌లిస్టెడ్ కంపెనీలకు జోష్‌నిస్తున్నాయి. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు క్యూ కడుతున్నాయి. ఈ బాటలో తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి మూడు కంపెనీలు అనుమతులు పొందాయి. జాబితాలో ఎలక్ట్రానిక్స్ బజార్ కంపెనీ జీఎస్‌జీ ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్ సర్వీసుల సంస్థ గ్లోటిస్, ఫార్మా రంగ కంపెనీ అమంతా హెల్త్‌కేర్ చేరాయి. ఈ మూడు కంపెనీలు సెబీకి 2025 ఫిబ్రవరి-మార్చిలో ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. వీటికి తాజాగా గ్రీన్‌సిగ్నల్ లభించింది.

జీఎస్‌జీ ఎలక్ట్రానిక్స్



పబ్లిక్ ఇష్యూలో భాగంగా జీఎస్‌జీ ఎలక్ట్రానిక్స్ రూ. 450 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి అదనంగా ప్రమోటర్లు 51 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీ ఎలక్ట్రానిక్స్ బజార్ బ్రాండుతో పునరుద్ధరించిన ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లను విక్రయిస్తోంది. వారంటీతో పునరుద్ధరించిన ప్రొడక్టుల పూర్తిస్థాయి వేల్యూ చైన్ నిర్వహిస్తోంది. కంపెనీ భారత్‌సహా యూరప్, ఆఫ్రికా, యూఏఈలలో కార్యకలాపాలు విస్తరించింది. దేశీయంగా మైక్రోసాఫ్ట్ అధీకృత పునరుద్ధరణ ప్రొడక్టుల సంస్థగా నిలుస్తోంది.

గ్లోటిస్



చెన్నైకు చెందిన లాజిస్టిక్స్ కంపెనీ గ్లోటిస్ ఐపీవోలో భాగంగా రూ. 160 కోట్ల ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.45 కోట్ల షేర్లను ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వాణిజ్య వాహనాలు, కంటెయినర్ల కొనుగోలు తదితర పెట్టుబడి వ్యయాలతోపాటు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. సమీకృత మల్టీమోడల్ లాజిస్టిక్స్ సర్వీసుల సంస్థ గ్లోటిస్ ప్రధానంగా ఎనర్జీ సరఫరా సొల్యూషన్లు అందిస్తోంది.

అమంతా హెల్త్‌కేర్



1994లో ఏర్పాటైన ఫార్మా రంగ కంపెనీ అమంతా హెల్త్‌కేర్ ఐపీవోలో భాగంగా 1.25 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. అహ్మదాబాద్‌కు చెందిన కంపెనీ ప్రధానంగా మెడికల్ పరికరాలతోపాటు.. రోగులు నోటి ద్వారా ఔషధాలు తీసుకునేందుకు వీలులేనప్పుడు వినియోగించే స్టెరైల్ లిక్విడ్, పేరంటల్ ప్రొడక్టులను తయారు చేస్తోంది. అంతర్జాతీయంగా 113 ప్రొడక్ట్ రిజిస్ట్రేషన్లను కలిగి ఉంది.

అదానీ చౌక నిధుల సమీకరణ

ముంబై ఎయిర్‌పోర్ట్ రుణాల రీఫైనాన్సింగ్‌కు రెడీ



న్యూఢిల్లీ: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల నుంచి డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ బిలియన్ డాలర్లు(సుమారు రూ. 8,600 కోట్లు) సమీకరించింది. నిధులను ముంబై ఎయిర్‌పోర్ట్ రుణాల రీఫైనాన్సింగ్‌కు వినియోగించనుంది. న్యూయార్క్ సంస్థ అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షతన మెట్‌లైఫ్ ఇంక్, బ్లాక్‌రాక్ ఇంక్, ఎఫ్‌డబ్ల్యూడీ ఇన్సూరెన్స్ నిధులు సమకూర్చాయి. ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(ఎంఐఏఎల్) కోసం 2022లో సమీకరించిన రుణాల రీఫైనాన్స్‌కు నిధులు వెచ్చించనున్నట్లు అదానీ గ్రూప్ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. ఎంఐఏఎల్‌లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ వాటా 74 శాతంకాగా.. భారత ఎయిర్‌పోర్ట్స్ అథారిటీకి 26 శాతం వాటా ఉంది. దేశీయంగా రెండో పెద్ద ఎయిర్‌పోర్ట్‌ను నిర్వహిస్తున్న కంపెనీ 2029 జులైలో గడువుతీరే 75 కోట్ల డాలర్ల విలువైన నోట్లను జారీ చేసింది. వీటికి అదనంగా 25 కోట్ల డాలర్ల నోట్లను జారీ చేసే వీలుతో నిధుల సమీకరణ చేపట్టింది. తద్వారా బిలియన్ డాలర్లను సమకూర్చుకుంది. దీంతో ఎంఐఏఎల్ అభివృద్ధి, ఆధునీకరణ, సామర్థ్య విస్తరణకు ఆర్థిక వెసులుబాటు లభించనున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలియజేసింది. తాజాగా జారీ చేసిన బాండ్లు 6.9 శాతం కూపన్‌రేటుతో నాలుగేళ్ల కాలానికి గడువు తీరనున్నాయి. ఎయిర్‌పోర్ట్ మౌలికసదుపాయాల రంగంలో తొలి ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ ప్రయివేట్ బాండ్ల జారీని చేపట్టినట్లు కంపెనీ పేర్కొంది.

గెలాక్సీ ఇన్సూరెన్స్ నుంచి మార్వెల్ పథకం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆరోగ్య బీమా సంస్థ గెలాక్సీ హెల్త్ ఇన్సూరెన్స్ కొత్తగా గెలాక్సీ మార్వెల్ పేరిట పాలసీని ప్రవేశపెట్టింది. తొలిసారి క్లెయిమ్ చేసేంత వరకు లేదా 55 ఏళ్ల వచ్చేంత వరకు ఒకే ప్రీమియంను కొనసాగించడం, 71 కస్టమబుల్స్‌కు కవరేజీ, అపరిమిత స్థాయిలో 100 శాతం సమ్ ఇన్సూర్డ్‌ను రిస్టోర్ చేయడం, ప్రీమియం వెయివర్, ఔట్‌పేషంట్ బెనిఫిట్స్ మొదలైనవి ఇందులో ఉన్నాయి. తమ పాలసీల విక్రయం కోసం పాలసీబజార్‌తో చేతులు కలిపినట్లు కంపెనీ ఎండీ జీ. శ్రీనివాసన్ తెలిపారు. కార్యకలాపాలు ప్రారంభించిన గత ఏడాది కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 4,730 పైగా పాలసీదార్లకు బీమా భద్రత కల్పించామని, రెండు రాష్ట్రాల్లో 1893 మంది పైగా ఏజెంట్లతో పటిష్టమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నామని ఆయన వివరించారు.

కల్పతరుకు యాంకర్ నిధులు

రూ. 708 కోట్లు సమీకరణ



రియల్టీ అభివృద్ధి సంస్థ కల్పతరు పబ్లిక్ ఇష్యూలో భాగంగా యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 708 కోట్లు సమీకరించింది. షేరుకి రూ. 414 ధరలో 9 సంస్థలకు 1.71 కోట్ల షేర్లను కేటాయించింది. ఇన్వెస్ట్ చేసిన సంస్థలలో జీఐసీ, బెయిన్ క్యాపిటల్, సింగపూర్ సావరిన్ వెల్త్, ఎస్‌బీఐ ఎంఎఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎంఎఫ్ తదితరాలున్నాయి. మంగళవారం(24న) ప్రారంభమైన కంపెనీ ఐపీవో గురువారం(26న) ముగియనుంది. షేరుకి రూ. 387-414 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 1,590 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. ఇందుకు కొత్తగా ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. హౌసింగ్, కమర్షియల్ ఆస్తులకు పెరిగిన డిమాండ్ నేపథ్యంలో గతేడాది(2024-25) ఏప్రిల్-డిసెంబర్ కాలంలో రూ. 2,727 కోట్ల విలువైన ప్రాపర్టీలను కంపెనీ విక్రయించింది.

భారత వృద్ధి మెరుగే

• 2025-26లో 6.5 శాతం
• అంచనాలు పెంచిన ఎస్‌అండ్‌పీ
• కనిష్ట చమురు ధరలు, ద్రవ్యోల్బణం సానుకూలం



న్యూఢిల్లీ: ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ 2025-26 సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి అంచనాలను పెంచుతూ నిర్ణయాన్ని ప్రకటించింది. 6.5 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేసింది. ముడి చమురు ధరలు కనిష్ట స్థాయిలో ఉండడం, పరపతి విధాన సరళీకరణ (వడ్డీ రేట్ల తగ్గింపు), ఆదాయపన్ను తగ్గింపు, సాధారణ వర్షపాతం అంచనాలను సానుకూలతలుగా పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు రూపాయి, ద్రవ్యోల్బణంపై పెద్ద ప్రభావం చూపించకపోవచ్చని అంచనా వేసింది. భారత జీడీపీ 6.5 శాతం వృద్ధి సాధిస్తుందంటూ ఎస్‌అండ్‌పీ ఈ ఏడాది ఆరంభంలో అంచనా వేయగా, అంతర్జాతీయంగా వాణిజ్య, భౌగోళిక అస్థిరతల నేపథ్యంలో ఆ తర్వాత 0.20 శాతాన్ని తగ్గిస్తూ, 6.3 శాతానికి సవరించింది. మళ్లీ పూర్వపు వృద్ధి అంచనాలనే ఇప్పుడు ప్రస్తావించింది. ఆసియా పసిఫిక్ ప్రాంతం ఆర్థిక పరిస్థితులపై ఎస్‌అండ్‌పీ ఒక నివేదికను విడుదల చేసింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఘర్షణలతో చమురు ధరలు దీర్ఘకాలం పాటు పెరుగుతూ పోతే అది ఆసియా పసిఫిక్ ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపిస్తుందని పేర్కొంది. గతేడాది కంటే చమురు ధరలు తక్కువగా ఉండడం భారత్‌కు అనుకూలిస్తుందని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ ఆర్థికవేత్త విశ్రుత్ రాణా తెలిపారు. ఏడాది క్రితం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 85 డాలర్లుగా ఉండడం గమనార్హం. ''కరెంట్ ఖాతా నుంచి చేయాల్సిన చెల్లింపులు తగ్గుతాయి. దేశీయంగా ఇంధన ధరల ఒత్తిళ్లు ఉండవు. ఇంధన ధరలు మోసర్తుగా పెరిగినా కానీ, ద్రవ్యోల్బణంపై ఆహార ధరలే ఎక్కువగా ప్రభావం చూపిస్తాయి. కనుక మొత్తం మీద రూపాయి లేదా ద్రవ్యోల్బణంపై పెద్ద ప్రభావం ఉండదన్నది మా అంచనా''అని రాణా వివరించారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం నేపథ్యంలో ముడి చమురు బ్యారెల్‌కు 69 డాలర్లకు పడిపోవడం తెలిసిందే.

స్థానిక డిమాండ్ బలం..

అంతర్జాతీయంగా ఇంధన సరఫరా మెరుగ్గా ఉన్న పరిస్థితుల్లో చమురు ధరలు పెరగకపోవచ్చని ఎస్‌అండ్‌పీ పేర్కొంది. స్థానిక డిమాండ్ బలంగా ఉన్నందున భారత్ తదితర దేశాల్లో ఆర్థిక వృద్ధి నిదానించడాన్ని పరిమితం చేస్తుందని తెలిపింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి 6.7 శాతానికి పెరగొచ్చని అంచనా వ్యక్తం చేసింది. 2024-25లో దేశ జీడీపీ 6.5 శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. 2025-26 సంవత్సరానికి 6.5 శాతం వృద్ధి అన్న ఎస్‌అండ్‌పీ అంచనాలు.. ఆర్‌బీఐ అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. 2025లో ద్రవ్యోల్బణం 4 శాతంగా ఉండొచ్చని ఈ నివేదిక తెలిపింది. గతేడాది ఇది 4.6 శాతంగా ఉంది. రూపాయి ఈ ఏడాది చివరికి 87.5 స్థాయికి చేరుతుందని పేర్కొంది.

వేదాంతా నిధుల సమీకరణ

వ్యయభరిత రుణాల రీఫైనాన్సింగ్‌కు సై

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ లండన్ దిగ్గజం వేదాంతా రిసోర్సెస్(వీఆర్‌ఎల్) గ్లోబల్ బ్యాంకుల నుంచి 60 కోట్ల డాలర్లు(సుమారు రూ. 5,160 కోట్లు) సమీకరించనుంది. కాలావధి రుణాల ద్వారా సమీకరించనున్న నిధులను అధిక వ్యయమవుతున్న ప్రయివేట్ క్రెడిట్ సౌకర్యాల రీఫైనాన్సింగ్‌కు వినియోగించనుంది. దేశీ లిస్టెడ్ కంపెనీ వేదాంతా లిమిటెడ్ మాతృ సంస్థ ఇది. తొలి దశలో 38 కోట్ల డాలర్లు, తదుపరి మరో 22 కోట్ల డాలర్లు సమకూర్చేందుకు బ్యాంకుల కన్సార్షియం అంగీకరించినట్లు వేదాంతా వెల్లడించింది. గల్ఫ్, జపనీస్, యూరోపియన్ బ్యాంకులతోకూడిన కన్సార్షియం ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొంది. రుణదాతల కన్సార్షియంలో స్టాన్‌చార్ట్, సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్ప్, ఫస్ట్ అబుధాబి బ్యాంక్ తదితరాలున్నట్లు తెలియజేసింది. నాలుగేళ్ల కాలావధిగల రుణ సౌకర్యం సగటున సుమారు మూడేళ్లలో గడువు తీరనున్నట్లు వెల్లడించింది. ఎస్‌వోఎఫ్‌ఆర్‌తోపాటు 450 బేసిస్ పాయింట్ల ధర(రేటు)లో నిధులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. తద్వారా సగటు రుణ వ్యయాలు ఒక అంకె స్థాయికి తగ్గనున్నట్లు తెలియజేసింది. 55 కోట్ల డాలర్ల రీఫైనాన్సింగ్‌లో 900 బేసిస్ పాయింట్లకుపైగా వడ్డీ వ్యయాల ఆదా ద్వారా వార్షికంగా 5 కోట్ల డాలర్లమేర వడ్డీ ఆదాకానున్నట్లు వివరించింది.



తిలక్ వర్మ సెంచరీ

ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్

లండన్: భారత యువ ఆటగాడు ఠాకూర్ తిలక్ వర్మ (241 బంతుల్లో 100; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) కౌంటీ చాంపియన్‌షిప్‌లో సెంచరీతో ఆకట్టుకున్నాడు. కౌంటీల్లో హ్యాంప్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తిలక్ వర్మ... ఎసెక్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో 'శత'క్కొట్టాడు. హైదరాబాద్‌కు చెందిన తిలక్ వర్మకు ఇదే తొలి కౌంటీ సీజన్ కాగా... టీమిండియా తరఫున అతడు 29 మ్యాచ్‌లు ఆడాడు. 22 ఏళ్ల తిలక్ వర్మ 4 వన్డేలు, 25 టి20ల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో మంచి రికార్డు ఉన్న తిలక్... సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ భారత జట్టులో చోటు దక్కించుకోవాలని భావిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కౌంటీల్లో అడుగుపెట్టిన అతడు... ఇంగ్లండ్ గడ్డపై తొలి మ్యాచ్‌లోనే చక్కటి బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన తిలక్... హ్యాంప్‌షైర్ తరఫున మాత్రం సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. తొలి డివిజన్ పోటీల్లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఎసెక్స్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 296 పరుగులు చేయగా... హ్యాంప్‌షైర్ తొలి ఇన్నింగ్స్‌లో 138.1 ఓవర్లలో 453 పరుగులు చేసింది. తిలక్ వర్మతో పాటు లియామ్ డాసన్ (235 బంతుల్లో 139; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరూ దంచికొట్టడంతో హ్యాంప్‌షైర్ జట్టు 157 పరుగుల ఆధిక్యం దక్కించుకుంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఎసెక్స్... మంగళవారం మూడోరోజు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 3 వికెట్లకు 108 పరుగులు చేసింది.

అన్నీ ఆయనే చూసుకున్నాడు

భర్త సత్యవర్త్ అండగా నిలిచాడు
- పాప ఆలనపాలన తనదే
- భారత స్టార్ రెజ్లర్ సాక్షి మలిక్ అంతరంగం

తల్లి అయ్యాక ఇబ్బందులెదుర్కొన్నా





న్యూఢిల్లీ: ఒలింపిక్స్ చరిత్రలో తొలి పతకాన్ని గెలిచిన భారత మహిళా రెజ్లర్‌గా ఘనత వహించిన సాక్షి మలిక్ తన అంతరంగాన్ని ఆవిష్కరించింది. ఓ అథ్లెట్‌గా ఎదిగిన వైనం, తల్లిగా... భార్యగా... మారిన విధానంతో 'గేమ్ ఆన్' తొలి ఎపిసోడ్ రూపుదిద్దుకుంది. ప్రీతి దహియా హోస్ట్‌గా వ్యవహరించిన ఈ పాడ్‌కాస్ట్‌లో సాక్షి తనను తాను పరిచయం చేసుకుంది. తన రెజ్లింగ్ పయనం... గృహిణిగా బాధ్యతలు ఇలా పదిలమైన జ్ఞాపకాలు, మధురమైన క్షణాలు అన్ని పంచుకుంది. క్రికెట్ మతమైన దేశంలో మిగతా ఆటల్లోని ఆణిముత్యాల్ని పరిచయం చేసే ఈ కార్యక్రమంలో సాక్షి సంగతులన్నీ ఇలా చెప్పుకొచ్చింది. 'ప్రేమ, పెళ్లికి ముందే సత్యవర్త్ కడియాన్ ఓ రెజ్లర్‌గానే తెలుసు. 2011లో ఇచ్చిన పుస్తకం, నేను రాసుకున్న ఊసులు, పోడియంపై ఊహించుకున్న బాసలు, రాత్రిళ్లు త్రివర్ణ పతకంతో పాటే నిదరోవడం అన్ని ఓ మెరుపు కలలు కానే కావు. నిజ జీవితంలో నిజమైన అనుభూతులు' అని ముచ్చటగా చెప్పింది.

రెజ్లింగ్‌లో నా అడుగులు

'మా కుటుంబంలో రెజ్లర్లు ఎవరూ లేరు. అలాంటి నాకు రెజ్లింగ్‌పై ఆసక్తి కలగడానికి జపాన్ దిగ్గజ రెజ్లర్ సావోరి యోషిదానే కారణం. ఓసారి విమానంలో విదేశీయానం చేసిన నాకు మూడుసార్లు ఒలింపిక్ చాంపియన్ అయిన ఆమె గురించి తెలిసింది. అప్పుడే నా కెరీరే రెజ్లింగ్ అయ్యింది. రెజ్లింగే తదనంతరం జీవితమైంది. కెనడాలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నా అభిమాన రెజ్లర్ యోషిదాను కలుసుకోవడంతో ఆనందం రెట్టింపైంది. అప్పుడే అనుకున్న నాకు ఆడబిడ్డ పుడితే యోషిదా పేరే పెట్టాలని! చివరకు అనుకున్నట్లే భగవంతుడు కుమార్తెనే ఇచ్చాడు. నేను గట్టిగా అనుకున్న పేరే పెట్టుకున్నాను'

ఫేస్‌బుక్ రిక్వెస్ట్‌తో...

'నేను... నా భర్త సత్యవర్త్ బాల్యం గడిపింది, చదివింది ఒకే చోటే అయినా కూడా ఒకరికొకరం తెలియదు. ఓ ఫేస్‌బుక్ ఫ్రెండ్ రిక్వెస్ట్‌తో మొదట టెక్స్ట్ (అక్షరాలు) కలిసింది. ఆ తర్వాతే మాట, బాట అన్ని కలిశాయి. రెజ్లింగ్ కెరీర్ కూడా ఇద్దరివి సమాంతరంగానే సాగాయి. మా క్రీడా ప్రయాణం, ప్రేమాయనం, 2014 కామన్వెల్త్ క్రీడల్లో పతకాల విజయం అన్ని కలిసే పయనించాయి. గ్లాస్గోలో రజతాలు గెలిచినపుడే సత్యవర్త్ ప్రేమ ప్రస్తావన తెచ్చాడు. కానీ నేనైతే ఒలింపిక్ పతకం వచ్చేదాకా ప్రేమపంజరంలో ఇరుక్కోనని చెప్పా. అప్పుడు నా జీవితమంతా రెజ్లింగే. నేను ఆశించినట్లే తను నా ప్రేమకై నిరీక్షించాడు. నా లక్ష్యం (రియో ఒలింపిక్ పతకం) సాకారమవగానే మా ప్రేమ తీరం కూడా చేరుకున్నాం'.

ప్రసవానికి ముందు రోజు కూడా...

'నేను నా కుమార్తెను ప్రసవించడానికి ముందు రోజు కూడా బాగా సిద్ధమయ్యాను. ఎందుకంటే నేనొక అథ్లెట్‌ను. ప్రసవానంతర ఒత్తిడి నన్ను దరిచేరదని భావించా. కానీ చిత్రంగా నేను ఇంటికెళ్లగానే పది–పదిహేను రోజుల పాటు ఏడుపును ఆపుకోలేకపోయాను. నా దగ్గరే బిడ్డ వుండటం కూడా కష్టంగా ఉండేది. అసలేమి జరుగుతుందో అర్థమయ్యేది కాదు అప్పుడు. నెలలు గడిచేకొద్దీ పరిస్థితిలో మార్పొచ్చింది. ఇప్పుడు పాపకు ఏడు నెలలు నిండాయి. మా అందరిలో ఆమెనే బలవంతురాలని అనిపిస్తుంది. చాలా ముద్దొస్తుంది. ఎంతటి క్రీడాకారులైనా కూడా మాతృత్వపు భావోద్వేగాలకు అతీతులు కాలేరనే విషయం అప్పుడే నాకు అర్థమైంది. ఇందులో ముఖ్యంగా నా భర్త అండదండల గురించి చెప్పుకోవాలి. ఎంతో ఓపిగ్గా, మురిపెంగా పాపని నన్ను చూసుకున్నారు'.

జపనీస్ దిగ్గజం పేరది

'మా ముద్దుల పాప పేరు యోషిదా. బహుశా మేమిద్దరం రెజ్లర్లు కావడంతో పాటు నాకెంతగానో స్ఫూర్తినిచ్చిన జపాన్ రెజ్లింగ్ దిగ్గజం సావోరి యోషిదా పేరే పెట్టుకున్నాం. మా బిడ్డకు అమ్మలాలన తక్కువైనా తండ్రి ప్రేమ మాత్రం అపారం. నేను ఆరోగ్యంగా ఉండేందుకు, తగినంత విశ్రాంతి తీసుకునేందుకు సత్యవర్త్ ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాడు. రోజూ రాత్రి 11 నుంచి తెల్లవారు జాము 3 గంటల వరకు నా భర్తే తల్లి పాత్ర పోషిస్తాడు. ఆ తర్వాత 3 నుంచి ఉదయం 8 గంటల వరకు నేను పాప సంగతి చూసుకుంటాను. ఈ సమయంలోనే సత్యవర్త్ విశ్రాంతి తీసుకుంటాడు'.

'పట్టుదలతో కట్టిపడేశాడు'

ఐసీసీ చైర్మన్ జై షా పై గంగూలీ ప్రశంసలు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రస్తుత అధ్యక్షుడు, గతంలో బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన జై షాపై భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ప్రశంసలు కురిపించాడు. 2019 నుంచి 2022 వరకు గంగూలీ బీసీసీఐ అధ్యక్షుడిగా వ్యవహరించిన సమయంలో జై షా బోర్డు కార్యదర్శిగా పనిచేశాడు. వీరిద్దరి మధ్య చక్కటి అనుబంధం ఉంది. రాజకీయ నేపథ్యం ఉన్న జై షా నిజాయితీ, పట్టుదల తనను ఎంతో ఆకట్టుకున్నాయని గంగూలీ పేర్కొన్నాడు. 'అప్పగించిన పనులు పూర్తి చేయడంలో జై షా చాలా ప్రత్యేకం. అతడు భారత క్రికెట్ అభివృద్ధికి సహకరించాడు. రాజకీయ నేపథ్యం నుంచి రావడంతో అతడి నిర్ణయాల్లో మొండితనం, ఓరకమైన దృఢత్వం ఉంటుందని ఆశించా. కానీ అందుకు భిన్నమైన తీరుతో నిజాయితీ, పట్టుదలతో ఆకట్టుకున్నాడు. ఎప్పుడూ ఆట గురించే ఆలోచిస్తాడు. దీన్ని మరింత మెరుగుపరిచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టొచ్చా అని మార్గాలు వెతుకుతుంటాడు' అని గంగూలీ అన్నాడు. కోవిడ్–19 వంటి క్లిష్ట సమయంలో బోర్డు అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన గంగూలీ, జై షా ఆటగాళ్ల సంరక్షణ కోసం ఎన్నోచర్యలు చేపట్టారు. కరోనా వైరస్ ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా క్రీడా కార్యకలాపాలు ఆగిపోయిన దశలోనూ 'బయోబబుల్' వంటి ప్రత్యేక ఏర్పాట్లతో ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐపీఎల్ వంటి టోర్నీలను నిర్వహించారు. 2022లో పదవీకాలం ముగియడంతో గంగూలీ స్థానంలో రోజర్ బిన్నీ బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగా... గతేడాది వరకు కార్యదర్శిగా కొనసాగిన 36 ఏళ్ల జై షా... 2024 నవంబర్‌లో ఐసీసీ చైర్మన్‌గా నియమితుడయ్యాడు. తద్వారా పిన్న వయసులో ఈ బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగా నిలిచాడు. '2019లో తొలిసారి అతడిని కలిశాను. గుజరాత్ క్రికెట్ సంఘంలో పనిచేసి వచ్చాడు. చిన్నపిల్లవాడిలా కనిపించాడు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా అండగా నిలిచేవాడు. ఏ సమయంలో అయినా సంప్రదించగానే స్పందించేవాడు. అతడికి ఆటపై స్పష్టమైన అభిప్రాయాలు, అవగాహన ఉంది. ఆటగాళ్లకు ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటాడు. క్రికెట్‌ను మరింత ముందుకు తీసుకెళ్లాలనే ఉన్నత లక్ష్యం అతని ఎదుగుదలకు సహకరించింది. అనుభవంతో మరింత రాటుదేలాడు. ఇప్పుడు క్రికెట్‌లో అత్యున్నత పదవైన ఐసీసీ చైర్మన్ బాధ్యతలు చేపడుతున్నాడు. నిజాయితీగా పనులు పూర్తి చేస్తాడు. ఇప్పటికీ అతడితో మంచి అనుబంధం కొనసాగుతోంది' అని గంగూలీ వివరించాడు.

క్వార్టర్స్‌లో యూకీ జోడీ



మలోర్కా (స్పెయిన్): వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీకి సన్నాహాల్లో భాగంగా మలోర్కా ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో బరిలోకి దిగిన భారత స్టార్ యూకీ బాంబ్రీ శుభారంభం చేశాడు. రాబర్ట్ గాలోవే (అమెరికా)తో జత కలిసి ఈ టోర్నీలో పోటీపడుతున్న యూకీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ–గాలోవే ద్వయం 6–3, 6–3తో గ్రెగోరి జాక్–అలెగ్జాండర్ ముల్లర్ (ఫ్రాన్స్) జోడీపై విజయం సాధించింది. 75 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ–గాలోవే ఆరు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా చేజార్చుకోని యూకీ–గాలోవే ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు.

కోచ్ పదవికి విస్మరించడంపై...

- ఒలింపిక్ పతక విజేత విజయ్ కుమార్ ఆవేదన
- ఎన్ఆర్ఏఐ అధ్యక్షుడికి లేఖ



న్యూఢిల్లీ: లండన్ ఒలింపిక్స్ (2012)లో రజత పతకం సాధించిన షూటర్ విజయ్ కుమార్‌ను కోచ్ పదవికి విస్మరించడంపై ఆవేదనకు గురయ్యాడు. కొత్త తరం కెరటాలను సానబెట్టాలనుకుంటున్న తన సంకల్పానికి భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) నుంచి స్పందన కరువైంది. కోచ్ పదవి కోసం తన పేరును పరిశీలించాల్సిందిగా పదేపదే దరఖాస్తు చేసుకున్నప్పటికీ అదేపనిగా ఎన్ఆర్ఏఐ వర్గాలు విస్మరిస్తున్నాయి. దీంతో విసిగివేసారిన విజయ్ తనకు ఎదురవుతున్న చేదు అనుభవంపై ఎన్ఆర్ఏఐ అధ్యక్షుడు కాళికేశ్ సింగ్ దేవ్‌కు లేఖ రాశాడు. షూటింగ్‌లో తను సాధించిన సాఫల్యాలు, ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో తన నైపుణ్యాన్ని గుర్తించాలని, యువ కిశోరాలను తీర్చిదిద్దే అవకాశం కల్పించాలని లేఖలో పేర్కొన్నాడు. దీనిపై కాళికేశ్ స్పందించారు. అతని దరఖాస్తులపై తనకు సమాచారం లేదని, కోచ్ అయ్యే అర్హత, సామర్థ్యం విజయ్ కుమార్‌కు ఉన్నాయని అన్నారు. 'కోచ్ పదవికి అతని పేరును తప్పకుండా పరిశీలిస్తాం. కజకిస్తాన్‌లో ఆగస్టు 16 నుంచి 30 వరకు ఆసియా చాంపియన్‌షిప్ పోటీలు ముగియగానే కోచ్‌ల పనితీరుపై సమీక్ష జరుపుతాం. ఫలితాలు ఇవ్వని కోచ్‌లను తొలగించిన వెంటనే కొత్త కోచ్‌ల నియామకం చేపడతాం' అని అన్నారు. ఈ ఫిబ్రవరిలో ఎన్ఆర్ఏఐ ఏకంగా 30పైచిలుకు మందిని కోచ్‌లుగా, హైపెర్ఫార్మెన్స్ నిపుణులుగా నియమించింది. మాజీ షూటర్లు జస్పాల్ రాణా, దీపాలి దేశ్‌పాండేల గడువును పొడిగించిన షూటింగ్ సంఘం... విజయ్ దరఖాస్తును మాత్రం బుట్టదాఖలు చేసింది. దీనిపై విజయ్ కుమార్ మాట్లాడుతూ తాను ఎన్ఆర్ఏఐ ప్రధాన కార్యదర్శి సహా సెలక్షన్ కమిటీ సభ్యుల్ని చాలాసార్లు కలిశానని, కానీ ఏ ఒక్కరు కూడా సంతృప్తికర సమాధానం ఇవ్వలేదని చెప్పాడు. ఒలింపిక్స్‌తో పాటు పలు కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు గెలిచిన విజయ్‌ని భారత ప్రభుత్వం ఖేల్‌రత్న అవార్డుతో సత్కరించింది. ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖలో డీఎస్పీగా ఉన్న విజయ్ కోచ్ పదవిని గట్టిగా ఆశిస్తున్నాడు.



విజేత లలిత్

ముంబై: ఆరియన్‌ప్రో ముంబై ఓపెన్ అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ మునునూరి రోహిత్ (ఎంఆర్) లలిత్ బాబు చాంపియన్‌గా అవతరించాడు. మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో విజయవాడకు చెందిన 32 ఏళ్ల లలిత్ బాబు ఎనిమిది పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. లలిత్‌తోపాటు అర్మేనియాకు చెందిన మామికోన్ ఘరిబియాన్ కూడా 8 పాయింట్లు సంపాదించాడు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా విజేతను నిర్ణయించగా... లలిత్ బాబుకు టైటిల్ ఖరారైంది. 150 మంది ప్లేయర్ల మధ్య స్విస్ ఫార్మాట్‌లో తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో లలిత్ బాబు ఏడు గేముల్లో గెలిచి, మరో రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో నల్ల పావులతో ఆడిన లలిత్ 72 ఎత్తుల్లో జార్జియా గ్రాండ్‌మాస్టర్ లెవాన్ పాంట్‌సులయపై గెలుపొందాడు. 2012లో భారత 26వ గ్రాండ్‌మాస్టర్ (జీఎం)గా అవతరించిన లలిత్ బాబు 2014 చెస్ ఒలింపియాడ్‌లో కాంస్య పతకం గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. కామన్వెల్త్ చాంపియన్‌గా నిలిచిన లలిత్ ఆసియా చాంపియన్‌షిప్‌లో రజతం కూడా సాధించాడు. ఓవరాల్‌గా లలిత్ తన కెరీర్‌లో ఇప్పటి వరకు 20 స్వర్ణాలు, 15 రజతాలు, 14 కాంస్య పతకాలు సాధించాడు.



శ్రీతేజకు స్వర్ణం

ప్రయాగ్‌రాజ్ (ఉత్తరప్రదేశ్): జాతీయ జూనియర్ అండర్–20 ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో చివరిరోజు తెలంగాణకు ఒక స్వర్ణ పతకం, ఒక కాంస్య పతకం లభించాయి. ఏడు క్రీడాంశాల (100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్లు) సమాహారమైన మహిళల హెప్టాథ్లాన్‌లో తెలంగాణ అమ్మాయి థోలెం శ్రీతేజ చాంపియన్‌గా నిలిచింది. భద్రాచలం పట్టణానికి చెందిన శ్రీతేజ మొత్తం 4735 పాయింట్లతో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. హర్షిత (ఢిల్లీ; 4414 పాయింట్లు) రజతం దక్కించుకోగా... జాస్మిన్ (కేరళ; 3907 పాయింట్లు) కాంస్య పతకాన్ని సాధించింది. గత ఏడాది డిసెంబర్‌లో ఒడిశాలో జరిగిన జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం నెగ్గిన శ్రీతేజ ఈసారి ఫెడరేషన్ కప్‌లో స్వర్ణ పతకం సాధించడం విశేషం. మరో వైపు అండర్–20 పురుషుల 800 మీటర్ల విభాగంలో తెలంగాణకే చెందిన బానోత్ వినోద్ కుమార్ కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. వినోద్ 1 నిమిషం 50.26 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానంలో నిలిచాడు.

'వింబుల్డన్ 150' వేడుకల్లో ముర్రే విగ్రహావిష్కరణ



లండన్: మరో రెండేళ్లలో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ ఈవెంట్ 150వ వార్షికోత్సవం జరుపుకోనుంది. ఈ నేపథ్యంలో బ్రిటన్ మేటి ఆటగాడు ఆండీ ముర్రే విగ్రహాన్ని ఆవిష్కరించాలని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ భావించింది. దీని కోసం ముర్రే సంబంధిత కళాకారులతో కలిసి పనిచేయనున్నట్లు తెలిసింది. ముర్రే చుట్టుకొలతలు, ఒడ్డిక, పాదవుల్ని వారితో పంచుకోనున్నాడు. నిజానికి 'బిగ్–త్రీ' ఫెడరర్–నాదల్–జొకోవిచ్‌లతో ముర్రే సమకాలికుడైనప్పటికీ ఆ ముగ్గురితో పోల్చదగిన దిగ్గజమైతే కాదు. అయితే ముర్రే 2013లో వింబుల్డన్ టైటిల్‌తో 77 ఏళ్ల బ్రిటన్ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించడం ద్వారా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. 1936లో ఫ్రెడ్ పెర్రీ గెలిచిన తర్వాత మరే బ్రిటన్ ప్లేయర్ వింబుల్డన్‌లో గెలుపొందలేకపోయాడు. ఏడున్నర దశాబ్దాల తర్వాత ఎట్టకేలకు ముర్రే వింబుల్డన్ టైటిల్‌తో బ్రిటన్ ముచ్చట తీర్చాడు. 2027లో జరిగే 150 ఏళ్ల వింబుల్డన్ పండగలో ముర్రేతో పాటు పెర్రీ విగ్రహాన్ని కూడా ఆవిష్కరిస్తారు. ముర్రే తన కెరీర్‌లో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను గెలిచాడు. 2012లో యూఎస్ ఓపెన్ గెలిచిన అతను 2013, 2016లలో వింబుల్డన్ విజేతగా నిలిచాడు. ఇక ఈ సీజన్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఈ నెల 30 నుంచి జరుగుతుంది.

లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలో ఎనిగ్మా కర్సర్ అనే రెండు కాళ్ల శాకాహార డైనోసార్ అస్థిపంజరమిది. దీని పొడవు కేవలం 180 సెంటీమీటర్లు, ఎత్తు 64 సెంటీ మీటర్లు. మంగళవారం ఈ అస్థిపంజరాన్ని మీడియా ఎదుట ప్రదర్శించారు. ఈ మ్యూజియంలో అనేక డైనోసార్ల అస్థిపంజరాలను సైతం చూడొచ్చు.



వేడెక్కుతున్న ఆసియా

ప్రపంచ సగటు కంటే రెండు రెట్లు అధికం ● ప్రపంచ వాతావరణ సంస్థ పరిశోధనలు వెల్లడి

పర్యావరణంపై ఓ కొత్త నివేదిక ఆసియాను ఆందోళన పరుస్తోంది. తీవ్రమైన వాతావరణ మార్పులు ఆసియాను సంక్షోభానికి గురి చేస్తాయని హెచ్చరిస్తోంది. వాతావరణ మార్పులపై ప్రపంచ వాతావరణ సంస్థ ఇటీవల 'స్టేట్ ఆఫ్ ది క్లైమేట్ ఇన్ ఆసియా-2024'ను విడుదల చేసింది. ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలకంటే ఆసియా రెండు రెట్లు వేగంగా వేడెక్కుతోందని అధ్యయనం పేర్కొంది. ఈ మార్పు అత్యంత తీవ్రమైన పర్యావరణ సమస్యలను కలిగిస్తుందని హెచ్చరించింది. మంచి నీటి వనరులతో పాటు, తీర ప్రాంతాలకు ముప్పు అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.



వేగంగా కరుగుతున్న హిమనీనదాలు

ఆసియాలో అత్యంత అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరాల్లో 2024లో ఒకటిగా నమోదైందని నివేదిక తెలిపింది. 1991-2020 బేస్‌లైన్ కంటే సగటు ఉష్ణోగ్రతలు 1.04 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉన్నాయని పేర్కొంది. ఖండం ప్రపంచ సగటు కంటే దాదాపు రెండు రెట్లు వేగంగా వేడెక్కుతోందని నివేదిక తెలిపింది. ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా మధ్య ఆసియాలోని హిమాలయాలు, టియాన్ షాన్ వంటి కీలక పర్వత శ్రేణుల్లో హిమానీనదాలు కరగడం వేగవంతం అయ్యింది. దీనివల్ల కీలకమైన మంచినీటి వనరులు, పర్యావరణ వ్యవస్థలకు ప్రమాదం ఉందని వివరించింది.

తీరప్రాంతాలకు ముప్పు..

ఆసియాలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కూడా రికార్డు స్థాయిలో పెరిగాయని 'స్టేట్ ఆఫ్ ది క్లైమేట్ ఇన్ ఆసియా-2024'నివేదిక తెలిపింది. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైన కారణంగా, ఆసియా పసిఫిక్, హిందూ మహాసముద్ర తీరప్రాంతాల్లో సముద్ర మట్టాలు ప్రపంచ సగటు కంటే వేగంగా పెరిగాయి. ఈ ధోరణులు భారత్‌తో సహా ఖండంలోని తీరప్రాంతాల్లో నివసించే లక్షలాది మంది ప్రజలకు ప్రమాదమని పేర్కొంది. ఇవి వరదలు, తుఫానుల ప్రమాదాలను పెంచుతాయని వెల్లడించింది. 2024 ఆసియా ఖండం అంతటా తీవ్ర విపత్తులు సంభవించిన విషయం తెలిసిందే.

తీవ్రమైన వేడి..

ఆసియాలోని కొన్ని ప్రాంతాలను, ముఖ్యంగా భారత్, జపాన్‌లను సుదీర్ఘమైన వేడి గాలులు తాకాయని తెలిపింది. ఇవి వందలాది మంది మరణాలకు కారణమయ్యాయని నివేదిక పేర్కొంది. సముద్ర ఉష్ణ గాలులు రికార్డు స్థాయిలో 15 మిలియన్ చదరపు కిలో మీటర్లకు చేరుకున్నాయని, ఇది సముద్ర జీవవైవిధ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని హెచ్చరించింది. ఈ సంవత్సరంలో ఉష్ణమండల తుఫాను యాగి ఆగ్నేయాసియా అంతటా విస్తృతమైన నష్టాన్ని కలిగించింది. ఇది గత సెప్టెంబర్‌లో ఉత్తర వియత్నాంలో డజన్ల కొద్దీ ప్రజల ప్రాణాలను బలిగొంది. అలాగే, మధ్య ఆసియా 70 సంవత్సరాలలో ఎన్నడూ లేనంత దారుణమైన వరదలను చవి చూసింది. ఎన్నడూ లేనంత వర్షపాతంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మౌలిక సదుపాయాలకు తీవ్ర అంతరాయం కలిగింది. సెప్టెంబర్ 2024లో నేపాల్ కూడా విపరీతమైన వరదలొచ్చాయి. 246 మంది ప్రాణాలు కోల్పోయారు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు సకాలంలో పనిచేయడం, పరిపాలనా వ్యవస్థలు సమన్వయంతో ప్రతిస్పందించడంతో వేలాది మంది ప్రాణాలను కాపాడగలిగారు.

తక్షణ వ్యూహాలు..

ఈ విపత్కర పరిస్థితుల్లో పర్యావరణాన్ని కాపాడుకోవడానికి తక్షణ వ్యూహాలు అత్యవసరమని నివేదిక సూచించింది. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి దేశాలన్నీ ఉమ్మడి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని పేర్కొంది. పర్యావరణ మార్పుల వల్ల కలిగే మానవ, ఆర్థిక నష్టాన్ని తగ్గించడానికి ముందస్తు చర్యలు చాలా అవసరమని, ప్రజల జీవితాలను, వారి జీవనోపాధిని రక్షించడానికి విపత్తు సంసిద్ధతను మెరుగుపరచాలని సూచించింది. ఇక రాబోయే ముప్పును గుర్తించడంలో జాతీయ వాతావరణ సేవలు కీలకమైన పాత్ర పోషించాల్సి ఉంటుందని గుర్తు చేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్



రొమేనియాలోని బుకారెస్ట్‌లో మంగళవారం సాంజియెన్ వేడుకలో భాగంగా పూల కిరీటాలతో యువతుల నాట్యం



స్పెయిన్‌లోని సొరియా ప్రావిన్స్‌లోని శాన్ పెడ్రో మన్రిక్‌లో శాన్ జువాన్ కార్యక్రమం కోసం సిద్ధం చేస్తున్న అగ్ని గుండాలు. మనవాళ్లకు మాదిరిగా అక్కడా నిప్పులపై చెప్పుల్లేకుండా నడిచే సంప్రదాయం ఉంది



ఇరాన్ క్షిపణి దాడులతో సైరన్లు మోగడంతో మంగళవారం ఇజ్రాయెల్‌లోని హైఫాలోని అండర్‌గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లోకి చేరిన జనం



రష్యాలోని తూర్పుప్రాంత జబైకల్‌స్కీ క్రాయ్‌లో కార్చిచ్చు వ్యాపిస్తుండటంతో వాహనదారులు అటమనోవ్‌కా వద్ద ఇలా హైవే పక్కన కార్లను నిలిపేశారు

ప్రయాణికులు 241 మంది, ఇతరులు 34 మంది

విమాన ప్రమాద మృతులపై స్పష్టత

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాద మృతుల సంఖ్యపై గుజరాత్ ప్రభుత్వం మొదటిసారిగా స్పష్టతనిచ్చింది. ఈ విషాద ఘటనలో మొత్తం 275 మంది చనిపోయారని తెలిపింది. వీరిలో విమానంలోని 241 మంది, ఆ సమయంలో ఘటనాస్థలి అయిన బీజే మెడికల్ కాలేజీ ఆవరణలోని మరో 34 మంది ఉన్నారంది. ఘటనాస్థలి నుంచి మృతదేహాలన్నిటినీ తొలగించామని, డీఎన్ఏ ద్వారా 260 మృతదేహాలను, ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా మరో ఆరుగురిని గుర్తించామని మంగళవారం గుజరాత్ ఆరోగ్య శాఖ ప్రకటించింది. మృతుల్లో 120 మంది పురుషులు, 124 మంది మహిళలు, 16 మంది చిన్నారులు ఉన్నారు. ఇప్పటి వరకు 256 మృతదేహాలను సంబంధీకులకు అప్పగించారు.

వలస ఖైదీలను మూడో దేశానికి పంపొచ్చు

ప్రభుత్వానికి మార్గం సుగమం చేసిన అమెరికా సుప్రీంకోర్టు

వాషింగ్టన్: వలసదారులను వారి స్వదేశాలకు కాక ఇతర దేశాలకు తిరిగి పంపించే ప్రక్రియకు అమెరికా సుప్రీంకోర్టు మార్గం సుగమం చేసింది. వలసదారులను మూడో దేశానికి పంపడం వల్ల వారు ఎదుర్కొనే ప్రమాదాలను అధికారులకు చెప్పడానికి అవకాశం ఇవ్వాలని కోరుతూ దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును తోసిపుచ్చింది. ఇది అక్రమాలకు వారు అనుభవించే ప్రతిఫలమని కోర్టు వ్యాఖ్యానించింది. వలసదారుల బహిష్కరణలపై కఠిన వైఖరి అవలంబిస్తున్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు ఊరటనిచ్చింది. ఈ కేసులో మయన్మార్, దక్షిణ సూడాన్, క్యూబా, మెక్సికో, లావోస్, వియత్నాం దేశాలకు చెందిన ఎనిమిది మంది వలసదారులు ఉన్నారు. వీరిని మే నెలలో దక్షిణ సూడాన్‌కు వెళ్తు విమానంలో పంపించారు. అయితే వలసదారులను మూడో దేశాలకు తరలిస్తే అక్కడ వారు హింసకు లేదా హత్యకు గురయ్యే అవకాశం ఉందన్న అప్పీళ్లను సుప్రీం కొట్టిపారేసింది. కోర్టు తీర్పు భయంకరమైనదని నేషనల్ ఇమ్మిగ్రేషన్ లిటిగేషన్ అలయన్స్ తెలిపింది. ఈ నిర్ణయం తమ క్లయింట్లను హింసకు, మరణానికి గురిచేసిందన్నారు. ఈ తీర్పు అమెరికా ప్రజల భద్రత, రక్షణకు విజయమని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. ఎనిమిది మంది వలసదారులు అమెరికాలో హత్య, దహనం, సాయుధ దోపిడీతో సహా క్రూరమైన నేరాలకు పాల్పడ్డారని తెలిపింది. కానీ, ఖైదీలలో చాలా మందిపై ఎటువంటి నేరారోపణలు లేవని వలసదారుల న్యాయవాదులు సుప్రీంకోర్టుకు వినిపించారు.

గాజాలో మళ్లీ కాల్పులు 50 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్: గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ఆర్మీ, డ్రోన్లు, శతఘ్నులతో జరిపిన కాల్పుల్లో మంగళవారం కనీసం 50 మంది ప్రాణాలు కోల్పోయారు. 2023 అక్టోబర్ నుంచి ఇజ్రాయెల్ ఆర్మీ జరుపుతున్న దాడులు, కాల్పుల్లో మరణించిన వారి సంఖ్య 56 వేల మార్క్‌ను దాటిందని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. అమెరికా కాంట్రాక్టర్ దాదాపు రెండు నెలలుగా నిర్వహిస్తున్న ఆహార పంపిణీ కేంద్రాల వద్ద అన్నార్తులపై కాల్పులు నిత్యకృత్యంగా మారాయి. మంగళవారం ఆహార పంపిణీ కేంద్రం వద్దకు వచ్చిన ట్రక్కుల సమీపంలోకి జనం దూసుకెళ్లడంతో ఇజ్రాయెల్ ఆర్మీ ట్యాంకులు, డ్రోన్లతో కాల్పులకు దిగిందని అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. కాల్పులతో జనం భయంతో పరుగులు తీశారని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. ఈ కాల్పుల్లో 25 మంది చనిపోగా దాదాపు 150 మంది గాయపడ్డారని నుసెయిరత్ శరణార్థి శిబిరం వద్ద ఉన్న ఔదా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. క్షతగాత్రుల్లో 62 మంది పరిస్థితి విషమంగా ఉందని వివరించాయి. ఈ ఘటనలో చనిపోయిన ఆరుగురి మృతదేహాలు తమ ఆస్పత్రికి తీసుకొచ్చారని డెయిర్ అల్-బలాహ్‌లోని అల్-అక్సా ఆస్పత్రి వర్గాలు సైతం వెల్లడించాయి. గాజాలోని వేర్వేరు ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మరో 25 మంది చనిపోయినట్లు అల్‌జజీరా తెలిపింది. ఇలా ఉండగా, 2023 అక్టోబర్ 7 నుంచి 21 నెలలుగా గాజాపై జరుగుతున్న దాడుల్లో 56,077 మంది చనిపోగా మరో 1.31 లక్షల మంది గాయపడ్డారని ఆరోగ్య విభాగం తెలిపింది.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్‌తో దోస్తీనా!

డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలపై అమిత్ షా ఆగ్రహం

న్యూఢిల్లీ: దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ పార్టీతో డీఎంకే, సోషలిస్టు పార్టీల నాయకులు, ఇతరులపై హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. అధికారం కోసం కాంగ్రెస్ ఎంతకైనా దిగజారుతుందనే విషయం ఆత్యయిక పరిస్థితితో ప్రతి ఒక్కరికీ తెలిసిపోయిందన్నారు. 'ఎమర్జెన్సీకి 50 ఏళ్లు'అంశంపై జరిగిన ఓ కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కానీ, ఎమర్జెన్సీ సమయంలో అన్యాయం, అరాచకం, నియంతృత్వం ఎలా రాజ్యం చేశాయో ఇప్పటికీ ప్రతి ఒక్కరీ మనస్సుల్లో గుర్తుండిపోయిందని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో దేశ వ్యాప్తంగా ప్రతిపక్ష నేతలు, విద్యార్థి నాయకులు, జర్నలిస్టులు, సంపాదకులు..ఇలా లక్ష మందికి పైగా జైలు పాలు కావాల్సి వచ్చిందన్నారు. గుజరాత్, తమిళనాడుల్లో అధికారంలో ఉన్న కాంగ్రెసేతర ప్రభుత్వాలను అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ డిస్మిస్ చేశారని గుర్తు చేశారు. అప్పట్లో ఇబ్బందులకు గురైన వారిలో చాలా మంది ప్రస్తుతం కాంగ్రెస్‌తో సన్నిహిత సంబంధాలను కొనసాగించడం గుర్తించాల్సిన అంశమని చెప్పారు. 'దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన పార్టీతో చేతులు కలిపిన మీకు, ప్రజాస్వామ్యం గురించి ప్రశ్నించే హక్కు ఎక్కడుందని డీఎంకే, సమాజ్‌వాదీ (సోషలిస్టులు) తదితరులను అడగాలనుకుంటున్నా'అన్నారు. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన మన దేశం నియంతృత్వాన్ని అంగీకరించబోదని పేర్కొన్నారు. 'ఆ నిరంకుశపాలకురాలి చుట్టూ ఉండే చిన్న సమూహం తప్ప మరెవరూ అత్యవసర పరిస్థితిని ఇష్టపడలేదు. అందుకే, అత్యవసర పరిస్థితిని ఎత్తివేశాక దేశ ప్రజలు మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో తనకు కేవలం 11 ఏళ్లని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పట్లో గుజరాత్‌లోని తమ సొంతూరికి చెందిన 184 మందిని పోలీసులు అరెస్ట్ చేసి, సబర్మతీ జైలుకు తరలించారని తెలిపారు.

త్రివిధ దళాలకు ఆదేశాలిచ్చే అధికారం సీడీఎస్‌కు

న్యూఢిల్లీ: త్రివిధ దళాలకు ఆదేశాలు జారీ చేసే అధికారాన్ని డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్‌కు కట్టబెడుతూ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్య రక్షణ బలగాలైన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లలో సమష్టి తత్వాన్ని, ఐక్యతను పెంచుతుందని ఆయన వివరించారు. సాయుధ దళాల ఆధునీకరణ, పరివర్తన దిశగా పడిన ఒక ప్రధానమైన అడుగని రక్షణ శాఖ అభివర్ణించింది. త్రివిధ దళాల్లో పారదర్శకత, సహకారం, పరిపాలనా సామర్థ్యం మెరుగవుతుందని తెలిపింది. ఇప్పటి వరకు రెండు, అంతకంటే ఎక్కువ విభాగాలకు వేర్వేరుగా సూచనలు, ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. తాజా నిర్ణయంతో ఈ ఒరవడి పూర్తిగా మారనుంది. ఇందుకు సంబంధించిన మొట్టమొదటి ఉత్తర్వు మంగళవారం విడుదలైందని రక్షణ శాఖ తెలిపింది.

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారని మినహాయింపు ఇవ్వలేం: సుప్రీం

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారనే కారణంతో ఇంట్లో పాల్పడిన దారుణ కృత్యాల నుంచి మినహాయింపులు ఇవ్వలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కట్నం వేధింపుల కేసులో భార్య మృతిపై పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు మినహాయింపు ఇవ్వాలన్న పిటిషనర్ వినతిని జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం మంగళవారం తోసిపుచ్చింది. పిటిషనర్ బల్జీందర్ సింగ్ రాష్ట్రీయ రైఫిల్స్‌లో 20 ఏళ్లుగా బ్లాక్ క్యాట్ కమాండోగా పనిచేస్తున్నారని, ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌లో సైతం పాల్గొన్నారని అతడి లాయర్ విక్రమ్ చౌదరి ధర్మాసనానికి వివరించారు. స్పందించిన ధర్మాసనం..'దీన్ని బట్టి మీరెంత ఫిట్‌నెస్‌గా ఉన్నారో అర్థమవుతోంది. భార్యను మీరొక్కరే, మీ భార్యను ఉరి వేసి ఎలా చంపగలిగారో తెలుస్తోంది'అని వ్యాఖ్యానించింది. అయితే, ఆరు వారాల్లోగా స్పందించాలంటూ ఈ కేసులో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కాగా, పెళ్లయిన రెండేళ్లకే భార్యను కట్నం పేరుతో చంపిన ఆరోపణలపై 2004లో అమృత్‌సర్‌లోని న్యాయస్థానం పిటిషనర్‌ను దోషిగా నిర్ధారించింది. బల్జీందర్ సింగ్ కట్నం కోసం భార్యను దారుణంగా హింసించి చంపినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మినహాయింపు ఇవ్వాలన్న వినతిని పంజాబ్ హరియాణా హైకోర్టు తోసిపుచ్చింది.

బెయిలిచ్చినా విడుదల చేయని జైలర్

'న్యాయం అపహాస్యం' అంటూ సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా విడుదల చేసేందుకు జైలర్ నెలల తరబడి జాప్యం చేయడంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ చర్య ఎంతో దురదృష్టకరం, న్యాయం అపహాస్యమవుతోందంటూ మండిపడింది. దిగువ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులో యూపీ చట్ట వ్యతిరేక మత మార్పిడి చట్టం-2021 సెక్షన్ 5లోని క్లాజ్(1)ను చేర్చనందుకు తనను విడుదల చేయలేదన్న పిటిషనర్ పేర్కొన్నారు. ఆ క్లాజ్‌ను చేరుస్తూ తాజాగా బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ అంశాన్ని జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. పిటిషనర్‌కు సుప్రీంకోర్టు ఏప్రిల్ 29వ తేదీన బెయిలివ్వగా, మే 27న ఘాజియాబాద్ కోర్టు విడుదల ఉత్తర్వులిచ్చింది. బెయిలిచ్చినా విడుదల చేయకపోవడానికి కారణమైన ఘాజియాబాద్ జిల్లా జైలు సూపరింటెండెంట్ 25న స్వయంగా హాజరు కావాలని, యూపీ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్‌ను వర్చువల్‌గా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

బోయింగ్ విమానాల్ని ఆపేయండి

సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ విషాదం నేపథ్యంలో ఎయిరిండియాకు చెందిన బోయింగ్ విమాన సర్వీసులన్నిటినీ నిలిపివేసేలా ఆదేశించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎయిరిండియాతో దేశంలో కార్యకలాపాలు నిర్వహించే అన్ని విమానయాన సంస్థలకు చెందిన విమానాలపై ఆకస్మిక ఆడిట్ చేపట్టాలని కోరింది. ఈ ఆడిట్ వివరాలను బహిర్గతం చేయడంతోపాటు లోపాలకు బాధ్యులైన వారిపై జరిమానాలు విధించాలని, దిద్దుబాటు చర్యలను వెంటనే చేపట్టాలని పేర్కొంది. న్యాయవాది అజయ్ బన్సల్ ఈ మేరకు పిటిషన్ వేశారు. ప్రతివాదులుగా కేంద్రంతోపాటు డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ), ఎయిరిండియా, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ(బీసీఏఎస్)లను చేర్చారు.

ఇద్దరు బోధకులకు తీవ్ర అవమానం

అగ్రకులానికి చెందిన నలుగురు అరెస్ట్

ఇటావా: భాగవత కథ చెప్పేందుకు గ్రామానికి వచ్చిన కథా వాచక్, అతడి సహాయకుడిని కులం పేరుతో దూషించి, తీవ్రంగా అవమానించిన అగ్ర కులానికి చెందిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన యూపీలోని ఇటావా జిల్లాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ముకుట్ మణి యాదవ్, ఆయన సహాయకుడు సంత్ సింగ్ యాదవ్ భాగవత కథా ప్రవచనం కోసం శనివారం రాత్రి దండార్‌పూర్ గ్రామానికి వెళ్లారు. ప్రవచనం అనంతరం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వారి వద్దకు వచ్చి కులం అడిగారు. బ్రాహ్మణులుండే గ్రామానికి రావడానికి మీకెంత ధైర్యం అంటూ వారిని నానా దుర్భాషలాడారు. ముక్కునే నేలపైకి రాయించారు. మూత్రం వారిపై చల్లారు. గుండు గీయించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులు నలుగురిని అరెస్టు చేశారు.

నీట్‌లో తక్కువ మార్కులొచ్చాయని... కూతురిని కొట్టి చంపిన తండ్రి

సాంగ్లీ: నీట్‌లో తక్కువ మార్కులొచ్చాయని ఓ తండ్రి.. కూతురిని కొట్టి చంపాడు. మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాంగ్లికి చెందిన 17 ఏళ్ల సాధన వైద్య జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) రాసింది. ఇటీవలే ఫలితాలు వచ్చాయి. సాధనకు తక్కువ మార్కులు రావడంతో ఆగ్రహించిన ధోండి రామ్ భోస్లే శుక్రవారం రాత్రి ఆమెను కర్రతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన బాలికను ఆమె తల్లి ప్రీతి భోస్లే.. స్థానిక ఆసుపత్రికి తరలించింది. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి ఆమెను జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాధన మరణించింది. కూతురికి అంత్యక్రియలు నిర్వహించిన తర్వాత ప్రీతి.. భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. భార్య ఫిర్యాదు మేరకు.. ధోండి రామ్ భోస్లేను ఆదివారం అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. జూన్ 24 వరకు పోలీసు కస్టడీకి విధించారు.

ఎయిరిండియా విమానంలో ఏడుగురికి అస్వస్థత

బాధితుల్లో సిబ్బంది

న్యూఢిల్లీ: ఎయిరిండియా విమానంలో సిబ్బంది సహా ఏడుగురు అనారోగ్యానికి గురయ్యారు. లండన్ నుంచి ముంబైకి బయలుదేరిన ఎయిరిండియా విమానం ఏఐ-130లో మార్గమధ్యంలో ఇద్దరు సిబ్బంది, ఐదుగురు ప్రయాణికులు తలతిప్పుతోందని, వికారంగా ఉందని ఫిర్యాదు చేశారు. అయితే అత్యవసర పరిస్థితి కాకపోవడంతో, బోయింగ్ 777 విమానం తన ప్రయాణాన్ని కొనసాగించింది. ముంబైలో సురక్షితంగా ల్యాండ్ అయింది. అక్కడ ముందుగానే అప్రమత్తమైన వైద్య బృందాలు వారిని పరీక్షించారు. ప్రాథమిక చికిత్స చేశారు. ఈ సంఘటనపై తాము దర్యాప్తు చేస్తున్నామని, రెగ్యులేటరీకి కూడా తెలియజేశామని ఎయిరిండియా ప్రతినిధి ఒకరు తెలిపారు. అయితే... అనారోగ్యానికి గల కారణంపై ఇంకా అధికారిక ధ్రువీకరణ లేదు. ఈ సంఘటనలకు ఫుడ్ పాయిజనింగ్ కారణమై ఉంటుందని సీనియర్ ఎయిర్‌లైన్ అధికారిని ఉటంకిస్తూ మరో నివేదిక తెలిపింది.

రష్యా దాడుల్లో 16 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్‌లోని జనావాసాలపై రష్యా దాడులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తాజాగా, డ్రోన్లు, క్షిపణులు, శతఘ్నులతో మంగళవారం జరిపిన దాడుల్లో 16 మంది పౌరులు చనిపోగా, 100 మంది వరకు గాయపడ్డారు. సెంట్రల్ ఉక్రెయిన్‌లోని నీప్రో నగరంపై మంగళవారం మధ్యాహ్నం రష్యా జరిపిన బాలిస్టిక్ క్షిపణి దాడుల్లో ఏడుగురు చనిపోగా 70 మంది వరకు క్షతగాత్రులయ్యారని అధికారులు వెల్లడించారు. సమీపంలోని సమర్‌పై జరిగిన దాడిలో మరో ఇద్దరు మరణించగా 9మంది గాయపడ్డారని స్థానిక అధికారులు వివరించారు. దాడుల్లో 20 స్కూళ్లు, 10 కిండర్‌గార్టన్లు, ఒక సంక్షేమ కార్యాలయం, ఎనిమిది వైద్య కేంద్రాలు దెబ్బతిన్నాయన్నారు. ప్రయాణికుల రైలు కిటికీలు సైతం ధ్వంసమయ్యాయని చెప్పారు. ఖెర్సన్‌పై రష్యా జరిపిన దాడుల్లో నలుగురు చనిపోగా 11 మంది గాయాలపాలయ్యారు. సుమీ ప్రాంతంలో రష్యా డ్రోన్ దాడుల్లో ఐదేళ్ల చిన్నారి సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఆరుగురు గాయపడ్డారు.

ఆర్జేడీ చీఫ్‌గా లాలు మళ్లీ ఎన్నిక

పట్నా: రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) వ్యవస్థాపకుడు లాలు ప్రసాద్ యాదవ్ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికయ్యారు. సంస్థాగత ఎన్నికల ఫలితాలను పార్టీ రిటర్నింగ్ అధికారి రామచంద్ర పుర్బే మంగళవారం వెల్లడించారు. ఆర్జేడీ అధ్యక్ష పదవి కోసం లాలు ఒక్కరే నామినేషన్ వేశారని తెలిపారు. ఆయన నామినేషన్ సక్రమంగా ఉన్నట్లు పరిశీలనలో తేలిందని చెప్పారు.

జైన మతాభిమాని అయిన ప్రముఖ కళింగ పాలకుడు ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మతోద్యమాలు

1. భారతదేశంలో నూతన మతోద్యమాల కాలం ఏది?
ఎ) క్రీ.పూ. ఆరో శతాబ్దం
బి) క్రీ.పూ. అయిదో శతాబ్దం
సి) క్రీ.పూ. నాలుగో శతాబ్దం
డి) క్రీ.పూ. రెండో శతాబ్దం

2. అజీవక మత స్థాపకుడు ఎవరు?
ఎ) గోసాలపుత్త బి) అలరకలామ
సి) ఉద్దక రామపుత్త డి) పార్శ్వనాథ

3. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) జైనమతంలో మొత్తం తీర్థంకరుల సంఖ్య 24
బి) మొదటి తీర్థంకరుడు రుషభనాథుడు
సి) చివరి తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు
డి) పైవన్నీ

4. చార్వాక మత స్థాపకుడు ఎవరు?
ఎ) అలరకలామ బి) నేమినాథ
సి) అజితకేశకంబళిన్ డి) ఆదినాథ

5. జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. సల్లేఖన	i. జైనులు ఆచరించే వ్రతం
2. శాద్వాదం	ii. జైనతత్వం
3. విద్యాదేవి	iii. జైనులు ఆరాధించే స్త్రీ దేవత
4. అంగాలు	iv. జైనుల పవిత్ర గ్రంథాలు
5. దిగంబర, శ్వేతాంబర	v. జైనమత శాఖలు

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-iv, 2-v, 3-iii, 4-ii, 5-i
సి) 1-ii, 2-i, 3-v, 4-iii, 5-iv
డి) 1-v, 2-iv, 3-i, 4-iii, 5-ii

6. బౌద్ధమతంలో తాంత్రిక శాఖ ఏది?
ఎ) హీనయానం బి) వజ్రయానం
సి) మహాయానం డి) ఏదీకాదు

7. బుద్ధుడి తొలి గురువు ఎవరు?
ఎ) అలరకలామ బి) ఉద్దక రామపుత్త
సి) ఎ, బి డి) ఎవరూకాదు

8. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ) బుద్ధుడు ప్రతిపాదించిన సిద్ధాంతం - ప్రతీత్య సముత్పాద
బి) బౌద్ధమతం ఆచరించేవారు - ఉపాసికులు, భిక్షువులు
సి) బౌద్ధమత ముఖ్య శాఖలు - హీనయానం, మహాయానం
డి) పైవన్నీ

9. చారిత్రకంగా జైన మతాన్ని స్థాపించినవారు ఎవరు?
ఎ) పార్శ్వనాథ బి) సంభవనాథ
సి) రుషభనాథ డి) వర్ధమాన మహావీర

10. 'తీర్థంకరుడు' అంటే అర్థం ఏమిటి?
ఎ) మోక్షం ప్రసాదించేవాడు
బి) సంసార నావ దాటించేవాడు
సి) మార్గం చూపేవాడు డి) బి, సి

11. క్రీ.పూ. ఆరో శతాబ్దంలో నూతన మతాలు ఏర్పడటానికి కారణం?
ఎ) హిందూ మతం పవిత్రత కోల్పోవడం
బి) బ్రాహ్మణుల ఆధిపత్య ధోరణి
సి) కర్మకాండలకు ప్రాముఖ్యం ఇవ్వడం
డి) పైవన్నీ

12. మొదటి తీర్థంకరుడైన రుషభనాథుడిని నారాయణుడి అవతారంగా పేర్కొన్న పురాణం ఏది?
ఎ) విష్ణు పురాణం
బి) భాగవత పురాణం
సి) బ్రహ్మవైవర్త పురాణం
డి) ఎ, బి

13. జైనులను ప్రారంభంలో 'నిగ్రంధులు' అని పిలిచేవారు. నిగ్రంధులు అంటే అర్థం?
ఎ) మార్గం చూపేవారు
బి) మోక్షాన్ని ప్రసాదించేవారు
సి) బంధాల నుంచి బయటపడిన వారు
డి) ఏదీకాదు

14. తీర్థంకరులు, వారి చిహ్నాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్-ఎ	గ్రూప్-బి
1. రుషభనాథ	i. సింహం
2. అజితనాథ	ii. పాము
3. అరిష్టనేమి	iii. శంఖం
4. పార్శ్వనాథ	iv. ఏనుగు
5. వర్ధమాన మహావీర	v. వృషభం


ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
సి) 1-iv, 2-v, 3-i, 4-iii, 5-ii
డి) 1-iii, 2-ii, 3-v, 4-i, 5-iv

15. పార్శ్వనాథుడికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ) కాశీ రాజ్యానికి చెందినవాడు
బి) వర్ధమానుడి కంటే 250 ఏళ్ల ముందు జీవించాడు
సి) పార్శ్వనాథుడి తల్లిదండ్రులు - అశ్వసేనుడు, వామలాదేవి
డి) పైవన్నీ

16. జైనమత పంచ సూత్రాల్లో నాలిగింటిని పార్శ్వనాథుడు రూపొందించగా, వాటికి బ్రహ్మచర్య సూత్రాన్ని చేర్చింది ఎవరు?
ఎ) వర్ధమాన మహావీరుడు
బి) నేమినాథ సి) సంభవనాథ
డి) అరిష్టనేమి

17. మహావీరుడు ఎవరి అనుమతితో సన్యాసం స్వీకరించాడు?
ఎ) తల్లి - త్రిసల బి) భార్య - యశోద
సి) అన్నయ్య - నందివర్ధన
డి) పైన పేర్కొన్న ఎవరూ కాదు

18. వర్ధమానుడికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) బిరుదులు- జినుడు, మహావీర, కేవలి
బి) జ్ఞానోదయం పొందిన స్థలం- జృంభిక గ్రామం



సి) నిర్యాణం చెందిన ప్రాంతం- పావాపురి
డి) పైవన్నీ

19. జైన పంచ సూత్రాలను సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్ - ఎ
1. అహింస
2. అసత్యం పలకరాదు
3. అస్తేయ
4. అపరిగ్రహ
5. బ్రహ్మచర్యం

గ్రూప్ - బి
i. హింసకు పాల్పడవద్దు
ii. సత్యం పలకాలి
iii. దొంగతనం చేయకూడదు
iv. ఆస్తులు కలిగి ఉండకూడదు
v. వివాహం చేసుకోవద్దు

ఎ) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
బి) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
సి) 1-iv, 2-v, 3-ii, 4-iii, 5-i
డి) 1-v, 2-ii, 3-i, 4-iii, 5-iv

20. గణాధారులు అంటే..?
ఎ) వర్ధమానుడి ప్రత్యక్ష శిష్యులు
బి) గౌతమ బుద్ధుడి శిష్యులు
సి) అజీవక మతాన్ని అవలంబించేవారు
డి) చార్వాక సిద్ధాంతాన్ని నమ్మినవారు

21. జైన సంఘం మొదటి థేర(అధ్యక్షుడు)ఎవరు?
ఎ) భద్రబాహు బి) స్థూల భద్ర
సి) ఆర్య సుదర్శన్ డి) జామాలి

22. ఆరో థేర అయిన భద్రబాహు మగధలో క్షామం వల్ల దక్షిణ భారతదేశానికి వలస వచ్చినట్లు తెలియజేస్తున్న గ్రంథం ఏది?
ఎ) గాథాకోశ బి) పరిశిష్టపర్వన్
సి) యశఃస్తిలక డి) వైరాగ్య తరంగం

23. జైనుల ప్రార్థనా మందిరాలను ఏమంటారు?
ఎ) బసది బి) విహారం
సి) చైత్యం డి) పైవేవీకాదు

24. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) మొదటి జైన సంగీతి స్థూలభద్రుడి అధ్యక్షతన పాటలీపుత్రంలో జరిగింది
బి) మొదటి జైన సంగీతిలో మహావీరుడి బోధనలను 12 అంగాలుగా అర్ధమాగధి భాషలో రచించారు
సి) రెండో జైన సంగీతి వల్లభి (గుజరాత్)లో దేవర్షి క్షమశ్రమణుడి అధ్యక్షతన జరిగింది
డి) పైవన్నీ

25. దక్షిణ భారతదేశానికి వచ్చి సల్లేఖన వ్రతం ఆచరించిన ప్రముఖ మగధ పాలకుడు?
ఎ) అశోకుడు బి) చంద్రగుప్తమౌర్య
సి) ఉదయన డి) బిందుసార

26. జైన అశోకుడిగా పేరు పొందిన మౌర్య పాలకుడు ఎవరు?
ఎ) కునాల బి) బృహద్రథ
సి) సంప్రతి డి) తివర

27. చాముండరాయ నిర్మించిన గోమతేశ్వర/బాహుబలి విగ్రహం కర్ణాటకలోని ఏప్రాంతంలో ఉంది?
ఎ) ఐహోల్ బి) శ్రావణ బెళగొళ
సి) పట్టడకల్ డి) హంపి

28. జైన మతాభిమాని అయిన ప్రముఖ కళింగ పాలకుడు ఎవరు?
ఎ) ఖారవేలుడు బి) ప్రతాపరుద్రుడు
సి) నరసింహదేవ డి) అనంతచోడగాంగ

29. జైనమతాన్ని అవలంబించిన రాష్ట్రకూట రాజు?
ఎ) అమోఘవర్షుడు బి) నాలుగో ఇంద్రుడు
సి) ఎ, బి డి) ఎవరూ కాదు

30. జతపరచండి.

గ్రూప్-ఎ
1. మాయాదేవి
2. ప్రజాపతి గౌతమి
3. యశోధర
4. కిసగౌతమి
5. సుజాత

గ్రూప్-బి
i. బుద్ధుడి తపస్సు సమయంలో అతడిని వృక్షదేవతగా ఆరాధించిన స్త్రీ
ii. బుద్ధుడి ద్వారా జనన మరణాల జ్ఞానం పొందిన మహిళ
iii. బుద్ధుడి భార్య
iv. బుద్ధుడిని పెంచిన తల్లి
v. బుద్ధుడికి జన్మనిచ్చిన తల్లి

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
సి) 1-ii, 2-iii, 3-iv, 4-i, 5-v
డి) 1-iii, 2-v, 3-ii, 4-i, 5-iv

31. బుద్ధుడికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) జ్ఞానోదయం కలిగిన గ్రామం ఉరువేలా
బి) జ్ఞానోదయం పొందిన రోజు వైశాఖ శుద్ధ పూర్ణిమ
సి) మహాపరినిర్యాణం చెందిన ప్రాంతం కుశినగరం
డి) పైవన్నీ

32. బుద్ధుడి కర్మకాండలను ఏ రాజ్యంలో నిర్వహించారు?
ఎ) వైశాలి బి) మల్ల
సి) గాంధార డి) విజ్జి

33. బుద్ధుడి జీవితంలో 5 ప్రధాన ఘట్టాలను పంచకల్యాణాలు అంటారు. ఆ సంఘటన వాటికి సంబంధించిన చిహ్నాలను జతపరచండి.

గ్రూప్-ఎ
1. జననం
2. మహాభినిష్క్రమణం
3. జ్ఞానోదయం
4. ధర్మచక్ర పరివర్తనం
5. మహాపరినిర్యాణం

గ్రూప్-బి
i. తామర పువ్వు
ii. గుర్రం
iii. రావిచెట్టు
iv. చక్రం
v. స్తూపం

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv, 5-v
బి) 1-v, 2-iv, 3-iii, 4-ii, 5-i
సి) 1-ii, 2-iv, 3-v, 4-i, 5-iii
డి) 1-iii, 2-i, 3-iv, 4-v, 5-ii

34. ఆర్య సత్యాలు, అష్టాంగ మార్గాలను బోధించింది ఎవరు?
ఎ) వర్ధమాన మహావీరుడు
బి) బుద్ధుడు సి) పార్శ్వనాథుడు
డి) అజితనాథుడు

35. సంస్కృతం స్వీకరించక పూర్వం బౌద్ధమతస్థులు ఉపయోగించిన భాష ఏది?
ఎ) ప్రాకృతం బి) అర్ధమాగధి
సి) పాళీ డి) దేశీ

36. కింది వాటిలో సరైన జత?
ఎ) వినయ పీఠిక - ఉపాలి
బి) సుత్త పీఠిక - ఆనందుడు
సి) అభిదమ్మ పీఠిక- వసుబంధు
డి) పైవన్నీ

37. బుద్ధుడి పూర్వ జన్మలు తెలియజేసే జాతక కథలు ఏ పీఠికలో ఉన్నాయి?
ఎ) సుత్త పీఠిక బి) వినయ పీఠిక
సి) అభిదమ్మ పీఠిక డి) పైవేవీ కావు

38. బౌద్ధమతాన్ని స్వీకరించిన మొదటి మహిళ?
ఎ) యశోధర బి) కిసగౌతమి
సి) ప్రజాపతి గౌతమి డి) సుజాత

39. బౌద్ధమత ప్రార్థనా మందిరాలను ఏమంటారు?
ఎ) విహారం బి) చైత్యం
సి) స్తూపం డి) బసది

40. బౌద్ధ సంగీతులు, అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్ - ఎ
1. మొదటి బౌద్ధ సంగీతి
2. రెండో బౌద్ధ సంగీతి
3. మూడో బౌద్ధ సంగీతి
4. నాలుగో బౌద్ధ సంగీతి

గ్రూప్ - బి
i. మహాకశ్యప
ii. సభాకామి
iii. మొగలిపుత్త తిస్స
iv. వసుమిత్రుడు

ఎ) 1-i, 2-ii, 3-iii, 4-iv
బి) 1-iv, 2-iii, 3-ii, 4-i
సి) 1-ii, 2-i, 3-iv, 4-iii
డి) 1-iii, 2-iv, 3-i, 4-ii

41. బౌద్ధ సంగీతులు జరిగిన ప్రదేశాలు, నిర్వహించిన రాజులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

గ్రూప్ - ఎ	గ్రూప్ - బి
1. రాజగృహం	i. అజాతశత్రువు
2. వైశాలి	ii. కాలాశోకుడు
3. పాటలీపుత్రం	iii. అశోకుడు
4. కుందలవనం	iv. కనిష్కుడు

ఎ) 1-iv, 2-iii, 3-ii, 4-i
బి) 1-i, 2-ii, 3-iii, 4-iv
సి) 1-iii, 2-iv, 3-i, 4-ii
డి) 1-ii, 2-iii, 3-iv, 4-i

42. ఎన్నో బౌద్ధ సంగీతిలో బౌద్ధమతం హీనయాన, మహాయాన శాఖలుగా చీలిపోయింది?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4

43. అశోకుడు తన కుమార్తె సంఘమిత్ర, కుమారుడు మహేంద్రను బౌద్ధమత వ్యాప్తి కోసం ఏ దేశం పంపించాడు?
ఎ) శ్రీలంక బి) నేపాల్
సి) భూటాన్ డి) చైనా

44. శ్రీలంకకు చెందిన ప్రముఖ బౌద్ధ గ్రంథం?
ఎ) దీపవంశ బి) మహావంశ
సి) చుళవంశ డి) పైవన్నీ

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) డి; 4) సి; 5) ఎ; 6) బి; 7) సి; 8) డి; 9) ఎ; 10) డి; 11) డి; 12) డి; 13) సి; 14) బి; 15) డి; 16) ఎ; 17) సి; 18) డి; 19) బి; 20) ఎ; 21) సి; 22) బి; 23) ఎ; 24) డి; 25) బి; 26) సి; 27) బి; 28) ఎ; 29) సి; 30) బి; 31) డి; 32) బి; 33) ఎ; 34) బి; 35) సి; 36) డి; 37) ఎ; 38) సి; 39) బి; 40) ఎ; 41) బి; 42) డి; 43) ఎ; 44) డి.

'తోడా' అనే తెగలు ఏ రాష్ట్రంలో నివసిస్తున్నాయి?

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కలను సేకరించడం తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అంటారు. దేశంలో తొలిసారిగా 1872లో జనాభా లెక్కల సేకరణ మొదలైంది. 1881 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

జనాభా

భారతదేశ జనాభాలో విభిన్న శారీరక లక్షణాలు కనిపిస్తాయి. ప్రాచీన కాలం నుంచి వివిధ దేశాలకు చెందినవారు భారతదేశంలోకి ప్రవేశించి సాంఘికంగా, సాంస్కృతికంగా ఇక్కడి సమాజంలో కలిసిపోయారు. వీరు స్థానికులతో వివాహ సంబంధాలు ఏర్పర్చుకున్నారు. ఫలితంగా విభిన్న శారీరక లక్షణాలున్న సంతతి ఉద్భవించిందని ఆంత్రోపాలజిస్టుల అభిప్రాయం.

'రిస్లే' అనే ఆంత్రోపాలజిస్టు శారీరక లక్షణాల ఆధారంగా ప్రపంచ జనాభాను ఆరు జాతులుగా విభజించారు. ఏ దేశ జనాభాలోనైనా ఒక జాతి లేదా రెండు జాతుల లక్షణాలు ఉంటాయి. కానీ భారతదేశంలో మాత్రమే ప్రపంచంలోని ఆరు జాతుల లక్షణాలు కనిపిస్తాయి. అవి...

ఎ నీగ్రిటోలు

దేశంలోకి మొదటిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించే షోంపెన్స్, జార్వాస్, ఓంజెస్ లాంటి తెగలలో, కేరళలోని పులియాన్స్ తెగలలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.

బి ప్రోటో ఆస్ట్రలాయిడ్స్

మధ్య భారతదేశంలో నివసించే గోండులు, ముండాలు, భిల్లులు, ఒరేన్‌లు, సంతాలులు, చెంచులు, కురుంబాలు లాంటి గిరిజన తెగలలో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

సి మెడిటరేనియన్

వీరినే ద్రవిడులు అని కూడా పిలుస్తారు. దక్షిణ భారతదేశంలో నివసించే ప్రజలను ఈ జాతి సంతతిగా పేర్కొంటారు. వీరినే సింధూ నాగరికత ప్రజల సంతతిగా పేర్కొనవచ్చు. ద్రవిడ ప్రజల జీవన విధానంలో సింధూ నాగరికత ప్రజల సాంస్కృతిక లక్షణాలు ఇప్పటికీ కనిపిస్తాయి.

డి మంగోలాయిడ్స్

ఈశాన్య భారతదేశంలోని అసోం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రజల్లో, అండమాన్‌లోని 'సెంటినీలీస్' అనే తెగలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి. ఈ జాతి ప్రజల శరీరంలో 'ఎపికాంతిక్ ఐలిడ్' అనే ప్రత్యేక లక్షణం కనిపిస్తుంది.

ఇ బ్రాకీ సెఫాలస్

వీరినే కాకసాయిడ్ జాతి ప్రజలుగా పేర్కొంటారు. ఈ జాతి వారిలో తల వెడల్పుగా ఉంటుంది. గుజరాత్,మహారాష్ట్రలోని మార్వాడీలు, పశ్చిమ బెంగాల్‌లోని నయనార్ క్షత్రియులు, నంబూద్రీ బ్రాహ్మణుల్లో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.

ఎఫ్ నార్డిక్స్

వీరినే ఆర్యన్లు అని పిలుస్తారు. భారతదేశంలోకి చివరిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. ఈ జాతి లక్షణాలున్న సంతతి ప్రస్తుతం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని రాజపుత్రులు, జాట్‌లలో కనిపిస్తుంది.

జనాభా లెక్కల సేకరణ (2011)

ఒక నిర్దిష్ట ప్రాంతంలో తమలో తాము అంతః ప్రజననం జరుపుకునే, నిర్దిష్ట ఆవాసంలో నివసించే ప్రజా సమూహమే జనాభా. ఇంటింటి సర్వే ద్వారా శాస్త్రీయ పద్ధతిలో జనాభా, దాని అనుబంధ అంశాలను సేకరించే పద్ధతినే జనాభా లెక్కల సేకరణ అంటారు.

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కల సేకరణ తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అని అంటారు.

- ప్రపంచంలో మొదటిసారిగా 1841లో ఆధునిక జనాభా లెక్కల సేకరణ ఇంగ్లండ్‌లో ప్రారంభమైంది. 1872లో భారతదేశంలో జన గణన మొదలైంది. 1881 నుంచి పదేళ్లకు ఒకసారి క్రమం తప్పకుండా మన దేశంలో జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.
- 2011 జనాభా లెక్కల సేకరణ 15వది, స్వాతంత్ర్యం వచ్చాక ఏడోది. ఈ జనాభా లెక్కల సేకరణ 2010 ఏప్రిల్ 1న ప్రారంభమై 2011 మార్చిలో ముగిసింది. ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా 17.5 శాతం. అత్యధిక జనాభా ఉన్న దేశాల జాబితాలో భారతదేశం తొలి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో వరసగా అమెరికా, ఇండోనేసియా, బ్రెజిల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఉన్నాయి.
- 2011 మార్చి 1 నాటికి దేశ జనాభా 1.21 బిలియన్లు దాటింది. 2001 నాటికి దేశ జనాభా 1.02 బిలియన్లు ఉండేది. అంటే పదేళ్లలో దేశ జనాభా 18.196 కోట్లు పెరిగింది.
- 1991-2001 దశాబ్దంలో జనాభా వృద్ధిరేటు 21.54 శాతం. కాగా, 2001-11 మధ్యకాలంలో అది 17.7 శాతానికి తగ్గింది.
- 1991-2001 దశాబ్దంలో జనాభా వార్షిక వృద్ధిరేటు 1.9 శాతం కాగా 2001-11లో 1.64 శాతానికి తగ్గింది.
- జనసాంద్రత 2001లో చ.కి.మీ.కు 325 ఉంటే, అది 2011లో 382కు పెరిగింది.
- అక్షరాస్యత 2001 మార్చి 1 నాటికి 64.38 శాతం కాగా, 2011 మార్చి నాటికి 74.04 శాతానికి పెరిగింది.
- లింగనిష్పత్తి 2001 మార్చి 1 నాటికి 933 ఉంటే, 2011 మార్చి 1 నాటికి 943కి పెరిగింది. ప్రతి వెయ్యి మంది పురుషులకు ఉన్న స్త్రీల సంఖ్యను లింగనిష్పత్తి అంటారు. దేశంలోకెల్లా అత్యుత్తమంగా కేరళలో లింగనిష్పత్తి 1084:1000గా ఉంది.
- దేశంలో అత్యధిక జనాభా ఉన్న మొదటి ఐదు రాష్ట్రాలు... ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్).
- దేశంలో తక్కువ జనాభా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... సిక్కిం, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, గోవా.
- అత్యధిక జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... బిహార్, పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, సిక్కిం, నాగాలాండ్.
- అత్యధిక జనసాంద్రత ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు.. ఢిల్లీ, చండీగఢ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు... అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలి.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, జమ్మూ-కశ్మీర్.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు తక్కువగా ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... నాగాలాండ్, కేరళ, గోవా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... కేరళ, మిజోరాం.
- దేశంలో తక్కువ అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... బిహార్, అరుణాచల్‌ప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు జిల్లాలు మిజోరాంలో ఉన్నాయి. అవి.. సెర్‌చ్చిప్, ఐజ్వాల్.
- దేశంలో అక్షరాస్యత తక్కువ ఉన్న మొదటి రెండు జిల్లాలు... మధ్యప్రదేశ్‌లోని అలిరాజ్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 10.43 కోట్ల(8.6 శాతం) మంది షెడ్యూల్డ్ తెగలకు చెందినవారు.
- ఎస్టీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్, తక్కువగా ఉన్న రాష్ట్రం సిక్కిం.
- ఎస్టీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం మిజోరాం, తక్కువగా ఉన్న రాష్ట్రం గోవా.
- ఎస్టీ జనాభా లేని రాష్ట్రాలు... పంజాబ్, హర్యానా.
- 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) జనాభా శాతం 16.6. సంఖ్యాపరంగా 20.14 కోట్లు.
- ఎస్సీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. తక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరాం.
- ఎస్సీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం పంజాబ్, తక్కువగా ఉన్నది మిజోరాం.
- ఎస్సీ జనాభా లేని రాష్ట్రం నాగాలాండ్

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సంతాల్ జనాభా ఉన్న రాష్ట్రాలు ఏవి? (2011, A.S.O)
ఎ) మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్
బి) కర్ణాటక, పశ్చిమబెంగాల్
సి) ఉత్తరప్రదేశ్, జార్ఖండ్
డి) జార్ఖండ్, పశ్చిమ బెంగాల్

2. మేఘాలయ ప్రత్యేకంగా గిరిజన రాష్ట్రం. ఆ రాష్ట్రంలో నివసించే గిరిజన తెగలేవి? (2001, J.L.)
ఎ) ఖాసీలు, ఉషరీలు, లభీర్లు
బి) ఖాసీలు, జయంతియాలు, గారోలు
సి) జయంతియాలు, గారోలు, కుర్కిలు
డి) గారోలు, ఫాంగులు, హామ్‌రో

3. జనాభాపరంగా దేశంలో అతిచిన్న రాష్ట్రం ఏది? (2011, D.L.)
ఎ) నాగాలాండ్ బి) అసోం
సి) సిక్కిం డి) కేరళ

4. ఇండియాలో అత్యధిక అక్షరాస్యత ఉన్న జిల్లా ఏది? (2011, D.L.)
ఎ) సెర్‌చ్చిప్ బి) గుంటూరు
సి) మిడ్నాపూర్ డి) గాజామ్

5. 'తోడా' అనే తెగలు ఏ రాష్ట్రంలో నివసిస్తున్నాయి? (2002, AEEs)
ఎ) రాజస్థాన్ బి) మధ్యప్రదేశ్
సి) అసోం డి) తమిళనాడు

6. భారతదేశంలోని గిరిజనుల్లో సంఖ్యాపరంగా ఎక్కువగా ఉన్నవారు? (2011, Gr-II)
ఎ) సంతాలులు బి) భిల్లులు
సి) ముండాలు డి) నాగాలు

సమాధానాలు

1) డి; 2) బి; 3) సి; 4) ఎ; 5) డి; 6) బి.

మాదిరి ప్రశ్నలు

1. 'మీనా' జాతికి చెందిన తెగల వారు ఏ రాష్ట్రంలో అధికంగా నివసిస్తున్నారు?
ఎ) గుజరాత్ బి) అసోం
సి) రాజస్థాన్ డి) మధ్యప్రదేశ్

2. 2011లో జరిగిన జన గణన స్వాతంత్ర్యానంతరం ఎన్నోది?
ఎ) 15 బి) 7 సి) 8 డి) 9

3. కింది వాటిలో అధిక జనాభా ఉన్న రాష్ట్రాల అవరోహణ క్రమాన్ని గుర్తించండి?
ఎ) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్
బి) మధ్యప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
సి) రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
డి) ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్

4. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభావృద్ధి రేటు అధికంగా ఉన్న రాష్ట్రం?
ఎ) అరుణాచల్ ప్రదేశ్
బి) మేఘాలయ సి) బిహార్
డి) జమ్మూ-కశ్మీర్

5. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో జనసాంద్రత ఎంత?
ఎ) 325 బి) 267
సి) 382 డి) 176

6. 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లా ఏది?
ఎ) దిబాంగ్ వ్యాలీ బి) యానాం
సి) అంజాన్ డి) నార్త్ ఈస్ట్ ఢిల్లీ

7. కిందివాటిలో అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించని తెగ ఏది?
ఎ) షోంపెన్స్ బి) జార్వాస్
సి) సెంటినీలీస్ డి) మోప్లాలు

8. జనాభా లెక్కల సేకరణకు సంబంధించి ఏ సంవత్సరాన్ని 'గొప్ప విభాజక సంవత్సరం'గా పేర్కొంటారు?
ఎ) 1911 బి) 1901
సి) 1921 డి) 1931

9. మానవ జనాభా 'గుణమధ్యమం'(జియోమెట్రిక్) రేటులో పెరుగుతుండగా, వనరులు మాత్రం 'అంకమధ్యమం' (అర్థమెటిక్) రేటులో పెరుగుతున్నాయని తెలిపిన శాస్త్రవేత్త ఎవరు?
ఎ) మాల్థస్ బి) కీన్స్
సి) రికార్డో డి) రొనాల్డ్ రాస్

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) బి; 5) సి; 6) డి; 7) డి; 8) సి; 9) ఎ.

ఏడో పంచవర్ష ప్రణాళిక కాలం

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

ప్రణాళికా వ్యూహాలు

వ్యూహం అనే విస్తృత భావనలో అభివృద్ధి ప్రణాళికకు సంబంధించిన విధానపర చర్యలు ఇమిడి ఉంటాయి. భారతదేశంలో ప్రణాళికలకు సంబంధించిన వ్యూహాల్లో పేదరికం, అల్పాభివృద్ధి లాంటి సమస్యల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించారు. పరిమాణం, పెట్టుబడుల పంపిణీ ప్రక్రియ, వనరుల సమీకరణ, ప్రభుత్వ రంగ పాత్ర తదితర అంశాలకు చెందిన విధానాలను ప్రణాళికల్లో అవలంబించారు.

భారత్‌లో ఆర్థిక ప్రణాళికల వ్యూహాన్ని ప్రభావితం చేసిన అంశాలు

1) మహలనోబిస్ వృద్ధి నమూనా
2) భారీ పరిశ్రమల వ్యూహం
3) ఉపాధి లక్ష్యం
4) సామాజిక లక్ష్యాలు; వృద్ధి, అసంతులిత వృద్ధి మధ్య వ్యూహం.

మొదటి పంచవర్ష ప్రణాళిక

విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, సాంఘిక పరిస్థితులను మెరుగుపరచడం లాంటి అంశాలకు ప్రాధాన్యమిస్తూ మొదటి పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని ఖరారు చేశారు.

రెండో పంచవర్ష ప్రణాళిక

రెండో పంచవర్ష ప్రణాళికలో భారీ పరిశ్రమల అభివృద్ధి, ప్రజలకు సాంఘిక సేవల కల్పనపై దృష్టి సారించారు. ప్రొఫెసర్ పి.సి. మహలనోబిస్ రష్యా అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రెండో ప్రణాళికకు అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించారు.

రెండో ప్రణాళికలో అవలంబించిన వ్యూహంలోని ముఖ్యాంశాలు

- మహలనోబిస్ ప్రకారం.. భారీ పరిశ్రమల్లో పెట్టుబడి పెంపు, సేవలపై వ్యయం పెంపు, కొనుగోలు శక్తి పెంపు ద్వారా నూతన డిమాండ్‌ను సృష్టించడం; చిన్న తరహా, గృహ పరిశ్రమల్లో పెట్టుబడి, ఉత్పత్తిని అధికం చేయడం ద్వారా నూతన డిమాండ్‌కు అనుగుణంగా వినియోగ వస్తువుల సరఫరా పెంచడం లాంటివి అభివృద్ధి వ్యూహంలో ప్రధాన అంశాలు.
- మహలనోబిస్ పెట్టుబడి వ్యూహంలో ప్రభుత్వ రంగానికి ప్రాధాన్యమిచ్చారు.
- నెహ్రూ - మహలనోబిస్ అభివృద్ధి నమూనా రెండో ప్రణాళిక రూపకల్పన సమయంలో వెలువడింది. ఇందులో అభివృద్ధికి సంబంధించి దీర్ఘ కాలిక లక్ష్యాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అధిక పెట్టుబడి రేటు సాధన కోసం పొదుపు రేటును పెంచడం, భారీ పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వడం, నూతన పరిశ్రమల రక్షణకు 'రక్షిత విధానం' అవలంబించడం, దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ, లక్షిత వర్గాల ప్రజలకు అవకాశాలను విస్తృతం చేయడం లాంటి అంశాలకు నెహ్రూ - మహలనోబిస్ అభివృద్ధి నమూనాలో ప్రాధాన్యం ఇచ్చారు.
- ఆధునిక యంత్రాలు, విద్యుచ్ఛక్తిని ఉపయోగించి వినియోగ వస్తువులు రూపొందించే కుటీర, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి నెహ్రూ - మహలనోబిస్ నమూనాలో తగిన ప్రోత్సాహం ఇచ్చారు.

మూడో పంచవర్ష ప్రణాళిక

మూడో పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయం, పారిశ్రామిక రంగాల మధ్య ఇంటర్‌డిపెండెన్స్ (పరస్పర ఆధారం) వృద్ధి చేయడంపై దృష్టి సారించారు. జాతీయ, ప్రాంతీయ అభివృద్ధి, స్వదేశీ, బహిర్గత ఆధారాల నుంచి వనరుల సమీకరణ తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళికలో సాంకేతిక ప్రగతికి చర్యలు తీసుకోవడం, అధిక ఉత్పాదకత సాధించడం, జనాభా నియంత్రణ, ఉపాధి, సామాజిక మార్పు అంశాలపై దృష్టి కేంద్రీకరించారు.

వార్షిక ప్రణాళికలు

వార్షిక ప్రణాళికల కాలం(1966-69)లో.. మూడో పంచవర్ష ప్రణాళికలో ఆర్థిక వ్యవస్థలో సంభవించిన అనిశ్చిత పరిస్థితులను నివారించడంపై దృష్టి సారించారు. దీంతోపాటు ఏ విధమైన అదనపు ద్రవ్యోల్బణ పరిస్థితులు తలెత్తకుండా సహేతుక వృద్ధి రేటు సాధనకు ప్రాధాన్యం ఇచ్చారు. అవస్థాపితా సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం, ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచడంపై దృష్టి కేంద్రీకరించారు. విద్య, కుటుంబ నియంత్రణ, రక్షిత తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర అంశాలపై దృష్టి సారించి వివిధ సాంఘిక సేవా పథకాలను ప్రవేశపెట్టారు.

నాలుగో పంచవర్ష ప్రణాళిక

నాలుగో పంచవర్ష ప్రణాళికా కాలంలో (1969-74) వార్షిక ప్రణాళికల్లో అవలంబించిన వ్యూహాన్ని కొనసాగించారు. చిన్న రైతులకు ప్రోత్సాహం కల్పించేవిధంగా వ్యవసాయం, నీటి పారుదల అభివృద్ధికి సంబంధించిన వ్యూహాలను అమలు చేశారు. ఆధునిక పరిశ్రమలను అభివృద్ధి చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే క్రమంలో.. చిన్న, పెద్ద తరహా పారిశ్రామిక యూనిట్ల వికేంద్రీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎగుమతులను పెంచడం, దిగుమతులను తగ్గించుకోవడంతో పాటు క్రమంగా విదేశాలపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించడానికి ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. సమతౌల్య ఆర్థికవృద్ధిని దృష్టిలో ఉంచుకొని సుస్థిరత, స్వయం సమృద్ధి సాధనకు ఈ ప్రణాళికలో పెద్దపీట వేశారు.

అయిదో పంచవర్ష ప్రణాళిక

పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వయం సాధనను దృష్టిలో ఉంచుకొని 5వ పంచవర్ష ప్రణాళిక వ్యూహాన్ని రూపొందించారు. వ్యవసాయ రంగంలో అధిక దిగుబడినిచ్చే వంగడాల వాడకం, బహుళ పంటల కార్యక్రమం ద్వారా ఉత్పత్తి పెంపునకు ప్రాధాన్యం ఇచ్చారు. పారిశ్రామిక రంగ అభివృద్ధిలో భాగంగా వినియోగ వస్తువులు, వ్యవసాయాధారిత పరిశ్రమల విస్తరణ, ప్రోత్సాహం లాంటివాటిపై దృష్టి సారించారు.

ఆరో పంచవర్ష ప్రణాళిక

ఆరో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో నిరుద్యోగ సమస్య, అల్ప ఉద్యోగిత, పేదరికాన్ని అట్టడుగు స్థాయికి తగ్గించడం లాంటి అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడుల వృద్ధిని వేగవంతం చేయడం ద్వారా అవస్థాపనా సౌకర్యాల పెంపు, ఉత్పత్తి, ఎగుమతుల వృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. ఆయా లక్ష్యాల సాధన కోసం ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. ప్రజలకు కనీస అవసరాల కల్పన, గ్రామీణ, అసంఘటిత రంగాల్లో ఉపాధి అవకాశాల పెంపునకు ప్రాధాన్యం ఇస్తూ వ్యూహాన్ని సిద్ధం చేశారు.



ఏడో పంచవర్ష ప్రణాళిక

మానవ వనరుల అభివృద్ధి, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ఏడో పంచవర్ష ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకోవడం ద్వారా దేశంలో పేదరికం, నిరుద్యోగం, ప్రాంతీయ అసమానతల తగ్గింపునకు కృషి చేసే దిశగా అవసరమైన అభివృద్ధి వ్యూహాన్ని అవలంబించారు.

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక

ఎనిమిదో పంచవర్ష ప్రణాళిక (1992-97)లో మానవాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళికలో ఉపాధి అవకాశాల విస్తరణకు అవలంబించిన వ్యూహాలు, విధానాలు, కార్యక్రమాల్లోని ముఖ్యాంశాలు కింది విధంగా ఉన్నాయి..

1. వేగవంతమైన, అన్ని ప్రాంతాలకు విస్తరించిన వ్యవసాయ రంగ అభివృద్ధి.
2. వ్యవసాయాధారిత, అనుబంధ కార్యకలాపాలైన డెయిరీ, ఫిషరీలకు సంబంధించి అవస్థాపనా సౌకర్యాలు, మార్కెటింగ్ సౌకర్యాల అభివృద్ధి.
3. గ్రామీణ ప్రాంతాల్లో తయారీ కార్యకలాపాల అభివృద్ధి.
4. చిన్న తరహా, తయారీ రంగ వికేంద్రీకరణపై దృష్టి సారించడం.
5. ఆరోగ్య, విద్యా సౌకర్యాలను పటిష్టపరచడం.
6. సేవా, ఇన్‌ఫార్మల్ రంగాల కార్యకలాపాల్లో వేగవంతమైన వృద్ధి.
7. ఉపాధి వృద్ధి పెంపులో భాగంగా నియంత్రణ విధానాన్ని సరళీకరించడం.
8. అవస్థాపనా సౌకర్యాలు, గృహ వసతి కల్పనకు సంబంధించిన కార్యక్రమాలను ప్రవేశపెట్టడం.

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక

తొమ్మిదో పంచవర్ష ప్రణాళిక (1997-2002) వ్యూహంలో భాగంగా.. వ్యవసాయ ఉత్పత్తి పెంపు ద్వారా సాంవత్సరిక వృద్ధి రేటు పెంపు, వనరుల సమీకరణలో స్వయం సాధన (సెల్ఫ్ రిలయన్స్), గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో మార్పులను తీసుకురావడం ద్వారా గ్రామీణ పేదరిక తీవ్రత తగ్గింపు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని మధ్య తరహా, భారీ పరిశ్రమల్లో సామర్థ్యం, పోటీతత్వం పెంపునకు తగిన చర్యలను విస్తరించడం, ఫార్మల్, ఇన్‌ఫార్మల్ రంగాల్లోని గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి, అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. మానవాభివృద్ధిని మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

పదో పంచవర్ష ప్రణాళిక

పదో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో.. ప్రైవేట్ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. వృద్ధి పెంపునకు వ్యూహాలు, ప్రభుత్వం ఎదుర్కొంటున్న విధానపరమైన సవాళ్లను అధిగమించడంపై దృష్టి సారించారు. ప్రభుత్వ రంగ పెట్టుబడుల్లో మూలధనం - ఉత్పత్తి నిష్పత్తికి ప్రాధాన్యం ఇవ్వడానికి బదులుగా ప్రైవేట్ రంగంలో అధికవృద్ధి వ్యూహాన్ని అమలు చేశారు.

పదకొండో పంచవర్ష ప్రణాళిక

పదకొండో పంచవర్ష ప్రణాళికలో (2007-2012) పేదరికం తగ్గించడం, ఉపాధి అవకాశాల కల్పన, లింగ సంబంధిత తేడాలు నివారించడం, అక్షరాస్యత పెంచడం, వ్యవసాయ రంగంలో 4 శాతం వార్షిక వృద్ధి సాధించడం ధ్యేయంగా విశాల దృక్పథంతో కూడిన సమ్మిళిత వృద్ధి వ్యూహాన్ని అమలు చేశారు.

పన్నెండో పంచవర్ష ప్రణాళిక

పన్నెండో పంచవర్ష ప్రణాళిక వ్యూహంలో (2012-2017) వ్యవసాయ రంగంలో అధిక ప్రగతి సాధించడం, ఉపాధి కల్పన (ముఖ్యంగా తయారీ రంగంలో) వేగవంతం చేయడం, విద్య, ఆరోగ్యం, శిక్షణా నైపుణ్యాన్ని మెరుగుపరచడానికి పటిష్ఠ చర్యలు తీసుకోవడం, పేదల అభ్యున్నతికి ప్రత్యేకంగా ఉద్దేశించిన పథకాలను సమర్థంగా అమలు చేయడం, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్రణాళికలు, లక్షిత వర్గాల ప్రజలకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించడం లాంటి విధానాలపై దృష్టి సారించారు. వేగవంతమైన, సుస్థిర, అధిక సమ్మిళిత వృద్ధికి ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు..

మాదిరి ప్రశ్నలు

1. మహలనోబిస్ పెట్టుబడి వ్యూహంలో ఏ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు?
   1) ప్రభుత్వ రంగం 2) ప్రైవేట్ రంగం
   3) అసంఘటిత రంగం
   4) సంఘటిత రంగం
2. కింది వాటిలో నెహ్రూ - మహలనోబిస్ అభివృద్ధి నమూనాలో భాగం కానిది?
   1) దిగుమతుల ప్రత్యామ్నాయీకరణ
   2) పరిశ్రమలకు సంబంధించిన రక్షిత విధానం
   3) సమ్మిళిత వృద్ధి
   4) భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం
3. ఎన్నో పంచవర్ష ప్రణాళికలో చిన్న రైతులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయం, నీటి పారుదల అభివృద్ధికి వ్యూహం అవలంబించారు?
   1) 3 2) 4 3) 5 4) 6
4. ఆర్థిక ప్రణాళికా వ్యూహాన్ని కింద పేర్కొన్న ఏ అంశం ప్రభావితం చేసింది?
   1) మహలనోబిస్ వృద్ధి నమూనా
   2) ఉపాధి లక్ష్యం
   3) సామాజిక లక్ష్యాలు
   4) పైవన్నీ
5. దీర్ఘ కాలంలో అధిక పారిశ్రామికీకరణ అనేది బొగ్గు, విద్యుచ్ఛక్తి, భారీ యంత్రాలు, ఇనుము, ఉక్కు రంగాల్లో ఉత్పత్తి పెరుగుదలపై ఆధారపడి ఉంటుందని భావించిన వారు?
   1) వి.కె.ఆర్.వి. రావ్ 2) మహలనోబిస్
   3) కాల్డర్ 4) ఎస్. చక్రవర్తి
6. భారీ పరిశ్రమల వ్యూహం ఏ పరిస్థితికి దారితీసిందనే విమర్శ ఉంది?
   1) వాణిజ్య లోటు పెంపు
   2) వ్యవసాయ ఉత్పత్తి పెంపు
   3) అసంఘటిత రంగ అభివృద్ధి
   4) అసమానతల తగ్గింపు

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2; 4) 4; 5) 2; 6) 1.

The head office of BIS is located in?



1. What is the minimum capital requirement for New Banks in the Private Sector?
   a) Rs. 200 crore
   b) Rs. 300 crore
   c) Rs. 500 crore
   d) Rs. 600 crore
   e) None of these
2. Many times we read a term "ECB" in financial newspapers. What is the full form of ECB?
   a) Essential Commercial Borrowing
   b) Essential Credit and Borrowing
   c) External Credit and Business
   d) External Commercial Borrowing
   e) None of the above
3. Which among the following banks has launched "Dhanchayat" an educational film to raise awareness on the dangers of borrowing money from unorganised sources?
   a) Axisb) ICICI
   c) HDFC d) SBI
   e) YES
4. What is the maximum monthly pension for the subscribers under Atal Pension Yojana?
   a) Rs 2000 b) Rs 3000
   c) Rs 4000 d) Rs 5000
   e) None of these
5. If a company which is not a non - banking financial company wants to collect public deposits, it is governed by ___ Act:
   a) RBI Act 1934
   b) Banking companies Act
   c) Companies Act 1956
   d) Central Government
   e) None of the above
6. Which among the following has launched a Smart Humsafar Plan, a unique plan which offers multiple benefits of savings and insurance cover for husband and wife under a single policy?
   a) ICICI Prudential
   b) SBI Life c) NIACL
   d) LIC e) HDFC ERGO
7. Which country launched world first Facial recognition ATM?
   a) China b) Japan
   c) US d) Canada
   e) Brazil
8. Which type of machine is used by Business Correspondents?
   a) Micro ATMs b) POS
   c) Biometric Card Reader
   d) Solar empowered
   e) Water resistant
9. Which among the following bank has tied up with Chinese e-commerce giant Alibaba to provide easier trade finance to small and medium enterprises (SMEs) in the country?
   a) HDFC Bank
   b) SBI Bank
   c) Canara Bank
   d) ICICI Bank e) Axis Bank
10. In India, conventionally, bonds are issued by institutions in ____ sector while debentures by corporate in ____ sector.
   a) private, public
   b) public, private
   c) either a or b
   d) cooperative, NBFC
   e) None of the above
11. What is the name of the platform launched by State Bank of India (SBI) that enables customers to book their foreign exchange transactions online?
   a) SBI eforex
   b) SBI emoney
   c) SBI eonline
   d) SBI eshare
   e) SBI ebuddy
12. In CDR, "R" stands for ____.
   a) Ratio b) Receipt
   c) Regulation d) Restructuring
   e) Reserve
13. Which of the following is not a function of General Insurance?
   a) Cattle Insurance
   b) Crop Insurance
   c) Marine Insurance
   d) Fire Insurance
   e) None of the above
14. The Bank for International Settlements (BIS) is the world's oldest international financial organization established on 17 May 1930. The mission of the BIS is to serve central banks in their pursuit of monetary and financial stability, to foster international cooperation in those areas and to act as a bank for central banks. The head office of BIS is located in ___.
   a) Hong Kong b) Switzerland
   c) China d) Mexico
   e) Australia
15. National Investment and Infrastructure Fund (NIIF) is a fund created by the Government of India for enhancing infrastructure financing in the country. To be operational by the year end, the headquarter of NIIF will be located in ____.
   a) Mumbai b) New Delhi
   c) Bengaluru d) Chennai
   e) Kolkata
16. Special Drawing Rights (SDRs) are international foreign exchange reserve assets issued by-
   a) World Bank b) WTO
   c) ADB d) IMF
   e) None of these
17. Which of the following types of accounts are known as "Demat Accounts"?
   a) Zero Balance Accounts
   b) Accounts which are opened to facilitate repayment of a loan taken from the bank. No other business can be conducted from there
   c) Accounts in which shares of various companies are traded in electronic form
   d) Accounts which are operated through internet banking facility
   e) None of the above
18. According to the Socio Economic and Caste Census (SECC) which among the following states in India has highest per cent of Urban BPL households?
   a) Bihar b) Uttar Pradesh
   c) Manipur d) Jharkhand
   e) Sikkim
19. Payment of a cheque may be countermanded by the ___
   a) Payee b) Drawer
   c) True owner d) Drawee
   e) None of these
20. Union Government has decided to set up a Bank Board Bureau (BBB) to monitor key performance indicators of two dozen public sector banks (PSBs). BBB will start functioning from ___.
   a) 31st December 2015
   b) 1st January 2016
   c) 31st March 2016
   d) 1st April 2016
   e) 1st June 2016
21. Identify the well known person related to Banking field in India from the following?
   a) Mrs. Meira Kumar
   b) Mrs. Kiran Shaw
   c) Mr. Arun Jaitley
   d) Dr. D Subbarao
   e) All of the above
22. A fixed deposit receipt is kept with the bank for its safety, is known as ___?
   a) Safe custody
   b) Safe deposit
   c) Locker
   d) Valid safe deposit
   e) None of the above
23. Reserve Bank will issue ___bank notes with 3 additional features to aid the visually impaired in identification.
   a) Rs. 500 and Rs 1,000
   b) Rs. 100 and Rs. 500
   c) Rs. 50 and Rs. 100
   d) Rs. 10 and Rs. 100
   e) None of these
24. Simply click a card launched by SBI special for ____.
   a) Cash Transfer
   b) Online Shopping
   c) Pay Utility Bills
   d) For Home Loans
   e) None of these
25. Banking Companies are prohibited under Sec 8 of banking Regulation Act to sell and purchase securities. Yet Banks are selling securities (of the customer) which are under pledge as permitted by:
   a) Indian Contract Act
   b) SARFAESI Act
   c) Government Notification
   d) Banking Regulation Act
   e) None of these
26. Hypothecation is:
   a) A transaction of conditional sale
   b) A legal transaction whereby goods may be made available as security for a debt
   c) Transfer of ownership by the borrower to the lender
   d) Either a or b
   e) None of the above
27. Mortgage is a:
   a) Security on movable property for a loan
   b) Security on immovable property for a loan
   c) Concession on immovable property
   d) Facility on immovable property
   e) Security on loan sanctioned against fixed deposits
28. What is the minimum amount to be invested under Sukanya Samriddhi Scheme?
   a) Rs. 500 b) Rs. 1000
   c) Rs. 1500 d) No ceiling
   e) Rs. 100
29. The Main activity of the Financial Intelligence Unit India (FIU-IND) is to control:
   a) Tax Evasion
   b) Money Laundering
   c) Terrorism
   d) Avoiding NPAs
   e) Avoiding frauds in ATMs
30. The SARFAESI Act 2002 empowers Banks / Financial Institutions to recover their non-performing assets (bad loans) without the intervention of the Court. In "SARFAESI" second "S" stands for ____.
   a) Securitisation
   b) Security c) Statutory
   d) Share e) Saving
31. The main function of an Asset Management Company is to:
   a) hold the securities of various schemes
   b) manage the funds by making investments in various types of securities
   c) hold its property for the benefit of the unit holders
   d) act on behalf of SEBI
   e) All the above
32. Global Rating Agency Fitch has downgraded Viability Rating (VR) by one notch to 'bb' of which among the following banks?
   a) Bank of Baroda
   b) State Bank of India
   c) Punjab National Bank
   d) Canara Bank
   e) IDBI Bank
33. The Banking Codes and Standards Board of India was registered on 18th February, 2006 under which of the following RBI Act?
   a) Banking Regulation Act
   b) The Societies Registration Act, 1860
   c) Cooperative Societies Act
   d) None of the above
   e) All the above
34. As per the Banking Ombudsman Scheme, any person can file a complaint before the Banking Ombudsman, if the satisfied reply is not received from the bank within a period of ____.
   a) one month b) three months
   c) two months d) six months
   e) None
35. CIBIL as a credit bureau caters to:
   a) Consumer segments
   b) Commercial segments
   c) Both commercial and consumer segments
   d) Nationalized Banks only
   e) Private Banks only
36. Infusion of liquidity, by RBI, is done through _____ from / to banks under a _____ transaction.
   a) borrowing, repo
   b) borrowing, reverse repo
   c) lending, repo
   d) lending, reverse repo
   e) None of the above
37. Some banks are financing big projects like construction of roads, bridges etc. Financing such projects means banks are helping exactly in:
   a) Infrastructural Development
   b) Project Management
   c) Developing core sector Industry
   d) Financial Inclusion
   e) All of the above
38. A rate of exchange established between any two currencies on the basis of the respective quotation of each currency in terms of a third currency is known as:
   a) Cross rate b) Merchant rate
   c) Wash rate d) Composite rate
   e) None of the above

KEY

1) c; 2) d; 3) c; 4) d; 5) c; 6) b; 7) a; 8) c; 9) d; 10) b; 11) a; 12) d; 13) e; 14) b; 15) a; 16) d; 17) c; 18) c; 19) b; 20) d; 21) d; 22) a; 23) a; 24) b; 25) d; 26) b; 27) b; 28) b; 29) b; 30) b; 31) b; 32) c; 33) b; 34) a; 35) c; 36) c; 37) a; 38) a.